
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 162

మంగళవారం 2-9-2025

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



త్వరలో హైడ్రోజన్ బాంబు పేలుస్తా

దేశంలో జరుగుతున్న ఓట్ల చోరీపై ఇప్పటికే అణుబాంబు పేల్చానని, త్వరలో హైడ్రోజన్ బాంబు పేలుస్తానని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ సంచలన ప్రకటన చేశారు.

వివరాలు 6లో ▸



భారత్... పూర్తిగా ఎత్తేస్తామంది!

'అమెరికాపై టారిఫ్‌లను పూర్తిగా ఎత్తేస్తామంటూ భారత్ ప్రతిపాదించింది. కానీ ఆ ప్రకటన ఆలస్యంగా వచ్చింది. పరిస్థితి ఇప్పటికే చేయిదాటిపోయింది' అని ట్రంప్ అన్నారు.

వివరాలు 6లో ▸

గోల్డ్ రష్

అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పటిష్టంగా ఉండటం, టారిఫ్‌లపరమైన అనిశ్చితి, ఈ నెలలో అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చనే అంచనాల మధ్య పసిడి ర్యాలీ కొనసాగుతోంది. 99.9% స్వచ్ఛత బంగారం రూ. 1,000 పెరిగి రూ. 1,05,670కి చేరింది. అమెరికా టారిఫ్‌లపరమైన అనిశ్చితి, వడ్డీ రేట్లపై ఫెడ్ వైఖరి గురించి ఆందోళన పెరుగుతుండటంతో ఇన్వెస్టర్లు, పసిడిలాంటి సురక్షితమైన పెట్టుబడి సాధనాల వైపు మళ్లుతున్నారని ట్రేడర్లు వెల్లడించారు. వెండి ధర కేజీకి మరో రూ. 1,000 పెరిగి ఇంకో కొత్త గరిష్ట స్థాయి రూ. 1,26,000ని (పన్నులు కలిపి) తాకింది.



-15లో



నిరంతరం మనుషుల కోసం, పేదవాడి పెదవి మీద చిరునవ్వు చూడటం కోసం బతికిన వై.ఎస్.రాజశేఖర రెడ్డి వర్ధంతి నేడు.

ఆయన వెళ్లిపోయి పదహారేళ్లయినా కోట్లాది గుండెలు ఆయన్ని నిత్యం తలుస్తూనే ఉన్నాయి. అలాంటప్పుడు ఆయన వెళ్లిపోయాడని ఎలా అనగలం? ఆయన **'మనలోనే, మనతోనే, మన ఆత్మగా'** ఉన్నాడని ఆ మహానాయకుడిని స్మరిస్తూ భూమన కరుణాకర రెడ్డి రాసిన ప్రత్యేక వ్యాసం

'చరిత్ర చూసిన ఘోర విషాదం'

సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల్లో వైఎస్ దూరదృష్టిని వివరించే

'చిరస్మరణీయ ప్రజాబాంధవుడు'

ఒక నాయకుడు ఇన్ని పథకాలు రూపొందించగలడా అని ఆశ్చర్యపడేలా పనిచేసిన రాజశేఖర రెడ్డి స్వర్ణయుగంపై

'వైఎస్ ఏం చేయలేదనీ...'

నివాళి వ్యాసాలు ఎడిట్ పేజీలో..

ఉమ్మడిగా ముందుకెళ్దాం



తియాంజిన్‌లో ముచ్చటించుకుంటున్న భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్

ప్రపంచ శాంతి, సుస్థిరతకు భారత్-రష్యా సంబంధాలే మూలస్తంభం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటన

- చైనాలోని తియాంజిన్‌లో రష్యా అధినేత పుతిన్‌తో భేటీ
- ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు నేతల చర్చలు
- కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయం
- ఉక్రెయిన్‌లో శాంతి యత్నాలను స్వాగతించిన నరేంద్ర మోదీ
- బహుముఖ సంబంధాల్లో పురోగతి: పుతిన్
- ఒకే కారులో మోదీ, పుతిన్ ప్రయాణం

ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, సుస్థిరతలకు భారత్ – రష్యా సంబంధాలే మూలస్తంభమని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో సైతం రెండు దేశాలు కలిసి పనిచేస్తాయని, ఉమ్మడిగా ముందుకెళ్తాయని అన్నారు. చైనాలోని తియాంజిన్‌లో షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ సోమవారం రష్యా అధినేత పుతిన్‌తో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. ఆర్థికం, ఇంధనం, ఎరువులు, వాణిజ్యం, అంతరిక్షం, సాంస్కృతిక, భద్రత తదితర రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకొనే దిశగా చర్చలు జరిగాయి. భారత్-రష్యా బంధం కేవలం ఇరుదేశాల ప్రజలకే కాకుండా మొత్తం ప్రపంచానికి కూడా కీలకమేనని మోదీ చెప్పారు.

6లో

ఆ ఇద్దరి వల్లే కేసీఆర్‌కు మరక

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

- కాళేశ్వరం అంశంలో హరీశ్, సంతోష్‌రావు పాత్ర
- మెఘా కృష్ణారెడ్డి పాత్ర కూడా ఉంది.. వారి వెనుక సీఎం రేవంత్ ఉన్నారు.. వారిని కాపాడుతూ కేసీఆర్‌ను బద్నాం చేస్తున్నారు
- నాన్నపై సీబీఐ ఎంక్వైరీ పడిన తర్వాత పార్టీ ఉంటే ఎంత? పోతే ఎంత?

సాక్షి, హైదరాబాద్: పార్టీ అధినేత పక్కన ఉంటూ ఆయన పేరు చెప్పుకుని అనేక రకాలుగా లబ్ధి పొందిన వారు చేసిన చెత్త పనుల వల్లే కేసీఆర్‌కు అవినీతి మరక అంటిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కాళేశ్వరం అంశంలో కేసీఆర్‌కు అవినీతి మరక అంటడంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌రావుతో పాటు కాంట్రాక్టర్ మెఘా కృష్ణారెడ్డి పాత్ర ఉందంటూ మిగతా 12వ పేజీలో ▶



కవిత ఆరోపణల వెనుక కుట్ర!

- పార్టీ కోసం అనేకమంది తమ శక్తియుక్తులు వెచ్చించారు
- పార్టీ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు ఉన్నాయి
- బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించండి
- పార్టీ అధినేతకు ముఖ్యనేతల విన్నపం?
- కేసీఆర్‌ను కలిసిన కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, వేముల, పల్లా
- హరీశ్ ఆరడుగుల బుల్లెట్ అంటూ 'ఎక్స్'లో బీఆర్‌ఎస్ పోస్ట్
- డైనమిక్ నాయకుడు హరీశ్ అంటూ కేటీఆర్ రీట్వీట్

12లో

'సాక్షి' ఎడిటర్‌పై అక్రమ కేసు



- పత్రిక పాత్రికేయుల పైనా అక్రమ కేసు నమోదు
- పోలీసులకు అన్యాయంపై ప్రశ్నిస్తే... పోలీసు కేసా?
- ఏపీ ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తున్నందుకు కక్షసాధింపు
- ఏడాదిగా ఇదే రీతిలో అక్రమ కేసులతో వేధింపులు
- హైకోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తున్న పోలీసు శాఖ


8లో

అఫ్గాన్‌ను అల్లాడించిన భూ విలయం

6.0 తీవ్రతతో భూకంపం

- 800 మందికి పైగా మృత్యువాత
- ఊళ్లు నేలమట్టం, కుప్పకూలిన వ్యవస్థలు.. కొండ ప్రాంతం కావడంతో భారీ ప్రాణ, ఆస్తి నష్టం
- నత్తనడకన సహాయక చర్యలు
- అన్నివిధాలా అండగా ఉంటాం: మోదీ
- ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి

- వివరాలు 6లో▶



నాలుగేళ్ల స్థానికత సబబే

- ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో ప్రభుత్వ జీవో 33ని సమర్థించిన సుప్రీంకోర్టు
- స్థానిక కోటా నిబంధనలకు గ్రీన్ సిగ్నల్.. హైకోర్టు తీర్పు రద్దు చేస్తూ తీర్పు
- ఇతర ప్రాంతాల్లో చదివి స్థానికులుగా పరిగణించాలని కోరుతూ వేసిన పిటిషన్ల కొట్టివేత

14లో

ఏ సవాల్‌కైనా సిద్ధం



జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- నన్ను కొందరు నక్సలైట్ అన్నందుకు బాధపడలేదు.. నేను ఇచ్చిన తీర్పులో వారు ఒక్క అక్షరం కూడా మార్చలేరు
- ఇండియా కూటమి అభ్యర్థిని కాను... ప్రతిపక్ష పార్టీల అభ్యర్థిని
- ఎన్నికల సంఘం ఇదే ధోరణితో వెళితే ప్రజాస్వామ్యానికే ప్రమాదం
- ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల పరిచయ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి
- తెలుగు ఎంపీలంతా ఆత్మప్రబోధాను సారం ఓటేయాలని పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- వివరాలు 2లో▶



మన సారే! బాంబు బెదిరింపు వచ్చిందని..!

పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు

- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ
- సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి
- సమస్యలు పరిష్కారం కాకపోతే అక్టోబర్ 12న 'చలో హైదరాబాద్'
- ఆర్టీసీ కల్యాణ మండపంలో సభకు భారీ ఎత్తున హాజరైన ఉద్యోగులు



సీపీఎస్ రద్దు చేయండి.. హామీ నిలబెట్టుకోండి

- లేకుంటే రద్దు చేసే ప్రభుత్వం వచ్చి తీరుతుంది
- ప్రభుత్వాల పునాదులు కదిపిన చరిత్ర పీఆర్‌టీయూ టీఎస్‌కి ఉంది
- ప్రభుత్వానికి టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి హెచ్చరిక
- పీఆర్‌టీయూ టీఎస్ మహాధర్నాకు భారీ స్పందన

సీపీఎస్ ఉద్యోగులకు శాపం

- తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం
- ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి: ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

- వివరాలు 5లో▶

సాక్షి, సాగుబడి

మనం తినే ఆహారంలో 95% మట్టిలోనే పండుతోంది. వ్యవసాయానికి, ఆహార భద్రతకు నేలపైన ఉండే 6 అంగుళాల మట్టే (టాప్ సాయిల్) మూలాధారం. మానవాళికి ఎంతో విలువైన ఈ వారసత్వ సంపద వర్షాలకు, వరదలకు కొట్టుకుపోతోంది. మేటలు వేసిన ఇసుక ఆ మట్టిలోనిదే.

పంట నష్టం, ఆస్తి నష్టం కన్నా మట్టి నష్టం చాలా పెద్దది. మనం ఎవరూ పట్టించుకోని విపత్తు ఇది. ఇలా భూముల్లోనుంచి కొట్టుకెళ్లిన మట్టి, ఇసుకతో రిజర్వాయర్లు, చెరువులు పూడుకుపోతున్నాయి. పైమట్టిని కోల్పోతున్న సాగు భూములు నిస్సారమవుతున్నాయి. ఫలితంగా 1960లో కిలో రసాయనిక ఎరువు వేస్తే 16.5 కిలోల పంట వచ్చేది. ఇప్పుడు 3.5 కిలోలకు తగ్గిపోయింది. మన దేశంలో ప్రతి సంవత్సరం హెక్టారుకు సగటున 21 టన్నుల టాప్ సాయిల్ కొట్టుకుపోతోందని అధ్యయనాలు చెబుతున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు, వరదలకు కోల్పోతున్న మట్టి ఎంత? మట్టి కొట్టుకుపోకుండా ఏమైనా చెయ్యగలమా? ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకోవాలి? వ్యవసాయ పద్ధతుల్లో ఏం మార్పులు తేవాలి? శాస్త్రవేత్తలు ఏమంటున్నారు? చదవండి..

నీటితో కొట్టుకుపోతున్న మట్టి ఎంత?

మట్టి.. మనకు పూర్వీకులు ఇచ్చిన వారసత్వ సంపద. మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకాలు, తేమతో కూడి ఉండే నేల పైపొర వ్యవసాయానికి చాలా ముఖ్యమైనది. మట్టి కోతకు గురికావటం వల్ల భూమి ఉత్పాదకశక్తి, పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. భూమి పైపొరలో 6 సెం.మీ. లోతు మట్టిలోనే పంటలు పండించుకొని తిని మనం బతుకుతున్నాం. 95% ఆహారాన్ని ఇస్తున్నది ఈ మట్టే. రాళ్లు రప్పలు, ఆకులు అలముల కారణంగా మట్టి సహజసిద్ధంగా నిరంతరం ఏర్పడుతూనే ఉంటుంది. 6 సెం.మీ. మందాన మట్టి ఏర్పడటానికి 1,000 సంవత్సరాలు పట్టవచ్చని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ లెక్క తేల్చింది. అయితే, అంతకన్నా అతివేగంగా కొట్టుకుపోతున్నది. ఎక్కువగా దున్నే భూములు, కొండ ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువ.

భారీ వర్షాలకు ఇసుక మేట వేసిన వరి పొలం





తెలంగాణాలో భారీ వర్షాలకు మట్టి కొట్టుకుపోయిన వరి పొలం

ఆరు వర్గీకరణలు

ఈశాన్య రాష్ట్రమైన అస్సాంలోని బ్రహ్మపుత్ర నదీ పరీవాహక ప్రాంతం దాదాపు 300 చదరపు కిలోమీటర్లు లేదా దాని ఉపరితల నేలలో 31 శాతం 'విపత్కర' స్థాయిలో కోతకు గురవుతోంది. 'దేశంలో నేల కోతపై సమగ్ర అవగాహన కలిగించేందుకు నేల కోత ఏయే జిల్లాల్లో ఏయే దశల్లో ఉందో అధ్యయనం చేశాం' అన్నారు సహారియా. ఒక సంవత్సరంలో హెక్టారు భూమి నుంచి టన్నుల కొద్దీ మట్టి కొట్టుకుపోతోంది. ఒక సంవత్సరంలో ఒక హెక్టారులో 100 టన్నులకు పైగా మట్టి కోతకు గురైనట్లు తేలితే, ఆ ప్రాంతాన్ని 'విపత్తు' ప్రాంతంగా వర్గీకరిస్తారు.

జాతీయ సగటు హెక్టారుకు 21 టన్నులు

దేశంలో వానలు, వరదలకు సగటున సంవత్సరానికి హెక్టారు భూమి నుంచి 21 టన్నుల మేరకు మట్టి నీటితో పాటు కొట్టుకుపోతోందని ఢిల్లీ ఐఐటీ అధ్యయనంలో తేలింది. భౌగోళిక స్థితి, జీవవైవిధ్య పరంగా హిమాలయాలు, బ్రహ్మపుత్ర లోయ ప్రాంతాలు నేల కోతకు అతిపెద్ద హాట్‌స్పాట్. అక్కడితో పోల్చితే భిన్నంగా ఉండే ఒడిశా లో కూడా 'విపత్కర' స్థితిలో నేల కోతకు గురవుతోంది. జిల్లాల వారీగా చూస్తే, దేశంలో నేల కోతకు గురయ్యే అవకాశం ఉన్న 20 జిల్లాల్లో తొమ్మిది అస్సాంలోనే ఉన్నాయని అధ్యయనం పేర్కొంది. అడవుల నరికివేత, రసాయనిక/పారిశ్రామిక వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయం చెయ్యటమే ఇందుకు కారణమని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. 'నేల కోతకు సంబంధించి పాన్-ఇండియా స్థాయిలో రాష్ట్రాలు, జిల్లాల వారీగా అధ్యయనం చేసి గణాంకాలను ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉంచాం. భవిష్యత్తులో నేల సంరక్షణ ప్రణాళికల అమలుకు ఈ సమగ్ర అవగాహన దోహదపడుతుందని ఆశిస్తున్నాం అన్నారు సహారియా.

వర్షపాతం ఇంకా పెరుగుతుంది!

వర్షపాతం వచ్చే రోజుల్లో మరింత పెరుగుతుందని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. 2050 నాటికి ఖరీఫ్ కాలంలో 5–10 శాతం, రబీ కాలంలో 12–17 శాతం వర్షపాతం పెరుగుతుందని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గతంలో పార్లమెంటులో చెప్పారు. అంటే, నివారణ చర్యలకు మనం ఉపక్రమించకపోతే రానున్న రోజుల్లో మరింత మట్టి కొట్టుకుపోతుందన్నమాట. 2050 నాటికి హెక్టారుకు మరో 10 టన్నుల మట్టి కొట్టుకుపోతుందని కూడా మంత్రి హెచ్చరించారు. సుస్థిర వ్యవసాయ పద్ధతుల ద్వారా ఈ సమస్యను కొంత వరకు అధిగమించవచ్చు.

100 టన్నుల మట్టి పోతే విపత్తు!

మన దేశంలో భూముల ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) అధ్యయనం వెల్లడించింది. దాదాపు 30 శాతం భూభాగం 'స్వల్పంగా' కోతకు గురవుతూ ఉంటే, కీలకమైన 3 శాతం భూభాగం 'విపత్కర' స్థితిలో మట్టిని వర్షాలు, వరదల వల్ల నష్టపోతోందని ఈ పరిశోధన తెలిపింది.

జియోస్పేషియల్ మోడలింగ్ – మ్యాపింగ్' పేరిట జరిగిన ఈ అధ్యయనం మన దేశం అంతటా నేల కోతను లెక్కగట్టింది. ఢిల్లీ ఐఐటీలో సివిల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, హైడ్రోసెన్స్ ల్యాబ్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డా. మనబేంద్ర సహారియా, రవిరాజ్ అధ్యయనం చేశారు.



ఉత్తరాంధ్రలో అత్యధికం

ఏపీలోని పాత జిల్లాల్లో కోతకు గురై కొట్టుకుపోతున్న మట్టి హెక్టారుకు ఏడాదికి సగటున టన్నుల్లో : శ్రీకాకుళం– 27, విశాఖపట్నం– 27, విజయనగరం– 25, తూర్పు గోదావరి– 16, చిత్తూరు– 16, అనంతపురం– 15, వైఎస్సార్ కడప – 14, పశ్చిమ గోదావరి– 13, కృష్ణా– 13, ప్రకాశం– 13, గుంటూరు– 12, కర్నూలు– 12, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు– 10 .

తెలుగు రాష్ట్రాల్లో కొట్టుకుపోతున్న మట్టి ఎంత?

తెలుగు రాష్ట్రాల్లో ఏటా హెక్టారుకు సగటున 14–15 టన్నుల మట్టి కొట్టుకుపోతోంది. తెలంగాణలో సగటున హెక్టారుకు ఏడాదికి 14 టన్నులు, ఆంధ్రప్రదేశ్‌లో సగటున 15 టన్నుల మట్టి వర్షానికి, వరదలకు కొట్టుకుపోతున్నదని ఐఐటీ ఢిల్లీ అధ్యయనంలో వెల్లడైంది. అయితే, కొన్ని ప్రాంతాల్లో అత్యధికంగా వేల టన్నుల్లోనే మట్టి కోతకు గురై కొట్టుకుపోతోంది. కొండ ప్రాంతాలు, వాలు ఎక్కువగా ఉన్న భూములు, అడవులు నరికివేసిన నేలలు, తవ్వకాలు జరిగే ప్రాంతాలు, ఎక్కువగా దుక్కి లేదా దమ్ము చేసే ఎటువంటి ఆచ్ఛాదనా లేని వ్యవసాయ భూముల్లో నుంచి నమ్మలేనంత ఎక్కువ మొత్తంలో హెక్టారుకు ఏడాదికి వేల టన్నుల్లోనే మట్టి కొట్టుకుపోతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇది 4,407 టన్నులైతే, తెలంగాణలో కొంచెం తక్కువగా 3,498 టన్నులు కొట్టుకుపోతోందని ఈ అధ్యయనం వెల్లడించింది.

పెద్దపల్లిలో అత్యధికం

తెలంగాణ జిల్లాల్లో కోతకు గురై కొట్టుకుపోతున్న మట్టి హెక్టారుకు ఏడాదికి సగటున టన్నుల్లో : పెద్దపల్లి– 22, నల్లగొండ– 20, కుమురంభీం ఆసిఫాబాద్– 18, ములుగు– 18, జయశంకర్ భూపాలపల్లి– 18, ఆదిలాబాద్ – 17, జగిత్యాల– 17, భద్రాద్రి కొత్తగూడెం– 17, మంచిర్యాల– 17, ఖమ్మం– 16, సూర్యాపేట– 16, వరంగల్ రూరల్– 16, మహబూబాబాద్– 13, కరీంనగర్ – 13, వరంగల్ అర్బన్– 13, యాదాద్రి భువనగిరి– 13, వనపర్తి– 12, జనగాం– 12, నిర్మల్– 12, నిజామాబాద్– 12, వికారాబాద్– 12, కామారెడ్డి– 11, రాజన్న సిరిసిల్ల– 11, మహబూబ్‌నగర్– 11, నాగర్ కర్నూల్– 11, సంగారెడ్డి– 10, నారాయణపేట– 10, సిద్దిపేట– 9, మెదక్– 9, రంగారెడ్డి– 9, జోగులాంబ గద్వాల– 8, మేడ్చల్-మల్కాజిగిరి– 6, హైదరాబాద్– 0. జనావాసాలతో కిక్కిరిసి ఉండే హైదరాబాద్ జిల్లా నుంచి వర్షానికి మట్టి పెద్దగా కొట్టుకుపోవట్లేదు! అత్యధికంగా మట్టి కొట్టుకుపోతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని ఇస్రో అధ్యయనం తెలిపింది.


పంట నష్టం, ఆస్తి నష్టం కన్నా మట్టి నష్టం చాలా పెద్దది

మనమెవరమూ పట్టించుకోని మహా విపత్తు ఇది

దేశవ్యాప్తంగా హెక్టారుకు ఏటా సగటున 21 టన్నులు మట్టి కొట్టుకుపోతోంది

తెలంగాణలో	ఏపీలో
13 టన్నులు	15 టన్నులు

భవిష్యత్తు తరాలు ఏమైపోతాయి?



హెక్టారు భూమిలో 1 సెం.మీ. వర్షం కురిస్తే లక్ష లీటర్ల నీరు పడుతుంది. అధిక వర్షాలకు పొలంలోని మెత్తని మట్టి నీట కరిగి వరదతో వెళ్లిపోతుంది. ఆ మట్టి నీటి అడుగుకు చేరాలంటే పది గంటలు పడుతుంది. కాబట్టి, రిజర్వాయర్లు, చెరువుల్లోకి వరద నీటి ద్వారా ఆ మట్టి చేరుతుంది. ఇసుకైతే దగ్గర్లోని పొలాల్లో మేట వేస్తుంది. నేల పైపొర మట్టి వర్షానికి కొట్టుకుపోతే అడుగున మొరం, రాళ్లు, రప్పలు పైకి తేలతాయి. ఒక మోస్తరు వర్షపు నీరు పొలం నుంచి బయటకు పోకుండా భూమిలోకి ఇంకాలంటే పంట పొలాల్లో కందకాలు, కుంటలు తవ్వుకోవాలి. నీరు ఇంకటంతో పాటు మట్టి కూడా పొలం దాటి బయటకు పోకుండా కందకాలు లేదా కుంటల్లో ఆగుతుంది. మట్టిని తర్వాత తీసి మళ్లీ పొలంలో వేసుకోవచ్చు. మట్టిని పరిరక్షించుకునేందుకు అందరూ శ్రద్ధ తీసుకోవాలి. లేకపోతే భవిష్యత్తు తరాలు ఏమైపోతాయి?

– డా. అల్లూరి పద్మరాజు, ఆంగ్రౌ మాజీ వైస్ చాన్స్‌లర్

మట్టిని జాతి సంపదగా చూడాలి



ఏటా హెక్టారు భూమిలో 1.5 టన్నుల మట్టి కొత్తగా ఏర్పడుతుంది. 200 ఏళ్లకు గానీ ఒక అంగుళం ఎత్తు మట్టి ఏర్పడదు. అయితే, అంతకు 8 రెట్ల మట్టి ప్రతి ఏటా వాన నీటితో, గాలితో కొట్టుకు పోతోంది. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. పొలం రైతు సొంతదైనా మట్టిని జాతి సంపదగా చూడాలి. మట్టిని కాపాడుకోవటానికి, భూసారాన్ని పెంపొందించుకోవటానికి ప్రభుత్వం ఈ 4 పనులు చెయ్యాలి: 1. భూమిని వీలైనంత మేరకు ఆచ్ఛాదన పంటలతో, గడ్డితో కప్పి ఉంచటం. 2. అతిగా దున్నటం, దమ్ము చెయ్యటం తగ్గించటం. 3.సాగు పద్ధతి ఏదైనా భూమిలో సేంద్రియ పదార్థం ఎక్కువగా కలిసేలా పచ్చిరొట్ట పంటలు సాగు చేసి కలియదున్నాలి. 4. ప్రతి సీజన్‌లోనూ దున్నాల్సిన అవసరం ఉన్న వరి వంటి పంటలకు బదులు తోటల సాగుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

– డా. జీవీ రామాంజనేయులు, ఈడీ, సుస్థిర వ్యవసాయ కేంద్రం వ్యవస్థాపకుడు

'అలయ్ బలయ్'కు రాష్ట్రపతిని ఆహ్వానించిన దత్తాత్రేయ



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును 'అలయ్ బలయ్'కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా హరియాణా మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. సోమవారం రాష్ట్రపతి ముర్మును ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో కలిసిన ఆయన, అక్టోబర్ 3న హైదరాబాద్‌లో జరగనున్న సంప్రదాయక స్నేహసమ్మేళనం అలయ్ బలయ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆ కార్యక్రమం ఉద్దేశం, ప్రాముఖ్యత గురించి రాష్ట్రపతికి దత్తాత్రేయ వివరించారు. స్నేహం, ఆప్యాయత, సోదరభావాన్ని ప్రతిబింబించే ఈ వేదికపై రాష్ట్రపతి ఆసక్తి కనబరిచి అనేక విషయాలు అడిగి తెలుసుకున్నారు. 'సమాజంలో ప్రేమ, ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించే ఈ విధమైన వేదికలు కొనసాగడం ఆనందదాయకం'అని రాష్ట్రపతి అభినందించినట్లు సమాచారం.

ఏ సవాల్‌కైనా సిద్ధం

- ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల పరిచయ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి
- తెలుగు ఎంపీలంతా ఆత్మప్రబోధానుసారం ఓటేయాలని పిలుపునిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి



సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, భట్టి, మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: 'నేను ఫలానా అని ముద్ర వేస్తూ కొందరు మాట్లాడుతున్నారు. అలా అంటే ఈ రాజకీయాలు నాకెందుకులే అని వెనక్కు తగ్గుతానేమో అనుకున్నారు. కానీ నేను ఎలాంటి సవాల్‌నైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నా'అని విపక్ష పార్టీల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆ మాట (నక్సలైట్) అన్నందుకు తనకు బాధ కలగలేదని చెప్పారు. వారు మాట్లాడినంత మాత్రాన తాను సుప్రీంకోర్టు జడ్జిగా ఇచ్చిన తీర్పులో ఒక్క అక్షరాన్ని కూడా మార్చలేరని చెప్పారు. అసలు ఆ తీర్పు గురించి మాట్లాడే ముందు ఒక్కసారి చదివి మాట్లాడాలని హితవు పలికారు. అలా చదివి మాట్లాడితే తనపై ఉపయోగించిన భాషా ప్రయోగం జరిగేది కాదని అభిప్రాయపడ్డారు. టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ఇండియా కూటమి పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతల మధ్య పరిచయ కార్యక్రమం జరిగింది.

ఏ పార్టీ సభ్యత్వం తీసుకోను..

ఈ కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలు మసకబారుతున్న సందర్భంలో గొంతెత్తి మాట్లాడే కర్తవ్యం ప్రతి పౌరుడిపైనా ఉంటుందన్నారు. అందుకే తాను ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీకి అంగీకరించానని చెప్పారు. తాను రాజకీయ ముళ్ల కిరీటాన్ని నెత్తిన పెట్టుకోలేదని.. భవిష్యత్తులోనూ ఏ పార్టీ సభ్యత్వం తీసుకోనని స్పష్టం చేశారు. తాను రాజకీయేతర వ్యక్తిని కాదని.. రాజ్యాంగంపట్ల విధేయతతో ఓటు వేసే ప్రతి పౌరుడికీ రాజకీయాలతో అవినాభావ సంబంధం ఉంటుందని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వివరించారు.

మరింత ప్రమాదంలోకి ప్రజాస్వామ్యం...

దేశంలో ప్రస్తుతం ప్రజాస్వామ్యం మరింత ప్రమాదంలోకి వెళ్తున్నట్లు కనిపిస్తోందని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్యుడికి ఆయుధంగా ఓటు హక్కును ఇవ్వాలని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ భావించారని, కానీ ఓటరు జాబితాను చిత్తు కాగితంలా మార్చి ఇష్టం ఉన్నవారి పేర్లను జాబితాలో చేర్చి.. ఇష్టంలేని వారి పేర్లు తీసేయడం ఎలా కుదురుతుందని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సంఘం ఇదే ధోరణితో వెళ్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదమన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవానికి భంగం కలిగించను..


ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నప్పుడు తాను పార్టీల బలాబలాలను చూసుకోలేదని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీకను హిమాలయాలపై ఎగురవేశానని చెప్పేంత వెర్రివాడిని కాదని.. కానీ తెలంగాణ ప్రతిష్టకు, ఆత్మగౌరవానికి భంగం కలిగేలా ఏ పనీ చేయనని చెప్తానన్నారు. తాను ఇండియా కూటమి అభ్యర్థిని కాదని, దేశంలోని ప్రతిపక్ష పార్టీల అభ్యర్థినని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇండియా కూటమిలో లేని 'ఆప్'సహా మరికొన్ని పార్టీలు తనకు మద్దతిచ్చాయని చెప్పారు.

రెండు విధానాల మధ్య పోటీ: సీఎం రేవంత్

ఈ ఎన్నిక రెండువిధానాల మధ్య జరుగుతోందని.. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేసే వారు.. రాజ్యాంగాన్ని రక్షించి పేదలందరికీ రిజర్వేషన్లు ఇవ్వాలనే వారి మధ్య పోటీ జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలుగు గౌరవాన్ని, ప్రతిష్టను పెంచేందుకు అన్ని రాజకీయ పక్షాలు ఒక్కతాటిపైకి రావాలని కోరారు. జెండాలు, ఎజెండాలు పక్కనపెట్టి చంద్రబాబు, పవన్ కల్యాణ్, వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి, కేసీఆర్, ఒవైసీలు జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వాలని కోరారు. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 42 మంది లోక్‌సభ, 18 మంది రాజ్యసభ సభ్యులు ఆత్మప్రబోధానుసారం ఓటేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, సీపీఐ, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గెలుపు కోసం అన్ని పార్టీలూ సహకరించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తల పిలుపు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్. చిత్రంలో కోదండరాం తదితరులు

సాక్షి, హైదరాబాద్/పంజగుట్ట: వెంకయ్యనాయుడు తెలుగు వాడైనప్పుడు సుదర్శన్‌రెడ్డి తెలుగువాడు కాకుండా పోతారా? తెలుగు రాష్ట్రాల్లోని పార్టీలు ఆయనకు ఎందుకు సపోర్ట్ చేయడం లేదని పలువురు వక్తలు ప్రశ్నించారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ పౌరసమాజం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరహక్కుల నేత ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎంపీల బయోడేటా మొత్తం సేకరించి, ఎవరి బలహీనతలు ఎక్కడున్నాయో తెలుసుకుని, వారి అవసరాలకు వాడుకుంటోందని ఆరోపించారు. సల్వాజుడుం కేసులో ద్విసభ్య ధర్మాసనంలో సుదర్శన్‌రెడ్డి ఒకరు. అంత మాత్రాన ఆయనను అర్బన్ నక్సలైట్ అనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రజల హక్కులను కాపాడేది సుప్రీంకోర్టు మాత్రమే అని తెలిపారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, 1969లో ఇందిరాగాంధీ తాను నిలబెట్టిన వ్యక్తికి ఓటు వేయమని అడగలేదు. ఆత్మ ప్రబోధం చేసుకుని ఓటు వేయండని కోరారు. తరువాత ఆ తరహా సమరం 2025లో వస్తోంది. ఎంపీలు అందరూ ఆత్మప్రబోధానుసారం ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ సంపాదకులు దేవులపల్లి అమర్, కె.రామచంద్రమూర్తి, ఎన్.వేణుగోపాల్, ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, పాశం యాదగిరి, బి.ఎస్.రాములు, రాఘవాచారి, విరాహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య ప్రతిష్ట మసకబారుతోంది

- తిరోగమనంలో ఉన్న వ్యవస్థ మూల స్తంభాలను సరిదిద్దాలి
- మార్పునకు నేను దోహదపడతానేమోనన్న భావనతోనే బరిలోకి..
- విపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'ఒకరి విధుల్లో మరొకరు జొరబడకుండా ఉంటే వ్యవస్థలన్నీ బాగానే ఉంటాయి. కానీ మన దగ్గర ఇప్పుడదే లోపిస్తోంది. ''పార్లమెంటులో జరిగే చర్చల్లో మెజారిటీ, మైనారిటీ పార్టీలన్న భేదం చూపటం మొదలుపెడితే అదే రోజు ప్రజాస్వామ్యం అంతమైనట్టే..''అన్న మన తొలి లోక్‌సభ స్పీకర్ గణేశ్ మౌలాంకర్ మాటలు గుర్తొస్తున్నాయి. పార్లమెంటులో ఎవరు మాట్లాడాలో, ఎవరు మాట్లాడొద్దో శాసిస్తున్నారు. అంతా వారిష్టం అన్నట్టుగా కొనసాగుతోంది. చర్చ, సంభాషణకు వీల్లేకుండా పోయింది. దీన్ని మార్చాల్సిన అవసరం ఉంది. ఆ మార్పునకు నేనేమన్నా దోహదపడతానేమోనన్న భావనతోనే ఉప రాష్ట్రపతి అభ్యర్థిత్వానికి అంగీకరించాను..'అని విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ మూలస్తంభాల ప్రతిష్ట మసకబారుతోందని, అవి తిరోగమనంలో ఉన్నాయని, వాటిని సరిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తాను ఉప రాష్ట్రపతి అభ్యర్థిత్వానికి అంగీకరించటానికి దారితీసిన పరిస్థితులు, ప్రస్తుతం రాజ్యాంగబద్ధ సంస్థల పనితీరు తదితర అంశాలపై ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పెడధోరణిని నియంత్రించాలి

నేను ఏ రాజకీయ పార్టీకీ చెందిన వ్యక్తిని కాను. భవిష్యత్తులో కూడా ఏ పార్టీలో చేరను. దేశంలో 63.7 శాతం జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా ఉండటమంటే మెజార్టీ ప్రజల అభ్యర్థిగా ఉండటమేనని భావిస్తూ అంగీకరించా. దేశంలో స్వేచ్ఛాయుత ఎన్నికలు స్థానం లేకుండా పోయింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 30 రోజుల్లోనే ఓటర్ల జాబితా రూపకల్పన కసరత్తు మొదలైంది. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని అప్పట్లో జాబితా రూపొందించారు. వయోజనులను జాబితాలో ఎలా చేర్చాలనే ప్రధాన కర్తవ్యంతో ఆ కసరత్తు జరిగింది. కానీ ప్రస్తుతం జాబితా నుంచి పేర్లు ఎలా తొలగించాలి అన్నదే ముఖ్యంగా మారింది. ఆ పద్ధతిని ప్రశ్నించాల్సి ఉంది.

ఇక్కడి వారు అండగా ఉంటారన్న నమ్మకం ఉంది..

నేను 53 సంవత్సరాలుగా రాజ్యాంగ పుస్తకాన్ని వెంట మోస్తున్నాను. అన్నింటికీ అందులో సమాధానం ఉంటుందని బలంగా నమ్ముతాను. నేను ఉప రాష్ట్రపతిగా విజయం సాధిస్తే, దాని ప్రకారమే నడుచుకుంటాను. ఎలక్టోరల్ కాలేజీలో పార్టీలకు సభ్యత్వం ఉండదు, వాటి ప్రతినిధులకు మాత్రమే సభ్యత్వం ఉంటుంది. వారు పార్టీలకతీతంగా ఆత్మప్రబోధానుసారం ఓటేస్తారని భావిస్తున్నా.

రాజకీయ పదవి కాదు..

మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న రాధాకృష్ణన్‌కు మద్దతివ్వాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్.. శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేను కోరినట్టు తెలిసింది. అయితే ఆ సమయంలోనే నేను ఉద్ధవ్‌ను కలిశాను. ఫడ్నవీస్ అభ్యర్థనకు మీరెలా స్పందిస్తారని ఆయనను విలేకరులు అడిగారు. దీంతో సుదర్శన్ రెడ్డితో భేటీ ముగిశాక నేను ఫడ్నవీస్‌కు ఫోన్ చేసి సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వమని కోరతాను అని ఆయన అన్నారు. ఆయన తీరు నాకు ఆసక్తిగా అనిపించింది. ఇండియా కూటమిలో కాకుండా తటస్థంగా ఉన్న విపక్ష పార్టీలు నాకు మద్దతు తెలిపినందున నేను ఇండియా కూటమి అభ్యర్థిగా కాకుండా విపక్షాల అభ్యర్థిగా బరిలో ఉన్నాను. రాజకీయ ముళ్ల కిరీటం మీకెందుకు అని కొందరు నా అభ్యర్థిత్వాన్ని ప్రశ్నించారు. అయితే ఉప రాష్ట్రపతి పదవి రాజకీయ పదవి కాదు, అది ఏ పార్టీకి సంబంధం లేనిది. అందుకే దాన్ని నేను రాజకీయ ముళ్లకిరీటంగా భావించటం లేదని చెప్పా.

నిర్భయంగా.. నిష్పాక్షికంగా పనిచేస్తా

దేశంలోని ఎంపీలకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి లేఖ

ఉప రాష్ట్రపతిగా, రాజ్యసభకు చైర్మన్‌గా పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిరక్షణకు తాను బాధ్యత వహిస్తానని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి హామీ ఇచ్చారు. భయం, పక్షపాతం లేకుండా పనిచేస్తానని, గౌరవం, మర్యాద, సంభాషణ, సమన్వయం అనే విలువలతో ముందుకెళతానని వెల్లడించారు. దేశంలోని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు సోమవారం ఆయన లేఖ రాశారు ఈ లేఖను తాజ్ కృష్ణా హోటల్లో జరిగిన పరిచయ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. 'రాజ్యాంగ పరిరక్షణే దేశానికి నిజమైన బలమని నా జీవితం నాకు తెలియజేసింది. ఈ ఎన్నిక ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీ కాదు. సిద్ధాంతపరమైన పోరాటం. సెప్టెంబర్ 9వ తేదీన జరిగే ఎన్నికల్లో నాకు మద్దతు ఇవ్వండి. ' అని ఆ లేఖలో సుదర్శన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- జస్టిస్ ఈశ్వరయ్య ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో చేసిన బిల్లుపై సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల పట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బీసీ బిల్లులకు చట్టబద్ధత రాదని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే బీసీ రిజర్వేషన్ల పెంపుదల సాధ్యమవుతుందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెల్లుబాటు కాని బిల్లులతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. బీసీల పట్ల కాంగ్రెస్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటులో చర్చ జరపాలన్నారు. పార్లమెంటులో చర్చ జరిగి రాజ్యాంగ సవరణ చేసినప్పుడే బీసీలకు రిజర్వేషన్లు పెరుగుతాయనే అంశాన్ని పలుమార్లు చెప్పానన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని చర్చించేందుకు వెనకాడుతోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కేవలం అగ్రకుల పెత్తనంతో నడిచే పార్టీ అని, అక్కడ బీసీ వాదం లేదని పేర్కొన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్.. ఎన్నడూ బీసీల పక్షాన నిలవలేదన్నారు. అనంతరం విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు మాట్లాడుతూ.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అమలు చేసిందని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కావాలని దేశంలో ఎక్కడా నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు జరగలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఈడబ్ల్యూఎస్‌పైన ఉన్న శ్రద్ధ బీసీలపైన లేదని విమర్శించారు.

కోదండరాం, అజారుద్దీన్‌కు ఓకే

- ఎమ్మెల్సీలుగా ఎంపికకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్
- తెలంగాణలో గవర్నర్ కోటా అభ్యర్థులుగా ఖరారు




సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. టీపీసీసీ ప్రతిపాదించిన ప్రొఫెసర్ ఎం.కోదండరాం, మాజీ క్రికెటర్, మాజీ ఎంపీ అయిన మహమ్మద్ అజారుద్దీన్‌ల పేర్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం అధికారిక లేఖ విడుదల చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు సైతం లేఖను పంపారు. 'తెలంగాణలో గవర్నర్ నామినేషన్ కింద ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రొఫెసర్ ఎం.కోదండరాం, అజారుద్దీన్ పేర్లను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించారు. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపట్టండి..' అని అందులో పేర్కొన్నారు. లేఖ ప్రతిని సీఎల్పీ నేత, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా పంపించారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికతో రాష్ట్ర కాంగ్రెస్‌లో కొత్త సమీకరణలు ఏర్పడతాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు, భవిష్యత్తులో జరిగే శాసనసభ ఎన్నికల్లో ఈ నిర్ణయం కాంగ్రెస్‌కు బలాన్ని చేకూరుస్తుందని పార్టీ వర్గాలు అంటున్నాయి.

అంకుర సంస్థలకు వ్యవసాయ వర్సిటీ గుర్తింపు పత్రాలు

- పీజేటీఏయూ వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 15 వ్యవసాయ ఆధారిత స్టార్టప్స్‌కు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం గుర్తింపు లభించింది. ఈ మేరకు సోమవారం అగ్రి హబ్ ఇన్నోవేషన్ సెంటర్లో ఆయా సంస్థలకు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య గుర్తింపు పత్రాలను అందజేశారు. ఈ సంస్థలు యూనివర్సిటీలోని అగ్రి హబ్ ఇన్నోవేషన్ సెంటర్లో విజయవంతంగా సాంకేతిక శిక్షణ పూర్తి చేసుకున్నాయి. అగ్రి హబ్ తరఫున ఇప్పటికి సుమారు 150 స్టార్టప్స్‌కు నాబార్డ్ సహాయంతో తోడ్పాటు అందించినట్లు జానయ్య వివరించారు. ఇందులో భాగంగా కూరగాయల సాగులో మానవ ప్రమేయం తగ్గించి రైతులకు తోడ్పాటు అందించేందుకు ఇంజనీరింగ్ విద్యార్థులు ఆవిష్కరించిన రోబోని వీసీ లాంఛనంగా ప్రారంభించారు. గ్రామీణ యువత, అభ్యుదయ రైతులకు చేయూతనందించే కార్యక్రమంలో భాగంగా నాబార్డ్ ఆర్థిక సహకారాన్ని ఆరుగురికి అందజేశారు. మరో రెండు స్టార్టప్స్‌కు ఒక్కొక్క దానికి రూ. 40 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని యూనివర్సిటీ అగ్రి హబ్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశాన్ని వికసిత భారత్‌గా రూపొందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నా యన్నారు. కార్యక్రమంలో నాబార్డ్ డీజీఎం దీప్తి, వీహబ్ ప్రతినిధి సీత, రిజిస్ట్రార్ డా.విద్యాసాగర్, ఏజీహబ్ ఎండీ జి.వెంకటేశ్వర్లు, స్టార్టప్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, కోడి గుడ్లపై సీబీఐ విచారణ

జరగాలి: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, రూ.600 కోట్ల కోడిగుడ్ల స్కాంపై సీబీఐ విచారణ జరగాలని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఇంతియాజ్ అహ్మద్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి ఇవ్వడంలో పెద్ద కుట్రదాగి ఉందని, మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన తర్వాత రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ విషం చిమ్మారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టును కట్టకుండా చంద్రబాబు కేసులు వేశారని, ఇప్పుడు సీబీఐ విచారణ వెనుక కూడా ఆయనే ఉన్నారని ప్రవీణ్ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి చెప్పినట్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు ఇచ్చిందని ఆరోపించారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్న కాంగ్రెస్, బీజేపీ నేతలపై సిట్ ఏర్పాటు చేయాలని, డీపీఆర్ లేకుండా కొడంగల్, నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంపై సీబీఐ విచారణ జరగాలని ప్రవీణ్ డిమాండ్ చేశారు.

రోజుకో అవినీతి కేసు..

- గత నెలలో 31 అవినీతి కేసులు నమోదు చేసిన ఏసీబీ

సాక్షి, హైదరాబాద్: గత నెలలో సగటున రోజుకు ఒక అవినీతి కేసు నమోదైంది. ఆగస్టు 1 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా 31 కేసులు నమోదు చేసినట్టు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో15 ట్రాప్‌కేసులు, రెండు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, మూడు క్రిమినల్ మిస్‌కండక్ట్ కేసులు, ఏడు రెగ్యులర్ ఎంక్వైరీలు, నాలుగు సర్‌ప్రైజ్ చెక్‌లు ఉన్నట్టు తెలి పారు. గత నెలలో నలుగురు ప్రైవేటు వ్యక్తులు సహా మొత్తం 22 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఏసీబీ ట్రాప్ కేసులలో నిందితుల వద్ద నుంచి రూ.2,82,500, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులలో రూ.5,13,75,198 జప్తు చేసినట్టు వెల్లడించారు.

వేగంగా పనులు..తక్షణ పరిహారం

కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

- గత ఏడాది కేంద్రం నుంచి అందిన సాయంపై ఆరా
- ప్రస్తుతం వివిధ శాఖల పరిధిలో వాటిల్లిన నష్టంపై నివేదిక ఇవ్వాలన్న సీఎం
- విపత్తుల సమయంలో కలెక్టర్లు, ఎస్పీలు క్షేత్రస్థాయికి వెళ్లాలని సూచన



వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, తుమ్మల, ఉత్తమ్, వివేక్, సీఎస్ రామకృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలకు మరమ్మతులతోపాటు విద్యుత్ సబ్ స్టేషన్ల పునర్నిర్మాణం పనులను వేగిరం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వరద మృతుల కుటుంబాలకు, పశువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం విడుదల చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఇటీవలి వరదలతో వాటిల్లిన నష్టంపై సోమవారం ఆయన సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు.

'విపత్తుల నిధులు'ఖర్చు చేయడంలో అలసత్వం

రాష్ట్ర విపత్తుల ఉపశమన నిధులు (ఎస్డీఆర్‌ఎఫ్) ఉన్నా నిబంధనల ప్రకారం ఖర్చు చేయడంలో అలసత్వం చూపారని అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని శాఖలు ఈ నిధులను సక్రమంగా వినియోగించి ఎప్పటికప్పుడు వినియోగ ధ్రువీకరణ పత్రాలు (యూసీ) సమర్పించాలని ఆదేశించారు. గతేడాది ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లినా కేంద్రం నుంచి సరైన సహాయం అందకపోవడంపై సీఎం ఆరా తీశారు. కేంద్రం గతంలో ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడం, గతేడాదికి సంబంధించి రావాల్సిన నిధులపై ఓ నివేదిక తయారు చేయాలని సూచించారు. అలాగే..ప్రస్తుతం వివిధ శాఖల పరిధిలో వాటిల్లిన నష్టం వివరాలతో మరో సమగ్ర నివేదిక రూపొందించాలని చెప్పారు. ఈ రెండు నివేదికలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని బృందం ఈ నెల 4న ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి అందజేస్తుందని తెలిపారు.

నీటి వినియోగదారుల సంఘాల పునరుద్ధరణ!

రాష్ట్ర వ్యాప్తంగా 257 చెరువులు, కుంటలకు గండి పడిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో.. చిన్న నీటిపారుదల శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న నీటివనరులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు. గతంలో నీటి వినియోగదారుల సంఘాలుండేవంటూ.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి నూతన నిబంధనలతో ఆ సంఘాల పునరుద్ధరణకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం

ప్రాథమిక అంచనాల ప్రకారం 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. రెండు రోజుల్లో పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక సమర్పిస్తే కేంద్రం దృష్టికి తీసుకెళతామని సీఎం చెప్పారు. నీట మునిగిన సబ్ స్టేషన్ల స్థానంలో అధునాతన సామగ్రి, సామర్థ్యంతో కూడిన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్‌ను ఆదేశించారు. రాష్ట్రంలో వీధి దీపాల నిర్వహణ, ఏర్పాటుపై సమీక్ష నిర్వహించి పరిష్కారంతో రావాలని సీఎస్‌కు సూచించారు. చెంగిచర్లతో పాటు జియాగూడ, అంబర్‌పేటలోని కబేళాల్లో హలాల్, జట్కా సక్రమంగా జరిగేలా చూడాలని సీఎం ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న నూతన వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, ఆస్పత్రుల భవనాల పనులు వేగవంతం చేసి, వాటి ప్రారంభానికి తేదీలు నిర్ణయించాలని వైద్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూని ఆదేశించారు.

ఎస్డీఆర్‌ఎఫ్ సేవలు భేష్

రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఏర్పాటు చేసిన ఎస్డీఆర్‌ఎఫ్ దళాలు వరదల సమయంలో మెరుగైన సేవలు అందించడంపై ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. భారీ వర్షాల సమయంలో 42 ఆపరేషన్లలో పాల్గొని 217 మందిని రక్షించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సిబ్బందికి మరింత మెరుగైన శిక్షణ, నైపుణ్యాలు అందేలా చూడాలని రాష్ట్ర అగ్నిమాపక విభాగం డీజీ నాగిరెడ్డికి సూచించారు.

భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యం వద్దు: సీఎం

బహుళ అంతస్తుల భవనాలు, ఇతర నిర్మాణాలకు అనుమతుల జారీ విషయంలో జాప్యంపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు అధికారులు ఉద్దేశ పూర్వకంగా అలసత్వం చూపుతున్నారని అన్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలో 'బిల్డ్ నౌ'కింద పనుల అనుమతులపై ఆయన సమీక్ష నిర్వహించారు. అనుమతుల ఆలస్యానికి కారకులను గుర్తించి వారిని సరెండర్ చేయాలని హెచ్‌ఎండీఏ కార్యదర్శి ఇలంబర్తిని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా నీటి పారుదల శాఖ విభాగం అధికారులపై పలు ఆరోపణలు వస్తున్నాయని.. వాటిని ఎంత మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువులు, నాలాలు, ఇతర నీటి వనరులకు సంబంధించి లైడార్ సర్వేను తక్షణమే చేపట్టాలన్నారు. జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఇరిగేషన్ అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ త్వరగా అనుమతులు మంజూరు చేయాలని హెచ్‌ఎండీఏ కార్యదర్శిని ఆదేశించారు. సమీక్షలో హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహమ్మద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో క్షేత్రస్థాయికి వెళ్లాలి..

మారుతున్న వాతావరణ పరిస్థితులతో ముున్ముందు అకాల వర్షాలు, వరదలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తంగా ఉండి విపత్తుల సమయంలో తక్షణమే క్షేత్రస్థాయికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాల్లో పనులకుగాను కలెక్టర్లకు రూ.10 కోట్ల చొప్పున, సాధారణ నష్టం వాటిల్లిన జిల్లాల కలెక్టర్లకు రూ.5 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తామని తెలిపారు. సమీక్షలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.



వరద తగ్గింది.. పత్తి మురిగింది!

కాళేశ్వరం: ఎగువన కురుస్తున్న వర్షాలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం గోదావరి పరీవాహక ప్రాంతంలోని అన్నారం, చంద్రుపల్లి, నాగెపల్లి, మద్దులపల్లి, పలుగుల, కుంట్లం, పూసుకుపల్లి, కాళేశ్వరం, బొమ్మాపూర్ తదితర ప్రాంతాల్లోని చిన్న పిల్ల వాగులు, కాల్వలు పొంగడంతో బ్యాక్ వాటర్‌తో పత్తి చేన్లలోకి వరద నీరు చేరింది. రోజుల తరబడి పత్తి చేన్లు నీటిలో ఉండిపోయాయి. సోమవారం గోదావరి తగ్గుముఖం పట్టడంతో చేనుల్లోని పత్తి మొక్కలు మురిగి దర్శనమిస్తున్నాయి. వందల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించండి

- గవర్నర్‌ను కలిసిన టీపీసీసీ చీఫ్, మంత్రులు పొన్నం, సీతక్క



గవర్నర్‌కు మొక్కను అందజేస్తున్న మహేశ్‌గౌడ్. చిత్రంలో కేపీ వివేకానంద, బీర్ల ఐలయ్య, సీతక్క, నారాయణ, పొన్నం, ఆది శ్రీనివాస్, సత్యం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ శాసనసభ రూపొందించిన బిల్లులను ఆమోదించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరాయి. సోమవారం రాజ్‌భవన్‌లో మహేశ్‌గౌడ్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ నాయకులు కె.నారాయణ తదితరులు గవర్నర్‌తో భేటీలో పాల్గొన్నారు. అనంతరం మహేశ్‌గౌడ్ రాజ్‌భవన్ బయట మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానం మేరకు బీసీ రిజర్వేషన్లు పెంచుతూ చట్టాలు చేసి, ఆర్డినెన్స్ కూడా తెచ్చామన్నారు. తాజాగా ఉభయసభల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లు తెచ్చామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రిజర్వేషన్ల సీలింగ్ 50 శాతాన్ని ఎత్తివేస్తూ చట్ట సవరణ చేశామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల సర్వేను పరిగణనలోకి తీసుకోవాలని మహేశ్‌గౌడ్ కోరారు.

రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు ఒకటే సాఫ్ట్‌వేర్

- త్వరలోనే నక్షా లేని మిగిలిన గ్రామాల్లో భూముల రీసర్వే: రెవెన్యూ మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు మరింత మెరుగైన పారదర్శక సేవలు అందించేందుకు వీలుగా రెవెన్యూ శాఖ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, సర్వే విభాగాలను అనుసంధానించేలా కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. భూభారతి పోర్టల్‌లో సర్వే మ్యాప్‌లను లింకు చేసేలా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు వెల్లడించారు. సోమవారం సచివాలయంలో రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, సర్వే విభాగం, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ) అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ భూభారతి పోర్టల్‌ను మరింత సులువుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌ఐసీ అధికారులకు సూచించారు. కొత్తగా రూపొందిస్తున్న సాఫ్ట్‌వేర్‌లో ఎప్పటికప్పుడు కోర్టు కేసులను పర్యవేక్షించే వ్యవస్థ కూడా ఉండాలన్నారు. నక్షా లేని ఐదు గ్రామాల్లో భూముల రీసర్వే విజయవంతంగా పూర్తయినందున రాష్ట్రంలోని మిగిలిన 408 గ్రామాల్లోనూ త్వరలోనే ఈ రీసర్వేను ప్రారంభించాలని ఆదేశించారు. భూవివాదాల పరిష్కారంలో తెలంగాణ దేశానికే మార్గదర్శకంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్.లోకేశ్‌కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీసీఎల్‌ఏ మంద మకరంద్, ఎన్‌ఐసీ అధికారులు ప్రసాద్, విజయమోహన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి 'వకుళాభరణం'



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ సమక్షంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు కాషాయకండువా కప్పుకున్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో ఆయనకు రాంచందర్‌రావు బీజేపీ ప్రాథమిక సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ ఇది తెలంగాణలో స్పష్టమైన సంకేతం.. బీసీ లు, ఎంబీసీలు అందరూ బీజేపీతో ఉన్నారని, బీసీల హక్కులను రక్షించేది బీజేపీ మాత్రమేనన్నారు. కె.లక్ష్మణ్ ప్రసంగిస్తూ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసుపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మసిపూసి మారేడుకాయ చేసి, కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా వ్యవహరించిందని ఎద్దేవా చేశారు. బీజేపీతోనే సామాజికన్యాయం సాధన సాధ్యమని వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చేప, రొయ్య పిల్లల పెంపకం బాధ్యత ఎస్‌హెచ్‌జీలకు..

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- త్వరలో మహిళా సంఘ సభ్యులకు యూనిఫాం చీరలు: సీతక్క



లబ్ధిదారుకు వాహనపత్రం అందిస్తున్న భట్టి, వాకిటి శ్రీహరి, మెట్టు సాయికుమార్. చిత్రంలో దివ్య తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చేప, రొయ్య పిల్లల పెంపకం బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించి ప్రభుత్వమే వారి నుంచి విద్యుత్ కొనుగోలు చేసి ఆదాయం సమకూర్చే కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. సోమవారం ప్రజాభవన్లో మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామన్నారు. అన్ని జిల్లాల్లో డ్వాక్రా బజార్లు ఏర్పాటు ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు.

మత్స్యకార కుటుంబాలకు అండగా ఉంటాం: వాకిటి

సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని లబ్ధిదారులకు వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యుల కోసం త్వరలో యూనిఫాం చీరలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఇప్పటివరకు మహిళా సంఘాలకు రూ. 25 వేల కోట్లకుపైగా రుణాలు ఇచ్చామని, ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ అద్దె బస్సుల ద్వారా ఒక్కో మహిళా సంఘం ప్రతినెలా 70 వేల రూపాయలను సంపాదిస్తున్నట్లు, పెట్రోల్ బంకుల ద్వారా ప్రతినెలా రూ. 4 నుంచి 5 లక్షల వరకు ఆదాయం మహిళా సంఘాలకు వస్తున్నట్లు తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ త్వరలో వందల సంఖ్యలో సంచార చేపల విక్రయ వాహనాలను పంపిణీ చేస్తామని, మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, సెర్ప్ సీఈఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.

కవిత వ్యాఖ్యలతో 'కాళేశ్వరం అవినీతి' రుజువైంది

- అందులో మామ వాటా ఎంతో.. అల్లుడి వాటా ఎంతో తేలాలి
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలతో తేలిపోయిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. అయితే కాళేశ్వరంలో అవినీతి కేసీఆర్ చేశారా? లేక హరీశ్‌రావు చేశారా? అన్న విషయంతో తమకు అవసరం లేదని, బీఆర్‌ఎస్ హయాంలో కుంభకోణం జరిగిందనేది మాత్రం స్పష్టమని చెప్పారు. కవిత కూడా ఇప్పుడు అదే చెప్పారన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో మామ కేసీఆర్ వాటా ఎంతో? అల్లుడు హరీశ్‌రావు వాటా ఎంతో? తేలాలని అన్నారు. మొదటి దఫా ప్రభుత్వంలో హరీశ్‌రావు తప్పు చేస్తే, కేసీఆర్ ఎందుకు చర్యలు తీసుకోలేదని, ఆ రోజున కవిత ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో మూడు ముక్కలాట ఫైనల్‌కి చేరిందని, వారి కుటుంబ కలహాలను తమపై రుద్దడమేంటని మహేశ్‌గౌడ్ ప్రశ్నించారు. ఆ కుటుంబంలోని అంతర్గత కలహాలతో తొలుత కేటీఆర్, ఆ తర్వాత కవిత అమెరికా వెళ్లి అవగాహన కుదుర్చుకుని వచ్చి, ఇప్పుడు హరీశ్‌రావును టార్గెట్ చేశారని అన్నారు. వారి కుటుంబ కలహాలతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని, సీఎం రేవంత్‌రెడ్డిపై కవిత చేసిన వ్యాఖ్యలను తాను ఖండిస్తున్నానని మహేశ్‌గౌడ్ స్పష్టం చేశారు. కాగా, 'కాళేశ్వరం బంతి సీబీఐ కోర్టులో ఉంది. గతంలో కాళేశ్వరం కేసీఆర్‌కు ఏటీఎంలా ఉందని విమర్శించిన బీజేపీకి ఇప్పుడు తమ నిజాయితీని నిరూపించుకునే అవకాశం వచ్చింది. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్న బీజేపీ.. ఇప్పుడు దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి, బాధ్యులపై చర్యలు తీసుకునేలా కృషి చేయాలి'అని మహేశ్‌గౌడ్ అన్నారు. కాళేశ్వరంపై హరీశ్‌రావు, కేటీఆర్‌లు అసత్యాలు మాట్లాడుతూ.. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు.

వైఎస్సార్ మార్గం ఎప్పటికీ అనుసరణీయం: మహేశ్ గౌడ్

జన హృదయ నేత, సంక్షేమ ప్రదాత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చూపిన స్ఫూర్తిదాయక మార్గం ఎప్పటికీ అనుసరణీయమని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ కొనియాడారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సోమవారం ఒక ప్రకటనలో ఆయన నివాళులర్పించారు. 'పేదల పెన్నిధి, ప్రజాపాలనకు నిలువెత్తు నిదర్శనం వైఎస్సార్. మహానేత ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, గృహ నిర్మాణ పథకం, ఫీజు రీయింబర్స్‌మెంట్, రుణమాఫీ లాంటి సంక్షేమ పథకాలు లక్షలాది కుటుంబాలకు ఆశాకిరణాలుగా మారాయి. పేదల సంక్షేమం కోసం ఆయన ప్రవేశపెట్టిన పథకాలు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడతాయి'అని ఆ ప్రకటనలో మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు.

రామోజీ ఆక్రమించిన భూములను విడిపించాలి

- అనాజ్‌పూర్‌లోని అసైన్డ్ రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలి
- రంగారెడ్డి జిల్లా సీపీఎం ప్రధాన కార్యదర్శి యాదయ్య డిమాండ్



ఆర్డీఓ అనంతరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేత యాదయ్య, నేతలు

ఇబ్రహీంపట్నం: రామోజీ ఫిలింసిటీ ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములకు విముక్తి కల్పించడంతోపాటు అనాజ్‌పూర్‌లోని అసైన్డ్‌భూముల లబ్ధిదారులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా సీపీఎం ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యాదయ్య మాట్లాడుతూ.. అనాజ్‌పూర్‌లోని పేదల సీలింగ్ భూములను లాక్కొని బడాబాబులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. 1991లో 274 నుంచి 278, 281 సర్వే నంబర్లలోని 125 ఎకరాల సీలింగ్ భూమిని 125 మందికి ప్రభుత్వం అసైన్ చేసిందన్నారు. అప్పట్లో 80 మందికి పట్టాలు ఇచ్చారని తెలిపారు. ఈ మొత్తం భూమిని రామోజీ ఫిలింసిటీకి, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. పేద రైతుల నోట్లో మట్టి కొట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 301, 307 సర్వే నంబర్లలోని సుమారు 20 ఎకరాల భూమి రామోజీ ఫిలింసిటీ కబ్జాలో ఉందన్నారు. కోర్టులో కేసులు వేసి రైతులు రాకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ.. వేముల కత్వ, ఇందిరమ్మ సాగర్, పటేల్‌కుంట ఎఫ్‌టీఎల్ భూములను ఆక్రమించిన ఫిలింసిటీ యాజమాన్యం భారీ నిర్మాణాలు చేపడుతోందన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆర్డీఓ కార్యాలయంలోకి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను అధికారులు అడ్డుకున్నారు. అనంతరం ఆర్డీఓ అనంతరెడ్డి వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. వారం రోజుల్లో రికార్డులు పరిశీలించి, పూర్తి సమాచారం సేకరించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ ఆందోళనలో సీపీఎం నాయకులు సామేల్, జంగయ్య, సుమలత, శివకుమార్, ముత్యాలు, బాల్‌రాజ్, మహేశ్, రవి, భిక్షపతి, శ్రీను, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ నిధులు దారి మళ్లించారు

- ఎస్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ ఆరోపణలు



ఫిర్యాదుపత్రాన్ని చూపుతున్న ఎస్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ పరిధిలోని భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు పెద్ద సంఖ్యలో దారి మళ్లించారని ఎస్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు బత్తుల రాజశేఖర్, ద్యాగటి హరీశ్ ఆరోపించారు. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. కార్మిక సంక్షేమ బోర్డులోని సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగి పెద్ద ఎత్తున నిధులను కాజేశారని, దాదాపు పన్నెండేళ్లుగా కుర్చీ వీడని సదరు అధికారి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. పన్నెండేళ్లలో కార్మిక శాఖలో కమిషనర్లు, జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు చాలామంది మారినప్పటికీ, బోర్డులోని ఆ అధికారి మాత్రం అదే కుర్చీలో దర్జాగా కొనసాగుతున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించి కొన్ని పత్రాలను మీడియా ప్రతినిధులకు అందించారు. ఈ అంశంపై కార్మిక శాఖ ఉన్నతాధికారులతోపాటు విజిలెన్స్ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే న్యాయపోరాటం చేయనున్నట్లు మీడియాకు వెల్లడించారు.

సంస్థను బలోపేతం చేస్తాం

వ్యవసాయ యాజమాన్య, విస్తరణ శిక్షణ సంస్థను సందర్శించిన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోనే ఏకైక వ్యవసాయ యాజమాన్య, విస్తరణ శిక్షణ సంస్థను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కమిషన్ సభ్యులతో కలిసి మలక్‌పేటలోని సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు, రైతులకు ఎంతగానో ఉపయోగపడే ఈ శిక్షణ సంస్థ నిరాదరణకు గురైందని స్థానిక అధికారులు కోదండరెడ్డి దృష్టికి తెచ్చారు. 1985లో ఏర్పాటైన ఈ సంస్థలో మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఆదర్శ రైతులకు సాగులో నూతన పద్ధతులపై శిక్షణ ఇచ్చేవారని, చాలా సందర్భాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రులు కూడా ఈ సంస్థకు వచ్చి శిక్షణ తరగతుల్లో పాల్గొనే వారని తెలిపారు. కానీ గత పదేళ్ల కాలంలో ఈ సంస్థ తన వైభవాన్ని కోల్పోయిందని అధికారులు కోదండరెడ్డి, సభ్యులు భవానీ రెడ్డి, భూమి సునీల్‌లకు వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శిక్షణ సంస్థలో వివిధ విభాగాలను కమిషన్ బృందం పరిశీలించింది. దేశంలోనే హెచ్‌డీ కాటన్‌ను పరీక్షించి గుర్తించిన డీఎస్‌ఏ ల్యాబ్‌గా మలక్‌పేట ల్యాబ్‌కు పేరుందని తెలుసుకొన్న కోదండరెడ్డి ఈ సంస్థకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో గడపాలి.
అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి.
– వై.ఎస్. రాజశేఖర రెడ్డి

సాక్షి
మంగళవారం, 2 సెప్టెంబర్ 2025

శుభ పరిణామం... త్రైపాక్షికం

ఏడేళ్ల అనంతరం తొలిసారిగా ప్రధాని నరేంద్ర మోదీ చైనాలో జరిపిన పర్యటన అనేక విధాల సత్ఫలితాలనిచ్చింది. ఇది అంతర్జాతీయ పెత్తందార్లకు తగిన సందేశం పంపింది. పెహల్గామ్ ఉగ్రవాద దాడిపై మూణ్ణెల్లు గడిచినా ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోయిన షాంఘై సహకార సంస్థ(ఎస్సీవో)తో ఆ ఘటనను ఖండిస్తూ తీర్మానం చేయించింది. చైనా, రష్యాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత మెరుగుపరుచుకునే దిశగా ప్రగతి సాధించింది. ఈ పరిణామాలన్నీ యాదృచ్ఛికంగా జరిగినవి కాదు. అంతర్జాతీయ సంబంధాల్లో అమెరికా సృష్టించిన సరికొత్త గందరగోళం వల్ల ఏర్పడిన అయోమయ వాతావరణాన్ని ఎస్సీవో శిఖరాగ్ర సదస్సు ఒక కుదుపు కుదిపింది. ప్రపంచవ్యాప్త మీడియా ఈ శిఖరాగ్ర సదస్సు కన్నా మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు చర్చించుకుంటున్న వీడియోకూ, ఛాయాచిత్రాలకూ అత్యధిక ప్రాధాన్యమివ్వటం మోదీ చైనా సందర్శనలోని అంతరార్థాన్నీ, దాని పరిణామాలనూ అవగాహన చేసుకోవటం వల్లే. అయితే కేవలం ఈ పర్యటన వల్లే అంతా మారిపోతుందనీ, చైనా మనతో సవ్యంగా ఉంటుందనీ, అమెరికా తన తెలివితక్కువ విధానాలను సవరించుకుంటుందనీ అనుకోనవసరం లేదు. ఇప్పటికైతే యూరేసియాలోని మూడు అగ్ర దేశాల కలయిక అవసరార్థ బంధమే. బలపడాలంటే చేయాల్సింది చాలా ఉంటుంది. రష్యాకిది వర్తించదు. ఆ దేశంతో మన మైత్రి చిరకాలమైనది. దాన్ని నీరుగార్చడానికి అమెరికా ఎంత ప్రయత్నించినప్పటికీ అదేమంత తగ్గలేదు. కానీ పెరగాల్సినంత పెరగలేదు.

ఈ మూడు దేశాల కలయికా ఈ దేశాల ప్రయోజనాలు నెరవేర్చుకోవటంతోపాటు ఈ ప్రాంత శాంతికీ, సుస్థిరతకూ, అభివృద్ధికీ దోహదపడుతుంది. దీని మూలాలు ప్రచ్ఛన్న యుద్ధానంతర పరిణామాల్లో ఉన్నాయి. సోవియెట్ యూనియన్ కుప్పకూలి రష్యాగా మిగిలిపోయిన 1990వ దశకంలో అప్పటి ఆ దేశ ప్రధాని యెవ్‌జెనీ ప్రైమకోవ్ ఈ భావనకు రూపుదిద్దారు. ఈ వ్యూహాత్మక కలయిక భవిష్యత్తులో అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టగలదని భావించారు. మంత్రుల స్థాయిలో, నిపుణుల స్థాయిలో పలు సమావేశాలు కూడా జరిగాయి. కానీ 2020లో గల్వాన్ ఉదంతం అనంతరం నిలిచిపోయాయి. చైనాతో మనకున్న సరిహద్దు తగాదాలూ, చేదు అనుభవాలూ తక్కువేం కాదు. నిజానికి మొన్నటికి మొన్న ఎస్సీవో మంత్రుల స్థాయి భేటీ అనంతరం విడుదలైన సంయుక్త ప్రకటనలో పెహల్గామ్ ప్రస్తావన లేకపోవటాన్ని నిరసిస్తూ మన దేశం దానిపై సంతకం చేసేందుకు నిరాకరించింది. ఇప్పుడు ఎస్సీవో తన తప్పు దిద్దుకోవటం శుభ పరిణామం.

ఈ త్రైపాక్షిక కలయికపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాటలు గమనిస్తే ఆయనెంత కలవరపడుతున్నారో తెలుస్తుంది. ఇది 'ఏకపక్ష విపత్తు'గా పరిణమిస్తుందట! ఆ దేశ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో సరేసరి. రోజుకో రకంగా నోరు పారేసుకుంటున్నారు. మన దేశం సంయమనంతో అమెరికా 50 శాతం సుంకాలు ఎంత అర్థరహితమో చెప్తూ వస్తోంది. తాను తప్ప దిక్కులేదనే స్థితికి చేరిన అమెరికా కళ్లు తెరిపించటం ప్రస్తుతావసరం. దేశాల మధ్య పటిష్ఠమైన ద్వైపాక్షిక సంబంధాలు ఉన్న కాలంలో తనకు అనుకూలమైన నిబంధనలతో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)ను అమల్లోకి తెచ్చింది అమెరికాయే. పర్యవసానంగా ఎడాపెడా ఆర్జించి, స్వీయ తప్పిదాల కారణంగా సంక్షోభంలో పడిన ఆ దేశం అందుకు ఇతరులను నిందిస్తూ మూర్ఖంగా ప్రవర్తిస్తోంది.

భారత–చైనా సంబంధాలపై రెండు వైపుల నుంచీ వెలువడిన ప్రకటనలు ఒకే స్వరంతో ఉండటం గమనించదగ్గది. ఇరు దేశాలూ భాగస్వాములే తప్ప ప్రత్యర్థులు కారని ఆ ప్రకటనలు గుర్తుచేశాయి. చైనాతో మన సంబంధాలు బాగున్నప్పుడు పాకిస్తాన్ అణిగిమణిగి ఉండటం మొదటినుంచీ కనబడుతోంది. ఇకపై కూడా అదే జరిగితే మంచిదే. ఏదేమైనా పెత్తందారీ పోకడలు చెల్లబోవని చెప్పాల్సిన తరుణం ఆసన్నమైంది. కాకపోతే భారత్–చైనా–రష్యా కలయిక వికసించాలంటే ఎంతో చిత్తశుద్ధితో, నిజాయితీతో పనిచేయాల్సి ఉంటుంది. అది జరగాలని ఈ మూడు దేశాలు మాత్రమే కాదు... ప్రపంచమే కోరుకుంటోంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.దశమి రా.12.35 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** మూల రా.7.49 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.6.14 నుండి 7.58 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.50 నుండి 11.36 వరకు, **అమృత ఘడియలు:** ప.1.02 నుండి 2.46 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.12
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

వైఎస్ ఏం చేయలేదనీ...

అభిప్రాయం



డా॥ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి

ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ వంటి వారు ఎంత కృషి చేసినా 2003 ఆరంభం నాటికి కూడా ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ పార్టీ చావు బతుకుల్లోనే ఉండేది. తొమ్మిదేండ్ల చంద్రబాబు పాలనతో రాష్ట్రం ఆత్మహత్యల రాష్ట్రంగా మారిపోయింది. ఆ స్థితిలో 'పాదయాత్ర' అనే ప్రజాసమస్యల అవగాహనా యాత్రతో, 'జైత్ర యాత్ర' అనే పార్టీ చైతన్య యాత్రతో జనంలో నమ్మకాన్ని కలిగించి, కాంగ్రెస్ పార్టీకి ప్రాణం పోసి, బలం చేకూర్చారు వైఎస్ రాజశేఖర రెడ్డి. ఇక, 2004లో అత్యధిక మెజారిటీతో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారం పొందేట్లు చేశారు; సీఎం కూడా అయ్యారు. 2009 నాటి జనరల్ ఎలక్షన్లలో కూడా కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించేటట్లు చేశారు.



'పల్లెబాట', 'నగర బాట', 'రైతు బాట', 'ప్రాజెక్టుల బాట' వంటి కార్యక్రమాలతో ఎల్లప్పుడూ జనంలో ఉంటూ, పార్టీని మరింత బలోపేతం చేస్తూ అన్ని వర్గాల ప్రజల అవసరాల్ని తీర్చడానికి కృషి చేశారు. సీఎం కావడంతోటే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇచ్చారు. రైతుల విద్యుత్ బకాయిలు రద్దు చేశారు. సబ్సిడీపై పంట విత్తనాలు, గడ్డి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల్ని ఇచ్చారు. విత్తనాల కోసం 'సీడ్ విలేజ్'లను ఏర్పరచారు. పంటల బీమా పథకం ప్రవేశపెట్టారు. పంట నిల్వలకు 'రైతు బంధు' పథకాన్ని ప్రవేశపెట్టారు. రైతుల శిక్షణకై 'పొలం బడి' కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయాభివృద్ధికై 'వ్యవసాయ టెక్నాలజీ మిషన్' ఏర్పరచారు. 'పని గ్యారంటీ' పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి పేదలకు జీవన సమస్య లేకుండా చేయడానికి కృషి చేశారు. మధ్యతరగతి గృహ అవసరాల్ని 'రాజీవ్ గృహ కల్ప' ద్వారా తీర్చ డానికి ప్రయత్నించారు.

డ్వాక్రా సభ్యులైన మహిళలందరికీ పావలా వడ్డీకే రుణాలిచ్చి వారి కుటుంబాల ఆర్థిక అభివృద్ధికై కృషి చేశారు. ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐటీఐలను నెలకొల్పారు. హైదరాబాద్‌లో బిట్స్ క్యాంపస్ ఏర్పాటు చేశారు. 'జవహర్ నాలెడ్జ్ సెంటర్'లు, ఇరవై ఒకటవ శతాబ్ది గురుకులాలు, పలు మెడికల్, డెంటల్, ఇంజినీరింగ్ కాలేజీల్ని ఏర్పరచారు. భారీ, మధ్యతరహా, చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు కృషి చేశారు.

వ్యవసాయేతర అవసరాలకు ఛార్జీలు పెంచకుండానే విద్యుత్ సరఫరా చేశారు. వ్యాపార, వాణిజ్యాల అభివృద్ధికై రోడ్ల సౌకర్యాల్ని పెంచారు. తీర జిల్లాల్లో ఓడరేవుల నిర్మాణానికై కృషి చేశారు. నగరాల్లో '108' అంబులెన్సుల్ని, పల్లెల్లో '104' అంబులెన్సుల్ని ఏర్పరచారు.

ఇలా, పలు అభివృద్ధి–సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్ర రాజకీయాల్లో రాకెట్టులా దూసుకెళ్ళారు వైఎస్సార్. ఇంతటి అవగాహనతో ప్రజా సమస్యల పరిష్కారం జరిపి సామాన్య జనం కూడా మేమూ సంతోషంగా బతకగలం అనే ధీమా కల్పించిన వైఎస్ లేకపోవడం దురదృష్టకరం. అయితే, జనంలో ఆయనపై అభిమానం సడలసలేదనేది సుస్పష్టం. ఆయనపై గల విశ్వాసం, నమ్మకం, అభిమానం ఇప్పుడు జనం జగన్‌పై చూపుతున్నారు.

వ్యాసకర్త రిటైర్డ్ ప్రొఫెసర్, చరిత్ర శాఖ, ఎస్వీ యూనివర్సిటీ

చరిత్ర చూసిన ఘోర విషాదం

స్మరణ



భూమన కరుణాకర రెడ్డి

మన సారథి మన సచివుడు
మన వియ్యము మన సఖుండు
మన బాంధవుడున్
మన విభుడు గురుడు దేవర
మనలను దిగనాడి చనియె మనుజాధీశా!

శ్రీకృష్ణ పరమాత్ముడు ఇహం వీడి పరమపదం చేరుకున్నపుడు అర్జునుడి ఆవేదన అది. కానీ, ఆధునిక యుగంలో ఓ పరమాప్తుడు హఠాత్తుగా నవ్వుతూ అంతర్ధానమయ్యాడని కోట్లాది మంది అల్లల్లాడిపోవడం ఆశ్చర్యం, అపూర్వం.

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారు అందర్నీ కలవాలని చిరుదరహాసంతో బయలుదేరి మేఘాల మధ్య, వర్షంలో పావురాల గుట్ట వద్ద ప్రపంచాన్ని వదిలిన వేళ కోట్ల మంది నిర్ఘాంతపోయారు. నమ్మలేదు, నిజంకాదు అనుకున్నారు. తెల్లటి దుస్తుల్లో చెరగని చిరునవ్వుతో శత్రువుకైనా వరమిచ్చే ఆ మహర్షి అలా ఎలా వెళ్ళిపోతాడని ఏడ్చారు. ప్రసార మాధ్యమాలను నమ్మక ఆ ప్రాంతానికి పరుగెట్టారు. దేవుణ్ణి నిందించారు.

తెలుగు రాష్ట్రాలలో మూడు రోజుల పాటు ఏ ఇంట్లోనూ పొయ్యి వెలగలేదు. కన్నీటి వరదలో ఆకలి కొట్టుకుపోయింది. చరిత్రలో ఎందరో చక్రవర్తులు, తత్త్వవేత్తలు మరణించినపుడు కూడా ఇంతటి విషాదాన్ని, ప్రజా ప్రతిస్పందాశ్రు సంద్రాన్ని చూడలేదు అన్నది వాస్తవం. వైఎస్ మరణవార్త విని కొండంత ఆ దుఃఖాన్ని గుండెల్లో మోయలేక, ఆ భారంతో బాధతో ఏడు వందలకు పైగా గుండెలు కొండెక్కాయి. నమ్మలేని విషయం ఇది. కళ్ళ ముందు సత్యం ఇది. 'నీవు లేని వేళ మాకీ బ్రతుకేల, నీ వెంటే వస్తాం, ఏ లోకంలో ఉన్నా నీ పరిపాలనలోనే ఉంటాం' అంటూ కదిలిపోవడం ఏమనాలి!

◆ ఎందుకు ప్రజలకు ఆయన పట్ల అంత ప్రేమ? రూపాయి డాక్టరు అయినందుకా? సామాజిక సేవకై రాజకీయ వైద్యుడైనందుకా? నాగలి మోసేవాడి భుజం నొప్పి తెలిసినందుకా? కార్మికుల ఘర్మజల మర్మం ఎరిగినందుకా? రాళ్ళ భూమిని నీళ్ళతో తడిపినందుకా?



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి
డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతి నేడు

కారణ జన్ముడు

మనతో, మన మధ్య తిరిగిన ఓ మనిషి, ఓ నాయకుడు ఇంత ఆదరం పొందటం నిజంగా చరిత్ర. భగవంతుడిని అనేక రూపాలలో కొలుస్తాం. అలా ఆ రాజన్నకు జనం గుండెల్లో గుడి కట్టడం; అన్నగా, నాన్నగా, బంధువుగా, హితుడిగా, గురువుగా, దేవరగా కొలవడం అసాధ్యమైన సాధ్యం. ఆయనకిచ్చారు హృదయ నైవేద్యం. ఆ రూపు నేటికీ ఆరాధ్యం. ఆ మూర్తి, ఆ వ్యక్తిత్వపు అయస్కాంత స్ఫూర్తి ఇంకా పచ్చగా, పచ్చిగా వుంది. ప్రజల హృదయాల్లో పలవరిస్తూ ఉంది, పలకరిస్తూనే ఉంది.

ఇంతగా ఇంకా ఆ దరహాసపు చంద్రకాంతి మనలో ఉందంటే– ఆయన చేసిన సేవ, శత్రువును సైతం క్షమించే గుణం, కపటం లేని దార్శనికత, మోసం లేని రాజకీయం, కొందరివాడుగా కాక అందరివాడుగా మారిన నైజం, పాలకుడే సేవకుడుగా మారిన రూపం, దుస్తులంత తెల్లని మనసు, చిరునవ్వంత అందమైన చిత్తం, ఆదరణ వేళ అమ్మతనం, కరుణించే ఔదార్యం, ఎముక లేని దాతృత్వం... ఇంకా ఇంకా ఇంకా ఎన్నో, ఎన్నెన్నో!

కారణ జన్ముడు, రణ జన్ముడు, అనురాగ హృదయ రుణ అరుణ జన్ముడు రాజశేఖరరెడ్డి. దైవం, ఈ లోకాన్ని మార్చాలని మానుషరూప దైవంగా ఆయనను ఇలకు పంపి, మరింత కాలం మనుగడ సాగిస్తే ఆయన ముందు తనని మరచిపోతారేమోనని హఠాత్తుగా ఆయన శ్వాస వాయువును తన వాయులీనం చేసుకున్నాడు. ఈర్ష్యతో సర్వేశుడు చేసిన చర్య ఆయన మరణం అని అందరి హృదయ వచనం.

ఎందుకు ఆయన పట్ల అంత ప్రేమ? రూపాయి డాక్టరు అయినందుకా? సామాజిక సేవకై రాజకీయ వైద్యుడైనందుకా? సమ్మోహపు చిరునవ్వుతో సామాన్యులను పలకరించినందుకా? నాగలి మోసేవాడి భుజం నొప్పి తెలిసినందుకా? కార్మికుల ఘర్మజల మర్మం ఎరిగినందుకా? పేదలను ప్రేమించినందుకా? రాళ్ళ భూమిని నీళ్ళతో తడిపినందుకా? ఒక్క మనిషిలో ఎన్ని రూపాలు, ఎన్ని భిన్న స్వరూపాలు!

చరిత్ర చూసిన ఘోర విషాదం, ఉప్పొంగిన అశ్రు సముద్రం, ఉలిక్కిపడిన శూన్యపు గగనం.... ఆ రోజు తలవటానికి కూడా ఇష్టపడని సెప్టెంబరు... అయినవాళ్ళు పోతేనే అతి త్వరగా మరిచిపోయే ఈ రోజుల్లో ఇన్ని సంవత్సరాలు గడిచినా ఇంకా ఆ రోజును, ఆ మనిషిని, ఆ మనసును తలచుకుని కన్నీరు పెడుతున్నారంటే... ఎంత అదృష్టవంతుడు రాజశేఖరరెడ్డి! ఆయన లేని మనం ఎంత దురదృష్టవంతులం!!

జన హృదిలో... పూజ గదిలో...

ఆత్మీయుల ఫొటోలను ఇంటి గోడలకు తగిలించుకుంటాం. కానీ కొన్ని లక్షల కుటుంబాలు ఆయన ఫొటోను దేవుని గదిలో, దేవుడి పటాల పక్కన ఉంచి పూజించడం చూస్తున్నాం. ఎదలోని దేవుడు, ఎదురైన దేవుడు ఇంటిపూజలో ఉండాలి అని 'రాజన్న'ను 'రామన్న'ను చేసి కొలవడం కేవలం ఆయనకే దక్కిన గౌరవం. ఆనంద ఆత్మార్పణం ఆకాశదేశం నుంచి అందుకుంటున్నవాడు ఆ రాజశేఖరరెడ్డి.

నాయకుల విగ్రహాలు ఆ యా పట్టణాలలో అరుదుగా వెలుస్తాయి. కానీ ఊరు ఊరునా ప్రజలు వై.ఎస్. విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నారు. 'అన్నా! నీవు అడుగు పెడితే నీతో పాటు మేఘాలు వస్తాయి, వర్షాలు మా పంట పొలాల్ని పలకరిస్తాయి, పంటతో మా ఇంట పండగే తెస్తాయి' అని ప్రతి రైతు గుండె చెమ్మ చేసుకునేది ఆయన గురించే!

'పేదరికంలో పుట్టిన మేము ఈ రోజు ఇంత పెద్ద ఉద్యోగం చేస్తున్నామంటే, ఇలా విదేశాలకు వచ్చామంటే, మా కుటుంబ ఆర్థిక స్థితి బాగైందంటే అది ఆ 'సామాజిక వైద్యుడు' పెట్టిన భిక్ష. ఆయన అందించిన ఫీజు రీయింబర్సుమెంటు ఆర్థిక సాయంతోనే మా స్థితీ, గతీ మారింది' అని చెబుతుంటే ఎవరన్నారు రాజన్న లేడని! ఇన్ని కోట్ల గుండెలు ఆయన్ని తలుస్తూ ఉంటే, పిలుస్తూ ఉంటే ఎక్కడికి పోతాడు? మనలోనే, మనతోనే, మన ఆత్మగా ఉంటాడు.

స్వార్థంతో కొందరు జీవిస్తారు. సమాజం కోసం మహాత్ములు జీవితాన్ని అర్పిస్తారు. నిరంతరం మనుషుల కోసం, పేదవాడి పెదవి మీద చిరునవ్వు చూడటం కోసం, బతుకు పోరులో బడుగు వర్గాల వారిని గెలిపించడం కోసం తపన పడ్డాడు, ఆలోచనగా అడుగులు వేశాడు రాజశేఖరరెడ్డి. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ఆయన పాలన అనితర సాధ్యం. దేశానికి ఒక ఉదాహరణ అనడం అతిశయోక్తి కాదు. రామరాజ్యం, రాజన్న రాజ్యం అని పోల్చుకోని పేదవాడు లేడు ఈ రోజు.

శత్రువులను ఆయుధాలతో కాక చిరునవ్వుల విరివిల్లులతో గెలుస్తూ అభిమానాన్ని పొందాడు. ఆయన వెంట హర్షంతో వర్షం నడిచి వచ్చింది. నీటి కరువుకు నిత్య నిలయమైన అనంతపురం లాంటి జిల్లాను వరదలు పలకరించాయి. ఆయన హయాంలో ఒక్క రైతు కూడా ఆవేదనతో ఆత్మహత్య చేసుకోలేదు. నీళ్ళతో పాటు ఉచిత కరెంటు కూడా ఇచ్చి, కర్షకుడి కంట కన్నీరు రాకుండా కాపాడుకున్నాడు. నదుల నీరు వృథాగా సముద్రంలో కలవకూడదని, ఆ జలబలాన్ని రైతుకు అందించాలని, భూములు తడిపి, వారి కుటుంబాల కన్నీళ్ళు తుడిచిన సత్యపథుడు, అపర భగీరథుడు వై.ఎస్.

ఉద్యోగుల అలజడులు లేవు. విద్యార్థుల ఉద్యమాలు లేవు. హింసావాదుల్ని అహింసా మార్గానికి తీసుకువచ్చి సంస్కరించాలని సంస్కారంతో నక్సలైట్లతో చర్చలు జరిపాడు. ఎవ్వరూ ఊహించని 'ఆరోగ్య శ్రీ'ని పేదలకు వరంగా అందించి, కార్పొరేట్ వైద్యాన్ని వాళ్ళ కాళ్ళ దగ్గరకు తెచ్చిన మహా ప్రాణదాత. ఆయన పుణ్యమా అని ఎందరి ఇళ్ళల్లో దీపాలు వెలిగాయో!

ఆయన వేగం, సాధిస్తున్న సంక్షేమం, ప్రజలలో ఆయన పట్ల ఉన్న ఆరాధనం చూసి శాసన సభలో ప్రతిపక్షాలు అల్లాడిపోయాయి. ఏం అనాలో, ఎలా తిట్టాలో అర్థం కాలేదు వారికి. చంద్రబాబు ప్రయత్నం చేసి, ఆయన చతురత, చమత్కారం, హాస్యం, దృఢచిత్తం ముందు నవ్వుల పాలయ్యాడు. నలిగి కూర్చున్నాడు. ఆయనను తిట్టాలనుకున్న ప్రతి నోరూ మూతబడిపోయింది... తెరిస్తే అప్రయత్నంగా ఆయనను పొగడకుండా ఉండలేమనే భయంతో! ఆయనలోని మానవత్వ విరాడ్రూప విజృంభణ చూసి ప్రపంచమే చేతులు జోడించింది.

శ్రీవారిని భక్తుల చెంతకు చేర్చాడు!

హిందువులకు, హైందవ ధర్మానికి, ధర్మ పరిరక్షణకు ఆయన చేసిన సేవ, పనులు మరే నాయకుడూ, మరే ముఖ్యమంత్రీ చేయలేదు అన్నది వాస్తవం. కళ్ళు మూసుకుని అసత్యాలు ప్రచారం చేసే వాళ్లు సైతం అంతరంగంలో అంగీకరించిన సత్యం. పసుపు ఎంత పూసినా పాడవని అగ్నికణం.

ఈ రోజు సమస్త ప్రపంచం తిరుమల శ్రీవారి ఆలయ విశేషాలను, ఉత్సవాలను చూస్తున్న 'శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్' ఆయన ఆలోచన. ఆయన రూపకల్పన. అన్య మతాల వారికి తి.తి. దేవ స్థానంలో ఉద్యోగాలు ఇవ్వకూడదు అని ప్రభుత్వ ఉత్తర్వులు (జి.ఓ.) ఇచ్చింది ఆయనే!

'కల్యాణమస్తు' పేరుతో, శ్రీవారి మూలమూర్తి పాదాలు తాకిన తాళిబొట్లతో 36 వేల మందికి రాష్ట్రవ్యాప్తంగా తి.తి.దే. వివాహాలు జరిపించడానికి కర్త ఆయన. భగవంతుడు అందరివాడని దళిత వాడలకు గోవిందుడిని 'దళిత గోవిందం' పేరుతో తీసుకువెళ్ళిన సాహసి. ప్రపంచంలోని ప్రతి గ్రామంలో శ్రీనివాస కల్యాణాలు జరగాలని శ్రీకారం చుట్టినవాడు, తిరుపతిలో వేద విశ్వవిద్యాలయాన్ని స్థాపించినవాడు, స్వామివారిని కల్యాణ రథాలపై ఆసీనుల్ని చేసి రాష్ట్రం నలుమూలలకీ తీసుకువెళ్ళినవాడు, తిరుమల మాడ వీధులలో పాదరక్షలు ధరించడం నిషేధించినవాడు, శ్రీవారిని దర్శించుకున్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా లడ్డు ప్రసాదాన్ని అందించినవాడు, ఉచిత పుస్తక ప్రసాదం ఇచ్చినవాడు, అన్నమయ్య జన్మగ్రామమైన తాళ్ళపాక వద్ద 108 అడుగుల అన్నమయ్య విగ్రహాన్ని ఆవిష్కరించినవాడు ఆ శ్రీరాజ హృదయుడే!

తిరుమలలో ప్రతి పున్నమికీ గరుడసేవ, నిత్యం ఆగని అకుంఠిత హరినామ సంకీర్తనం, అంతర్జాతీయ అన్నమయ్య ఉత్సవాలు, గోవుకు సర్వోన్నత స్థానమిచ్చిన వందే గోమాతం, చంటి బిడ్డల జంటలకు శ్రీవారి తక్షణ దర్శనం, సవ్యాఖ్యాన భారత భాగవతాల ముద్రణ.... ఇలా రోజూ ఓ నూతన కార్యక్రమంతో భక్తులకు శ్రీవారి దర్శనం సులభతరం చేశాడు. శ్రీవారిని భక్తుల ముంగిళ్ళకు తీసుకెళ్ళాడు.

◆ అన్ని రంగాలనూ అభివృద్ధి చేసి, ప్రజలను చల్లగా చూసిన ఆ అయిదేళ్ళూ ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయల పాలనను గుర్తుకు తెచ్చింది, మరిపించింది అని ఎందరో పెద్దలు అన్నారు, అంటున్నారు. ఆ స్వర్ణయుగ సూత్రధారిని నిత్యం ప్రజలు స్మరించుకుంటూనే ఉన్నారు.

తిరుమలలో కనీవిని ఎరుగని రీతిలో 75 మంది పవిత్ర పీఠాధిపతులతో 'సనాతన ధర్మ ప్రచార సదస్సులు' నిర్వహించి ధర్మ శంఖారావాన్ని నలుదిక్కులా వినిపించాడు. హైందవ ధర్మాన్ని నాలుగు పాదాలతో నడిపిన అపర నారాయణుడు ఆయన అంటే అది సర్వ సమ్మతం. తి.తి.దేవస్థానం అప్పటి అధ్యక్షుడిగా ఈ కార్యభారాన్ని నా చేత చేయించి, నన్ను అదృష్టజీవిగా మార్చినవాడు. వైభవమంతా చూశాను. భక్తుల పారవశ్యాన్ని దర్శించాను అంటే అది ఆయన చల్లని దీవెన, నా మీద ఆయనకున్న ప్రేమ.

ఆయన పరిపాలనలో కవులు, కళాకారులు, రచయితలతో సాంస్కృతిక రంగం ఎంత గొప్పగా వెలిగిందో! తిరుపతిలో నాలుగు సంవత్సరాల తెలుగు భాషా బ్రహ్మోత్సవాల వైభవానికి ఆయన సూత్రధారి. శంకరంబాడి సుందరాచార్య, శ్రీకృష్ణదేవరాయలు, ఎం.ఎస్. సుబ్బులక్ష్మి వంటి మహామహుల విగ్రహాలు ఆవిష్కరించింది ఆయనే!

అన్ని రంగాలనూ అభివృద్ధి చేసి, ప్రజలను చల్లగా చూసిన ఆ అయిదేళ్ళూ ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయల పాలనను గుర్తుకు తెచ్చింది, మరిపించింది అని ఎందరో పెద్దలు అన్నారు, అంటున్నారు. ఆ స్వర్ణయుగ సూత్రధారిని నిత్యం ప్రజలు స్మరించుకుంటూనే ఉన్నారు.

అంతటి మహానాయకుడు, మహానుభావుడు, మహర్షి నాకు హితుడు, సన్నిహితుడు, స్నేహితుడు, గురువు, దైవం కావడం నా పూర్వజన్మ పుణ్యఫలం. ఏ ముహూర్తం కలిపిందో, ఏ తల్లి చల్లని దీవెన ఫలించిందో వైఎస్ ప్రేమ నాకు దక్కింది. 'కర్ణా' అని పిలిస్తే కరిగి పోయేవాడిని. అండగా ఆయన కైదండ నా భుజం మీద వేసి నడిపిస్తే విశ్వ విజేతను అయ్యేవాడిని. ఆయన ఆప్యాయతకు మాటరాక మూగబోయేవాడిని. ఆ చిరునవ్వు నన్ను వెలిగించేది. ఆ చూపు నాకు వెలుగిచ్చేది. అది తీరని రుణం, తీర్చలేని రుణం.

పాతికేళ్ళకు పైగా ఉన్న బంధాన్ని, అనుబంధాన్ని నిత్యం ఎదలో స్మరించుకుంటూ, భారమైన కాలంలో, జీవం లేని జీవితం గడుపుతూ, ఆ చల్లని ధవళ దరహాసాన్ని స్మరిస్తూ, జ్ఞాపకాలను దోసిలిలో పట్టుకుని, కలంలో కన్నీళ్ళు నింపుకుని, కడలి అంత ప్రేమను కాసిన్ని అక్షరాలుగా మార్చి అందిస్తున్నా.

రాముడు అవతారం చాలించినా హనుమంతుడు ఉన్నాడు ఆ భక్తిని చాటడం కోసం, వారసుడిని సేవించడం కోసం. వై.ఎస్. ఆశయాలు చాటడానికి, సాధించడానికి ఆయన వారసుని సేవకు ఆ 'నా దేవుని' ఆదేశంతో నేను అందుకే కార్యోన్ముఖుణ్ణి. రక్తాశ్రువులతో...

వ్యాసకర్త టీటీడీ మాజీ చైర్మన్

చిరస్మరణీయ ప్రజాబాంధవుడు!

విశ్లేషణ



మాకిరెడ్డి పురుషోత్తమ రెడ్డి

వైఎస్సార్ మన నుంచి దూరమై నేటికి 16 సంవత్సరాలు. సంక్షేమం, అభివృద్ధి, దూరదృష్టి, విలువలు, విశ్వసనీయత, ఆదర్శ రాజకీయాలు వంటి మాటలు విన్నప్పుడల్లా ఆయనే గుర్తొస్తారు. ఆయన దూరదృష్టితో తీసుకున్న అనేక నిర్ణయాలు అద్భుత ఫలితాలనిచ్చాయి. జలయజ్ఞం అందుకు ఒక మంచి ఉదాహరణ. పోలవరం ప్రాజెక్టుకు నేడు జాతీయ హోదా రావడానికి నాడు అన్ని అనుమతులూ సాధించడం, కుడి– ఎడమ కాల్వల నిర్మాణం ప్రారంభించడం వల్లనే సాధ్యమయ్యింది. నేటి ప్రభుత్వం గొప్పగా చెప్పుకొనే పట్టిసీమ కూడా వైఎస్ కుడి కాలువను సింహభాగం పూర్తి చేసినందు వల్లే సాధ్యం అయ్యింది. దక్షిణ తెలంగాణ కోసం పాలమూరు– రంగారెడ్డి, డిండి; రాయలసీమ కోసం శంకుస్థాపనకి మాత్రమే పరిమితం అయిన గాలేరు–నగరి, హంద్రీ–నీవా, పోతిరెడ్డి పాడు వెడల్పు; ప్రకాశం జిల్లా కోసం వెలుగొండ; కృష్ణా డెల్టా కోసం పులిచింతల; హైదరాబాద్ శాశ్వత నీటి సమస్య పరిష్కారం కోసం గోదావరి నీటి సరఫరా; ఉత్తరాంధ్ర కోసం 'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి' ప్రాజెక్టులు రూపకల్పన చేశారు కాబట్టే నేడు ప్రభుత్వాలు వాటి కోసం నిధులు ఖర్చు చేయడం, ప్రజలు అడగడం సాధ్యమవుతోంది.

సంక్షేమం – అభివృద్ధి

వైఎస్సార్ అనగానే గుర్తుకు వచ్చేది సంక్షేమ పథకాలు. వాటిని రాజకీయ ప్రత్యర్థులు ఎన్నికల తాయిలాలని విమర్శించారు. కానీ వైఎస్సార్ అమలు చేసిన ప్రతి సంక్షేమ పథకానికీ ఒక శాస్త్రీయ



పరిశీలన, హేతుబద్ధమైన కారణం కనిపిస్తుంది. తాను ముఖ్యమంత్రి అయిన తరువాత రైతుల ఆత్మహత్యలకు కారణాలు, నివారణ చర్యలు సిఫార్సు చెయ్యమని 'ఆచార్య జయతీ ఘోష్ కమిషన్'ను నియమించారు. రైతుల ఆత్మహత్యలకు వ్యవసాయ సమస్యలే కారణం కాదనీ, విద్య, వైద్యం వంటివి కార్పొరేట్‌ల చేతులలోకి వెళ్లడం వల్ల రైతులు మరిన్ని అప్పులు చేయవలసివచ్చి ఆత్మహత్యలకు పాల్పడ్డారనీ కమిషన్ పేర్కొంది. దీంతో వైఎస్సార్ 'ఫీజు రీయింబర్స్‌మెంట్', 'ఆరోగ్య శ్రీ' పథకాలను ప్రవేశపెట్టారు.

వైఎస్సార్ తరహాలోనే జగన్‌మోహన్ రెడ్డి కూడా 'రైతు భరోసా', 'అమ్మ ఒడి', 'నాడు–నేడు' వంటి పథకాలు అమలు చేశారు. ఇవి చూడటానికి సంక్షేమ పథకాలు అనిపిస్తున్నా, ఈ పథకాల వల్ల రైతు ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి.

వైఎస్సార్ ఐదు సంవత్సరాల (స్వల్ప కాలపు) పాలనలోనే అనేక దీర్ఘకాలిక ఆలోచనలు మనకు ప్రతి అంశంలోనూ కనిపిస్తాయి. భవిష్యత్తు మొత్తం నగరాల చుట్టూ ఉంటుందని నాడే ఆయన గుర్తించారు. గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ విశాఖ, గుంటూరు – విజయవాడ, గ్రేటర్ వరంగల్, గ్రేటర్ తిరుపతి ఏర్పాటు ఆలోచన వైఎస్సార్‌దే!

ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పారిశ్రామిక మార్పులను గమనంలో ఉంచుకుని 'సెజ్'లకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. విదేశాలకు మనం వెళ్ళడం కాదు, మనం తగిన వాతావరణం సృష్టిస్తే విదేశీ కంపెనీలు మన దగ్గరకు వస్తాయని భావించి పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేశారు. 'శ్రీ సిటీ' ఆయన కలకు ప్రతిరూపమే!

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని జగన్‌మోహన్ రెడ్డి కూడా తన పాలనలో ప్రజలకు అత్యంత కీలకమైన విద్య, వైద్యాలకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యారంగంలో 'నాడు–నేడు' పేరుతో వేల కోట్ల రూపాయల ఖర్చుతో ప్రభుత్వ విద్యకు నాణ్యతా ప్రమాణాలు కల్పించారు. ఆంగ్ల మాధ్యమాల్లో చదువులు ఏర్పాటు చేస్తే అంతర్జాతీయ అవకాశాలను మన యువత అందుకుంటారని జగన్ భావించారు. వైద్యం పేదలకు అందుబాటులోకి రావాలంటే వైద్యశాలలను మెరుగు పరచడంతో పాటు, డాక్టర్ల నియామకం అత్యంత కీలకం అని గుర్తించారు. ప్రతి జిల్లాకూ ఒక మెడికల్ కళాశాల, దానికి అనుబంధంగా హాస్పిటల్ ఏర్పాటు జరిగితే డాక్టర్ల కొరత తీరి ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించవచ్చని భావించారు. ఆ దిశగానే నాడు వైఎస్సార్, నేడు జగన్ అడుగులు వేశారు. ప్రజలకు ఎనలేని సేవ చేశారు.

వ్యాసకర్త రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయ కర్త


పెద్దపల్లి జిల్లా ఎలిగేడు పీఏసీఎస్ వద్ద వర్షంలో యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు


నల్లగొండ జిల్లా పెద్దవూరలోని పీఏసీఎస్ వద్ద సోమవారం రాత్రి ఎరువుల కోసం రైతుల పడిగాపులు


జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ పీఏసీఎస్ వద్ద క్యూలైన్‌లో ఉన్న రైతులు

యూరియా లేదు.. రాలేదు

ప్రతీరోజూ చాలాచోట్ల క్యూలో ఉన్న రైతులకు వస్తున్న సమాధానం ఇదే

- వేలల్లో రైతుల బారులు... వందల బస్తాలే పంపిణీ చేస్తున్న వైనం
- రోడ్డెక్కుతున్న అన్నదాతలు... తప్పని ధర్నాలు, రాస్తారోకోలు

సాక్షి, నెట్‌వర్క్: యూరియా కోసం అర్ధరాత్రి నుంచే రైతులు క్యూలో నిలబడి జాగారం చేస్తున్నారు. ఉదయాన్నే రైతులకు అధికారుల నుంచి వస్తున్న సమాచారం యూరియా లేదు...రాలేదు...కొన్ని బస్తాలు వచ్చాయి. దీంతో ఆగ్రహించిన అన్నదాతలు ధర్నాలు, రాస్తారోకోలకు దిగుతున్నారు.

- మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలోని రైతువేదిక వద్ద రైతుల మధ్య తోపులాట జరిగింది. బానోతు అనిత అనే మహిళా రైతు కాలికి తీవ్రగాయమైంది. మరిపెడ, కురవి మండలాల్లో నాలుగు గంటల పాటు రైతులు ధర్నా, రాస్తారోకో చేయడంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ స్తంభించింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో యూరియా దొరకకపోవడంతో వరంగల్–ఖమ్మం రహదారిపై అంబేడ్కర్ కూడలి వద్ద ధర్నాకు దిగారు. జనగామ జిల్లా పాలకుర్తి రైతు సేవా సహకార సంఘం సొసైటీ వద్ద రైతులు ఒక్క రోజు ముందు సద్దులతో వచ్చి గోదాం వద్ద నిద్రపోయి తెల్లవారుజామున క్యూలైన్‌లో ఉంటున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోనూ రైతులు క్యూలో బారులుతీరారు.నర్సింహులపేట మండల కేంద్రంలో కూపన్‌పై యూరియా తీసుకున్నాక అదే నంబర్ కూపన్ కలర్ జీరాక్స్ తీసుకొని వచ్చారు. నిర్వాహకులు ఇంతకుముందే ఈ నంబర్‌పై పంపిణీ చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.
- యూరియా కోసం నల్లగొండ జిల్లా హాలియా మండలంలోని కొత్తపల్లి పీఏసీఎస్ వద్ద రాత్రి వేళ రైతులు నిద్రించారు. పట్టా పాస్‌పుస్తకాలు, చెప్పులు క్యూ లైన్‌లో ఉంచారు.
- పెద్దపల్లి జిల్లా ఎలిగేడులోని పీఏసీఎస్ వద్ద భారీ వర్షం కురుస్తున్నా రైతులు లెక్కచేయలేదు. కొందరు తడుస్తూనే, మరికొందరు గొడుగులు పట్టుకొని గంటల కొద్దీ బారులు తీరారు.
- మంచిర్యాల జిల్లా చెన్నూర్, కోటపల్లి మండలాల్లో వర్షంలోనూ రైతులు బారులు తీరారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. చెన్నూర్‌లో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి క్యాంపు కార్యాలయం ఎదుట రైతులు యూరియా కోసం ధర్నా నిర్వహించారు.
- పెద్దపల్లి జిల్లా మంథని ప్రధానచౌరస్తాలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు తమకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ మెయిన్ రోడ్డుపై రాస్తారోకో, ధర్నా చేశారు.


నల్లగొండ జిల్లా హాలియా మండలం కొత్తపల్లి పీఏసీఎస్ వద్ద రాత్రి వేళ నిద్రిస్తున్న రైతులు


మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

- కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి సొసైటీకి 670 బస్తాల యూరియా రాగా.. వెయ్యి మందికిపైగా క్యూలో ఉన్నారు. యూరియా అందనివారు నిరాశతో వెనుదిరిగారు.
- మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో మరోసారి రైతులు ధర్నా చేశారు. వారికి మద్దతుగా మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ధర్నాలో పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. నారాయణపేట జిల్లా మద్దూరులో తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లో పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డులు పెట్టగా.. ధన్వాడలో చెప్పులను క్యూలో పెట్టి యూరియా కోసం పడిగాపులు కాశారు. సీఎం నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని మద్దూరు పీఏసీఎస్ వద్ద మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి రైతులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ధర్నా చేశారు.
- వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలో యూరియా ఇవ్వడం లేదని కౌలు రైతు బిక్కి చెన్నకేశవులు ఏకంగా సింగిల్ విండో కార్యాలయం పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కిందకు దించారు.
- నల్లగొండ జిల్లా పెద్దవూరలోని పీఏసీఎస్ కేంద్రానికి మంగళవారం యూరియా వస్తుందన్న సమాచారంతో వందమందికిపైగా రైతులు సోమవారం రాత్రి 8 గంటల నుంచే చద్దర్లు, దుప్పట్లు తీసుకుని వచ్చి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుల జిరాక్స్‌లను వరుసలో ఉంచి అక్కడే నిద్రకు ఉపక్రమించారు.

చనిపోదామనుకున్నా



నేను ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నా. వారం రోజులుగా సింగల్‌విండో దగ్గరకు వచ్చి యూరియా అడిగితే పట్టాదార్ పాస్ బుక్కు అడుగుతున్నారు. నేను ఎక్కడి నుంచి తీసుకురావాలి. దినం దాటిపోతోంది. చేసేది లేకనే బాధ అనిపించి పీఏసీఎస్ మిద్దె ఎక్కి దూకి చనిపోదామనుకున్నా. – బిక్కి చెన్నకేశవులు, ఖిల్లాఘనపురం(వనపర్తి జిల్లా)

750 కిలోల ఎండు గంజాయి స్వాధీనం!

ఖానాపురం: వరంగల్ జిల్లా చిలుకమ్మనగర్ శివారు గువ్వలబోడు అటవీ ప్రాంతంలో నిల్వ చేసిన 750 కిలోలకుపైగా ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులు ఆదివారం రాత్రి ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వాహనంలో 23 బస్తాల్లో గంజాయి తరలిస్తున్నారు. ఈ క్రమంలో భారీ వర్షంకు రుస్తుండటంతో చిలుకమ్మనగర్ శివారు అటవీ ప్రాంతంలో డంప్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు దుగ్గొండి సీఐ సాయిరమణ అక్కడికి వెళ్లి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

సీపీఎస్ ఉద్యోగులకు శాపం

- తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం
- ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి: ఎమ్మెల్సీ మల్క కొమురయ్య


'సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ'లో అభివాదం చేస్తున్న నాయకులు

సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉద్యోగులకు శాపంగా మారిందని, ఉద్యోగులకు పెన్షన్ భిక్షకాదు.. హక్కు అని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. పెన్షన్‌ను ప్రభుత్వం హక్కుగా గుర్తించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని డిమాండ్ చేసింది. ఓపీఎస్ కోసం ప్రభుత్వాన్ని ఒప్పిద్దామని, సీపీఎస్ రద్దు కోసం పోరాడదామని పిలుపునిచ్చింది. పాత పెన్షన్ సాధన (ఓపీఎస్)కోసం సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభను సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, మాజీ ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ సౌకర్యం లేక వృద్ధాప్యంలో ఆర్థిక, అనారోగ్య సమస్యలతో మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ, ఈ సమస్యపై ఇప్పటికే గవర్నర్‌తో పాటు అధికారులకు, కేంద్ర ప్రభుత్వానికి వినతులు ఇచ్చామన్నారు. మాజీ ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం మాట్లాడుతూ పెన్షన్ ప్రాథమిక హక్కు అని ఇటీవల సుప్రీంకోర్టు తన తీర్పులో వెల్లడించిందని గుర్తు చేశారు.

'అగ్రి' కోర్సులకు రేపట్నుంచి రెండో విడత కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయాల పరిధిలోని వివిధ వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల 3, 4, 8, 9, 10 తేదీల్లో రెండవ విడత సంయుక్త కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ జీఈసీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ జరగనుందని వెల్లడించారు. ఈ కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.pjtau.edu.inను సందర్శించవచ్చని విద్యాసాగర్ సూచించారు.

రేపే 'ఇందిరమ్మ' గృహప్రవేశం!

- భద్రాద్రి జిల్లాలో ఇళ్ల ప్రారంభోత్సవానికి రానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- బెండాలపాడులో అట్టహాసంగా ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు చండ్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని 2024 మార్చి 11న భద్రాచలం వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. గృహప్రవేశ కార్యక్రమవేడుకకు కూడా భద్రాద్రి జిల్లానే ఎంచుకోవడం విశేషం. బెండాలపాడులో లబ్ధిదారులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారని తెలుస్తోంది.

ఇప్పటికే రెండుసార్లు వాయిదా..

బెండాలపాడుకు 310 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇందులో 238 గృహాలు ఆదివాసీ/కోయలకు కేటాయించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 21న నిర్వహించాలని నిర్ణయించారు. అయితే చివరి నిమిషంలో వాయిదా పడింది. రెండోసారి ఆగస్టు 30న సీఎం వస్తారంటూ ప్రచారం జరగగా.. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మరోసారి వాయిదా తప్పలేదు. ఎట్టకేలకు ఈనెల 3న కచ్చితంగా సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు వస్తారని అధికార వర్గాలు భావిస్తున్నాయి.


భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో సిద్ధమైన ఇందిరమ్మ ఇళ్లు

జిల్లాలకు సీఎం

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం నుంచి జిల్లాల పర్యటనకు వెళుతున్నారు. ఈనెల 3వ తేదీన ఆయన మహబూబ్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు వెళ్తారని సీఎంవో వర్గాల ద్వారా తెలిసింది. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో ఓ ఫార్మా కంపెనీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన కొత్తగూడెం జిల్లా భద్రాచలం వెళతారు. అక్కడ ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. 4వ తేదీన సీఎం రేవంత్ కామారెడ్డి జిల్లాకు వెళతారని, వరద బాధితులను పరామర్శించడంతోపాటు అక్కడ జరుగుతున్న సహాయ కార్యక్రమాలను సమీక్షిస్తారని సమాచారం. దీంతోపాటు స్థానిక ఎన్నికల కోడ్ వచ్చేలోపు వీలును బట్టి జిల్లాలకు వెళ్లాలని సీఎం భావిస్తున్నారని, ఈ మేరకు ఏయే జిల్లాల్లో పర్యటించాలన్న షెడ్యూల్ తయారవుతోందని సమాచారం.

ఆనందంగా ఉంది



ఇందిరమ్మ ఇల్లు మంజూరైనప్పుడు ఎంతో సంతోషం వేసింది. ఆ ఆనందం నుంచి బయటకు రాకముందే ఇంటి పనులు కూడా పూర్తయి, ఇప్పుడు గృహప్రవేశం దగ్గరకు వచ్చింది. పది రోజుల నుంచి ఎప్పుడెప్పుడు సీఎం సార్ మా ఇంటికి వస్తాడా అని ఎదురుచూస్తున్నా. – బచ్చల నర్సమ్మ, బెండాలపాడు

పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ

- సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి
- సమస్యలు పరిష్కారం కాకపోతే అక్టోబర్ 12న 'చలో హైదరాబాద్'
- ఆర్టీసీ కల్యాణ మండపంలో సభకు భారీ ఎత్తున హాజరైన ఉద్యోగులు



తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన పాత పెన్షన్ పోరాట సభలో అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు. చిత్రంలో మారం జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాస్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేయాలని, పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్‌పై అనేక ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. సీపీఎస్.. రాష్ట్రంలో 2 లక్షల 50 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఉరితాడుగా మారిందని పేర్కొంది. ఐదేళ్లు ఎమ్మెల్యే, ఎంపీలుగా చేసిన నాయకులకు జీవితకాలం పెన్షన్ ఇస్తున్నారని.. కానీ 40 ఏళ్లు ప్రభుత్వానికి సర్వీస్ చేసే ఉద్యోగులకు పెన్షన్ ఎందుకు ఇవ్వరని ప్రశ్నించింది. రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీపీఎస్‌ను రద్దు చేసిందని, తెలంగాణలో కూడా రద్దు చేయాలని జేఏసీ కోరింది. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో నేడు భేటీ అవుతున్నామని, తమ సమస్యలు పరిష్కారం కాకపోతే అక్టోబర్ 12న లక్షలాది ఉద్యోగులతో చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించింది. సోమవారం ఆర్టీసీ కల్యాణ మండపంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి నయాపైసా భారం కాని సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేసిందని, ఇక్కడ కూడా త్వరగా పాత పెన్షన్ విధానం తీసుకురావాలని కోరారు. 'పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు' అని అన్నారు. మాట ఇస్తే తప్పనని గత ఆగస్టులో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు.

ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమే..

సీపీఎస్‌ఈయూ అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం, ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. సీపీఎస్ రద్దు.. ఓపీఎస్ పునరుద్ధరణ కోసం ఒకవైపు తాము ఉద్యమం చేస్తుంటే ఇటీవల కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ అధ్యక్షుడు చావ రవి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటమే ముఖ్యమని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కాకముందు జేఏసీతో ఉన్న అనుబంధం కారణంగా ఈ సమావేశానికి హాజరయ్యానని, జేఏసీ తీసుకునే నిర్ణయాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఎస్టీయూ అధ్యక్షుడు సదానంద గౌడ్ మాట్లాడుతూ సీపీఎస్ అంతం జేఏసీ పంతంగా ప్రతి ఒక్క ఉద్యోగ, ఉపాధ్యాయుడు పోరాడుతారని తెలిపారు. టీపీటీఎఫ్ నేత అనిల్‌కుమార్ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ పునరుద్ధరించే దాకా జేఏసీతో కలసి పోరాడుతామని అన్నారు. ఇదిలా ఉండగా ఐదు డీఏలు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, పీఆర్సీ అమలు చేయాలని ఈ సభలో తీర్మానాలు చేశారు. టీజీఓస్ ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయండి.. హామీ నిలబెట్టుకోండి

- లేకుంటే రద్దు చేసే ప్రభుత్వం వచ్చి తీరుతుంది
- ప్రభుత్వానికి టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి హెచ్చరిక
- పీఆర్‌టీయూ టీఎస్ మహాధర్నాకు భారీ స్పందన




ధర్నాచౌక్ వద్ద సీపీఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఉద్యోగులు, ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులకు సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం తీసుకురావాలని.. లేకుంటే ఆ దిశగా ఆలోచించే ప్రభుత్వం ఏర్పడుతుందని టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వాల పునాదులు కదిపిన చరిత్ర పీఆర్‌టీయూ టీఎస్‌కు ఉందని గుర్తు చేశారు. సీపీఎస్ సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వాన్నే కాదు..కేంద్రంతోనూ యుద్ధం చేసేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. పెన్షన్ విద్రోహదినం పేరుతో పీఆర్‌టీయూ టీఎస్ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సోమవారం మహాధర్నా చేపట్టింది. ఈ ధర్నాకు అన్ని జిల్లాల నుంచి పెద్ద ఎత్తున టీచర్లు తరలివచ్చారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి శ్రీపాల్‌రెడ్డి కీలకోపన్యాసం చేశారు. సీపీఎస్ రద్దును ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ రెండేళ్లయినా అమలు చేయలేదన్నారు. 'రేవంత్ రెడ్డికి సీపీఎస్‌ను రద్దు చేసే అవకాశం వచ్చింది. దీనిని వినియోగించుకోకుంటే సీపీఎస్ రద్దు చేసే ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది'అని టీచర్ల హర్షధ్వానాల మధ్య ఉద్వేగంగా హెచ్చరించారు.

అరెస్టులు, నిర్బంధాలు లెక్క చేయం

ఈ ధర్నా కేవలం ట్రయల్ మాత్రమేనని, అసలు ఆట ముందుందని, అరెస్టులు, నిర్బంధాలకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని శ్రీపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము ఏ పార్టీకి అనుకూలం కాదని, టీచర్ల సమస్యల కోసం ఏ ప్రభుత్వాన్నైనా ఎదిరించి తీరుతామని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి టీచర్ల హృదయాల్లో నిలుస్తారో, లేక ఉపాధ్యాయుల ఆగ్రహం చవిచూస్తారో సీఎం తేల్చుకోవాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేస్తే టీచర్లు దాచుకున్న డబ్బులు ఇవ్వమని కేంద్ర మంత్రి నిర్మల చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో మొదలైన సీపీఎస్ వ్యతిరేక నినాదం ఢిల్లీ ఉద్యమం వరకూ తీసుకెళతామన్నారు. 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని కేంద్రం ఉత్తర్వులిచ్చినా, రాష్ట్రంలోని మూర్ఖపు ఐఏఎస్ అధికారులు కొర్రీలు పెట్టడం అవివేకమన్నారు. సీపీఎస్ రద్దు పోరుబాటకు అన్నీ జేఏసీలతో కలిసి ఉద్యమ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఉద్యోగుల జేఏసీ చైర్మన్, సెక్రటరీ జనరల్ మారం జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాసరావు మహాధర్నాకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సీఎల్ రోజ్, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడిగా ముందుకెళ్దాం

- ప్రపంచ శాంతి, సుస్థిరతకు భారత్–రష్యా సంబంధాలే మూలస్తంభం
- ప్రధానమంత్రి మోదీ ఉద్ఘాటన
- చైనాలోని తియాంజిన్‌లో రష్యా అధినేత పుతిన్‌తో భేటీ
- ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు నేతల చర్చలు

తియాంజిన్: ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, సుస్థిరతలకు భారత్–రష్యా సంబంధాలే మూలస్తంభమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో సైతం రెండు దేశాలు భుజం భుజం కలిపి పనిచేస్తాయని, ఉమ్మడిగా ముందుకెళ్తాయని అన్నారు. చైనాలోని తియాంజిన్‌లో షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ సోమవారం రష్యా అధినేత పుతిన్‌తో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఆర్థికం, ఇంధనం, ఎరువులు, వాణిజ్యం, అంతరిక్షం, సాంస్కృతిక, భద్రత తదితర రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకొనే దిశగా చర్చలు జరిగాయి. పుతిన్‌తో సమావేశం అనంతరం మోదీ మాట్లాడారు. ఈ ఏడాది డిసెంబర్‌లో పుతిన్ ఇండియాలో పర్యటించబోతున్నారని, ఆయనకు స్వాగతం పలకడానికి 140 కోట్ల మంది భారతీయులు ఎదురు చూస్తున్నారని చెప్పారు. భారత్, రష్యా మధ్యనున్న ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని చెప్పారు. భారత్–రష్యా బంధం కేవలం ఇరుదేశాల ప్రజలకే కాకుండా మొత్తం ప్రపంచానికి కూడా కీలకమేనని వివరించారు.

అది మానవాళి కోరిక

ఉక్రెయిన్‌లో శాంతి సాధన కోసం ఇటీవల జరిగిన ప్రయత్నాలను మోదీ స్వాగతించారు. ఉక్రెయిన్‌లో ఘర్షణకు సాధ్యమైనంత త్వరగా తెరపడాలని ఆకాంక్షించారు. ఇందుకోసం భాగస్వామ్య పక్షాలన్నీ కలిసి నిర్మాణాత్మక చర్యలు ప్రారంభించాలన్నారు. అక్కడ యుద్ధం ముగిసి, శాశ్వత శాంతి నెలకొనాలన్నది మొత్తం మానవాళి కోరిక అని ఉద్ఘాటించారు. పుతిన్‌తో భేటీ అనంతరం మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. కారులో పుతిన్‌తో కలిసి ప్రయాణిస్తున్న ఫొటోను షేర్ చేశారు. రష్యా అధ్యక్షుడితో అద్భుతమైన చర్చ జరిగిందని పేర్కొన్నారు. కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించామని తెలిపారు. ఉక్రెయిన్ ఘర్షణకు శాంతియుత పరిష్కారం సహా ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నామని వివరించారు.

బహుముఖ సంబంధాల్లో చురుగ్గా పురోగతి: పుతిన్

భారత్‌తో బంధానికి ఎల్లప్పుడూ అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పుతిన్ పునరుద్ఘాటించారు. భారత్–రష్యా సంబంధాలు ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేరడం ఆనందంగా ఉందన్నారు. రెండు దేశాలు కలిసి పని చేస్తూనే ఉంటాయని స్పష్టంచేశారు. రెండు దేశాల బహుముఖ సంబంధాలు చురుగ్గా పురోగతి సాధిస్తూనే ఉంటాయన్నారు. వాణిజ్యం, ఆర్థిక సంబంధాలు పూర్తి సానుకూలంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. బహుళ స్థాయి సహకార వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నామని, రెండు దేశాల మధ్య పర్యాటకుల మార్పిడి నానాటికీ వృద్ధి చెందుతోందని, ఐక్యరాజ్యసమితి, బ్రిక్స్, జీ20, ఎస్సీఓ తదితర అంతర్జాతీయ వేదికలపై సన్నిహితంగా, సమన్వయంతో కలిసి పని చేస్తున్నామని పుతిన్ వెల్లడించారు. ముఖ్యమైన రంగాల్లో భారత్, రష్యా మధ్య ద్వైపాక్షికబంధంపై మోదీ, పుతిన్ సంతృప్తి వ్యక్తంచేశారని భారత ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇరుదేశాల మధ్య ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చాలని వారు నిర్ణయానికొచ్చినట్లు పేర్కొంది.


ప్రధాని మోదీ, అధ్యక్షుడు పుతిన్ ఆత్మీయ ఆలింగనం

ఒకే కారులో మోదీ, పుతిన్ ప్రయాణం



తియాంజిన్‌లో ఆసక్తికర ఘట్టం చోటుచేసుకుంది. ఎస్సీఓ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధినేత పుతిన్ సోమవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రష్యాలో తయారైన అరుస్ లిమోజిన్ కారులో ఇరువురు నేతలు ఎస్సీఓ సదస్సు వేదిక నుంచి రిట్జ్–కార్ల్‌టన్ హోటల్‌కు చేరుకున్నారు. ఇరువురు నేతలు ఒకే కారులో కలిసి ప్రయాణించడం, సన్నిహితంగా మాట్లాడుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. మోదీ, పుతిన్ మధ్య వ్యక్తిగత, వ్యూహాత్మక స్నేహ సంబంధాలకు ఈ ఘటన నిదర్శనమని పరిశీలకులు అంటున్నారు. పుతిన్‌తో సంభాషణ ఎల్లప్పుడూ అర్థవంతంగా, నిర్మాణాత్మకంగా ఉంటుందని మోదీ పేర్కొన్నారు. మోదీతో కలిసి ప్రయాణించాలని మొదట పుతిన్ కోరుకున్నట్లు తెలిసింది. అంతేకాకుండా మోదీ రాక కోసం ఆయన ఎస్సీఓ వేదిక వద్ద 10 నిమిషాల పాటు వేచి చూశారు. హోటల్‌కు చేరుకున్న తర్వాత కూడా కారులోనే 45 నిమిషాలపాటు మాట్లాడుకోవడం విశేషం. అనంతరం హోటల్ లోపల ద్వైపాక్షిక సమావేశం జరిగింది. అంతకుముందు ఎస్సీఓ వేదిక వద్ద మోదీని పుతిన్ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. పుతిన్‌ను కలుసుకోవడం నాకు సదా ఆనందదాయకం అని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. మోదీ, పుతిన్, చైనా అధినేత జిన్‌పింగ్ కలిసి ఉన్న చిత్రాలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన ఎస్సీఓ

తియాంజిన్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) సభ్యదేశాల అధినేతలు ముక్తకంఠంతో ఖండించారు. ఈ మేరకు సోమవారం ఉమ్మడి డిక్లరేషన్ విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు సంతాపం, సానుభూతి ప్రకటించారు. ఈ హేయమైన ఘటనకు కారణమైన ముష్కరులను, వారి పోషకులను, కుట్రదారులను చట్టం ముందు నిలబెట్టి, కఠినంగా శిక్షించాల్సిందేనని తేల్చిచెప్పారు. ఇలాంటి ఘాతుకాలను సహించడానికి ఎంతమాత్రం వీల్లేదన్నారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదంపై రాజీలేని పోరాటానికి కట్టుబడి ఉన్నామని వారు ఉద్ఘాటించారు. ఉగ్రవాద, వేర్పాటువాద, తీవ్రవాద శక్తులపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయానికొచ్చారు. అలాంటి శక్తులను స్వలాభం కోసం ఎవరూ వాడుకోకుండా చర్యలు చేపట్టాలని తీర్మానించారు.

బెల్ట్ అండ్ రోడ్‌ను తప్పుపట్టిన మోదీ

చైనా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ కార్యక్రమం(బీఆర్ఐ) పట్ల ఎస్సీఓ సదస్సు వేదికగా ప్రధాని మోదీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఇలాంటి అనుసంధాన ప్రాజెక్టులు ఇతర దేశాల జాతీయ సార్వభౌమత్వాన్ని గౌరవించేలా ఉండాలని చెప్పారు. ఏ కార్యక్రమం అయినా సరే నమ్మకం, విశ్వసనీయత పెంచుకొనేలా ఉండాలి తప్ప తగ్గించుకొనేలా ఉండొద్దన్నారు. ఆసియా, ఆఫ్రికా, యూరప్‌ను అనుసంధానిస్తూ బీఆర్ఐని చైనా ప్రభుత్వం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగమైన చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే) గుండానే వెళ్తోంది. దీన్ని భారత్ మొదటి నుంచీ వ్యతిరేకిస్తోంది.

భద్రత, శాంతితోనే అభివృద్ధి

- **ఉగ్రవాదంపై పోరాటం మానవత్వం పట్ల మన బాధ్యత**
- ప్రాంతీయ అభివృద్ధికి అనుసంధానం అత్యంత కీలకం
- ఎస్సీఓ సదస్సులో మోదీ ఉద్ఘాటన

తియాంజిన్: షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) పట్ల భారత్ వైఖరి, విధానాన్ని ప్రధాని నరేంద్ర మోదీ వివరించారు. ఎస్ అంటే సెక్యూరిటీ(భద్రత), సీ అంటే కనెక్టివిటీ(అనుసంధానం), ఓ అంటే అపర్చునిటీ(అవకాశం) అని చెప్పారు. ప్రపంచంలో ఏ దేశ అభివృద్ధికైనా భద్రత, శాంతి, స్థిరత్వమే పునాది అని వెల్లడించారు. ప్రపంచ దేశాల పురోగతికి ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం ఎన్నో సవాళ్లు విసురుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఉగ్రవాదంపై పోరాటం చేయడం మానత్వం పట్ల మన బాధ్యత అని సూచించారు. చైనాలోని తియాంజిన్‌లో ఎస్సీఓ సదస్సులో రెండో రోజు సోమవారం ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రాంతీయ అభివృద్ధికి అనుసంధానం అత్యంత కీలకమని చెప్పారు. అనుసంధానం దిశగా జరిగే ప్రతి ప్రయత్నమూ ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించేలా ఉండాలని సూచించారు. ఎస్సీఓ చార్టర్‌లోని మూలసూత్రాల్లో ఇది కూడా ఒక భాగమేనని గుర్తుచేశారు.

కాలం చెల్లిన విధానాలు వద్దు

ఎస్సీఓ కింద 'సివిలైజేషనల్ డైలాగ్ ఫోరమ్' ఏర్పాటు చేసుకుందామని ప్రధాని మోదీ ప్రతిపాదించారు. ఘనమైన మన ప్రాచీన నాగరికతలు, కళలు, సాహిత్యం, సంప్రదాయాలను అంతర్జాతీయ వేదికపై పరస్పరం పంచుకోవడానికి ఈ ఫోరమ్ తోడ్పడుతుందని అన్నారు. దక్షిణార్ధ గోళ దేశాలు(గ్లోబల్ సౌత్) మరింత వేగంగా ప్రగతి సాధించాలని పిలుపునిచ్చారు. కాలం చెల్లిన విధానాలతో అనుకున్న లక్ష్యం సాధించలేమని చెప్పారు. ఇంకా వాటినే నమ్ముకొని ఉండడం భవిష్యత్తు తరాలకు అన్యాయం చేయడమే అవుతుందని అభిప్రాయపడ్డారు. గ్లోబల్ సౌత్ దేశాల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని విధానాలు రూపొందించుకోవాలని సూచించారు. భారతదేశ ప్రగతి ప్రయాణాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. సంస్కరణ, పనితీరు, మార్పు అనే మంత్రంతో తమదేశం ముందుకు సాగుతోందన్నారు. విస్తృత స్థాయిలో సంస్కరణలకు శ్రీకారం చుట్టామని, దీని వల్ల జాతీయ అభివృద్ధికి, అంతర్జాతీయ సహకారానికి నూతన అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. భారత్ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వామిగా మారాలంటూ ఎస్సీఓ సభ్య దేశాలను మోదీ ఆహ్వానించారు.

ముష్కరులను పోషించడం మానుకోవాలి

ఉగ్రవాదులకు మద్దతు ఇవ్వడం కొన్ని దేశాలు ఇకనైనా మానుకోవాలని ప్రధాని మోదీ పరోక్షంగా పాకిస్తాన్‌కు హితవు పలికారు. ముష్కర మూకలను పెంచిపోషిస్తే మొత్తం మానవళికి ముప్పు తప్పదని హెచ్చరించారు. ఉగ్రవాదం అనేది ఏ ఒక్క దేశానికో పరిమితమైన సమస్య కాదని అన్నారు. తాము క్షేమంగా ఉన్నామని ఏ ఒక్కరూ అనుకోవడానికి వీల్లేదన్నారు. కలిసికట్టుగా పోరాడితేనే ఉగ్రవాదం అంతమవుతుందని ఉద్ఘాటించారు. అల్‌ఖైదా, అనుబంధ గ్రూప్‌లపై యుద్ధం ప్రారంభించామని చెప్పారు. పహల్గాం ఉగ్రవాద దాడిని కూడా ప్రధాని ప్రస్తావించారు. ఇది కేవలం భారత్‌పై జరిగిన దాడి కాదని, మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్క దేశానికీ, ప్రతి పౌరుడికీ ఒక సవాల్ అని పేర్కొన్నారు. పహల్గాం దాడి సమయంలో భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

మౌన ప్రేక్షకుడిలా షహబాజ్ షరీఫ్

ఎస్సీఓ సదస్సు వేదిక వద్ద పాకిస్తాన్ ప్రధానమంత్రి షహబాజ్ షరీఫ్ మౌన ప్రేక్షకుడిగా మిగిలిపోవాల్సి వచ్చింది. సోమవారం ఉదయం నరేంద్ర మోదీ, పుతిన్ ఆయన ముందు నుంచే నడుచుకుంటూ వెళ్లారు. షరీఫ్ వైపు చూసేందుకు ఇష్టపడలేదు. తర్వాత నరేంద్ర మోదీ, పుతిన్, జిన్‌పింగ్ పరస్పరం కరచాలనం చేసుకున్నారు. సరదాగా సంభాషించుకున్నారు. తనను ఎవరూ పట్టించుకోకపోవడంతో కాసేపు షహబాజ్ షరీఫ్ ముఖం కళ తప్పినట్లు కనిపించింది. ఆయన ఒక పక్కన ఒంటరిగా నిల్చున్నారు.


మోదీ, పుతిన్ మాట్లాడుకుంటుండగా నిల్చుని చూస్తున్న షహబాజ్

అఫ్గాన్‌ను అల్లాడించిన భూ విలయం

6 తీవ్రతతో భూకంపం

- 800 మందికి పైగా మృత్యువాత
- ఊళ్లు నేలమట్టం, కుప్పకూలిన వ్యవస్థలు
- కొండ ప్రాంతమవడంతో భారీ ప్రాణ, ఆస్తి నష్టం
- నత్తనడకన సహాయక చర్యలు
- అండగా ఉంటాం: మోదీ

కాబూల్: అఫ్గానిస్తాన్ అల్లాడింది. దేశ తూర్పు ప్రాంతంలోని కూనూర్, నాన్‌ఘర్ ప్రావిన్సుల్లో ఆదివారం సంభవించిన భారీ భూకంపం ధాటికి గ్రామాలకు గ్రామాలే నామరూపాల్లేకుండా తుడిచిపెట్టుకు పోయాయి. 800 పై చిలుకు మంది మృత్యువాత పడగా 2,500 మందికి పైగా గాయపడ్డారు. భూకంపం సంభవిస్తూనే ప్రభావిత ప్రాంతాల్లోని జనమంతా హాహాకారాలు చేస్తూ ఇళ్లనుంచి బయటికి పరిగెత్తే ప్రయత్నం చేశారు. కానీ చాలామంది నిస్సహాయంగా శిథిలాల కింద చిక్కుబడ్డారు. మృతదేహాలను, గాయపడ్డవారిని సహాయక సిబ్బంది వెలికి తీస్తూ మార్చురీలకు, ఆస్పత్రులకు తరలిస్తున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. ప్రమాద తీవ్రత దృష్ట్యా మృతులు, క్షతగాత్రుల సంఖ్య భారీగా పెరిగే ఆస్కారముంది. కునార్, నంగర్హార్‌తో పాటు రాజధాని కాబూల్ నుంచి కూడా ప్రభుత్వ తదితర బృందాలు భూకంప ప్రభావిత ప్రాంతాలకు చేరుకుని సహాయక చర్యలకు ఉపక్రమించినట్టు ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. చాలా ప్రాంతాల్లో మృతుల సంఖ్య ఇంకా తెలియాల్సి ఉందని తాలిబన్ సర్కారు ప్రధాన అధికార ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ అన్నారు. భూకంప కేంద్రానికి సమీపంలో ఉన్న అతి పెద్ద పట్టణమైన జలాలాబాద్ కూడా భూకంపానికి బాగా ప్రభావితమైంది. అది అఫ్గాన్‌లోకెల్లా అతి పెద్ద వర్తక కేంద్రాల్లో ఒకటి. పాక్‌కు సమీపంలో ఉండటంతో సరుకులు తదితరాల లభ్యత అత్యధికంగా ఉండటమే అందుకు కారణం. ఆదివారం అర్ధరాత్రి 11.47 గంటలకు నాన్‌ఘర్ ప్రావిన్స్‌లో జలాలాబాద్‌కు ఈశాన్యాన 27 కి.మీ. దూరంలో 6.0 తీవ్రతతో భూమి కంపించింది. భూకంప కేంద్రం భూ ఉపరితలానికి కేవలం 8 కి.మీ. లోతులో ఉండటంతో ప్రమాద తీవ్రత భారీగా పెరిగిందని అమెరికా జియాలాజికల్ సర్వే పేర్కొంది. దాని తాలూకు ప్రకంపనలు ఏకంగా అసోం దాకా కనిపించాయి! తక్కువ లోతులో వచ్చే భూకంపాలు అత్యంత ప్రమాదకరంగా మారుతుంటాయి. 2023 అక్టోబర్ 7న 6.3 తీవ్రతతో కూడిన భూకంపం అఫ్గాన్‌ను వణికించింది. ఆ ఉత్పాతానికి 4,000 మందికి పైగా బలయ్యారు.

కొండల్లో కల్లోలం

భూకంపం సంభవించిన తూర్పు అఫ్గాన్ దాదాపుగా కొండ ప్రాంతమే. పైగా అత్యధిక ప్రాంతాలు చేరరానంత దుర్గమమైనవే! నేటికీ టెలిఫోన్ తదితర మౌలిక సమాచార వ్యవస్థలకు కూడా నోచుకోనివే. కునార్ ప్రాంతం, సమీపంలోని నుర్గల్ జిల్లా భూకంపానికి అత్యధికంగా నష్టపోయాయి.

కాళరాత్రి.. కన్నీటి వెతలు

– ''భారీ శబ్దంతో ఇంట్లో వాళ్లమంతా ఒక్కసారిగా మేల్కొన్నాం. నా పిల్లల్లో ముగ్గురిని వెంటనే బయటికి చేరేశాను. మిగతా వాళ్లను, కుటుంబీకులను బయటికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుండగానే పైకప్పు విరిగి నేరుగా నాపై పడింది. ఆ శిథిలాల్లో సగం దాకా కూరుకుపోయా. చుట్టుపక్కల వాళ్లు ధైర్యం చిక్కబట్టుకుని తిరిగొచ్చి బయటికి లాగేదాకా నరకయాతన అనుభవించా. నా భార్య, ఇద్దరు పిల్లలు భూకంపానికి బలైనట్టు తెలిసి గుండె బద్దలైంది'' అని మజా దారా గ్రామానికి చెందిన సాదిఖుల్లా బావురుమన్నాడు.


కునార్ ప్రావిన్స్‌లోని మజార్ దారాలో క్షతగాత్రులకు సాయం చేస్తున్న ఆర్మీ, వైద్య సిబ్బంది


మూగవోయిన ఫోన్లు... భారత్‌లోని అఫ్గాన్లలో ఆందోళన

అఫ్గాన్‌లో అత్యధికం తక్కువ ఎత్తులో ఉండే నిర్మాణాలే. అందులోనూ కాంక్రీట్, నాటు ఇటుకతో చేసినవే. ప్రమాద తీవ్రత పెరగడానికి ఇది కూడా కారణమేనని చెబుతున్నారు. దేశవ్యాప్తంగాఅసలే అంతంతమాత్రంగా ఉండే టెలిఫోన్ తదితర సమాచార వ్యవస్థలు భూకంపం దెబ్బకు పూర్తిగా కుప్పకూలాయి. దాంతో స్వదేశంలోని తమవారి క్షేమ సమాచారం తెలియక ఢిల్లీ తదితర ప్రాంతాల్లోని వేలాది అఫ్గాన్లు అల్లాడుతున్నారు.

భారత్ ఆపన్నహస్తం

అఫ్గాన్ భూకంప విలయంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. ఈ ఆపత్సమయంలో అన్నివిధాలా మానవీయ సాయం అందించేందుకు భారత్ సిద్ధమని ప్రకటించారు. ''పొరుగు దేశంలో జరిగిన ప్రాకృతిక విపత్తు, అది చేకూర్చిన అపార ప్రాణ నష్టం చూసి తీవ్ర ఆవేదనకు లోనయ్యా. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. క్షతగాత్రులు వీలైనంత త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా'' అని ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. ఇప్పటికే 15 టన్నుల ఆహార సామగ్రి తదితరాలను కాబూల్‌లోని భారత హై కమిషన్ కార్యాలయం నుంచి కునార్‌కు పంపినట్టు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు.

హైడ్రోజన్ బాంబు త్వరలో పేలుస్తా!



- ఓట్ల చోరీపై మరిన్ని నిజాలు బయటపెడతా
- 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు సభలో రాహుల్

పాట్నా: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ సంచలన ప్రకటన చేశారు. దేశంలో జరుగుతున్న ఓట్ల చోరీపై ఇప్పటికే అణుబాంబు పేల్చానని, త్వరలో హైడ్రోజన్ బాంబు పేలుస్తానని పేర్కొన్నారు. ఓట్ల దొంగతనంపై మరిన్ని నిజాలు బయటపెట్టిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ముఖం చూపించలేని పరిస్థితి వస్తుందని, ఆయన తలెత్తుకోలేరని చెప్పారు. సోమవారం బిహార్ రాజధాని పాట్నాలోని గాంధీ మైదాన్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. ఓట్ల చోరీని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని విప్లవాత్మక రాష్ట్రమైన బిహార్ యావత్ దేశానికి స్పష్టమైన సందేశం ఇచ్చిందని వెల్లడించారు. మహాత్మాగాంధీని హత్య చేసిన దుష్ట శక్తులే నేడు రాజ్యాంగాన్ని హత్య చేయడానికి కుట్రలు సాగిస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగం జోలికి వస్తే సహించబోమని బీజేపీని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని, ఓటు హక్కును రక్షించడానికే యాత్ర చేపట్టానని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందని, ఓటు చోర్, గద్దీ ఛోడ్ అంటూ వారు ముక్తకంఠంతో నినదించారని అన్నారు. రాహుల్ గాంధీ ఇంకా ఏం మాట్లాడారంటే...

రేషన్ కార్డును, భూమిని లాక్కుంటారు

''బీజేపీ నాయకులు మాకు నల్లజెండాలు చూపించారు. వారు ఒక విషయం తెలుసుకోవాలి. ఓట్లచోరీపై మహాదేవపురలో అణుబాంబు ప్రయోగించా. త్వరలో హైడ్రోజన్ బాంబు రాబోతోంది. అందుకోసం బీజేపీ నేతలు సిద్ధంగా ఉండాలి. ఓట్ల దొంగతనంపై బీజేపీ అసలు రంగు ఏమిటో ప్రజలకు తెలిసిపోతుంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమికి దక్కాల్సిన విజయాన్ని బీజేపీ కూటమి దొంగిలించింది. ఇది వంద శాతం నిజం. బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ఓట్ల చోరీకి పాల్పడ్డాయి. బిహార్ యువతకు చెప్పదల్చుకున్నది ఏమిటంటే.. ఓటు చోరీ అంటే హక్కుల చోరీ, రిజర్వేషన్ల చోరీ, ప్రజాస్వామ్యం చోరీ, ఉద్యోగాలు–ఉపాధి అవకాశాల చోరీ, విద్య చోరీ, భవిష్యత్తు చోరీ. కేవలం ఓటునే కాకుండా మీ రేషన్ కార్డును, భూమిని సైతం లాక్కొని అదానీకి, అంబానీకి కట్టబెట్టాలని చూస్తున్నారు'' అని రాహుల్ గాంధీ బీజేపీపై నిప్పులు చెరిగారు.

తప్పుడు విధానాలు నమ్ముకుంటున్న మోదీ: ఖర్గే

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తీరుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సోషలిజం గురించి మాట్లాడిన నితీశ్ ఇప్పుడు బీజేపీ–ఆర్ఎస్ఎస్‌ల ఒడిలో సేద తీరుతున్నారని ధ్వజమెత్తారు. పనికిరాని చెత్తను ఎక్కడ పారేస్తారో నితీశ్‌ను బీజేపీ–ఆర్ఎస్ఎస్‌లు అక్కడే పారేయడం తథ్యమని స్పష్టంచేశారు. ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సభలో ఖర్గే మాట్లాడారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ నెగ్గడానికి ప్రధాని మోదీ ఓట్ల చోరీకి ఆలోచనతోనే ఉంటారని ఆరోపించారు. ఎన్నికల్లో విజయం కోసం బోగస్ ఓట్లను, తప్పుడు ప్రచారాన్ని, తప్పు డు హామీలు, తప్పుడు పథకాలను నమ్ముకుంటారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

నూతన శిఖరాలకు భారత్-అమెరికా భాగస్వామ్యం

వాషింగ్టన్: రష్యా, చైనా అధినేతలు పుతిన్, జిన్‌పింగ్‌లతో ప్రధాని మోదీ భేటీ నేపథ్యంలో భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ఒక సందేశాన్ని 'ఎక్స్'లో పోస్టు చేసింది. భారత్–అమెరికాల మధ్య భాగస్వామ్యం నూతన శిఖరాలకు చేరుకుంటోందని వెల్లడించింది. ఇరుదేశాల మధ్య చక్కటి స్నేహ సంబంధాలు ఉన్నాయని, 21వ శతాబ్దంలో ఇది నిర్ణయాత్మక బంధమని ఉద్ఘాటించింది. ప్రజలు, ప్రగతి అనే అంశాలు మనల్ని ముందుకు నడిపిస్తున్నాయని స్పష్టం చేసింది. కీలక రంగాల్లో 2 దేశాలు కలిసి పని చేస్తున్నాయని పేర్కొంది. ఇరుదేశాల ప్రజల నడుమ ఉన్న ఎడతెగని స్నేహబంధం మన ప్రయాణానికి ఇంధంగా పని చేస్తోందని తేల్చిచెప్పింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చేసిన వ్యాఖ్యను కూడా అమెరికా రాయబార కార్యాలయం తమ పోస్టుకు జతచేసింది.

సుంకాలను భారత్ పూర్తిగా ఎత్తేస్తామంది!



- కానీ కాలాతీతమైంది
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాచాలత
- జిన్‌పింగ్, పుతిన్‌తో మోదీ భేటీ తర్వాత పోస్టులు
- వాటిని షేర్ చేసిన ఉపాధ్యక్షుడు వాన్స్

న్యూయార్క్/వాషింగ్టన్: బాధ్యతారహిత వ్యాఖ్యలు, పిల్లచేష్టలతో ఇప్పటికే ప్రపంచ దేశాల ముందు నిత్యం నవ్వులపాలవుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మిగిలి ఉన్న కాస్త పరువూ పూర్తిగా పోగొట్టుకునేలా ప్రవర్తిస్తున్నారు. అమెరికాపై టారిఫ్‌లను పూర్తిగా ఎత్తేస్తామంటూ భారత్ ప్రతిపాదించిందని సోమవారం మరో మతిలేని ప్రకటన చేశారాయన. పైగా, 'అది చాలా ఆలస్యంగా వచ్చిన ప్రకటన! ఎందుకంటే పరిస్థితి ఇప్పటికే చేయిదాటిపోయింది' అంటూ మేకపోతు గాంభీర్యం కూడా ప్రదర్శించారు. భారత్ తన రక్షణ, సైనిక, చమురు అవసరాల్లో అత్యధికం రష్యా నుంచే దిగుమతి చేసుకుంటోంది తప్ప అమెరికా నుంచి పెద్దగా కొనడమే లేదంటూ మరోసారి అక్కసు ప్రదర్శించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో పాటు అనూహ్యంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయిన కొద్ది గంటలకే సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్‌సోషల్‌లో ఇలాంటి అర్థం పర్థం లేని కామెంట్లకు దిగారు. ''భారత్ మాతో భారీగా వర్తక వ్యాపారాలు జరుపుతోంది. వాళ్లకు అతి పెద్ద క్లయింట్లం మేమే. కానీ భారత్‌తో మేం చేసే వ్యాపారం మాత్రం చాలా తక్కువ. ఎందుకంటే మాపై అంత భారీ సుంకాలు విధించింది. మాకు అత్యంత నష్టదాయకమైన ఈ ఏకపక్ష ఉత్పాతపు పోకడ దశాబ్దాలుగా సాగుతూ వస్తోంది. చాలా తక్కువ మందికి తెలిసిన వాస్తవమిది'' అంటూ వాపోయారు. ''ఇప్పుడు తీరిగ్గా 'జీరో టారిఫ్' ప్రతిపాదన చేసి ఏం లాభం? ఆ పని ఏళ్లక్రితమే చేయాల్సింది. ఇదంతా కామన్‌సెన్స్'' అంటూ సోషల్ మీడియాలోనే భారత్‌కు తీరిగ్గా క్లాసు కూడా పీకారు. ట్రంప్ పోస్టులను ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెంటనే షేర్ చేసి మద్దతుగా నిలిచారు. అయితే ఇలా భారత్ సున్నా సుంకాల ప్రతిపాదన చేసిందంటూ సోషల్ మీడియా పోస్టులు పెట్టడం ట్రంప్‌కు ఇది కొత్తేమీ కాదు. వాటిని అప్పట్లోనే విదేశాంగ శాఖ నిర్ద్వంద్వంగా ఖండించింది.

కాక పుట్టించిన 'షాంఘై భేటీ'! : తాజా షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమిట్‌లో భాగంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో పాటు అనూహ్యంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కూడా ప్రధాని నరేంద్ర మోదీ భేటీ కావడం తెలిసిందే. పలు అంశాలపై ఇద్దరు నేతలతో ఆయన లోతుగా చర్చలు జరిపారు. ఈ పరిణామాన్ని అమెరికా కర్రపెత్తనానికి శాశ్వతంగా చెక్ పెట్టే దిశగా పడిన అతి కీలక అడుగుగా పరిశీలకులు ఇప్పటికే అభివర్ణిస్తున్నారు. ఈ పరిణామంతో చిర్రెత్తుకొచ్చి ట్రంప్ ఇలా బాధ్యతారహిత వ్యాఖ్యలకు దిగుతున్నారని వారంటున్నారు. భారత్‌పై సుంకాలను ఆయన ఇప్పటికే భారీగా 25 శాతానికి పెంచడం తెలిసిందే. దానికి తోడు రష్యా నుంచి భారత్ కొనే చమురుపై మరో 25 శాతం అదనపు సుంకాలు బాదుతున్నట్టు ప్రకటించారు. దాంతో మనపై సుంకాలు ఏకంగా 50 శాతానికి ఎగబాకిన సంగతి తెలిసిందే.

మళ్లీ నోరు పారేసుకున్న పీటర్ నవరో

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ వాణిజ్య సలహాదారు, డొనాల్డ్ ట్రంప్ 50 శాతం టారిఫ్ విధానాల రూపకర్త పీటర్ నవరో మరోసారి నోరు పారేసుకున్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన భారత బ్రాహ్మణులను ఉద్దేశించి కులపరమైన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారతదేశ ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి అక్కడి బ్రాహ్మణ కులస్తులే లాభపడుతున్నారని ఆరోపించారు. రష్యా నుంచి భారత్ కొనుగోలు చేస్తున్న ముడి చమురే పుతిన్ ఉక్రెయిన్‌పై దురాక్రమణకు కారణమని మరోసారి నిందించారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆయన మోదీ యుద్ధంగా పేర్కొంటూ నవరో చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే అమెరికా ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేయడం తెల్సిందే.

కాళేశ్వరాన్ని కనుమరుగు చేసి ఆంధ్రాకు నీళ్లు తరలించే కుట్ర

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరాన్ని కనుమరుగు చేసి ఆంధ్రాకు నీళ్ల తరలించే ఎజెండాగా కుట్రలు చేస్తున్నారని, కేసీఆర్‌ను కుప్పకూల్చి తెలంగాణ రాష్ట్ర సంపదను దోచుకు తినాలని చూస్తున్నారని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుల కలను సాకారం చేసే కుతంత్రంలో భాగంగానే ఇవన్నీ చేస్తున్నారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణల పేరు తో బురదజల్లి ఇప్పుడు కేసును సీబీఐ చేతిలో పెట్టి రేవంత్ గురుదక్షిణ సమర్పించుకున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీది ఫెవికాల్ బంధమని, బీజేపీ, కాంగ్రెస్ కలిసి చేస్తున్న ఈ కుట్రలను ఎదుర్కోవాలని పార్టీ కేడర్‌కు జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి అప్పజెప్పడం అంటే ఆ ప్రాజెక్టును పూర్తిగా మూసేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజె క్టును సీబీఐకి ఇచ్చినా.. మరే ఏజెన్సీ వచ్చినా భయపడేది లేదన్నారు. రాజకీయ కుట్రతో కేసీ ఆర్‌ను టచ్ చేస్తే తెలంగాణ నిప్పుల కుంపటిలా మారుతుందని జీవన్‌రెడ్డి హెచ్చరించారు.

పత్తికి రూ.30 వేలు, వరికి రూ.25 వేలు పరిహారం చెల్లించాలి

బీజేపీ కిసాన్‌మోర్చా డిమాండ్

సాక్షి, హైదరాబాద్: వరికి ఎకరానికి రూ. 25 వేలు, పత్తికి ఎకరానికి రూ.30 వేలు, ఇతర పంటలకు మార్కెట్ రేట్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ కిసాన్‌మోర్చా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. క్షేత్రస్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు పంటనష్టాన్ని అంచనా వేసి సమగ్రమైన నివేదిక తయారుచేసి వెంటనే రైతులకు పరిహారం అందించాలని సూచించింది. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న వివిధ రకాల పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. ఇప్పటికైనా తెలంగాణలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేయాలని, యూరియా సరఫరాలో రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలని కోరింది. వరదలతో వరిపొలాల్లో ఇసుక మేటలు, రాళ్ల కుప్పలు పేరుకు పోయినందున ప్రభుత్వ నిధులతో వెంటనే తొలగించాలని డిమాండ్ చేసింది. సోమవారం ఈ మేరకు వ్యవసాయశాఖ కమిషనర్‌కు బీజేపీ నేత గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తదితరులు వినతిపత్రం సమర్పించారు.

'వయోధిక జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి'

సాక్షి, హైదరాబాద్: వయోధిక జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని వయోధిక పాత్రికేయుల సంఘం కోరింది. ఈ మేరకు సోమవారం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని వయోధిక పాత్రికేయుల సంఘం నేతలు కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వయోధిక పాత్రికేయుల సంఘం కార్యదర్శి లక్ష్మణరావు, సీనియర్ జర్నలిస్టు వేణుగోపాల్, ఫాజిల్, మల్లయ్య, మధు వాకిటి తదితరులున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా వారి ప్రాథమిక ప్రకటన
ఫారం -6

(చట్టం - 30/2013లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్ - 1 రూల్19 ప్రకారం)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రాజ పత్రం నెం.
డి.ఐ. జి.ఎస్.జె./ బీహెచ్ పిఎల్/ఎల్.ఎ./ 21 /2025, 13-08-2025
శ్రీయుత జిల్లా కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి వారి ఉత్తర్వులు నెం.
జి/521 /2024, డి.ఐ. 11-08-2025

ఆర్.సి నెం. బి/51/2024 తేది: 30.07.2025

ఈ దిగువన నిర్దిష్టపరిచిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలం, గారేపల్లి, పోతుల్వాయి, నల్లగుంట మరియు చిద్నేపల్లి గ్రామ శివారులోని విస్తీర్ణం ఎ. 29-19 గుం. గల భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం స్టేజ్ -2 కింద కాటారం మండలంలోని గారేపల్లి, పోతుల్వాయి, నల్లగుంట మరియు చిద్నేపల్లి గ్రామల పరిధిలో ఎ. 29-19 గుం. మేరకు గారేపల్లి ట్యాంక్ ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు మరియు మైనర్ల తవ్వకం కొరకు అవసరమైయున్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి గారు భావించినందున భూ సేకరణ సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస హక్కు, పునరావాస చట్టం 2013 మరియు సవరణ చట్టం 2016 వని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

తదనుగుణముగా జిల్లా కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి గారు ఈ దిగువ నిర్దిష్ట పరిచిన విధంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం మండలం, గారేపల్లి, పోతుల్వాయి, నల్లగుంట మరియు చిద్నేపల్లి గ్రామలలోని పట్టా మరియు ప్రభుత్వ భూముల విస్తీర్ణము ఎ.29-19 గుంటల భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణము చేయుట కొరకు చేపట్టబడిన భూసేకరణ ప్రక్రియ ద్వారా ఈ క్రింది ప్రభావితమైన పట్టా మరియు ప్రభుత్వ భూమి/ అసైన్ పట్టా కు నష్టము వాటిల్లిన దాని నిమిత్తం ఈ దిగువ చూపిన భూమి అవసరము ఉన్నదని భావించినందున ప్రతిపాదిత భూమిని సేకరించు నిమిత్తము ప్రభుత్వముచే రూపొందించబడి, శాసనము ద్వారా ఆమోదించబడిన భూసేకరణ పునరుపాదిపునరావాస కల్పనలో, చట్టం పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు-2013 ననుసరించి ఈ క్రింది ప్రకటన జారీ చేయనైనది. బాధిత కుటుంబాల పునరావాస మరియు పునరావాసం కోసం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గారిని అడ్మినిస్ట్రేటర్ గా నియమించబడినారు.

ఇట్టి భూసేకరణలో భాగము గా చేపట్టదలచిన సామాజిక ప్రభావ అధ్యయన నివేదిక మరియు చాప్టర్-2 ఆహార భద్రత పరిరక్షణ కొరకు మినహాయించుటకుగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం (3) సవరణ చట్టం ఆర్.ఎఫ్.సి.టి.ఎల్.ఎ., ఆర్ మరియు ఆర్, యాక్టు, 2016 (నం.21 ఆఫ్ 2017)) ద్వారా నోటిఫై చేయనైనది. కావున ఆర్.ఎఫ్.సి.టి.ఎల్.ఎ., ఆర్ మరియు ఆర్, యాక్టు, 2013 లోని సెక్షన్ 10ఎ చట్టం పరిధిలో (ఇ)ని చాప్టర్ -2 మరియు 3 లోని అంశములను సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక నుండి మినహాయించుటకు జి.వో.ఎమ్.ఎస్. నెం.47, తేది: 25-07-2017, ఇరిగేషన్ - సి.ఏ.డి (ఎల్.ఎ. ఆర్-అర్/2) డిపార్ట్‌మెంట్ ద్వారా జారీ చేయనైనది.

కావున, జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని కాటారం మండలములోని గారేపల్లి, పోతుల్వాయి, నల్లగుంట మరియు చిద్నేపల్లి గ్రామలలోని భూముల విస్తీర్ణము ఎ.29-19గుంటల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వానిని భూసేకరణ పనుల ప్రారంభ నిమిత్తం ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకటన జారీ చేయనైనది.

భూముల షెడ్యూలు

గ్రామం : గారేపల్లి మండలం : కాటారం జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సం.	సర్వే నం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం ప్రభుత్వ)	Requisition విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారు పేరు భూభారతి రికార్డు ప్రకారం (తండ్రి/భర్త)	అనుభవంలో వ్యక్తుల వారి పేరు (తండ్రి/భర్త)	విస్తీర్ణం (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	35	పట్టా	1-24	పూర నంద కిశోర్ (కమల మనోహర్‌రావు)	పూర నంద కిశోర్ (కమల మనోహర్‌రావు)	1-24	-	-
2				పూర నంద గోపాల్ (కమల మనోహర్‌రావు)	పూర నంద గోపాల్ (కమల మనోహర్‌రావు)		-	-
3		Road		N.H./others with Highway (N.H./ others with Highway)	N.H./others with Highway (N.H./ others withHighway)			
4	20	పట్టా	0-15	సింగనవేన ఓదయ్య (సమ్మయ్య)	సింగనవేన ఓదయ్య (సమ్మయ్య)	0-15	-	-
5	19	పట్టా	0-17	తోట కిష్టయ్య (గట్టయ్య)	తోట కిష్టయ్య (గట్టయ్య)	0-17	-	-
6				తోట సమ్మయ్య (మల్లయ్య)	తోట సమ్మయ్య (మల్లయ్య)		-	-
7				సింగనవేన వెంకట స్వామి (సమ్మయ్య)	సింగనవేన వెంకట స్వామి (సమ్మయ్య)		-	-
8				బండారు మల్లయ్య (లింగయ్య)	సింగనవేన (లింగయ్య)		-	-
9	11	పట్టా	0-15	అడువాల మల్లయ్య (అశయ్య)	అడువాల మల్లయ్య (అశయ్య)	0-15	-	-
10				సింగనవేణి రాజబాపు (లచ్చయ్య)	సింగనవేణి (లచ్చయ్య)		-	-
11				అడువాల వెంకట స్వామి (పోచయ్య)	అడువాల వెంకట స్వామి (పోచయ్య)		-	-
12				సింగనవేణి శంకర్ (లచ్చయ్య)	సింగనవేణి శంకర్ (లచ్చయ్య)		-	-
13				అడువాల లక్ష్మన్ (పోచయ్య)	అడువాల లక్ష్మన్ (పోచయ్య)		-	-
14				కోళ్ల శ్రీశైలం (రాజయ్య)	కోళ్ల శ్రీశైలం (రాజయ్య)		-	-
15				గుర్రపు రమణయ్య (చంద్రయ్య)	గుర్రపు రమణయ్య (చంద్రయ్య)		-	-
16				ఇండ్ల స్థలాలు (ఇండ్లు)	ఇండ్ల స్థలాలు (ఇండ్లు)		-	-
17				ఇండ్ల స్థలాలు (ఇండ్లు)	ఇండ్ల స్థలాలు (ఇండ్లు)		-	-
18				ఇండ్ల స్థలాలు (ఇండ్లు)	ఇండ్ల స్థలాలు (ఇండ్లు)		-	-
19				N.H/హైవేతో ఉన్న ఇతరులు (N.H/ హైవేతో ఉన్న ఇతరులు)	N.H/హైవేతో ఉన్న ఇతరులు (N.H/ హైవేతో ఉన్న ఇతరులు)			
20	12	పట్టా	0-10	దొంగరి కొండయ్య (సమ్మయ్య)	దొంగరి కొండయ్య (సమ్మయ్య)	0-10	-	-
21				మాచర్ల చెంద్రయ్య (సమ్మయ్య)	మాచర్ల చెంద్రయ్య (సమ్మయ్య)		-	-
22				చింత పోచయ్య (లక్ష్మయ్య)	చింత పోచయ్య (లక్ష్మయ్య)		-	-
23				పల్నాటి ప్రదీప్ (మల్లయ్య)	పల్నాటి ప్రదీప్ (మల్లయ్య)		-	-
24				బచ్చు అశోక్ (రామచంద్రమ్)	బచ్చు అశోక్ (రామచంద్రమ్)		-	-
25				తిగురం వంశీకృష్ణ (రాంరెడ్డి)	తిగురం వంశీకృష్ణ (రాంరెడ్డి)		-	-
26				చింత శారద (రామచంద్రం)	చింత శారద (రామచంద్రం)		-	-
27				చింత సౌందర్య (రామ్ చంద్రం)	చింత సౌందర్య (రామ్ చంద్రం)		-	-
28				దొంగరి రాజయ్య (సమ్మయ్య)	దొంగరి రాజయ్య (సమ్మయ్య)		-	-
29				దొంగరి రమేష్ (సమ్మయ్య)	దొంగరి రమేష్ (సమ్మయ్య)		-	-
30				సొరరి లక్ష్మి (సమ్మయ్య)	సొరరి లక్ష్మి (సమ్మయ్య)		-	-
31				ఇ సంతోష్ కుమార్ (పుల్లయ్య)	ఇ సంతోష్ కుమార్ (పుల్లయ్య)		-	-
32	138	పట్టా	0-25	రంగు వెంకటయ్య (వెంకటరామయ్య)	రంగు వెంకటయ్య (వెంకటరామయ్య)	0-25	-	-
33				పూర నంద కిశోర్ (కమల మనోహర్ రావు)	పూర నంద కిశోర్ (కమల మనోహర్ రావు)		-	-
34				పూర నంద గోపాల్ (కమల మనోహర్ రావు)	పూర నంద గోపాల్ (కమల మనోహర్ రావు)		-	-
35				రంగు లక్ష్మి నారాయణ (నర్సయ్య)	రంగు లక్ష్మి నారాయణ (నర్సయ్య)		-	-
36				బుర్ర రవి (లక్ష్మయ్య)	బుర్ర రవి (లక్ష్మయ్య)		-	-
37				బుర్ర రాజబాబు (లక్ష్మయ్య)	బుర్ర రాజబాబు (లక్ష్మయ్య)		-	-
38		ఎండోమెంట్		ఎండోమెంట్ (ఎండోమెంట్)	ఎండోమెంట్ (ఎండోమెంట్)		-	-
39	137	పట్టా	0-30	ఇండ్ల స్థలాలు (ఇండ్లు)	ఇండ్ల స్థలాలు (ఇండ్లు)	0-30	-	-
40		ఎండోమెంట్		ఎండోమెంట్ (ఎండోమెంట్)	ఎండోమెంట్ (ఎండోమెంట్)		-	-
41	136	పట్టా	0-24	చల్ల నారాయణ రెడ్డి (మల్లారెడ్డి)	చల్ల నారాయణ రెడ్డి (మల్లారెడ్డి)	0-24	-	-
42				మహ్మద్ షకీల్ (షకీల్)	మహ్మద్ షకీల్ (షకీల్)		-	-
43	113	పట్టా	0-36	కొట్టే రాజమౌళి (బాలయ్య)	కొట్టే రాజమౌళి (బాలయ్య)	0-36	-	-
44				చల్ల నారాయణ రెడ్డి (మల్లారెడ్డి)	చల్ల నారాయణ రెడ్డి (మల్లారెడ్డి)		-	-
45				కొట్టే శ్రీహరి (చంద్రయ్య)	కొట్టే శ్రీహరి (చంద్రయ్య)		-	-
46				తోట వెంకట స్వామి (కిష్టయ్య)	తోట వెంకట స్వామి (కిష్టయ్య)		-	-
47				రత్న మహేశ్వర రెడ్డి (మొండయ్య)	రత్న మహేశ్వర రెడ్డి (మొండయ్య)		-	-
48				బొమ్మ లక్ష్మి (సమ్మిరెడ్డి)	బొమ్మ లక్ష్మి (సమ్మిరెడ్డి)		-	-
49	125	పట్టా	0-36	అక్కపాక మత్తయ్య (-)	అక్కపాక మత్తయ్య (-)	0-36	-	-
50	126	లావుని పట్టా	0-36	గడి దేవరి లక్ష్మయ్య (మాదయ్య)	గడి దేవరి లక్ష్మయ్య (మాదయ్య)	0-36	-	-
51				గడి దేవరి వెంకట స్వామి (మాదయ్య)	గడి దేవరి వెంకట స్వామి (మాదయ్య)		-	-
52	127	పట్టా	0-20	తోట జనార్ధన్ (పోచయ్య)	తోట జనార్ధన్ (పోచయ్య)	0-20	-	-
53				బొడ్డు వినోద (శ్రీనివాస)	బొడ్డు వినోద (శ్రీనివాస)		-	-
54				తోట రాజ కుమార్ (రామ చెంద్రం)	తోట రాజ కుమార్ (రామ చెంద్రం)		-	-
55				తోట ప్రభాకర్ (పోచయ్య)	తోట ప్రభాకర్ (పోచయ్య)		-	-
56				షేక్ సర్వర్ (అబ్దుల్)	షేక్ సర్వర్ (అబ్దుల్)		-	-
57				తల్లా తిరుపతి (బాలయ్య)	తల్లా తిరుపతి (బాలయ్య)		-	-
58				ఎనగంటి యేందర్ (సమ్మయ్య)	ఎనగంటి యేందర్ (సమ్మయ్య)		-	-
59				బొడ్డు శ్రావ్య (శ్రీనివాస్)	బొడ్డు శ్రావ్య (శ్రీనివాస్)		-	-
60				కురి అమర్ (పోచం)	కురి అమర్ (పోచం)		-	-
61				కుంకాల రాజిరెడ్డి (రాం రెడ్డి)	కుంకాల రాజిరెడ్డి (రాం రెడ్డి)		-	-
62				బొడ్డు నవ్య (శ్రీనివాస్)	బొడ్డు నవ్య (శ్రీనివాస్)		-	-
63				బండం పద్మ (బాపు)	బండం పద్మ (బాపు)		-	-
64				కుసుమ రామయ్య (కిష్టయ్య)	కుసుమ రామయ్య (కిష్టయ్య)		-	-
65				గజ్జ రత్నాకర్ రావు (సంపత్ రావు)	గజ్జ రత్నాకర్ రావు (సంపత్ రావు)		-	-
66				బండి చంద్రకళ (బండి రాజశేఖర్)	బండి చంద్రకళ (బండి రాజశేఖర్)		-	-
67				ఇండ్ల స్థలాలు (ఇండ్లు)	ఇండ్ల స్థలాలు (ఇండ్లు)		-	-
68	119	పట్టా	0-33	తిగురం సాయికృష్ణ (రాం రెడ్డి)	తిగురం సాయికృష్ణ (రాం రెడ్డి)	0-33	-	-
69				చీర్ల అంజయ్య (కొండయ్య)	చీర్ల అంజయ్య (కొండయ్య)		-	-
70				ధరిపెల్లి వెంకటయ్య (మల్లయ్య)	ధరిపెల్లి వెంకటయ్య (మల్లయ్య)		-	-
71				బచ్చు అశోక్ (రామ చంద్రమ్)	బచ్చు అశోక్ (రామ చంద్రమ్)		-	-
72				బచ్చు ప్రకాష్ (రామ చెంద్రం)	బచ్చు ప్రకాష్ (రామ చెంద్రం)		-	-
73				బాచ్చు ప్రభాకర్ (రామ చంద్రం)	బాచ్చు ప్రభాకర్ (రామ చంద్రం)		-	-
74				అల్లాడి చెంద్రమౌళి (బ్రహ్మయ్య)	అల్లాడి చెంద్రమౌళి (బ్రహ్మయ్య)		-	-
75				దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి (దశరథ్ రాంరెడ్డి)	దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి (దశరథ్ రాంరెడ్డి)		-	-
76				కొట్టే శంకరయ్య (బాలయ్య)	కొట్టే శంకరయ్య (బాలయ్య)		-	-
77				కొట్టే శ్రీనివాస్ (బాలయ్య)	కొట్టే శ్రీనివాస్ (బాలయ్య)		-	-
78				మిరుదొడ్ల రాజు (మల్లయ్య)	మిరుదొడ్ల రాజు (మల్లయ్య)		-	-
79				బాసని కృష్ణ (సమ్మయ్య)	బాసని కృష్ణ (సమ్మయ్య)		-	-
80				బాసని సంతోష్ (లచ్చయ్య)	బాసని సంతోష్ (లచ్చయ్య)		-	-
81				ఇండ్ల స్థలాలు (ఇండ్లు)	ఇండ్ల స్థలాలు (ఇండ్లు)		-	-
82	35	పట్టా	0-17	పూర నంద కిశోర్ (కమల మనోహర్ రావు)	పూర నంద కిశోర్ (కమల మనోహర్ రావు)	0-17	-	-
83				పూర నంద గోపాల్ (కమల మనోహర్ రావు)	బాసని సంతోష్ (కమల మనోహర్ రావు)		-	-
84		రోడ్డు		N.H./others with Highway (N.H./ others with Highway)	N.H./others withHighway (N.H./ others with Highway)			
85	16	పట్టా	0-29	తోట వెంకయ్య (గట్టయ్య)	తోట వెంకయ్య (గట్టయ్య)	0-17	-	-
86				ముల్కల పోచయ్య (చెంద్రయ్య)	ముల్కల పోచయ్య (చెంద్రయ్య)		-	-
87				ముల్కల పోచయ్య (చెంద్రయ్య)	ముల్కల పోచయ్య (చెంద్రయ్య)		-	-
88				కొట్టే శ్రీశైలం (చంద్రయ్య)	కొట్టే శ్రీశైలం (చంద్రయ్య)		-	-
89				కొట్టే రమేష్ (చంద్రయ్య)	కొట్టే రమేష్ (చంద్రయ్య)		-	-
90				కొట్టే సుధాకర్ (చంద్రయ్య)	కొట్టే సుధాకర్ (చంద్రయ్య)		-	-
91				కొట్టే శ్రీహరి (చంద్రయ్య)	కొట్టే కొట్టే శ్రీహరి (చంద్రయ్య)		-	-
92				మలుకల సంతోష్ (అంకయ్య)	మలుకల సంతోష్ (అంకయ్య)		-	-
93				బాపు సంధ్య (గట్టయ్య)	బాపు సంధ్య (గట్టయ్య)		-	-
94				మలుకల్ల లక్ష్మి (మలుకల్ల దేవేందర్)	మలుకల్ల లక్ష్మి (మలుకల్ల దేవేందర్)		-	-
95				మలుకల తిరుపతి (పోచయ్య)	మలుకల తిరుపతి (పోచయ్య)		-	-
96	60	పట్టా	0-11	మాచర్ల రాజయ్య (నాగమల్లు)	మాచర్ల రాజయ్య (నాగమల్లు)	0-11	-	-
97				మాచర్ల నారాయణ (నాగమల్లు)	మాచర్ల నారాయణ (నాగమల్లు)		-	-
98		గ్రామ కంఠం పట్టా		జనగాం పద్మ (శంకరయ్య)	జనగాం పద్మ (శంకరయ్య)		-	-
99				జనగాం వినయ్ రావు (రాజేశ్వర రావు)	జనగాం వినయ్ రావు (రాజేశ్వర రావు)		-	-
100				దామెరు తంగేటి (రాజేశ్వర రావు)	దామెరు తంగేటి (రాజేశ్వర రావు)		-	-
101				బండం విజయ (వసంత రెడ్డి)	బండం విజయ (వసంత రెడ్డి)		-	-
102				బొమ్మన రామకృష్ణ రెడ్డి (లచ్చిరెడ్డి)	బొమ్మన రామకృష్ణ రెడ్డి (లచ్చిరెడ్డి)		-	-
103	61	ప్రభుత్వ భూమి	0-19	మాతి శంకరయ్య (సమ్మయ్య)	మాతి శంకరయ్య (సమ్మయ్య)	0-19	-	-
104				మాతి కేదారి (సమ్మయ్య)	మాతి కేదారి (సమ్మయ్య)		-	-
105				జనగాం రాజశేఖర్ (రాములు)	జనగాం రాజశేఖర్ (రాములు)		-	-
106				జనగాం వేణు మాధవ్ (రాములు)	జనగాం వేణు మాధవ్ (రాములు)		-	-
107	64	పట్టా	0-04	శైవాల రాజయ్య (-)	శైవాల రాజయ్య (-)		-	-
108	76	పట్టా	0-08	జక్కు గట్టయ్య (-)	జక్కు గట్టయ్య (-)	0-08	-	-
109	77	శిఖం	0-04	నీటిపారుదల - శిఖం (నీటి వనరులు) నీటి పారుదల - శిఖం (నీటి వనరులు))	నీటిపారుదల - శిఖం (నీటి వనరులు) నీటి పారుదల - శిఖం (నీటి వనరులు))	0-04	-	-
110	75	లావుని పట్టా	0-12	తొట్ల రామక్క (రాజయ్య)	తొట్ల రామక్క (రాజయ్య)	0-12	-	-
111				బీసల విజయ (నర్సయ్య)	బీసల విజయ (నర్సయ్య)		-	-
112				ఎర్ర సతీష్ (ఎర్ర సమ్మయ్య)	ఎర్ర సతీష్ (ఎర్ర సమ్మయ్య)		-	-
113	74	పట్టా	1-05	కొట్టే శేఖర్ (చంద్రయ్య)	కొట్టే శేఖర్ (చంద్రయ్య)	1-05	-	-
114	71	పట్టా	0-04	బీసల వెంకట స్వామి (పోచయ్య)	బీసల వెంకట స్వామి (పోచయ్య)	0-04	-	-
115	73	పట్టా	0-12	కొట్టే శ్రీహరి (చంద్రయ్య)	కొట్టే శ్రీహరి (చంద్రయ్య)	0-12	-	-
116				ఒడేటి మహేష్ (పెద్దరాజు)	ఒడేటి మహేష్ (పెద్దరాజు)		-	-
117				చీర్ల తిరుపతి (ఐలయ్య)	చీర్ల తిరుపతి (ఐలయ్య)		-	-
118				జాకంటి నరసింహం (వెంకటయ్య)	జాకంటి నరసింహం (వెంకటయ్య)		-	-
119				చీర్ల లయ వర్ధన్ (శ్రీనివాస)	చీర్ల లయ వర్ధన్ (శ్రీనివాస)		-	-
120				సింగనవేణి మహేందర్ (సింగనవేణి లింగయ్య)	సింగనవేణి మహేందర్ (సింగనవేణి లింగయ్య)		-	-
121				చౌటపల్లి వసంత (శ్రీనివాస్)	చౌటపల్లి వసంత (శ్రీనివాస్)		-	-
122				కొట్టే శేఖర్ (చంద్రయ్య)	కొట్టే శేఖర్ (చంద్రయ్య)		-	-
				కొట్టే శ్రీహరి (చంద్రయ్య)	కొట్టే శ్రీహరి (చంద్రయ్య)		-	-
123	72	పట్టా	0-15	కుడుదుల మల్లక్క (రాజయ్య)	కుడుదుల మల్లక్క (రాజయ్య)	0-15	-	-
124				రాళ్లబండి సమ్మక్క (నర్సయ్య)	రాళ్లబండి సమ్మక్క (నర్సయ్య)		-	-
	విస్తీర్ణము		12-18			12-18		

గ్రామం : పోతుల్వాయి మండలం : కాటారం జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సం.	సర్వే నం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం ప్రభుత్వ)	Requisition విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారు పేరు భూభారతి రికార్డు ప్రకారం (తండ్రి/భర్త)	అనుభవంలో వ్యక్తుల వారి పేరు (తండ్రి/భర్త)	విస్తీర్ణం (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1.	255	పట్టా	0-10	చీర్ల సమ్మిరెడ్డి (పోచిరెడ్డి)	చీర్ల సమ్మిరెడ్డి (పోచిరెడ్డి)	0-10	-	-
2.				బచ్చు ప్రభాకర్ (రాంచంద్రం)	బచ్చు ప్రభాకర్ (రాంచంద్రం)		-	-
3.				బచ్చు ప్రకాష్ (రాంచంద్రం)	బచ్చు ప్రకాష్ (రాంచంద్రం)		-	-
4.				అల్లాడి చంద్రమౌళి (బ్రహ్మయ్య)	అల్లాడి చంద్రమౌళి (బ్రహ్మయ్య)		-	-
5.				బచ్చు అశోక్ (రాంచంద్రం)	బచ్చు అశోక్ (రాంచంద్రం)		-	-
6.				దొంతిరెడ్డి సాధూజమ్మ (దేవేందర్ రెడ్డి)	దొంతిరెడ్డి సాధూజమ్మ (దేవేందర్ రెడ్డి)		-	-
7.				బొమ్మ మల్లారెడ్డి (పోచయ్య)	బొమ్మ మల్లారెడ్డి (పోచయ్య)		-	-
8.				లావణ్య జగన్ నాయక్ (బాలనాయక్)	లావణ్య జగన్ నాయక్ (బాలనాయక్)		-	-
9.				చీర్ల అరుణ (సమ్మయ్య)	చీర్ల అరుణ (సమ్మయ్య)		-	-
10.				చీర్ల మమత (రత్న ప్రకాష్)	చీర్ల మమత (రత్న ప్రకాష్)		-	-
11.	256	పట్టా	0-21	పుప్పెంతల శేఖర్‌రెడ్డి (మాధవరెడ్డి)	పుప్పెంతల శేఖర్‌రెడ్డి (మాధవరెడ్డి)	0-21	-	-
12.				మహమూదుల్లా ఖాన్ (వలీయుల్లాఖాన్)	మహమూదుల్లా ఖాన్ (వలీయుల్లాఖాన్)		-	-
13.				చీర్ల సమ్మిరెడ్డి (పోచిరెడ్డి)	చీర్ల సమ్మిరెడ్డి (పోచిరెడ్డి)		-	-
14.				మాచెర్ల రాజయ్య (నాగమల్లు)	మాచెర్ల రాజయ్య (నాగమల్లు)		-	-
15.				వేముల నర్సింగ రావు (జగ్గారావు)	వేముల నర్సింగ రావు (జగ్గారావు)		-	-
16.				కాకుల మర్రి నాగేశ్వరరావు (పక్షధర్ రావు)	కాకుల మర్రి నాగేశ్వరరావు (పక్షధర్ రావు)		-	-
17.				కాకుల మర్రి కృష్ణ రావు (పక్షధర్ రావు)	కాకుల మర్రి కృష్ణ రావు (పక్షధర్ రావు)		-	-
18.				మచెర్ల కనకమ్మ (రాజయ్య)	మచెర్ల కనకమ్మ (రాజయ్య)		-	-
19.				దరిపెల్లి వెంకటయ్య (మల్లయ్య)	దరిపెల్లి వెంకటయ్య (మల్లయ్య)		-	-
20.				కంకనాల సరోజన (రమేష్ రెడ్డి)	కంకనాల సరోజన (రమేష్ రెడ్డి)		-	-
21.				బచ్చు ప్రభాకర్ (రాంచంద్రం)	బచ్చు ప్రభాకర్ (రాంచంద్రం)		-	-
22.				బచ్చు ప్రకాష్ (రాంచంద్రం)	బచ్చు ప్రకాష్ (రాంచంద్రం)		-	-
23.				అల్లాడి చంద్రమౌళి (బ్రహ్మయ్య)	అల్లాడి చంద్రమౌళి (బ్రహ్మయ్య)		-	-
24.				చీర్ల అంజయ్య (కొండయ్య)	చీర్ల అంజయ్య (కొండయ్య)		-	-
25.				బచ్చు అశోక్ (రాంచంద్రం)	బచ్చు అశోక్ (రాంచంద్రం)		-	-
26.				దొంతిరెడ్డి సాధూజమ్మ (దేవేందర్ రెడ్డి)	దొంతిరెడ్డి సాధూజమ్మ (దేవేందర్ రెడ్డి)		-	-
27.				పంతిరెడ్డి స్వాతి (నరేందర్)	పంతిరెడ్డి స్వాతి (నరేందర్)		-	-
28.				లావణ్య నిర్మల (జగన్ నాయక్)	లావణ్య నిర్మల (జగన్ నాయక్)		-	-
29.	259	పట్టా	0-07	బొమ్మిన వెంకటస్వామి (లచ్చిరెడ్డి)	బొమ్మిన వెంకటస్వామి (లచ్చిరెడ్డి)	0-07	-	-
30.				బొమ్మన రాజిరెడ్డి (చిన్నలచ్చిరెడ్డి)	బొమ్మన రాజిరెడ్డి (చిన్నలచ్చిరెడ్డి)		-	-
31.				మలుకల్ల మౌనిక (బాపు మలుకల్ల)	మలుకల్ల మౌనిక (బాపు మలుకల్ల)		-	-
32.	258	పట్టా	1-01	బొమ్మిన వెంకటస్వామి (లచ్చిరెడ్డి)	బొమ్మిన వెంకటస్వామి (లచ్చిరెడ్డి)	1-01	-	-
33.				తడకమళ్ల రమేష్ (శంకరయ్య)	తడకమళ్ల రమేష్ (శంకరయ్య)		-	-
34.				జల్లారపు మల్లయ్య (నర్సయ్య)	జల్లారపు మల్లయ్య (నర్సయ్య)		-	-
35.				బొమ్మన రాజిరెడ్డి (చిన్నలచ్చిరెడ్డి)	బొమ్మన రాజిరెడ్డి (చిన్నలచ్చిరెడ్డి)		-	-
36.				బొమ్మన శ్రావణ్ (రాజిరెడ్డి)	బొమ్మన శ్రావణ్ (రాజిరెడ్డి)		-	-
37.				పులి అశోక్ (ఓల్లయ్య)	పులి అశోక్ (ఓల్లయ్య)		-	-
38.				కొప్పుల లక్ష్మి (లింగయ్య)	కొప్పుల లక్ష్మి (లింగయ్య)		-	-
39.				జక్కు స్వామి (మరాటి)	జక్కు స్వామి (మరాటి)		-	-
40.				ఉరగొండ శ్రీనివాస్ (రాజయ్య)	ఉరగొండ శ్రీనివాస్ (రాజయ్య)		-	-
41.				బుర్రి శ్రీనివాసులు (వెంకటి)	బుర్రి శ్రీనివాసులు (వెంకటి)		-	-
42.				తిగురం రాకేష్ (తిగురం మల్లారెడ్డి)	తిగురం రాకేష్ (తిగురం మల్లారెడ్డి)		-	-
43.				జల్లారపు సుభద్ర (రాజా బాపు)	జల్లారపు సుభద్ర (రాజా బాపు)		-	-
44.				మ్యాన లక్ష్మణ్ (రాజిరెడ్డి)	మ్యాన లక్ష్మణ్ (రాజిరెడ్డి)		-	-
45.				గుడు రాజబాబు (రాకేష్)	గుడు రాజబాబు (రాకేష్)		-	-
46.				బాల సీతారామిరెడ్డి (భద్రారెడ్డి)	బాల సీతారామిరెడ్డి (భద్రారెడ్డి)		-	-
47.				నంగి సీతమ్మ (సిద్దిరెడ్డి)	నంగి సీతమ్మ (సిద్దిరెడ్డి)		-	-
48.				వేల్పుల సమ్మక్క (పోచయ్య)	వేల్పుల సమ్మక్క (పోచయ్య)		-	-
49.				పంథుల శేఖరాణి (దొంగరి రవి)	పంథుల శేఖరాణి (దొంగరి రవి)		-	-
50.				మలుకల్ల మౌనిక (బాపు మలుకల్ల)	మలుకల్ల మౌనిక (బాపు మలుకల్ల)		-	-
51.				రైస్ మిల్లు (రైస్ మిల్లు)	రైస్ మిల్లు (రైస్ మిల్లు)		-	-
52.				బొమ్మిన వెంకటస్వామి (లచ్చిరెడ్డి)	బొమ్మిన వెంకటస్వామి (లచ్చిరెడ్డి)		-	-
53.	262	పట్టా	1-09	సాదు రమేష్ (చిన్న వీరయ్య)	సాదు రమేష్ (చిన్న వీరయ్య)	1-09	-	-
54.				సాదు నరేష్ (చిన్న వీరయ్య)	సాదు నరేష్ (చిన్న వీరయ్య)		-	-
55.				రామని నర్మద (రాజ వీరయ్య)	రామని నర్మద (రాజ వీరయ్య)		-	-
56.				సాదు బాల్ చందర్ (చిన్న వీరయ్య)	సాదు బాల్ చందర్ (చిన్న వీరయ్య)		-	-
57.				సాదు బాల్ చందర్ (చిన్న వీరయ్య)	సాదు బాల్ చందర్ (చిన్న వీరయ్య)		-	-
58.				సాదు బాల్ చందర్ (చిన్న వీరయ్య)	సాదు బాల్ చందర్ (చిన్న వీరయ్య)		-	-
59.				పతి ఓదేలు (పోచం)	పతి ఓదేలు (పోచం)		-	-
60.	263	పట్టా	0-28	రౌతు మల్లయ్య (వెంకటి)	రౌతు మల్లయ్య (వెంకటి)	0-28	-	-
61.				రౌతు రాజేశం (సమ్మయ్య)	రౌతు రాజేశం (సమ్మయ్య)		-	-
62.				రౌతు సత్యం (సమ్మయ్య)	రౌతు సత్యం (సమ్మయ్య)		-	-
63.				రౌతు ఐలయ్య (సమ్మయ్య)	రౌతు ఐలయ్య (సమ్మయ్య)		-	-
64.				రౌతు ఐలయ్య (సమ్మయ్య)	రౌతు ఐలయ్య (సమ్మయ్య)		-	-
65.				రౌతు వెంకటస్వామి (రాములు)	రౌతు వెంకటస్వామి (రాములు)		-	-
66.				తిరుగల చంద్రయ్య (లచ్చయ్య)	తిరుగల చంద్రయ్య (లచ్చయ్య)		-	-
67.				రౌతు సంతోష్ (రాములు)	రౌతు సంతోష్ (రాములు)		-	-
68.				తిరుగల స్వామి (పోచం)	తిరుగల స్వామి (పోచం)		-	-
69.				చీటీ లక్ష్మి (స్వామి)	చీటీ లక్ష్మి (స్వామి)		-	-
70.				రౌతు సుశీల (రాకేష్)	రౌతు సుశీల (రాకేష్)		-	-
71.				రౌతు రాకేష్ (సత్యం)	రౌతు రాకేష్ (సత్యం)		-	-
72.	265	లావుని పట్టా	0-11	ఎల్లాం రమాదేవి (సత్యనారాయణ)	ఎల్లాం రమాదేవి (సత్యనారాయణ)	0-11	-	-
73.				రౌతు మల్లయ్య (వెంకటి)	రౌతు మల్లయ్య (వెంకటి)		-	-
74.				రౌతు రాజయ్య (వెంకటి)	రౌతు రాజయ్య (వెంకటి)		-	-
75.				రౌతు రజేశం (సమ్మయ్య)	రౌతు రజేశం (సమ్మయ్య)		-	-
76.				రౌతు సత్యం (సమ్మయ్య)	రౌతు సత్యం (సమ్మయ్య)		-	-
77.				రౌతు ఐలయ్య (సమ్మయ్య)	రౌతు ఐలయ్య (సమ్మయ్య)		-	-
78.				రౌతు వెంకటస్వామి (రాములు)	రౌతు వెంకటస్వామి (రాములు)		-	-
79.				బొద్దుల సదానంద్ (లచ్చయ్య)	బొద్దుల సదానంద్ (లచ్చయ్య)		-	-
80.				తాటిపాముల స్వామి (లచ్చయ్య)	తాటిపాముల స్వామి (లచ్చయ్య)		-	-
81.				రౌత్తు సంతోష్ (రాములు)	రౌత్తు సంతోష్ (రాములు)		-	-
82.	271	లావుని పట్టా	0-35	మారాటి జవహర్ రెడ్డి (నర్సింహ రెడ్డి)	మారాటి జవహర్ రెడ్డి (నర్సింహ రెడ్డి)	0-35	-	-
83.				రౌతు మల్లయ్య (వెంకటి)	రౌతు మల్లయ్య (వెంకటి)		-	-
84.				రౌతు రాజేశం (సమ్మయ్య)	రౌతు రాజేశం (సమ్మయ్య)		-	-
85.				రౌతు సత్యం (సమ్మయ్య)	రౌతు సత్యం (సమ్మయ్య)		-	-
86.				రౌతు ఐలయ్య (సమ్మయ్య)	రౌతు ఐలయ్య (సమ్మయ్య)		-	-
87.				చీర్ల ప్రతాప్ (పోచిరెడ్డి)	చీర్ల ప్రతాప్ (పోచిరెడ్డి)		-	-
88.				రౌతు వెంకటస్వామి (రాములు)	రౌతు వెంకటస్వామి (రాములు)		-	-
89.				రౌత్తు సంతోష్ (రాములు)	రౌత్తు సంతోష్ (రాములు)		-	-
90.				తోటపల్లి పద్మ (తోటపల్లి సత్తయ్య)	తోటపల్లి పద్మ (తోటపల్లి సత్తయ్య)		-	-
91.				గద్దె ప్రేమల (బాపు)	గద్దె ప్రేమల (బాపు)		-	-
92.	229	పట్టా	0-25	చీటీ లక్ష్మి (స్వామి)	చీటీ లక్ష్మి (స్వామి)	0-25	-	-
93.				బుర్ర లక్ష్మయ్య (కిష్టయ్య)	బుర్ర లక్ష్మయ్య (కిష్టయ్య)		-	-
94.				బుర్ర రాజబాబు (లక్ష్మయ్య)	బుర్ర రాజబాబు (లక్ష్మయ్య)		-	-
95.				మేడి ఉమామహేశ్వర్ (రాజవీర్)	మేడి ఉమామహేశ్వర్ (రాజవీర్)		-	-
96.	228	పట్టా	0-14	మేడి కిరణ్ కుమార్ (రాజవీర్)	మేడి కిరణ్ కుమార్ (రాజవీర్)		-	-
97.				బుర్ర శ్రీనివాస్ (లక్ష్మణ్)	బుర్ర శ్రీనివాస్ (లక్ష్మణ్)		-	-
98.				సింగిరెడ్డి మధుకర్ (రాజయ్య)	సింగిరెడ్డి మధుకర్ (రాజయ్య)		-	-
99.				కోట దేవేందర్ రెడ్డి (లచ్చిరెడ్డి)	కోట దేవేందర్ రెడ్డి (లచ్చిరెడ్డి)		-	-
100.				బుర్ర రవి (లక్ష్మణ్)	బుర్ర రవి (లక్ష్మణ్)		-	-
101.				జాడి బాలయ్య (ధర్మయ్య)	జాడి బాలయ్య (ధర్మయ్య)		-	-
102.				గడి రమేష్ (రామయ్య)	గడి రమేష్ (రామయ్య)		-	-
103.				పిట్ల జ్యోతి (పిట్ల సురేందర్)	పిట్ల జ్యోతి (పిట్ల సురేందర్)		-	-
104.				బుర్ర లక్ష్మయ్య (కిష్టయ్య)	బుర్ర లక్ష్మయ్య (కిష్టయ్య)		-	-
105.				బుర్ర రాజబాబు (లక్ష్మయ్య)	బుర్ర రాజబాబు (లక్ష్మయ్య)		-	-
106.				పల్లి చిన్నయ్య (అక్కయ్య)	పల్లి చిన్నయ్య (అక్కయ్య)		-	-
107.	225	పట్టా	0-11	పీసు రాజా రెడ్డి (రఘురెడ్డి)	పీసు రాజా రెడ్డి (రఘురెడ్డి)	0-11	-	-
108.		విస్తీర్ణం		6-12				

గ్రామం : నల్లగుంట మండలం : కాటారం జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సం.	సర్వే నం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం ప్రభుత్వ)	Requisition విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారు పేరు భూభారతి రికార్డు ప్రకారం (తండ్రి/భర్త)	అనుభవంలో వ్యక్తుల వారి పేరు (తండ్రి/భర్త)	విస్తీర్ణం (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	1	పట్టా	0-30	గుండు సమ్మయ్య (మల్లయ్య)	గుండు సమ్మయ్య (మల్లయ్య)	0-30	-	-
2				గడ్డె బాపురెడ్డి (మల్లయ్య)	గడ్డె బాపురెడ్డి (మల్లయ్య)		-	-
3				చల్ల బాపు (పోచయ్య)	చల్ల బాపు (పోచయ్య)		-	-

(మిగతా 8వ పేజీలో...)

(...7వ పేజీ తరువాయి)

క్ర. సం.	సర్వే నం.	భూమి స్వభావం (పట్టా/ సాదా/ ప్రభుత్వ)	Requisition విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారుని పేరు భూభారతి రికార్డు ప్రకారం (తండ్రి/భర్త)	అనుభవం వ్యక్తుల వారి పేరు (తండ్రి/భర్త)	విస్తీర్ణం (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
4				బొమ్మన చిలుకమ్మ (అశోక్)	బొమ్మన చిలుకమ్మ (అశోక్)		-	-
5				చల్ల మల్లయ్య (లచ్చయ్య)	చల్ల మల్లయ్య (లచ్చయ్య)		-	-
6				బొమ్మెన లచ్చయ్య (బాలయ్య)	బొమ్మెన లచ్చయ్య (బాలయ్య)		-	-
7				బార్నే మల్లక్క (మల్లయ్య)	బార్నే మల్లక్క (మల్లయ్య)		-	-
8				చల్ల రవీందర్ (పోచయ్య)	చల్ల రవీందర్ (పోచయ్య)		-	-
9	28	పట్టా	1-23	రౌతు రాజేశం (సమ్మయ్య)	రౌతు రాజేశం (సమ్మయ్య)	1-23	-	-
10				చల్ల ఐల్లయ్య (మల్లయ్య)	చల్ల ఐల్లయ్య (మల్లయ్య)		-	-
11				ఉరగొండ శ్రీనివాస్ (రాజయ్య)	ఉరగొండ శ్రీనివాస్ (రాజయ్య)		-	-
12				దీర్ఘ తిరుపతి రెడ్డి (పోచిరెడ్డి)	దీర్ఘ తిరుపతి రెడ్డి (పోచిరెడ్డి)		-	-
13				తాడబోయిన సత్యనారాయణ (మొండయ్య)	తాడబోయిన సత్యనారాయణ (మొండయ్య)		-	-
14				బొద్దు సారయ్య (సమ్మయ్య)	బొద్దు సారయ్య (సమ్మయ్య)		-	-
15				గండు రాజబాబు (రాజేష్)	గండు రాజబాబు (రాజేష్)		-	-
16				గండు ప్రతిబాబు (రాజేష్)	గండు ప్రతిబాబు (రాజేష్)		-	-
17				బొద్దు రాజయ్య (సమ్మయ్య)	బొద్దు రాజయ్య (సమ్మయ్య)		-	-
18				బొద్దు స్వామి (సమ్మయ్య)	బొద్దు స్వామి (సమ్మయ్య)		-	-
19				గండు స్వప్న (రాజబాబు)	గండు స్వప్న (రాజబాబు)		-	-
20				చల్ల అనిల్ (సత్యం)	చల్ల అనిల్ (సత్యం)		-	-
21				దబ్బెట మానస (శ్రీనివాస్)	దబ్బెట మానస (శ్రీనివాస్)		-	-
22				రౌతు రాకేష్ (సత్యం)	రౌతు రాకేష్ (సత్యం)		-	-
23				రౌతు మహేష్ (సత్యం)	రౌతు మహేష్ (సత్యం)		-	-
24				బోలిశెట్టి రజిత (బోలిశెట్టి శ్రీనివాస్)	బోలిశెట్టి రజిత (బోలిశెట్టి శ్రీనివాస్)		-	-
25	26	లావుని పట్టా	0-30	కలికోట సోమయ్య (.)	కలికోట సోమయ్య (.)	0-30	-	-
26				షేక్ ఉస్మాన్ (షేక్ మహ్మద్ సాయబ్)	షేక్ ఉస్మాన్ (షేక్ మహ్మద్ సాయబ్)	-	-	
27				అత్కూరి పోచమ్మ (పోచయ్య)	అత్కూరి పోచమ్మ (పోచయ్య)		-	-
28				చిట్యాల జక్కు (బాలయ్య)	చిట్యాల జక్కు (బాలయ్య)		-	-
29				మంథని రాజయ్య (బానయ్య)	మంథని రాజయ్య (బానయ్య)		-	-
30				జకిటి వెంకటస్వామి (జకిటి మరాటి)	జకిటి వెంకటస్వామి (జకిటి మరాటి)		-	-
31				మంథని మల్లయ్య (బానయ్య)	మంథని మల్లయ్య (బానయ్య)		-	-
32				కొల్లూరు దుర్గయ్య (మల్లయ్య)	కొల్లూరు దుర్గయ్య (మల్లయ్య)		-	-
33				బొద్దు సారయ్య (సమ్మయ్య)	బొద్దు సారయ్య (సమ్మయ్య)		-	-
34				కోలుగూరి సమ్మక్క (మల్లయ్య)	కోలుగూరి సమ్మక్క (మల్లయ్య)		-	-
35				మంథెన శంకర్ (బుచ్చయ్య)	మంథెన శంకర్ (బుచ్చయ్య)		-	-
36				మంథెన శ్రీను (బుచ్చయ్య)	మంథెన శ్రీను (బుచ్చయ్య)		-	-
37				మంథెన బొందక్క (బానయ్య)	మంథెన బొందక్క (బానయ్య)		-	-
38				తాళ్లపల్లి మల్లక్క (చంద్రయ్య)	తాళ్లపల్లి మల్లక్క (చంద్రయ్య)		-	-
39				తాళ్లపల్లి రాజక్క (అంతయ్య)	తాళ్లపల్లి రాజక్క (అంతయ్య)		-	-
40				తాళ్లపల్లి పోచయ్య (లచ్చయ్య)	తాళ్లపల్లి పోచయ్య (లచ్చయ్య)		-	-
41				తాళ్లపల్లి సమ్మయ్య (లచ్చయ్య)	తాళ్లపల్లి సమ్మయ్య (లచ్చయ్య)		-	-
42				తాళ్లపల్లి బాపు (లచ్చయ్య)	తాళ్లపల్లి బాపు (లచ్చయ్య)		-	-
43				మంథెన చంద్రయ్య (సమ్మయ్య)	మంథెన చంద్రయ్య (సమ్మయ్య)		-	-
44				మంథెన బాలక్క (బుచ్చయ్య)	మంథెన బాలక్క (బుచ్చయ్య)		-	-
45				మంథెన లక్ష్మి (దుర్గయ్య)	మంథెన లక్ష్మి (దుర్గయ్య)		-	-
46				మంథెన పోచయ్య (శివయ్య)	మంథెన పోచయ్య (శివయ్య)		-	-
47				మంథెన అంతయ్య (శివయ్య)	మంథెన అంతయ్య (శివయ్య)		-	-
48				మంథెన గట్టయ్య (శివయ్య)	మంథెన గట్టయ్య (శివయ్య)		-	-
49				బొద్దు రాజయ్య (సమ్మయ్య)	బొద్దు రాజయ్య (సమ్మయ్య)		-	-
50				రామిల్ల పోచం (.)	రామిల్ల పోచం (.)		-	-
51	15	లావుని పట్టా	0-15	వేముల బొర్రాజు (గోరయ్య)	వేముల బొర్రాజు (గోరయ్య)	0-15	-	-
52				తోట వెంకటస్వామి (సమ్మయ్య)	తోట వెంకటస్వామి (సమ్మయ్య)		-	-
53				బెల్లంకొండ శకుంతల (మందరి)	బెల్లంకొండ శకుంతల (మందరి)		-	-
54				ప్రభుత్వ భూములు (ప్రభుత్వ భూములు)	ప్రభుత్వ భూములు (ప్రభుత్వ భూములు)			
55	18	ప్రభుత్వ భూములు	0-12	ప్రభుత్వ భూములు (ప్రభుత్వ భూములు)	ప్రభుత్వ భూములు (ప్రభుత్వ భూములు)	0-12	-	-
56	12	పట్టా	0-10	కొట్టే నర్సింహులు (మొండయ్య)	కొట్టే నర్సింహులు (మొండయ్య)	0-10	-	-
57				కొట్టే జనార్ధన్ (గట్టుమల్లు)	కొట్టే జనార్ధన్ (గట్టుమల్లు)		-	-
58				కొట్టే రాజయ్య (గట్టుమల్లు)	కొట్టే రాజయ్య (గట్టుమల్లు)		-	-
59				కొట్టే ప్రభాకర్ (గట్టుమల్లు)	కొట్టే ప్రభాకర్ (గట్టుమల్లు)			
60	19	పట్టా	0-27	ధుపెల్లి వెంకటస్వామి (దుర్గయ్య)	ధుపెల్లి వెంకటస్వామి (దుర్గయ్య)	0-27	-	-
61				జక్కు వెంకటస్వామి (గట్టయ్య)	జక్కు వెంకటస్వామి (గట్టయ్య)		-	-
62				సంగెం నర్సయ్య (రాజయ్య)	సంగెం నర్సయ్య (రాజయ్య)		-	-
63				దబెల్లి వెంకటయ్య (మల్లయ్య)	దబెల్లి వెంకటయ్య (మల్లయ్య)		-	-
64		వార సత్వం		కోడుకోప్పుల తిరుపతి (సమ్మయ్య)	కోడుకోప్పుల తిరుపతి (సమ్మయ్య)		-	-
65		పట్టా		సింగనవేని కిష్టస్వామి (వెంకయ్య)	సింగనవేని కిష్టస్వామి (వెంకయ్య)		-	-
66				సింగనవేని స్వరూప (మల్లయ్య)	సింగనవేని స్వరూప (మల్లయ్య)		-	-
67		వార సత్వం		మత్తరపు సతీష్ కుమార్ (బ్రహ్మయ్య)	మత్తరపు సతీష్ కుమార్ (బ్రహ్మయ్య)		-	-
68	22	పట్టా	0-10	మంత్రి పోచయ్య (బానయ్య)	మంత్రి పోచయ్య (బానయ్య)	0-10	-	-
69				దబెల్లి సుగుణ (వెంకటయ్య)	దబెల్లి సుగుణ (వెంకటయ్య)		-	-
70				రామిండ్ల పోచం (మల్లయ్య)	రామిండ్ల పోచం (మల్లయ్య)		-	-
71				గందం లక్ష్మి (లింగయ్య)	గందం లక్ష్మి (లింగయ్య)		-	-
72				పల్నాటి రాజయ్య (మధునయ్య)	పల్నాటి రాజయ్య (మధునయ్య)		-	-
73				రామిల్ల తిరుపతమ్మ (రామయ్య)	రామిల్ల తిరుపతమ్మ (రామయ్య)		-	-
74				కొట్టే అరుణ (కొట్టే రాజేశం)	కొట్టే అరుణ (కొట్టే రాజేశం)		-	-
75				రామిల్లా పోచు (మల్లేశం)	రామిల్లా పోచు (మల్లేశం)		-	-
76				జిలిరి మనస్వ (మహేష్)	జిలిరి మనస్వ (మహేష్)		-	-
77				రామిల్ల మల్లేశం (మల్లయ్య)	రామిల్ల మల్లేశం (మల్లయ్య)		-	-
78		విస్తీర్ణం	4-37			4-37		

గ్రామం : [illegible] మండలం : కాటారం జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సం.	సర్వే నం.	భూమి స్వభావం (పట్టా/ సాదా/ ప్రభుత్వ)	Requisition విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారుని పేరు భూభారతి రికార్డు ప్రకారం (తండ్రి/భర్త)	అనుభవం వ్యక్తుల వారి పేరు (తండ్రి/భర్త)	విస్తీర్ణం (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	126	లావుని పట్టా	0-23	సింగనవేని గట్టయ్య (మల్లయ్య)	సింగనవేని గట్టయ్య (మల్లయ్య)	0-23	-	-
2				సింగనవేని బాపు (మల్లయ్య)	సింగనవేని బాపు (మల్లయ్య)		-	-
3				పల్నాటి రాజయ్య (మధునయ్య)	పల్నాటి రాజయ్య (మధునయ్య)		-	-
4				మెంతిని రాజలింగు (అంతయ్య)	మెంతిని రాజలింగు (అంతయ్య)		-	-
5				శొల్లు రాజయ్య (పోచయ్య)	శొల్లు రాజయ్య (పోచయ్య)		-	-
6	130	లావుని పట్టా	0-17	కొట్టే శేఖర్ (సంధ్యయ్య)	కొట్టే శేఖర్ (సంధ్యయ్య)	0-07	-	-
7				కొట్టే దయేష్ (సంధ్యయ్య)	కొట్టే దయేష్ (సంధ్యయ్య)		-	-
8				కొట్టే సుభాష్ (సంధ్యయ్య)	కొట్టే సుభాష్ (సంధ్యయ్య)		-	-
9				కొట్టే శ్రీశైలం (సంధ్యయ్య)	కొట్టే శ్రీశైలం (సంధ్యయ్య)		-	-
10				[illegible]	[illegible]		-	-
11				పల్లె తిరుపతి (ఆదిరెడ్డి)	పల్లె తిరుపతి (ఆదిరెడ్డి)		-	-
12				కొట్టే శ్రీహరి (సంధ్యయ్య)	కొట్టే శ్రీహరి (సంధ్యయ్య)		-	-
13	125	పట్టా	0-19	జాడి సాంబయ్య (రాజయ్య)	జాడి సాంబయ్య (రాజయ్య)	0-19	-	-
14				జాడి శ్రీధర్ (రాజయ్య)	జాడి శ్రీధర్ (రాజయ్య)		-	-
15				జాడి నాగరాజు (రాజయ్య)	జాడి నాగరాజు (రాజయ్య)		-	-
16				[illegible] (గోపయ్య)	[illegible] (గోపయ్య)		-	-
17				[illegible] (గోపయ్య)	[illegible] (గోపయ్య)		-	-
18				[illegible] (గోపయ్య)	[illegible] (గోపయ్య)		-	-
19				జాడి శ్రీనివాసు (రాజయ్య)	జాడి శ్రీనివాసు (రాజయ్య)		-	-
20	124	లావుని పట్టా	0-19	కొట్టే వెంకటాలు (సంధ్యయ్య)	కొట్టే వెంకటాలు (సంధ్యయ్య)	0-19	-	-
21		గ్రామ కంఠం		కొట్టే సరోజ (శ్రీనివాస్)	కొట్టే సరోజ (శ్రీనివాస్)		-	-
22		పట్టా		[illegible] (మల్లయ్య)	[illegible] (మల్లయ్య)		-	-
23	121	లావుని పట్టా	0-12	కొట్టు వెంకటయ్య (మల్లయ్య)	కొట్టు వెంకటయ్య (మల్లయ్య)	0-12	-	-
24				మంథని రాజయ్య (అంతయ్య)	మంథని రాజయ్య (అంతయ్య)		-	-
25				[illegible] (రాజయ్య)	[illegible] (రాజయ్య)		-	-
26				[illegible]	[illegible]		-	-
27				పూర్ణ ఉదయ్ కిరణ్ (కమల మహిపాలు)	పూర్ణ ఉదయ్ కిరణ్ (కమల మహిపాలు)		-	-
28				పూర్ణ ఉదయ్ గోపాల్ (కమల మహిపాలు)	పూర్ణ ఉదయ్ గోపాల్ (కమల మహిపాలు)		-	-
29				[illegible]	[illegible]		-	-
30				[illegible] (రాజయ్య)	[illegible] (రాజయ్య)		-	-
31				మంథని పోచయ్య (పోచయ్య)	మంథని పోచయ్య (పోచయ్య)		-	-
32				మంథని సమ్మక్క (మల్లయ్య)	మంథని సమ్మక్క (మల్లయ్య)		-	-
33	122	పట్టా	0-12	మచ్చర్ల శ్రీనివాస్ (మల్లయ్య)	మచ్చర్ల శ్రీనివాస్ (మల్లయ్య)	0-12	-	-
34				[illegible]	[illegible]		-	-
35	119	పట్టా	0-04	పూర్ణ ఉదయ్ కిరణ్ (కమల మహిపాలు)	పూర్ణ ఉదయ్ కిరణ్ (కమల మహిపాలు)	0-04	-	-
36	127	లావుని పట్టా	0-21	పాతిటి గోపకిష్ (-)	పాతిటి గోపకిష్ (-)	0-21	-	-
37	129	లావుని పట్టా	0-12	నీల రామయ్య (పోచయ్య)	నీల రామయ్య (పోచయ్య)	0-12	-	-
38				పల్నాటి రాజయ్య (మధునయ్య)	పల్నాటి రాజయ్య (మధునయ్య)		-	-
39				పల్నాటి మల్లేష్ (మధునయ్య)	పల్నాటి మల్లేష్ (మధునయ్య)		-	-
40				నీలం శ్రీనివాస్ (రామయ్య)	నీలం శ్రీనివాస్ (రామయ్య)		-	-
41	163	పట్టా	0-18	[illegible] (రాజయ్య)	[illegible] (రాజయ్య)	0-18	-	-
42				[illegible] (రాజయ్య)	[illegible] (రాజయ్య)		-	-
43	162	పట్టా	0-31	జాడి చిన్న రాజయ్య (పోచయ్య)	జాడి చిన్న రాజయ్య (పోచయ్య)	0-31	-	-
44				జాడి మహేష్ (రాజయ్య)	జాడి మహేష్ (రాజయ్య)		-	-
45				జాడి రాజయ్య (రాజయ్య)	జాడి రాజయ్య (రాజయ్య)		-	-
46				జాడి శ్రీధర్ (రాజయ్య)	జాడి శ్రీధర్ (రాజయ్య)		-	-
47				జాడి నాగరాజు (రాజయ్య)	జాడి నాగరాజు (రాజయ్య)		-	-
48				కొట్టే జగదీశ్వర్ (ఐలయ్య)	కొట్టే జగదీశ్వర్ (ఐలయ్య)		-	-
49				కొట్టే ప్రకాష్ (ఐలయ్య)	కొట్టే ప్రకాష్ (ఐలయ్య)		-	-
50				[illegible] (మల్లయ్య)	[illegible] (మల్లయ్య)		-	-
51				జాడి శ్రీనివాసు (రాజయ్య)	జాడి శ్రీనివాసు (రాజయ్య)		-	-
52				కొట్టే శ్రీకాంత్ (ఐలయ్య)	కొట్టే శ్రీకాంత్ (ఐలయ్య)		-	-
53				కొట్టే పార్వతి (రాజు)	కొట్టే పార్వతి (రాజు)		-	-
54	161	పట్టా	0-18	గోరేటి రాజయ్య (వెంకటి)	గోరేటి రాజయ్య (వెంకటి)	0-18	-	-
55				గోరేటి రాజక్క (రాజయ్య)	గోరేటి రాజక్క (రాజయ్య)		-	-
56	119	పట్టా	0-03	పూర్ణ ఉదయ్ కిరణ్ (కమల మహిపాలు)	పూర్ణ ఉదయ్ కిరణ్ (కమల మహిపాలు)	0-03	-	-
57				పూర్ణ ఉదయ్ గోపాల్ (కమల మహిపాలు)	పూర్ణ ఉదయ్ గోపాల్ (కమల మహిపాలు)		-	-
58	118	పట్టా	0-33	గోరటి రాజయ్య (వెంకటి)	గోరటి రాజయ్య (వెంకటి)	0-33	-	-
59				గోరటి రాజక్క (రాజయ్య)	గోరటి రాజక్క (రాజయ్య)		-	-
60		విస్తీర్ణం	5-32			5-32		
61		మొత్తం విస్తీర్ణం	29-19			29-19		

ఇట్టి నోటిఫికేషన్ భూ సేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం 2013 నెం. 30/2013 లోని సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్ట పరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారిచేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు శ్రీయుత జిల్లా కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి మరియు భూ సేకరణ అధికారి మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైన పని దినములలో కార్యాలయ పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/శ్రీయుత జిల్లా కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి గారు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సంబంధిచి సెక్షన్ 12 ప్రకరం పైన తెలిపిన భూములలో ఏదైన ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో శ్రీయుత జిల్లా కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూ సేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైన అభ్యంతరములు ఉన్న ఎడల చట్టం లో 15 విభాగం ప్రకారం శ్రీయుత జిల్లా కలెక్టర్/భూ సేకరణ అధికారి మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భూపాలపల్లి గార్లకు ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల లిఖిత పూర్వకంగా తెలియతెయవలసి ఉంది.

సం/-	సం/-	సం/-
భూ సేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్.ఏ) జయశంకర్ భూపాలపల్లి	అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జయశంకర్ భూపాలపల్లి	జిల్లా కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి

DIPR RO No. 547/LA-PP/Advt/Pub/2025-26

‘సాక్షి’ ఎడిటర్‌పై అక్రమ కేసు

పత్రిక పాత్రికేయులపైనా అక్రమ కేసు నమోదు.. పోలీసులకు అన్యాయంపై ప్రశ్నిస్తే... పోలీసు కేసా?

ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తున్నందుకు కక్షసాధింపు.. ఏడాదిగా ఇదే రీతిలో అక్రమ కేసులతో వేధింపులు

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తున్న పోలీసు శాఖ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని నిలదీస్తున్న ''సాక్షి''పత్రికపై చంద్రబాబు ప్రభుత్వం మరోసారి కక్షసాధింపు చర్యలకు తెగబడింది. రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘిస్తూ, పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ... ''సాక్షి''ఎడిటర్‌పై అక్రమ కేసు బనాయించింది. పోలీసు అధికారులకు న్యాయబద్ధంగా దక్కాల్సిన పదోన్నతులను కల్పించలేదనే విషయాన్ని వెలుగులోకి తెచ్చి ఏ పోలీసు అధికారుల హక్కుల కోసమైతే గళమెత్తిందో, వారితోనే అక్రమ కేసు నమోదు చేయడం ప్రభుత్వ బరితెగింపునకు నిదర్శనం. అది కూడా రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జనుకుల శ్రీనివాస్‌తో ఫిర్యాదు చేయించి మరీ అక్రమ కేసు పెట్టడం గమనార్హం.

- రాష్ట్రంలో డీఎస్పీలకు ఏఎస్పీలుగా పదోన్నతి కల్పించేందుకు ప్యానల్ కాలపరిమితి ఆగస్టు 31తో ముగిసింది. అయినా, పదోన్నతులు ఇవ్వకపోవడంతో డీఎస్పీలు తీవ్రంగా నష్టపోయారు. కొందరు గత నెల 31న రిటైరయ్యారు. ప్యానల్ ఏర్పాటు చేసి పదోన్నతులు కల్పించేసరికి మరికొందరు రిటైరవుతారు. భారీగా ముడుపులు ఇవ్వలేదనే తమకు పదోన్నతులు ఇవ్వలేదని పలువురు డీఎస్పీలు వాపోయారు. ''పోలీసు శాఖ క్రమశిక్షణను గౌరవిస్తూ బహిరంగంగా మాట్లాడలేకపోతున్నాం. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రకటనలు జారీ చేయలేకపోతున్నాం. నిరసన వ్యక్తం చేయలేకపోతున్నాం. అదే ఆర్టీసీ ఉద్యోగులు పదోన్నతుల కోసం కొంతకాలంగా గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. సీఎం చంద్రబాబునూ కలిశారు. పోలీసులం అయినందున మేం అడగలేకపోతున్నాం''అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని ''సాక్షి''వెలుగులోకి తెచ్చింది. వారి ఆవేదనను గుర్తించి, పదోన్నతులకు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, ఉన్నతాధికారులు అందుకు విరుద్ధంగా ''సాక్షి''పై అక్రమ కేసులతో కక్షసాధింపునకు దిగడం విస్మయపరుస్తోంది.



- జనుకుల శ్రీనివాస్‌తో ఇప్పించిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి స్టేషన్‌లో.. సాక్షి పత్రికపై అక్రమ కేసు బనాయించారు. బీఎన్ఎస్ సెక్షన్లు 61(2), 196(1), 353(2) కింద సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై క్రైమ్ నంబరు 543/ 2025 కింద సోమవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

అక్కసుతోనే వరుసగా అక్రమ కేసులు

- గత ఏడాది అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చంద్రబాబు ప్రభుత్వం... ''సాక్షి''మీడియాపై అక్రమ కేసులతో విరుచుకుపడుతోంది. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట యథేచ్ఛగా సాగిస్తున్న అరాచకాన్ని ప్రశ్నిస్తుండడంతో గొంతు నొక్కే కుట్ర పన్నుతోంది. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ అక్రమ కేసులు బనాయించడంపై కోర్టులు తప్పుపడుతున్నా ప్రభుత్వం తీరు మారడం లేదు. పత్రికలు, మీడియా, సోషల్ మీడియా, కళారూపాలతో భావ ప్రకటన విషయంలో వచ్చే ఫిర్యాదుపై కేసుల నమోదు విషయంలో పాటించాల్సిన ప్రమాణాలను హైకోర్టు ఇటీవల స్పష్టం చేసింది. పోలీసు శాఖతో పాటు జిల్లా మేజిస్ట్రేట్లకు స్పష్టమైన మార్గదర్శకాలు నిర్దేశించింది. అయినా, రాష్ట్ర పోలీసు శాఖ వైఖరిలో మార్పు రావడం లేదు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని ఎత్తిచూపుతున్న ''సాక్షి''ని అక్రమ కేసులతో వేధించడమే పనిగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే పోలీసులు ఎలాంటి నోటీసులు లేకుండా... ''సాక్షి''ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డి నివాసంలో తనిఖీల పేరుతో హల్‌చల్ చేశారు. ఓ ఎడిటర్ నివాసంలో సోదాల పేరిట వేధింపులకు దిగడం తెలుగు రాష్ట్రాల్లో అదే తొలిసారి కావడం గమనార్హం.
- గత ఏడాది విజయవాడను వరదలు ముంచెత్తిన సమయంలో బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యాలను నిలదీసినందుకు కూడా ''సాక్షి''పై పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తను తెలంగాణలో దారుణంగా హత్య చేసిన ఉదంతాన్ని ప్రచురించినందుకు, కర్నూలు జిల్లాలో ప్రభుత్వ టీచర్ కుటుంబం కిడ్నాప్ ఉదంతాన్ని వెలుగులోకి తెచ్చినందుకు, అదే జిల్లాలో ఓ ఐపీఎస్ అరాచకాలను ఎండగట్టినందుకు అక్రమ కేసులు నమోదు చేసి ''సాక్షి''పత్రిక గొంతు నొక్కేందుకు యత్నించారు.
- బాలికపై అత్యాచారం చేసిన దారుణాన్ని ప్రశ్నించినందుకు సాక్షి టీవీపై అక్రమ కేసు నమోదు చేయడం విభ్రాంతి కలిగించింది. ఇటీవలి భారీ వర్షాలకు రాజధాని ప్రాంతం ముంపునకు గురైందని వీడియో ఆధారాలతో సహా ప్రసారం చేసిన సాక్షి టీవీపై కూడా అక్రమ కేసు నమోదు చేయడం గమనార్హం. తాజాగా డీఎస్పీలకు పదోన్నతులు కల్పించకుండా అన్యాయం చేస్తుండడంపై సాక్షి కథనం ప్రచురించడంపైనా ప్రభుత్వం కక్ష సాధింపునకు తెగబడింది.

"సాక్షి"అక్రమ కేసులు.. పత్రికా స్వేచ్ఛకు విఘాతం

పత్రికలపై ప్రభుత్వ వేధింపులు, అక్రమ కేసులు నమోదు చేయడాన్ని పాత్రికేయ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. రాష్ట్రంలో భావ ప్రకటనా స్వేచ్ఛను హరించేందుకు ప్రభు త్వం యత్నిస్తోందని విమర్శించాయి. ప్రభుత్వ కక్షసాధింపు చర్యలపై సమష్టిగా పోరాడతామని ప్రకటించాయి.

‘భూదాన్’ కేసులో ఈడీ దర్యాప్తు ముమ్మరం

నాగారం సర్వే నంబర్ 181 భూముల కేసులో రూ.4.80 కోట్ల విలువైన ఆస్తుల జప్తు

సాక్షి, హైదరాబాద్: భూదాన్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు వేగవంతం చేసింది. భూదాన్ భూములను ఫోర్జరీ డాక్యుమెంట్లతో విక్రయించిన కేసులో మహ్మద్ మునావర్‌ఖాన్ అతని భార్య షైకా తహాఖాన్‌కు చెందిన శంషాబాద్, బంజారాహిల్స్, టోలిచౌకిలోని రూ.4.80 కోట్ల విలువైన స్థిరాస్తులను జప్తు చేసింది. ఈ మేరకు హైదరాబాద్ జోనల్ ఈడీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అందులో పేర్కొన్న వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా మహేశ్వ రం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్ 181లో ఉన్న ప్రభుత్వ భూమి, భూదాన్ భూములను తమ పూర్వీకుల ఆస్తిగా పేర్కొంటూ ఖదీర్ ఉన్నిస్సా, ఆమె కుమారుడు మహ్మద్ మునావర్‌ఖాన్‌లు ఫోర్జరీ డాక్యుమెంట్లతో రెవెన్యూ రికార్డులు తయారు చేశారు. కొంతమంది ప్రభుత్వ అధికారులతో కలిసి ఫోర్జరీ, భూమి రెవెన్యూ రికార్డులను మార్చారు. ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఆ తర్వాత మధ్యవర్తుల ద్వారా విక్రయించి ఖాదర్ ఉన్నిస్సా, మునావర్‌ఖాన్ రూ.6.45 కోట్లు ఆర్జించారు. ఈ డబ్బుతో మునావర్.. తన భార్య పేరున స్థిరాస్తులను కొనుగోలు చేశారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా విక్రయించడం, ఫోర్జరీ, ప్రభుత్వ రెవెన్యూ రికార్డులను తారుమారు చేయడం వంటి ఆరోపణలపై 2023లో మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు ఆధారంగా పీఎంఎల్ఏ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్) కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఖదీర్ ఉన్నిస్సా, మహ్మద్ మునావర్‌ఖాన్ సహా పలువురు ప్రైవేట్, ప్రభుత్వ అధికారుల ఆస్తులపై విచారణ జరిపింది. రూ.4.80 కోట్ల విలువ చేసే ఆస్తులను అటాచ్‌మెంట్ చేసింది.

చనిపోయాడనుకున్న వ్యక్తి బతికాడు

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దండ వేస్తుండగా శరీరంలో కదలిక
- వెంటనే ఆస్పత్రికి తరలింపు.. ప్రాణాలతో బయటపడిన వైనం



తైలం రమేశ్



రమేశ్‌కు పూలమాల వేసి రోదిస్తున్న కుటుంబసభ్యులు

వనపర్తి రూరల్: చనిపోయాడనుకున్న వ్యక్తి.. లేచి కూర్చున్న సంఘటన వనపర్తి జిల్లాకేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన సోమవారం వైరల్‌గా మారింది. వనపర్తి పట్టణానికి చెందిన తైలం రమేశ్ తెలంగాణ ఉద్యమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెంట ఉండి పనిచేశాడు. ఆయనకి వీరాభిమానిగా మారాడు. ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లి ఇటీవలే వినాయకచవితికి వనపర్తికి వచ్చాడు. శనివారం రాత్రి ఇంట్లో నిద్రపోయిన రమేశ్.. ఆదివారం ఉదయం కుటుంబసభ్యులు లేపేందుకు ప్రయత్నించగా ఉలుకూపలుకూ లేకుండా ఉండిపోయాడు. దీంతో చనిపోయాడనుకొని కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేశారు. తన అభిమాని చనిపోయాడని తెలుసుకున్న నిరంజన్‌రెడ్డి రమేశ్‌ను కడచూపు చూసేందుకు ఆయన ఇంటికి వెళ్లాడు. పూలమాల వేసే సమయంలో రమేశ్ శరీరంలో కదలిక ఉన్నట్లు గుర్తించి రమేశ్.. రమేశ్ అని గట్టిగా పిలవడంతో మరింత కదిలాడు. వెంటనే ఆయన్ను జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి లోబీపీ వల్ల అస్వస్థతకు గురయ్యాడని బతికే ఉన్నట్లు తెలిపారు. డాక్టర్ల సూచన మేరకు నిమ్స్‌కు తరలించగా.. అక్కడే చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఉదయం నిరంజన్‌రెడ్డికి ఫోన్ చేసి తాను బాగానే ఉన్నట్లు రమేశ్ చెప్పాడు.

ఇకపై డిజిటల్‌గానే కాంపా ఏపీవో ఆమోదం

సాక్షి, హైదరాబాద్: అటవీ శాఖ పరిధిలోని ప్రత్యామ్నాయ అటవీకరణ నిధి నిర్వహణ, ప్రణాళిక (కాంపెన్సటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ–కాంపా)కు సంబంధించి అన్నిరాష్ట్రాలు డిజిటల్ కాంపా అన్యూవల్ ప్లాన్ ఆపరేషన్స్ (ఏపీవో) ప్లాట్‌ఫామ్ ద్వారా డిజిటల్ పద్ధతిలో సమర్పించాల్సి ఉంటుందని నేషనల్ కాంపా అథారిటీ జాయింట్ సీఈవో నిషాంత్ వర్మ వెల్లడించారు. సోమవారం నగరంలో డిజిటల్ కాంపా కార్యక్రమాన్ని ప్రారంభించిన తెలంగాణ పీసీసీఎఫ్ డా.సి. సువర్ణ మాట్లాడుతూ కాంపా వార్షిక ప్రణాళికలను డిజిటల్ రూపంలో సమర్పించినందువల్ల కేంద్ర పర్యావరణ శాఖ త్వరితగతిన అనుమతులను ఆమోదిస్తుందన్నారు. ఈ కార్య క్రమంలో నేషనల్ కాంపా సీనియర్ కన్సల్టెంట్ నిశీత్ సక్సేనా, ప్రియాంక వర్గీస్ పాల్గొన్నారు.

ఐసెట్ తొలిదశ కౌన్సెలింగ్‌లో 27,104 సీట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: ఐసెట్ తొలి దశ కౌన్సెలింగ్ ద్వారా 27,104 సీట్లు భర్తీ చేసినట్టు కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ దేవసేన తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కలిపి మొత్తం 77 కాలేజీలు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నాయన్నారు. వీటి పరిధిలో 27,904 ఎంబీఏ, 6,874 ఎంసీఏ సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

అర్ధరాత్రి ఆర్తనాదాలు

- ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు
- నలుగురు మృతి..ఐదుగురికి గాయాలు
- మహబూబ్‌నగర్ జిల్లా కాటవరం స్టేజీ వద్ద ఘటన



ప్రమాదానికి గురైన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, ట్రెయిలర్ లారీ

మహబూబ్‌నగర్ క్రైం/అడ్డాకుల: హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూర్‌కు వెళుతున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఓ లారీని ఢీకొట్టడంతో నలుగురు మృత్యువాతపడగా.. మరో ఐదుగురు గాయపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కాటవరం స్టేజీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. అడ్డాకుల ఎస్ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. ఏఆర్ 01టీ7676 నంబర్ కలిగిన బీసీపీఆర్ ట్రావెల్ బస్సు 32 మంది ప్రయాణికులతో ఆదివారం రాత్రి 12 గంటలకు హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూర్‌కు బయలుదేరింది. అడ్డాకుల మండలం కాటవరం స్టేజీ దగ్గర సోమవారం తెల్లవారుజామున 2.45 గంటల ప్రాంతంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ట్రావెల్ బస్సు వేగంగా ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు వరసలో కూర్చొన్న ప్రొద్దుటూర్‌కు చెందిన హసన్ (39), నంద్యాలకు చెందిన హాస్రప్ ఉన్నీసా (70), ప్రొద్దుటూర్ మండలం కమలాపురానికి చెందిన ఎల్లమ్మ (39) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నంద్యాల జిల్లా గోస్‌పాడ్‌కు చెందిన సుబ్బరాయుడు (55)ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాయపడిన నంద్యాలకు చెందిన సురేశ్‌రెడ్డి, హైదరాబాద్ కేపీహెచ్ కాలనీకి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, ప్రొద్దుటూర్‌కు చెందిన రఘునీ, అలగడ్డకు చెందిన ఓబులేష్, హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన శ్రీనివాసరావును చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఓబులేష్ చికిత్స పొందుతుండగా.. మిగిలిన వారిని డిశ్చార్జ్ చేశారు.



సుబ్బరాయుడు



హాస్రప్ ఉన్నీసా



హసన్

అనాథగా మారిన పదేళ్ల బాలుడు

ప్రొద్దుటూర్ మండలం కమలాపురం గ్రామానికి చెందిన మృతురాలు ఎల్లమ్మ భర్త ఇటీవల చనిపోగా.. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ఓ హోటల్‌లో దినసరి కూలీగా పనిచేస్తోంది. తన పదేళ్ల కొడుకు సంతోష్‌తో కలిసి హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూర్‌కు బస్సులో బయలుదేరింది. రోడ్డు ప్రమాదంలో ఎల్లమ్మ మృతి చెందడంతో సంతోష్ అనాథగా మారాడు.



సంతోష్


సాక్షి కరీంనగర్

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025

పేదల పెన్నిధి 'వైఎస్సార్'

- సాగునీటి ప్రాజెక్టులు, ఉన్నత విద్య రాజన్న చలువే
- నేడు దివంగత మహానేత వర్ధంతి

కరీంనగర్: వైఎస్సార్.. పేదల పెన్నిధిగా పేరుగాంచారు. ఆయన మననుంచి దూరమై ఏళ్లు గడుస్తున్నా.. అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతిఇంటికీ చేరాయంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ఆయన చేసిన కృషి అమోఘం. 2004–2009 కాలంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధికి రూ.వేల కోట్లు కేటాయించారు. విద్య, వైద్యం, సాగునీటి ప్రాజెక్టులకు ఆయన ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు. నేడు ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించుకునేందుకు అభిమానులు సిద్ధమవుతున్నారు.



న్యూస్‌రీల్

హెల్త్ సెంటర్‌ను ప్రభుత్వ భవనంలోకి మార్చాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌కార్పొరేషన్: సప్తగిరికాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ భవనంలోకి మార్చాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ భవనాన్ని పరిశీలించారు. విశాలంగా ఉన్న ఈ భవనంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, శుక్రవారం సభ నిర్వహించాలని సూచించారు. డీఎంహెచ్‌వో వెంకటరమణ, మాజీ కార్పొరేటర్ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

గడువులోగా పూర్తిచేయాలి

కరీంనగర్అర్బన్: ప్రభుత్వ పథకాలను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. 15 ఏళ్లు నిండిన బాలికలు, 50 ఏళ్లు పైబడిన మహిళలు, దివ్యాంగులను స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల ముఖ గుర్తింపు హాజరును ఉపాధ్యాయుల సాధారణ సెలవులతో సోమవారం నుంచి లింక్ చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు అన్ని ప్రభుత్వ వసతి గృహాలను సందర్శించి వసతులు, సౌకర్యాల నివేదిక సమర్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

ఆడిటోరియం పనుల పరిశీలన

కలెక్టరేట్ ఆడిటోరియంలో జరుగుతున్న ఆధునికీకరణ పనులను కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

మండపాల వద్ద ప్రత్యేక నిఘా



కరీంనగర్‌క్రైం: మహిళలు, యువతులు, బాలికల భద్రతకు వినాయక మండపాలు, ఊరేగింపుల వద్ద షీ టీంలు ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు సీపీ **గౌస్ ఆలం, సీపీ** గౌస్ ఆలం పేర్కొన్నారు. వినాయక నవరాత్రుల్లో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, అభ్యంతరకర ఫొటోలు, వీడియోలు తీసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వేధింపులకు గురైనప్పుడు విద్యార్థినులు, మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. కాలేజీలు, పాఠశాలల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పని ప్రదేశాల్లో వేధింపులు, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా వేధింపులకు గురైనప్పుడు నేరుగా సంప్రదించలేనివారు 87126 70759 నంబర్‌కు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆగస్టులో అందిన ఫిర్యాదుల ఆధారంగా 4 క్రిమినల్ కేసులు నమోదు చేయగా, 10 మందికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. 70 హాట్‌స్పాట్‌లలో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు 30 మంది పోకిరీలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వెల్లడించారు.

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా లింగారెడ్డి



లింగారెడ్డితో అధికారులు, ఉద్యోగులు

కరీంనగర్అర్బన్: జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి(డీవీహెచ్‌వో)గా డా.నల్ల లింగారెడ్డి నియమితులయ్యారు. సుధాకర్ ఇటీవల ఉద్యోగ విరమణ చేయగా లింగారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణ కేంద్రం ఏడీగా వ్యవహరిస్తున్న లింగారెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించింది. కాగా సోమవారం బాధ్యతలు స్వీకరించగా పశుసంపద వృద్ధి, పాడి రైతులకు సత్వర సేవలందించేందుకు కృషి చేస్తానని లింగారెడ్డి తెలిపారు. ఏడీహెచ్‌లు వినోద్ కుమార్, రామస్వామి, మహేందర్, సూపరింటెండెంట్లు గూడ ప్రభాకర్‌రెడ్డి, జగన్, డాక్టర్లు కోటేశ్వర్‌రావు, దివ్య, సాయిచైతన్య, సురేందర్‌రెడ్డి, భారతి, అరవింద్‌రెడ్డి, సుష్మిత, శశికాంత్, సాంబరావు, మనోహర్, కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

కునుకే బంగారమాయేనే..!

సాక్షి స్పెషల్ స్టోరీ

- నిద్ర కరువు.. బతుకు బరువు
- కుంగుబాటు, ఒత్తిడి ఆందోళనకు ప్రధాన కారణం
- ఆధునిక జీవనశైలితో వెంటాడుతున్న నిద్రలేమి
- కష్ట జీవుల్లో పెరుగుతున్న సమస్యలు



కరీంనగర్‌టౌన్/హుజూరాబాద్: నిద్ర చోటెరగదు అంటారు. దానిని ఆపడం ఎవరితరమూ కాదు. మహాఅయితే ఒకరోజు ఆపగలమేమోగానీ.. కునుకు తీయకుండా మాత్రం ఉండలేం. అయితే.. మారిన జీవన విధానాలు, చుట్టుముడుతున్న ఆర్థిక, కుటుంబ సమస్యల మధ్య యువత, వృద్ధుల్లో కంటినిండా నిద్ర కరువవుతోంది. ముఖ్యంగా మధ్య వయస్కులు పగలంతా కష్టం చేసి రాత్రి అయ్యాక కంటినిండా నిద్రపోవడం ఒక కలగా మారుతోంది. నిద్రలేమితో బాధపడుతున్నారు. దీనికి అనేక కారణాలు ఉండొచ్చు. వీటిలో ప్రధానమైనవి కుటుంబ సభ్యుల మధ్య సయోధ్య లేకపోవడం, యాంత్రిక జీవనం, మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు, మద్యం సేవించడం, ఇతర సమస్యలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

కారణాలు ఎన్నో..



- వృత్తి, వ్యక్తిగతంగా చాలామంది ఒత్తిడికి గురవుతుంటారు. ఆందోళన ఎక్కువై కునుకు రావడంలేదు. కొందరిలో జీవనశైలి మార్పులతోనూ ఈ ఇబ్బంది ఎదురవుతోంది.



- రాత్రి ఆలస్యంగా భోజనం చేయడం, ఎక్కువగా తినడం వల్ల పొట్టలో అసౌకర్యం, గ్యాస్ సమస్యతో నిద్రపట్టదు. కొందరికి పగటి నిద్ర అలవాటు. దీంతో రాత్రి నిద్రపట్టదు.



- కుంగుబాటు, రక్తపోటు, నొప్పి నివారణ, బరువు తగ్గించే మందులు నిద్రకు ఆటంకం కలిగిస్తాయి. ఏదైనా తీవ్రమైన సంఘటన జరిగితే మానసిక ఆందోళనతో నిద్రరాదు.



- అధిక బరువుతో గురక(స్లీప్ అప్నియా) నిద్రలేమికి కారణమవుతుంది.



- స్మోకింగ్, ఆల్కాహాల్ అలవాటు నిద్రలేమిని మరింత ఎక్కువ చేస్తాయి. ఆల్కాహాల్ తీసుకున్న తర్వాత కొద్ది గంటలు నిద్రపట్టినట్లు ఉంటుంది. కానీ.. మత్తు వదిలిన తర్వాత నిద్రపట్టదు.

నిద్రలేమితో సమస్యలివీ..

- ఏకాగ్రత, జ్ఞాపకశక్తి లోపించడం, చురుకుదనం తగ్గడం
- రోడ్డు ప్రమాదాలకు గురికావడం
- చిరాకు, కోపం, పనులపై దృష్టి కోల్పోవడం
- రక్తపోటు, గుండెజబ్బులకు దారితీయడం
- తలనొప్పి, కండరాల నొప్పి
- జీవనక్రియ లోపాలు, హార్మోన్ల అసమతుల్యత
- బరువు పెరగడం, మానసిక రుగ్మతలు, రోగ నిరోధకశక్తి తగ్గిపోవడం

ఏం చేయాలి?

- బరువును నియంత్రణలో పెట్టుకోవడం
- రోజూ ఒకే సమయానికి పడుకోవడం, లేవడం చాలా ప్రధానం
- మంచి నిద్ర కోసం పడకగదిని సౌకర్యంగా ఉండేలా చూసుకోవాలి
- నిద్రపోయే సమయానికి గంట ముందు సెల్ ఫోన్‌లు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు కట్టేయాలి
- సంగీతం వినాలి, పుస్తకాలు చదవాలి. పర్యాటక ప్రాంతాలకు వెళ్లడం, నచ్చిన వారితో గడపటం లాంటి చర్యలతో ఒత్తిడి, ఆందోళన నుంచి బయట పడొచ్చు.



- వ్యాయామంతో మంచి నిద్ర పడుతుంది. రోజూ కనీసం గంటపాటు నడక, ఈత, సైక్లింగ్ లాంటివి చేయాలి.
- కుటుంబ సంబంధాలు సరిగా ఉండడమూ ముఖ్యమే. భార్యాభర్తలు ఇద్దరూ పనిచేస్తే.. ఇంటి పనిలో ఇద్దరూ భాగస్వామ్యం తీసుకోవడం వల్ల ఒక్కరిపైనే ఒత్తిడి పడకుండా ఉంటుంది.

6–8 గంటలు నిద్రించాల్సిందే..

ఒక్కోసారి విపరీత నిర్ణయాలు తీసుకునేందుకు నిద్రలేమి కూడా ఒక కారణమని చెబుతున్నారు. తాజాగా కరీంనగర్‌లోని ఓ యువకుడు నిద్రలేమికి చికిత్స తీసుకుంటూ అపస్మారక స్థితికి చేరుకొని ఆస్పత్రి పాలయ్యాడు. ప్రతీ వ్యక్తికి రోజూ 6–8 గంటలపాటు నాణ్యమైన నిద్ర అవసరమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

పురుషులే అధికం

మహిళ, పురుషుల్లో గమనిస్తే పురుషులు 81 శాతం మంది కనీసం 6 గంటలు కూడా నిద్రపోలేకపోతున్నట్లు తెలుస్తోంది. అదే మహిళల విషయానికి వస్తే 60 శాతం మంది 6 గంటలలోపు నిద్రపోతున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక, కుటుంబ, ఉద్యోగపరమైన ఒత్తిళ్లతో పురుషులు అధిక ఒత్తిడికి లోనవుతున్నట్లు తెలుస్తోంది.



ఉరుకులు పరుగుల జీవితం



వ్యాపారంలో ఉన్న పోటీని తట్టుకొని నిలబడాలంటే కష్టమర్ల అభిరుచికి అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులు చేయాల్సి వస్తుంది. దీంతో తీవ్ర ఒత్తిడి పెరుగుతుంది. ఒత్తిడిని తట్టుకొని పనిచేయడం వల్ల లేనిపోని సమస్యలు తలెత్తుతున్నాయి.

– వెన్నం శ్రీనివాస్, వ్యాపారి, కరీంనగర్

ఆందోళనలు పక్కనపెట్టాలి



అనవసరపు ఆందోళనలు పక్కన బెట్టి నిద్ర కోసం ఉపక్రమించాలి. మంచి నిద్ర ఉంటేనే తెల్లవారి బ్రెయిన్ చురుకుగా ఉండి పనులు చేసుకోవచ్చు. నిద్రపోయే ముందు 15 నిమిషాల పాటు కళ్లు మూసుకొని ఏకాగ్రతతో ఉంటే నిద్ర ఉపక్రమిస్తుంది.

– వర్షి, మానసిక వైద్యనిపుణులు, హుజూరాబాద్

ఒత్తిడే ప్రధాన సమస్య



సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అంటే ఏసీ గదుల్లో పనిచేస్తున్నామనే ఆనందమే తప్ప మానసికంగా తీవ్ర ఒత్తిడి ఉంటుంది. వారంవారం షిఫ్టులు మారినప్పుడు నిద్రలేమి సమస్యలు వస్తాయి. కూర్చొని పనిచేయడం వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడుతుంటాయి.

– జి.సంతోషిణి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

మెదడు పనితీరు తగ్గుతుంది



నిద్రలేమి వల్ల మెదడు పనితీరు తగ్గిపోయి మతిమరుపు, ఏకాగ్రత లోపం, నిర్ణయాలు తీసుకోవడంలో గందరగోళం ఏర్పడుతుంది. ఇమ్యూనిటీ దెబ్బతినడంతో వైరల్స్, బాక్టీరియా వ్యాధులపై శరీరం పోరాడే శక్తి కోల్పోతుంది. రోజూ కనీసం 7–8 గంటలు ప్రశాంతమైన నిద్రపోవడం తప్పనిసరి చేసుకోవాలి.

– డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, క్రిటికల్‌కేర్ నిపుణులు

'పరిషత్' ఎన్నికలకే మొగ్గు

- 6న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓటర్ల ముసాయిదా
- 10న తుది జాబితా విడుదల



జెడ్పీ కార్యాలయం

కరీంనగర్: స్థానిక సంస్థల ఎన్నికలు ఈనెల 30లోగా నిర్వహించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించడంతో ఆ దిశగా కసరత్తు మొదలైంది. మొదట పరిషత్, తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం తలమునకలైంది. ఇందులో భాగంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించి వాటిపై అభ్యంతరాలు స్వీకరించి, తుది జాబితా ప్రదర్శనకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జెడ్పీ సీఈవోలు ఆయా మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 6న జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాలను జెడ్పీ, మండల పరిషత్తులలో ప్రదర్శించాలని ఆదేశాలు అందాయి. 8న జిల్లా, మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని ఎన్నికల సంఘం సూచించింది. వాటిపై అభ్యంతరాలుంటే 8 వరకు లిఖిత పూర్వకంగా దరఖాస్తుకు అవకాశం కల్పించారు. వాటిని 9లోగా పరిష్కరించి, 10న తుది జాబితా ప్రదర్శించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో పల్లెల్లో రాజకీయ సందడి నెలకొంది.

పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు



ధర్నా చేస్తున్న టీఎన్‌జీవోస్ ఉద్యోగులు

కరీంనగర్ అర్బన్: పెన్షన్ భిక్ష కాదు అని ఉద్యోగుల హక్కు అని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పెన్షన్ విద్రోహక దినం సందర్భంగా రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలు, టీషర్ట్‌లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం దశాబ్దాల తరబడి అహర్నిశలు శ్రమించే ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వరా అని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల జీవితం బజారున పడడమే కాకుండా దాచుకున్న డబ్బు, మెడికల్, జీపీఎఫ్ బిల్లులు తదితర వాటి కోసం ధర్నాలు చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందన్నారు. ఇలాగే కొనసాగితే ఏ ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళిచరణ్‌గౌడ్, టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, గెజిటెడ్ అధికారుల జిల్లా కార్యదర్శి అరవింద్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెండ్యాల కేశవరెడ్డి, లింగయ్య, టీచర్ల సంఘం నాయకులు రఘుశంకర్‌రెడ్డి, రవీంద్రచారి, కరుణాకర్‌రెడ్డి, టీఎన్జీవోల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వాణి.. పరిష్కరించాలని

- ప్రజావాణికి వినతుల వెల్లువ
- ఒక్కొక్కరిది ఒక్కో సమస్య

మొత్తం అర్జీలు: 269
ఎక్కువగా మునిసిపల్ కమిషనర్: 57
వారధి సొసైటీ: 21, డీపీవో: 15
ఆర్డీవో కరీంనగర్: 15
తహసీల్దార్ గంగాధర: 12
తహసీల్దార్ మానకొండూరు: 11
సీపీ ఆఫీస్: 08



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, అధికారులు

కరీంనగర్ అర్బన్: సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ప్రజావాణిని ఆశ్రయించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో అత్యధికం వచ్చిన ఫిర్యాదులే మళ్లీ మళ్లీ రావడం విశేషం. సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించామని కాగితాల్లో చూపుతుండగా ఆచరణలో మాత్రం విరుద్ధ పరిస్థితి అని అర్జీదారులు వాపోతున్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, నివేసన స్థలాలు, పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు రాగా పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు కలెక్టర్ పమేలా సత్పతి చొరవ చూపారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీకిరణ్, అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు అర్జీలను స్వీకరించారు. మొత్తం 269 దరఖాస్తులు వచ్చాయని కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురిని 'సాక్షి' పలకరించగా తమ ఆవేదనను వివరించారు. వివరాలు వారి మాటల్లోనే..

దర్జాగా బేస్‌మెంట్ నిర్మాణం



గ్రామ ప్రజల సౌకర్యార్థం నల్లాల బావి వద్దకు వెళ్లేందుకు 2007లో గ్రామ సభ తీర్మానం చేసి 20 ఫీట్ల దారి తీశారు. 4ఫీట్ల డ్రైనేజీ నిర్మించారు. మహేశ్ అనే వ్యక్తి డ్రైనేజీని పూడ్చివేసి రోడ్డుకు అడ్డంగా బేస్‌మెంట్ నిర్మించాడు. దీంతో నీరు నిలిచి, దోమలు పెరిగి దుర్వాసన వెదజల్లుతోంది. సదరు నిర్మాణాన్ని కూల్చేలా చర్యలు చేపట్టండి.

– మోతె గ్రామస్తులు, రామడుగు

ఐదేళ్లుగా తిరుగుతున్నా..



భర్త రామకృష్ణ వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. 2019లో రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మృతిచెందాడు. కుటుంబ పోషణ భారంగా ఉంది. కూలీ పనులు చేసుకుంటూ కూతురిని చదివిస్తున్న. వితంతు పింఛన్ కోసం ఐదేళ్లుగా తిరుగుతున్నా. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

– రజిత, కరీంనగర్

పాస్‌బుక్ ఇవ్వలే



ఆరెపల్లిలో మా అమ్మ పేరున సర్వే నంబర్ 364/ఆ లో 22 గుంటలన్నర ఉండగా, తండ్రి పేరున 365, 366 సర్వే నంబర్లలో 23 గుంటల భూమి ఉంది. సదరు భూమికి సంబంధించి మా పేరున ప్రొసీడింగ్ బి/1259/2020 ఇచ్చారు. కానీ ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. పాస్‌బుక్ రాలేదు. భూభారతిలో దరఖాస్తు ఇచ్చినా మా సమస్య పరిష్కారం కాలేదు.

– రామచంద్రం, మహేశ్, ఆరెపల్లి, కరీంనగర్

పద్మనగర్ జంక్షన్ పనుల్లో అక్రమాలు



పద్మనగర్ జంక్షన్ పనుల్లో విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడ్డారు. ఎటువంటి వర్క్ స్లిప్ లేకుండా సరైన ఎస్టిమేట్ లేకుండా పనులు చేశారు. సరైన అంచనాలతో అప్రూవల్ తీసుకుని పనులు ప్రారంభించాలి కానీ అవేవీ లేవు. మాధవ కన్‌స్ట్రక్షన్ చేపట్టిన పనులపై అనేక ఫిర్యాదులుండగా మళ్లీ వారికే పనులు అప్పగించడమేంటీ.? పనులకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోండి.

– బండారి వేణు, మాజీ కార్పొరేటర్, కరీంనగర్



చొప్పదండి పీఏసీఎస్ వద్ద రైతులు



చిగురుమామిడిలో..



శంకరపట్నం: ముత్తారంలో మహిళారైతుల క్యూ



తిమ్మాపూర్: వర్షంలో పడిగాపులు

తప్పని నిరీక్షణ

చొప్పదండి/చిగురుమామిడి/శంకరపట్నం/తిమ్మాపూర్: రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. వేకువజాము నుంచే కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నారు. సోమవారం చొప్పదండి పీఏసీఎస్‌కు 1,120 బస్తాలు రాగా ఈపాస్ యంత్రంలో వివరాలు నమోదు చేసిన అనంతరం రైతుల మొబైల్‌కు ఓటీపీ వచ్చాక పంపిణీ చేశారు. ఈ విధానంతో పంపిణీ ఆలస్యం అవుతోంది. చిగురుమామిడి పీఏసీఎస్‌లో 250 మందికి 500 బస్తాలు అందజేశారు. బస్తాలు దొరకని రైతులు సింగిల్‌విండో ఎదుట కరీంనగర్–హుస్నాబాద్ రహదారిపై ధర్నా చేపట్టారు. సీఐ సదన్‌కుమార్, ఎస్సై సాయికృష్ణ రైతులను సముదాయించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో 'గణపతి బొప్పామోరియా.. మాకు కావాలి యూరియా' అంటూ నినాదాలు చేశారు. ముత్తారంలో మహిళా రైతులు సైతం క్యూకట్టారు. సుమారు 400 మంది క్యూ కట్టడంతో తోపులాడుకున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ సొసైటీ వద్ద ఆదివారం రాత్రి నుంచే క్యూకట్టారు. మన్నెంపల్లి గోదాం వద్ద సైతం రైతులు వర్షంలో తడుస్తూ నిరీక్షించారు.

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో మహిళారైతు దుర్మరణం

• వెల్దుర్తిలో విషాదం


రాజవ్వ మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన పెంట రాజవ్వ (60) సోమవారం తన పంట చేను వద్ద విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. రాజవ్వ ఉదయం గ్రామ శివారులోని మొక్కజొన్న చేను వద్ద పిట్టలు కొట్టేందుకు వెళ్లింది. రాత్రి భారీ ఈదురు గాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ వైరు తెగి కిందపడింది. దానిని గమనించకుండా వెళ్లిన రాజవ్వ వైరుపై కాలు పడటంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. రాజవ్వ కుమారుడు పెంట తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి.. కరెంట్ షాక్‌కు గురై..


రవి(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): పెదపల్లి జిల్లా ధర్మారం మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన మేకల రవి(50) ఆదివారం రాత్రి చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మరణించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారంగా.. గ్రామ శివారులోని చెరువు మత్తడి వద్ద చేపలు పట్టేందుకు రవి రాత్రి వెళ్లాడు. మత్తడి సమీపంలోని ఓ రైతు కరెంట్ మోటార్ స్టార్టర్ బాక్స్ నుంచి జే వైరును మత్తడి వరకు తీసుకువెళ్లాడు. వైరును నీటిలో వేసి స్టార్టర్ ఆన్‌చేశాడు. అయితే, ప్రమాదవశాత్తు రవి కుడికాలుకు వైర్‌తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. మృతుడి భార్య సునీత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

కరీంపేట మాజీ సర్పంచ్ మృతి


వెంకట్‌రెడ్డి (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కరీంపేట మాజీ సర్పంచ్ కేతిరి వెంకట్‌రెడ్డి(70) సోమవారం వేకువ జామున మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. వెంకట్‌రెడ్డి 3 పర్యాయాలు సర్పంచ్‌గా, ఒకసారి ఎంపీటీసీగా పని చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సకలజనుల సమ్మె కొనసాగుతుండగా సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళి అర్పించారు.


ఇది సిరిసిల్ల శివారులోని రగుడు వద్ద ఉన్న మున్సిపల్ వాటర్ సరఫరా ఫిల్టర్‌బెడ్. ఇక్కడికి మిషన్ భగీరథ ద్వారా మంచినీరు సరఫరా అవుతుండగా.. ఆ నీటిని మళ్లీ శుద్ధి చేసి వాటర్‌ట్యాంకులకు ఎక్కిస్తున్నారు. అక్కడి నుంచి పట్టణంలోని నల్లాలకు సరఫరా చేస్తున్నారు. నల్లాల ద్వారా మురికినీరు సరఫరా అవుతోంది.


ఇది జిల్లా కేంద్రంలోని అనంత్‌నగర్‌లో నల్లా ద్వారా వస్తున్న మిషన్ భగీరథ నీరు. వారం రోజులుగా నల్లా నీరు మురికిగా వస్తున్నాయి. తాగేందుకు అనువుగా లేవు. మురికితో రావడంతో ఆ నీటిని తాగేందుకు జనం జంకుతున్నారు. నల్లాపైపులు లీకేజీలతో మురికి నీరు కలుస్తుందా.. అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇంట్లో స్నానాలకు, ముఖం కడుక్కునేందుకు, ఇతర అవసరాలకు సైతం మిషన్ భగీరథ నీటిని వాడుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

భగీరథ బురద నీరు

• నల్లాల్లో మురికి నీరు సరఫరా
• మధ్యమానేరు ఫిల్టర్‌బెడ్ చుట్టూ వరదనీరు
• క్లోరినేషన్ చేసినా శుద్ధికాని వైనం
• ఆ నీరు తాగొద్దు.. మిషన్ భగీరథ ఈఈ అన్వర్

మిషన్ భగీరథ స్వరూపం

మండలాలు	: 12
మున్సిపాలిటీలు	: సిరిసిల్ల, వేములవాడ
ఆవాస ప్రాంతాలు	: 359
తాగునీరు పొందే జనాభా	: 6 లక్షలు
నల్లాలు	: 1,26,766
నిర్మాణ వ్యయం	: రూ.1,085 కోట్లు
పైపులైన్ పొడవు	:1,263.77 కిలోమీటర్లు
నీళ్ల ట్యాంకులు	: 625
పాత నీళ్ల ట్యాంకులు	: 378
కొత్తగా నిర్మించినవి	: 247
రోజుకు అవసరమైన నీరు	: 10 కోట్ల లీటర్లు
వినియోగించే మోటార్లు	: 20
అవసరమయ్యే విద్యుత్	: 5.976 మెగావాట్స్
ఆధారం : మధ్యమానేరు జలాశయం	


ఇది మధ్యమానేరు జలాశయంలోని రుద్రవరం వద్ద ఉన్న ఇన్‌టేక్ వెల్. ఇటీవల వర్షాలు, వరదలతో జలాశయంలో పూర్తి స్థాయిలో 26 టీఎంసీలు నిండింది. ఇన్‌టేక్ వెల్ చుట్టూరా వరదనీరు చేరింది. తెల్లగా తేటగా ఉండాల్సిన మధ్యమానేరు జలాశయం నీరు ఇలా ఎర్రగా బురదరంగులోకి మారింది. ఈ నీటిని పంపింగ్ చేస్తూ రాజన్నసిరిసిల్ల జిల్లాలోని అన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ఫలితంగా శుద్ధి చేసినా వరదనీటిలోని బురద వీడడం లేదు.

సిరిసిల్ల: మధ్యమానేరు ఇన్‌టేక్ వెల్ నుంచి నీరు రంగుమారి వస్తోంది. ఆ నీటిని వేములవాడ మండలం అగ్రహారం నీటిశుద్ధి ప్లాంటులో క్లోరినేషన్ చేస్తున్నారు. నీరు ఎర్రగా మురికిగా రావడంతో మిషన్ భగీరథ అధికారులు బ్లీచింగ్, ఆలంతో శుద్ధి చేస్తున్నారు. అయినా శుద్ధికాకుండా రంగు మారి, మురికిగానే ఉంటున్నాయి. అధికారులు మరింత డోస్ పెంచి నీటిని శుద్ధి చేసినా క్లియర్ కావడం లేదు. దీంతో చేసేదేమి లేక నీటిని శుద్ధి చేస్తూ పైపులా ద్వారా పంపిణీ చేస్తున్నారు. నల్లాల ద్వారా ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు వస్తోంది. ఆ నీరు మురికిగా కనిపించడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. మనకు వచ్చే జబ్బుల్లో 90 శాతం మేరకు నీటి ద్వారా వస్తాయని, పరిశుభ్రమైన నీటిని తాగితేనే జబ్బులు రావని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మిషన్ భగీరథ అధికారులు రంగుమారిన నీటిని సరఫరా చేయడంతో అది మంచినీరు.. కాదు.. రోగాలను పెంచే నీరు అన్నట్లుగా మారాయి. భూగర్భ జలాలను తోడే బోరు నీటి కంటే ఉపరితల నీటిని తాగేందుకు వినియోగిస్తే ఆరోగ్యానికి ఎంతో మంచిదని మిషన్ భగీరథను ప్రారంభించారు. కానీ ఆ నీరే కలుషితం కావడం ఆందోళన కలిగిస్తుంది.

మొన్నటి దాకా మంచి నీరు వచ్చింది


మొన్నటి వరకు నల్లాల ద్వారా మంచినీరు వచ్చింది. ఇప్పుడు మురికినీరు వస్తోంది. ఆ నీటిని తాగుదామంటే మనసు ఒప్పడం లేదు. మా రగుడులో అందరి ఇళ్లలోనూ ఇలాగే రంగుమారి వస్తున్నాయి. ఆ నీళ్లు ఎవ్వరూ తాగడం లేదు. పైపులైన్ లీకేజీ అయిందని అనుకున్నాం. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా మంచినీరు సరఫరా చేయాలి.

– గుగ్గిళ్ల కనకయ్య, రగుడు

ఫిల్టర్ వాటర్ తెచ్చుకుంటున్నాం


ఐదు రోజులుగా నల్లాల ద్వారా రంగు మారిన నీరు వస్తుంది. ఆ నీళ్లు ఎవరూ తాగడం లేదు. అంతకుముందు తెల్లగా వచ్చేవి. వానలు పడ్డప్పటి నుంచి నల్లా నీరు మంచిగా వస్తలేదు. మా తండావాసులు వాటర్ ప్లాంటు వద్దకు వెళ్లి ఫిల్టర్ వాటర్ తెచ్చుకుని తాగుతున్నారు. అధికారులు నల్లా నీటిని పరిశీలించి వెంటనే మంచినీరు సరఫరా అయ్యేలా చూడాలి.

– భూక్యా అరుణ, భూక్యాతండా

క్లియర్ అయ్యేంత వరకు తాగొద్దు

భారీ వర్షాలతో మధ్యమానేరులోకి వచ్చిన వరదతో నీరు బురదగా మారింది. ఆ నీటిని సిరిసిల్లలోని 120 ఎంఎల్‌డీ శుద్ధి కేంద్రంలో నిత్యం శుద్ధి చేస్తున్నా క్లియర్ కావడం లేదు. క్లోరినేషన్ చేసినా నీరు పరిశుభ్రం కావడం లేదు. ఐదు రోజుల పాటు, ఆ నీరు క్లియర్ అయ్యేంత వరకు తాగొద్దు. ఇతర అవసరాలకు వినియోగించుకోవాలి. తప్పనిసరైతే కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

– ఎండీ ముజాహిద్ అన్వర్, మిషన్ భగీరథ ఈఈ, రాజన్న సిరిసిల్ల

బాల భీముడు

• సాధారణ ప్రసవంలో ఆరో సంతానముగా నాలుగుకిలోల శిశువు జననం


నాలుగుకిలోల బరువుగల నవజాత శిశువు

మానకొండూర్: మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారులు రెండు సాధారణ ప్రసవాలు చేశారు. అందులో బిహార్‌కు చెందిన ఓ మహిళకు 6వ సంతానంగా 4 కిలోల బరువున్న మగబిడ్డ జన్మించాడు. వివరాలు.. బిహార్‌కు చెందిన అఖిలేశ్, కాజల్ దేవి దంపతులు కొద్దిరోజులుగా అల్గునూర్ సమీపంలోని కోళ్ల ఫాంలో పని చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఐదుగురు ఆడపిల్లలు సంతానం. గర్భిణి అయిన కాజల్‌దేవికి సోమవారం నొప్పులు రావడంతో మానకొండూర్ పీహెచ్‌సీలో చేర్పించగా, పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆరో సంతానంగా సాధారణ ప్రసవంలో 4 కిలోల బరువున్న బాబు పుట్టడంతో ఆశ్చర్యపోతున్నామని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని డాక్టర్ సల్మాన్ తెలిపారు. మరో కాన్పులో మానకొండూర్‌లో స్వీట్ హౌజ్ నడుపుకుంటున్న రాజస్తాన్‌కు చెందిన ఓ వ్యక్తి కూతురు తార గుర్జార్ మూడున్నర కిలోల మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యాధికారులు తెలిపారు. సీహెచ్‌వో రాజునాయక్, హెల్త్ సూపర్‌వైజర్ జుబేర్, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

కేశవపట్నం పీహెచ్‌సీలో..

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కేశవపట్నం పీహెచ్‌సీలో సోమవారం పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళకు వైద్యులు సాధారణ కాన్పు చేశారు. మండల కేంద్రంలో వినాయక విగ్రహాలు తయారు చేసే లలిత్‌సారంగ్‌కు పురిటినొప్పులు రావడంతో పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు శ్రావణ్‌కుమార్, శ్రావణి సాధారణ కాన్పు చేయగా, 3 కిలోల శిశువు జన్మించాడు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యాధికారి తెలిపారు.

మంథని @ సీబీఐ

• న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు, కాళేశ్వరం ప్రాజెక్టు కేసులు సీబీఐకి
• రాష్ట్రంలో సంచలన సృష్టించిన ఈ కేసులు మంథని ప్రాంతానివే..
• రాజకీయాల్లో చర్చనీయాంశం



సాక్షి పెద్దపల్లి: మంథని అసెంబ్లీ నియోజకవర్గం రాష్ట్రవ్యాప్తంగా మరోసారి సంచలనాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. హైకోర్టు న్యాయవాది గట్టు వామన్‌రామవు దంపతుల హత్యలు, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల లీకేజీలు, నాణ్యతా ప్రమాణాలపై సందేహాలతో మంథని పేరు రాష్ట్రంలోనే మార్మోగింది. ఇటీవల మేడిగడ్డ బ్యారేజీ పగుళ్లు తెరపైకి రావడం.. తాజాగా ఘోష్ కమిటీపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం ఈ కేసును సీబీఐకి అప్పగించనున్నట్లు ప్రకటించడం ప్రకంపనలు సృష్టిస్తోంది. 15రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలో రెండు కేసులను సీబీఐకి అప్పగించడం, ఆ రెండూ మంథని అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించినవే కావడం జిల్లా రాజకీయాలను కుదిపేస్తున్నాయి.

న్యాయవాద దంపతుల హత్య కేసు..

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన గట్టు వామన్‌రావు న్యాయవాద దంపతుల హత్య కేసు నాలుగేళ్ల క్రితం .. 2021 ఫిబ్రవరి 17న రామగిరి మండలం కల్వచర్ల గ్రామ శివారులో జరిగింది. గట్టు వామన్‌రావు, ఆయన భార్య నాగమణిని కొందరు నడీరోడ్డుపై కత్తులతో అత్యంత దారుణంగా హత్యచేశారనే వీడియా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఇది లైవ్‌గా ఉండడంతో రాష్ట్రమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ కేసులో ప్రధాన నిందితులతోపాటు వారికి సహకరించిన ఏడుగురిని పోలీసులు అప్పట్లోనే అరెస్టు చేసి జైలుకు తరలించారు. కొద్దిరోజుల తర్వాత నిందితులు బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చారు. హత్య కేసులో టీఆర్‌ఎస్ నేతకు సంబంధం ఉందంటూ వామన్‌రావు తండ్రి కిషన్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈనేపథ్యంలోనే ఆగస్టు 12న కేసును సీబీఐకి అప్పగించి విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. దీంతో మంథని మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో తెరపైకి వచ్చింది.

కాళేశ్వరంతో ఇంకోసారి..

గత ప్రభుత్వం పెద్దపల్లి జిల్లాలోని మంథని అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి చోటుచేసుకుందని, దానిని తేల్చేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను వేసింది. తాజాగా కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టగా కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలు, ప్రజాధనం దుర్వినియోగం, అవినీతి ఆరోపణలపై విచారణకు సీబీఐకు అప్పగిస్తూ ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ప్ర భుత్వం 2022లో రాష్ట్రంలోకి సీబీఐ రాకుండా నిషేధం విధించగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ నిషేధ ఉత్తర్వులను ఉపసంహరించుకుంది. ఈ రెండు కేసులనూ సీబీఐకి అప్పగిస్తుండగా, ఆ రెండు మంథని అసెంబ్లీ నియోజకవర్గంతో సంబంధం ఉండడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. సీబీఐ ఎంట్రీతో జిల్లాలోనే కాదు.. రాష్ట్ర రాజకీయాల్లోనూ అనూహ్య పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందనే చర్చసాగుతోంది. ఈ కేసుల ఎఫెక్ట్‌తో వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి జిల్లా రాజకీయ ముఖచిత్రంలో ఎలాంటి పరిణామాలు ఉంటాయోనని అన్ని రాజకీయ పార్టీల్లోని కార్యకర్తలు ముచ్చటించుకుంటున్నారు.

ప్రపంచం గర్వించే బీమా సంస్థ ఎల్‌ఐసీ


మాట్లాడుతున్న శివనాగప్రసాద్

కరీంనగర్: ప్రపంచం గర్వించే అత్యుత్తమ బీమా సంస్థ ఎల్‌ఐసీ అని కరీంనగర్ సీనియర్ డివిజనల్ మేనేజర్ శివనాగప్రసాద్ అన్నారు. ఎల్‌ఐసీ 69వ ఆవిర్భావ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం డివిజనల్ కార్యాలయంలో సంస్థ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మలుచుకోవడం ద్వారా ఎల్‌ఐసీ మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోందని పేర్కొన్నారు. పేపర్ లెస్ ఆఫీస్ ఏర్పాటు దిశలో డిజిటలైజేషన్ నడుస్తోందని, భవిష్యత్‌లో మరింత టెక్నాలజీని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. గైనకాలజిస్ట్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ఎల్‌ఐసీ లాంటి నమ్మకమైన సంస్థ మరొకటి లేదన్నారు. అహ్మదాబాద్ ఎయిర్ క్రాఫ్ట్, ఆపరేషన్ సింధూర్ ఘటనల్లో అందరికీ ఎల్‌ఐసీ మాత్రమే ఉదారంగా క్లెయిమ్స్ చెల్లించిందని, సామాజిక బాధ్యత ఉన్న ఏకైక బీమా సంస్థ అని కొనియాడారు. మార్కెటింగ్ మేనేజర్ సోమశేఖర్, సేల్స్ మేనేజర్ రాజేశ్ ఖన్నా, రాజనరేందర్, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసును చేధించిన పోలీసులు

• నిందితులిద్దరూ మైనర్లు.. పైగా అన్నదమ్ములు
• పోలీసులను ప్రశంసించిన ఎస్పీ, డీఎస్పీ


స్వాధీనం చేసుకున్న 22.71 తులాల బంగారం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ధర్మపురి: ఆగస్టు 30న ధర్మపురికి చెందిన రెడీమేడ్ బట్టల వ్యాపారి కోలేటి మల్లికార్జున్ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన నిందితులను పోలీసులు పట్టుకున్నారు. చోరీకి పాల్పడింది ఇద్దరు మైనర్లు.. పైగా అన్నదమ్ములుగా గుర్తించారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. మల్లికార్జున్ బట్టల వ్యాపారి. ఆగస్టు 30న ఇంటికి తాళం వేసి వెళ్లాడు. కుటుంబం ఆర్థికంగా లేకపోవడం.. జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు మైనర్ బాలురు(అన్నదమ్ములు) తాళం పగులగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న 22.71 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్‌కుమార్, రవీందర్ రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేశారు. సీసీ పుటేజీలతోపాటు ఓ మహిళ ఇచ్చిన సమాచారంతో దర్యాప్తు చేపట్టారు. ఇందులో అన్నదమ్ములైన ఇద్దరు బాలురే దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 22.71 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జగిత్యాలలోని జువైనల్ కోర్టుకు తరలించామన్నారు. 24 గంటల్లోనే కేసును చేధించిన సీఐ, ఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్ రామస్వామి, కానిస్టేబుళ్లు రమేశ్‌నాయక్, రణధీర్ గౌడ్, ఆరిఫ్, మహేందర్‌ను డీఎస్పీ అభినందించారు.

స్వాతంత్ర్యసమరయోధుడు కిష్టయ్య కన్నుమూత


రాంపెల్లి కిష్టయ్య(ఫైల్)


నివాళి అర్పిస్తున్న అధికారులు

మంథని: పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధుడు రాంపెల్లి కిష్టయ్య(98) ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్‌లో మృతి చెందిన రాంపెల్లి కిష్టయ్య పార్థివదేహాన్ని ఆయన నివాసానికి తీసుకురాగా.. మంథని ఆర్డీవో సురేశ్, తహసీల్దార్ కుమారస్వామి సోమవారం సందర్శించారు. అధికారికంగా నివాళి అర్పించారు. అనంతరం గోదావరి తీరంలో ఆయన కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అనాడు నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిలో రాంపెల్లి కిష్టయ్య ఒకరు. ఆంగ్లేయుల పాలన నుంచి స్వేచ్ఛ లభించినా.. తెలంగాణకు నిజాం సంస్థానం నుంచి ప్రజలకు స్వాతంత్ర్యం లభించలేదు. అయితే మహారాష్ట్రలోని చాందా క్యాంపులో సైనిక శిక్షణ పొంది.. సాయుధ పోరాటం ద్వారా నిజాం పాలనకు వ్యతిరేకంగా కిష్టయ్య పోరాటం చేశారు. మంథని ప్రాంతం నుంచి చాలామంది సాయుధ పోరాటంలో పాల్గొనగా.. అందులో అందరూ ఇదివరకే మృతి చెందారు. వారిలో మిగిలిన రాంపెల్లి కిష్టయ్య కూడా కన్నుమూశారు. ఆయన మృతికి పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

కిష్టయ్య లేనిలోటు తీర్చలేనిది

మంథని: కాగా, రాంపెల్లి కిష్టయ్య లేనిలోటు తీర్చలేదని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రాంపెల్లి కిష్టయ్య మృతి సమాచారం తెలుసుకున్న మంత్రి.. ప్రభుత్వం పక్షాన శ్రద్ధాంజలి ఘటించారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల గడువు పొడిగింపు

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించే పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైళ్ల గడువును దక్షిణ మధ్య రైల్వే పొడిగించింది. ఇందులో రైలు నంబరు 07023/24 చర్లపల్లి-హజ్రత్ నిజాముద్దీన్ (చర్లపల్లి వీక్లీ ఎక్స్‌ప్రెస్) వచ్చే డిసెంబర్ 3వ తేదీ వరకు నడుస్తుంది. రైలు నంబరు 06563/64 యశ్వంత్‌పూర్-ధన్‌బాద్ (యశ్వంత్‌పూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్)ను డిసెంబర్ 31వ తేదీ వరకు పొడిగించారు. అదేవిధంగా రైలు నంబరు 07007/08 చర్లపల్లి-రాక్సల్ (రాక్సల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్) గడువును నవంబర్ 28 వ తేదీ వరకు పొడిగించారు.

నేడు, రేపు రైళ్లు రద్దు

రామగుండం: కాజీపేట - బల్లార్షా సెక్షన్ల మధ్య ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ (ఏబీఎస్) వ్యవస్థను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేశారు. ఈమేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. కాజీపేట - సిర్‌పూర్‌టౌన్(17003), బల్లార్షా - కాజీపేట(17004), బల్లార్షా - కాజీపేట(17036) రైళ్లను ఈనెల 3వ తేదీన రద్దు చేశారు. అదేవిధంగా కాజీపేట -బల్లార్షా(17035) 2వ తేదీన రద్దు చేశారు. భద్రాచలం రోడ్ - బల్లార్షా(17033) సింగరేణి కాజీపేట - బల్లార్షా మధ్య ఈనెల 3న రద్దు చేశారు. సిర్‌పూర్‌టౌన్ - భద్రాచలంరోడ్(17034) రైలు సిర్‌పూర్‌టౌన్-కాజీపేట మధ్య ఈనెల 3న రద్దు చేశారు. అదేవిధంగా సికింద్రాబాద్ - సిర్‌పూర్‌కాగజ్‌నగర్(17233) భాగ్యనగర్ ఈనెల 2న కాజీపేట వరకే నడిపించనున్నారు. సిర్‌పూర్ కాగజ్‌నగర్ - సికింద్రాబాద్(17234) భాగ్యనగర్ ఈనెల 3వ తేదీన కాజీపేట వరకే నడిపిస్తారు.

ఉపాధిలో అవకతవకలు.. రికవరీకి ఆదేశాలు


సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు

గన్నేరువరం(మానకొండూర్): ఉపాధి హామీ పనుల్లో రూ.2,13,620 అవకతకలు జరుగగా, వాటిలోంచి కొందరు పెనాల్టీ విధించగా, మరికొందరి నుంచి రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు మొత్తం రూ.4,64,61,662 పనులు చేపట్టారు. ఈ పనులపై సోమవారం డీఆర్‌డీవో శ్రీధర్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక మండలకేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. వివిధ గ్రామాల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. వీటిలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందికి సంబంధించి గ్రామాలవారీగా పెనాల్టీ, రికవరి డబ్బులు ఇలా ఉన్నాయి.. గన్నేరువరం రూ.4812, చొక్కారావుపల్లె రూ.600, యాస్వాడ రూ.96,921, గునుకులకొండాపూర్ రూ.10,336, మాదాపూర్ రూ.17,649, చాకలివానిపల్లె రూ.4,000, మైలారం రూ.12,400, సాంబయ్యపల్లె రూ.1,600, జంగపల్లి రూ.8,604, పీచుపల్లి రూ.5,790, హన్మజిపల్లె రూ. 10,988, గోపాల్‌పూర్ రూ.1,496, ఖాసీంపేట రూ.12,537, పారువెల్ల రూ.13,411, చీమలకుంటపల్లె రూ.10,976, గుండ్లపల్లి రూ.1,500 అవకతవకలు జరిగాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, పీఆర్ ఏఈ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆత్మలు ఘోషిస్తున్నాయ్


స్తూపాన్ని శుద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కరీంనగర్: కాంగ్రెస్ అబద్ధాల పాలనను ఆపేసి, ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పిలుపు మేరకు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదేశాల ప్రకారం సోమవారం బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు లోయర్ మానేరుడ్యాం నుంచి కాళేశ్వరం జలాలను సేకరించి మార్కెట్‌రోడ్‌లో గల అమరవీరుల స్తూపానికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నారదాసు, అనిల్ మాట్లాడుతూ, రాజకీయ దురుద్దేశంతోనే కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట కేసీఆర్ పేరును అప్రతిష్ట పాలు చేసేలా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కేవలం రెండు పిల్లర్లలో మాత్రమే పగుళ్లు వచ్చాయని, వాటికి మరమ్మతు చేపట్టకుండా విచారణ పేరిట ప్రాజెక్టును అపవిత్రం చేశారన్నారు. ఇలాంటి చర్యల ద్వారా తెలంగాణ అమరవీరుల ఆత్మలు ఘోషిస్తున్నాయని, వారి ఆత్మలు శాంతించాలని అమరవీరుల స్తూపానికి కాళేశ్వరం నీటితో జలాభిషేకం చేసినట్టు తెలిపారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, పిల్లి శ్రీలత, తిరుపతినాయక్, కాసారపు శ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల వేధింపులతో ఆత్మహత్యాయత్నం


బాధితుడి నుంచి వాంగ్మూలం తీసుకుంటున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది

కరీంనగర్‌రూరల్: డిపార్ట్‌మెంట్ అధికారుల వేధింపులు భరించలేక ఓ కానిస్టేబుల్ సోమవారం పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. దుర్శేడ్‌కు చెందిన గుజ్జేటి మనోహర్ చొప్పదండి ఫైర్‌స్టేషన్‌లో ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. డిపార్ట్‌మెంట్‌కు చెందిన అధికారులు డ్యూటీల పేరిట వేధిస్తున్నారు. వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ అవమానిస్తున్నారు. సోమవారం అధికారులు పలు రకాలుగా వేధింపులకు గురిచేయడంతో మనోహర్ ఇరుకుల్ల శివారులో పురుగులమందు తాగి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో మనోహర్ నుంచి పోలీసులు వాంగ్మూలం సేకరించారు.


అశోక్‌నగర్‌లో శివపార్వతుల కల్యాణం


సూర్యనగర్(శుభంగార్డెన్)లో దీపారాధన


కొత్తపల్లి గోకుల్‌నగర్ కుర్మవాడ వినాయక మండపం వద్ద కుంకుమ పూజ

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా


భగత్‌నగర్ శ్రీవేంకటేశ్వర కాలనీలో అయ్యప్ప మహా పడిపూజ

కరీంనగర్‌కల్చరల్/విద్యానగర్/కొత్తపల్లి/కరీంనగర్‌రూరల్: శ్రీ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం వినాయక మండపాల్లో విశేష పూజలు కొనసాగాయి. అశోక్‌నగర్‌లో యువమిత్ర క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భగత్‌నగర్ శ్రీవేంకటేశ్వరకాలనీలో ఏర్పాటు చేసిన మండపం వద్ద అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుని వద్ద చిన్నారులు నృత్యాలు చేశారు. కొత్తపల్లిలోని గోకుల్‌నగర్ కుర్మవాడలో విఘ్నేశ్వర సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమ పూజలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గుండేటి విశ్వనాథం వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద 22 రకాల నైవేద్యాలు సమర్పించారు. సూర్యనగర్ (శుభం)లో ఉదయం లింగార్చన, సాయంత్రం దీపారాధనతో స్వామివారిని కొలిచారు. బొమ్మకల్‌లోని అంజననగర్ వినాయక మండపంలో కుంకుమపూజ నిర్వహించారు. అంజననగర్‌లో స్వర్ణోత్సవ నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖులు వినాయకులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.


భగత్‌నగర్‌లో చిన్నారుల నృత్యం


పూజలు చేస్తున్న మాజీ మేయర్ సునీల్ రావు


బొమ్మకల్‌లో కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు


సరస్వతినగర్‌లో..


దుర్శేడ్‌లో..


చామనపల్లిలో అన్నదానం


వినాయకుని సేవలో పలువురు ప్రజాప్రతినిధులు

కరీంనగర్ అర్బన్ క్రీడోత్సవాలు ప్రారంభం

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని సప్తగిరికాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ అర్బన్ అండర్ 14, 17 క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఒలింపిక్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని సూచించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, కరీంనగర్ అర్బన్ కార్యదర్శి శంకరయ్య మాట్లాడుతూ సోమవారం నుంచి ఈనెల 8వరకు మానేరు విద్యాసంస్థల్లో కబడ్డీ, ఐవీవై పాఠశాలలో ఖోఖో పోటీలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్, ప్రైవేటు వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌గౌడ్, దారం శ్రీనివాస్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు మహేందర్, సీనియర్ పీడీలు, పీఈటీలు దివాకర్, శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, లింగారావు చిరంజీవి, మధునయ్య, విద్యాసాగర్‌తో పాటు సుమారు 50 పాఠశాలలకు చెందిన పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.


వాలీబాల్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న జనార్దన్ రెడ్డి

6నుంచి ఎస్జీఎఫ్ కబడ్డీ పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని పద్మనగర్‌లో గల మానేరు సీబీఎస్ఈ పాఠశాల ఆవరణలో ఈనెల 6నుంచి 8వ తేదీ వరకు మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో కరీంనగర్ అర్బన్‌స్థాయి ఎస్జీఎఫ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మానేరు విద్యాసంస్థల అధినేత, ఒలింపిక్ సంఘం ప్యాట్రన్ కడారి అనంతరెడ్డి తెలిపారు. సోమవారం పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. క్రీడలపై ప్రతీఒక్కరికి ఆసక్తి పెరిగినందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం క్రీడలకు అధిక ప్రాధన్యం ఇస్తుందన్నారు. ఏటా క్రీడా పోటీల నిర్వహణకు మానేరు విద్యాసంస్థలు ముందుంటాయని తెలిపారు. ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో క్రీడా రంగంలో మానేరు విద్యాసంస్థల కృషి చెప్పలేనిదని అన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ పాఠశాలల క్రీడా పోటీల నిర్వహణకు మానేరు విద్యాసంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, కరీంనగర్ అర్బన్ ఎస్జీఎఫ్ కార్యదర్శి అంతటి శంకరయ్య, పీఈటీ మహేందర్‌లతో పాటు ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అనంతరెడ్డి

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కరీంనగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ మాట్లాడుతూ ఫీజు నియంత్రణ చట్టం లేకపోవడం వల్ల ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించకుండా కాలయాపన చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అరవింద్, లోకేశ్, ప్రవీణ్‌కుమార్, జన్‌సైదా, శివతేజ, అన్వేష్, సురేశ్, విగ్నేష్, శ్రీకాంత్, సాయిరాం, శేఖర్, వంశీకృష్ణ, చరణ్, నిఖిల్, వంశీ ,హకీం గిరిబాబు, సర్దార్ నాయన ప్రీత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కరీంనగర్‌క్రైం: తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) పిలుపుమేరకు పాత పెన్షన్ సాధన కోసం శాతవాహన యూనివర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం విశ్వవిద్యాలయాల పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కిశోర్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ అన్నారు. ధర్నాలో సూపరింటెండెంట్ భీమయ్య, రాజేశ్వరి, సంతోష్, యోజన, మాధురి, కిషన్, పసివుద్దీన్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో..

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సోమవారం ఎస్సారార్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో సీపీఎస్ అధ్యాపకులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సీపీఎస్ అధ్యాపకులు మల్లారెడ్డి, రామకృష్ణ, హర్ జ్యోత్‌కౌర్, సతీశ్‌కుమార్ బి.చంద్రశేఖర్, నరేశ్ , కె.అర్జున్, రాజేశ్,, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

చేతిరాత పోటీల ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న కలెక్టర్

కరీంనగర్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పారమిత విద్యాసంస్థల సహకారంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి చేతిరాత పోటీల ఫలితాలను సోమవారం కలెక్టర్ పమేలా సత్పతి విడుదల చేశారు. జిల్లాలోని 16 మండలాల నుంచి 584 మంది పాల్గొనగా ప్రతీ మండలం నుంచి ప్రతిభ కనబర్చిన ముగ్గురు చొప్పున 48 మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 7న పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కలెక్టర్, డీఈవో, పారమిత పాఠశాలల అధినేతలు అభినందించారు.

'త్రివేణి' పుస్తకం ఆవిష్కరణ



కరీంనగర్ కల్చరల్: సాహితీవేత్త వరాల ఆనంద్ రచించిన 'త్రివేణి' కవితా సంకలనాన్ని సోమవారం నగరంలోని కార్ఖానాగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాజీ హిందీ ఉపాధ్యాయుడు ఉడుతల రాజేశం ఆవిష్కరించారు. త్రివేణి పుస్తక సమీక్ష చేసిన సాహితీ విమర్శకురాలు కల్వకుంట్ల శ్రీలత మాట్లాడుతూ మూడు పంక్తుల కవితల్లో జీవిత సారాంశాన్ని ఆవిష్కరించారన్నారు. సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు చంద్రశేఖర్, కవులు నలిమెల భాస్కర్, అనంతాచార్య, పీఎస్. రవీంద్ర, నాగేంద్రశర్మ, శ్రీనివాసశర్మ, పాయెట్రీ ఫోరం కన్వీనర్ ఇందిరా రాణి, మంగారి శివ ప్రసాద్, నడిమెట్ల రామయ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

విద్యానగర్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఈనెల 12న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ధర్నా పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ బోగె పద్మ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాధవిరెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక అధ్యక్షుడు యాదగిరి, నాయకులు లక్ష్మణ్, రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షుడు యువరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్.. ప్రజల పరేషాన్

- సూర్యనగర్‌లో తరచూ విద్యుత్ అంతరాయం
- సబ్‌స్టేషన్ ఒక చోట.. సిబ్బంది మరోచోట
- బ్యాంక్‌కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో పేలిన ఇన్సులేటర్

కొత్తపల్లి: కరీంనగర్‌రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని సీతారాంపూర్ సూర్యనగర్‌లో తరచూ పవర్‌కట్ అవుతుండడం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. వర్షాలు కురుస్తుండడంతో పాటు లైన్ పొడువుగా ఉండడం సమస్యకు కారణంగా తెలుస్తోంది. కరీంనగర్ బ్యాంక్‌కాలనీ సబ్‌స్టేషన్ నుంచి సూర్యనగర్‌కు విద్యుత్ సరఫరా అవుతుండగా.. రేకుర్తి సబ్‌స్టేషన్ పరిధిలోని సిబ్బంది నిర్వహణ బాధ్యతలు చేపడుతున్నారు. ఈ వింత పరిస్థితితో ఇక్కడి వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రేకుర్తి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగినప్పుడు ఇక్కడి సిబ్బందికే తెలియజేసేవారు. కానీ, ప్రస్తుతం విద్యుత్ సంబంధిత సమస్యలపై సిబ్బందికి తెలియజేస్తే..అక్కడి వారిని తెలుసుకొని వారి సమన్వయంతో పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కాలయాపనతో పాటు వినియోగదారుల్లో అసహనం నెలకొంటోంది. రేకుర్తి ఫీడర్ కింది సరఫరాను అనాలోచిత నిర్ణయంతో బ్యాంక్ కాలనీ సబ్‌స్టేషన్‌తో అనుసంధానం చేసి జగిత్యాల ఫీడర్ ద్వారా ప్రస్తుతం సరఫరా చేస్తున్నారు. అయితే ఈ ఫీడర్ లైన్లు పెద్దగా ఉండడంతో సూర్యనగర్‌వాసులకు కరెంట్ సరఫరాలో హెచ్చుతగ్గులతో పాటు అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు విన్నవించగా, రేకుర్తి సబ్‌స్టేషన్ కిందకు మార్చేందుకు వర్క్‌ఆర్డర్ మంజూరైంది. కానీ, ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ పనులు కూడా జరగడం లేదు. దీంతో ఇక్కడి వినియోగదారులు విద్యుత్ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.


11 కేవీ లైన్‌పై కట్ అయిన ఇన్సులేటర్, కాలిన బ్రాస్‌పట్టీలు

ఇన్సులేటర్ పేలి నిలిచిన సరఫరా

కరీంనగర్‌టౌన్–1 పరిధి 33/11 కేవీ బ్యాంక్‌కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని తులసీనగర్‌లో ఇన్సులేటర్ పేలి ఆ సబ్‌స్టేషన్ పరిధి ప్రాంతాల్లో అంధకారం నెలకొంది. సోమవారం వేకువజామున 3.40 గంటల ప్రాంతంలో కురిసిన వర్షంతో తులసీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో డీటీఆర్ వద్ద తలెత్తిన సాంకేతిక లోపంతో ఇన్సులేటర్ పేలడంతో విద్యుత్ వైర్లు రెండు చోట్ల తెగిపడ్డాయి. మరో రెండు చోట్ల అల్లుకొని జంపర్ కట్ కావడంతో సబ్‌స్టేషన్‌లోని ఫ్యాంథర్ కండక్టర్ (బస్‌బార్) జంపర్ కట్ అయింది. అంతేగాకుండా వరలక్ష్మి, మెహర్‌నగర్, కోర్టు ఫీడర్లలో తలెత్తిన సాంకేతిక లోపంతో వావిలాలపల్లిలోని 130 కేవీ సబ్‌స్టేషన్ ట్రిప్ అయింది. తులసీనగర్ అపార్ట్‌మెంట్‌లోని ఇన్సులేటర్ సాంకేతిక లోపం కారణంగా సమస్య ఏర్పడింది. అయితే 11 కేవీ వైర్లు తెగిపడడంతో మిగిలిన ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. వర్షం పడుతున్న సమయంలో కూడా ఏడీఈ శ్రీనివాస్, ఏఈ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో టౌన్3 సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టారు. సమారు ఐదుగంటల పాటు శ్రమించిన సిబ్బంది ఉదయం 9 గంటల సమయంలో విద్యుత్‌ను పునరుద్ధరించారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కొత్త డీటీఆర్ ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం మధ్యాహ్నం 12 నుంచి 1గంట వరకు 11 కేవీ రాంచంద్రాపూర్‌కాలనీ ఫీడర్ పరిధిలో అంజనాద్రి ఆలయం, పొన్నం కనకయ్య హోటల్, సాయిబాబా ఆలయం, అంజనాద్రికాలనీ రోడ్ నం.1–6 వరకు, కామారపులక్ష్మీ అపార్ట్‌మెంట్, ఎలైట్ ఇన్‌ఫ్రా అపార్ట్‌మెంట్, లహరి అపార్ట్‌మెంట్, శ్రీ కన్వెన్షన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 2 ఏడీఈ లావణ్య తెలిపారు.

పద్మనగర్, ఎస్ఎస్ పరిధిలో..

గణేశ్ నిమజ్జనం సందర్భంగా విద్యుత్ లైన్ల క్లియరెన్స్ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు 33/11 కేవీ పద్మనగర్, శాతవాహన యూనివర్సిటీ సబ్‌స్టేషన్ల పరిధిలో చింతకుంట, కమాన్‌పూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ రఘు తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్ బైండోవర్

కరీంనగర్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి మానేరువాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ మద్రి రాజశేఖర్‌ను సోమవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మరోసారి చట్ట వ్యతిరేక చర్యలు చేపట్టకుండా తహసీల్దార్ ఎదుట రాజశేఖర్‌ను బైండోవర్ చేసినట్లు వివరించారు.

లయన్స్ కమిటీ ప్రమాణ స్వీకారం

కరీంనగర్‌టౌన్: నూతనంగా ఏర్పాటైన సాయిశ్రీ లయన్స్ క్లబ్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం జ్యోతినగర్‌లోని శ్రీనిధి చిట్స్ సమావేశ మందిరంలో జరిగింది. క్లబ్ అధ్యక్షురాలు ధ్యావ స్వాతిరెడ్డి, కార్యదర్శి కొండం రజితరెడ్డి, కోశాధికారి పాత దీపికతో గవర్నర్ సింహరాజు కోదండరాం ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్, రీజినల్ చైర్మన్ ఊకంటి సంపతికుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మల్టిపుల్ చైర్మన్ హనుమండ్ల రాజిరెడ్డి, మోర భద్రేశం, గుంటుక చంద్రప్రకాశ్, సింగిరెడ్డి వాసుదేవరెడ్డి, గాలిపల్లి వెంకట్, వెంకటరమణారెడ్డి, బోయినపల్లి సరళ, చాడ మల్లారెడ్డి, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

మానేరు నీళ్లు కాళేశ్వరం నీళ్లెలా అయ్యాయి?

కరీంనగర్ కార్పొరేషన్: మానేరు నీళ్లు కాళేశ్వరం నీళ్లు ఎలా అయ్యాయో బీఆర్ఎస్ నాయకులు చెప్పాలని సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాళేశ్వరం నీళ్ల పేరిట మానేరు నీళ్లతో అమరవీరుల స్తూపాన్ని కడిగి, అమరవీరులను అవమానించారంటూ విమర్శించారు. అందుకు నిరసనగా సోమవారం నగరంలోని అమరవీరుల స్తూపాన్ని పాలతో అభిషేకించి శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించడంతో బీఆర్ఎస్ నాయకుల్లో వణుకు మొదలైందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అక్రమాలు, లోపాలను పీసీ ఘోష్ కమిషన్ ఆధారాలతో బయటపెట్టిందని తెలిపారు. అవినీతి బండారం బయటపడుతుండడంతో బీఆర్ఎస్ నాయకులు డ్రామాలు మొదలు పెట్టారన్నారు. నాయకులు తాజ్, అరుణ్‌కుమార్, సమద్ నవాబ్, రాజమల్లయ్య, రవీందర్, అక్బర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.


స్తూపాన్ని పాలతో శుద్ధి చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వ నిర్ణయంతో బీసీల్లో ఆనందం

కరీంనగర్‌కార్పొరేషన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీ ఆమోదం తెలిపిన చారిత్రక నిర్ణయంతో వెనుకబడిన వర్గాల్లో ఆనందం నెలకొందని కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాచౌక్‌లో బీసీసెల్ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకొంటుందనడానికి ఇది మరో నిదర్శనమన్నారు. దేశం మొత్తం ఆశ్చర్యపోయేలా సీఎం రేవంత్ నేతృత్వంలో, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో బీసీ బిల్లును ఆమోదించారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు బీసీలను అణగదొక్కితే కాంగ్రెస్ పెద్దపీట వేస్తోందన్నారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్, నగర అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్, నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున రాజేందర్, మాచర్ల ప్రసాద్, కట్ల సతీశ్, జక్కని ఉమాపతి, మడుపు మోహన్, అహమ్మద్ అలీ, మూల రవీందర్‌రెడ్డి, మహమ్మద్ ఆరిఫ్, వెన్న రాజమల్లయ్య, లింగంపల్లి బాబు, వంగల విద్యాసాగర్, నెల్లి నరేశ్, నూనె గోపాల్‌రెడ్డి, తోట అంజయ్య, కుంబాల రాజకుమార్, శ్రీరాముల రమేశ్, కుర్ర పోచయ్య తదితరులు పాల్గొన్నారు.


సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు

యూరియా నో స్టాక్

- సహకార సంఘాలు మూసివేత
- కేటాయింపులో జాప్యం
- ఆందోళనలో రైతులు

కరీంనగర్‌రూరల్: వానాకాలం సీజన్‌లో యూరియా లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సహకార సంఘాలు, డీసీఎంఎస్, ఆగ్రోస్ కేంద్రాల్లో రోజుల తరబడి యూరియా కోసం ఎండ, వానను లెక్కచేయక రోజుల తరబడి బారులు తీరినప్పటికీ లభించలేదు. కరీంనగర్ మండలంలో యూరియా కేటాయింపులో జాప్యంతో రెండు రోజుల నుంచి పంపిణీ నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం కేవలం దుర్శేడ్ సంఘంలో 73 బస్తాలు, కరీంనగర్ డీసీఎంఎస్‌లో 110 బస్తాలను బొమ్మకల్ రైతులకు మాత్రమే పంపిణీ చేశారు.

విక్రయ కేంద్రాలు మూసివేత

కరీంనగర్ సహకార సంఘం ఆధ్వర్యంలో బొమ్మకల్, చెర్లభూత్కూర్ కేంద్రాలు, దుర్శేడ్ సహకార సంఘం, తీగలగుట్టపల్లిలో డీసీఎంఎస్ కేంద్రం, నగునూరులో ఆగ్రోస్ కేంద్రాల్లో యూరియా స్టాక్ లేక మూసివేశారు. శనివారం తీగలగుట్టపల్లికి 10 మెట్రిక్ టన్నులు, నగునూరుకు 10, దుర్శేడ్‌కు 15, చెర్లభూత్కూర్‌కు 15మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా స్టాక్ వచ్చింది. తీగలగుట్టపల్లి, నగునూరులో ఒక్కరోజులోనే రైతులకు యూరియా పంపిణీ పూర్తి చేయగా టోకెన్లు జారీ చేసిన రైతులకు ఆదివారం చెర్లభూత్కూర్‌లో 170 బస్తాలు, సోమవారం దుర్శేడ్‌లో 73 బస్తాలను పంపిణీ చేశారు. ఆది, సోమవారాల్లో విక్రయ కేంద్రాలను మూసివేయడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. కొత్తగా కేవలం చెర్లభూత్కూర్‌కు 20 మెట్రిక్ టన్నులు, బొమ్మకల్‌కు 10, దుర్శేడ్‌కు 20 మెట్రిక్ టన్నుల యూరియా ఇండెంట్‌ను మండల వ్యవసాయాధికారి సత్యం మార్క్‌ఫెడ్‌కు పంపించారు. అయితే రైల్వే వ్యాగన్ రాకపోవడంతో సోమవారం రాత్రి వరకు యూరియా అలాట్‌మెంట్ కాలేదు. దీంతో మంగళవారం సైతం రైతులకు యూరియా లభించని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు వీలైనంత త్వరగా యూరియా స్టాక్ తెప్పించి సకాలంలో పంపిణీ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


దుర్శేడ్ సొసైటీలో యూరియా బస్తాల కోసం నిల్చున్న రైతులు


చెర్లభూత్కూర్‌లో మూసిఉన్న ఎరువుల గోదాం

'పురుమల్ల' ఓట్లు వివాదాస్పదం

- బొమ్మకల్, ఇరుకుల్లలో భార్యాభర్తలకు ఓటుహక్కు
- తహసీల్దార్‌కు బీజేపీ ఫిర్యాదు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భార్యాభర్తలైన మాజీ ప్రజాప్రతినిధులు రెండుచోట్ల ఓటరుగా నమోదు కావడం వివాదాస్పదంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా బొమ్మకల్, ఇరుకుల్లలో ఇద్దరికి ఓటుహక్కు కల్పించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆర్ఐ తిరస్కరించినప్పటికీ కొత్తగా ఇద్దరి ఓట్లు నమోదు కావడం గమనార్హం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశంతో పురుమల్ల దంపతులు అక్రమంగా రెండు ప్రాంతాల్లో ఓట్లు కలిగి ఉండటంపై బీజేపీ నాయకులు సోమవారం తహసీల్దార్, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కరీంనగర్‌రూరల్ మాజీ జెడ్పీటీసీ పురుమల్ల లలిత, బొమ్మకల్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నుంచి కరీంనగర్‌అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యేగా పోటీచేసిన పురుమల్ల శ్రీనివాస్ దంపతులు రెండు ఓట్ల వివాదంలో చిక్కుకున్నారు. ఇప్పటికే బొమ్మకల్‌లో ఇద్దరికి ఓట్లు ఉండగా కొత్తగా ఇరుకుల్లలో అధికారులు ఓటు హక్కు కల్పించారు. ఇటీవల పంచాయతీ అధికారులు ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాలో ఇరుకుల్లలోని ఇంటి నం.3–131లో పురుమల్ల శ్రీనివాస్, లలితలను ఓటర్లుగా చేర్చారు. అయితే ఇప్పటికే బొమ్మకల్‌లో ఇద్దరికి ఉన్న ఓట్లను తొలగించకుండానే ఇరుకుల్లలోని ఓటరు జాబితాలో కొత్త ఓటర్లుగా రెవెన్యూ అధికారులు చేర్పించడం వివాదాస్పదంగా మారింది. ఆర్ఐ ఇద్దరి ఓట్లను తిరస్కరించినప్పటికీ నేరుగా ఓటరు జాబితాలో పేర్లు రావడం అధికార వర్గాలకు విస్మయం కలిగిస్తోంది. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా రెండు ప్రాంతాల్లో పురుమల్ల శ్రీనివాస్, లలితలు అక్రమంగా ఓటుహక్కు కలిగి ఉన్నారని సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీవో సంజీవరావులకు ఫిర్యాదు చేశారు.అక్రమ ఓట్ల నమోదుకు సంబంధించిన వివరాలను తెలిపారు. అక్రమంగా నమోదైన ఓట్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు ఇరుకుల్లలో నమోదు చేసిన పురుమల్ల శ్రీనివాస్, లలితల ఓట్లను తొలగించాలని కోరుతూ ఆర్డీవో మహేశ్వర్‌కు ప్రతిపాదన పంపించినట్లు తహసీల్దార్ రాజేశ్ తెలిపారు.


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

ఉత్తరాలు రాయడాన్ని మరిచిపోవడం దురదృష్టకరం

కరీంనగర్: ఉత్తరాలు రాయడమే ప్రక్రియను నేటి యువత మరిచిపోవడం దురదృష్టకరమని డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం సప్తగిరి ప్రభుత్వ పాఠశాలలో లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, శాతవాహన లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ లేఖా రచన దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోస్ట్ కార్డు అంటే ఏమిటో తెలియని యువత, ఉత్తరాలు రాయడాన్ని మరిచి పోవడం మంచిది కాదని తెలిపారు. అధికారిక, అనధికారిక ఉత్తరాలు రాయడంలో ఇమిడిన పద్ధతులను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పోస్ట్ కార్డులు అందించి, తమకు ఇష్టమైన వ్యక్తులకు లేఖలు రాయమంటూ సూచించారు. లేఖా రచనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, ఉపాధ్యాయులు గాజుల రవీందర్, లయన్ ఎం.మహేందర్, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

4 బిల్లులకు మండలి ఆమోదం

సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల ఆందోళన

- కాళేశ్వరం నివేదికపై చర్చకు పట్టు
- నివేదిక కాపీలను చించి చైర్మన్ పైకి విసిరిన సభ్యులు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నినాదాలతో గందరగోళం



సాక్షి, హైదరాబాద్: అధికార, విపక్షాల నినాదాలతో శాసనమండలిలో సోమవారం తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. మండలి ప్రారంభం కాగానే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చకు పట్టుబట్టారు. ఓవైపు బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన కొనసాగుతుండగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు, పంచాయతీరాజ్ సవరణ బిల్లు, పురపాలక సంఘాల చట్ట సవరణ, అల్లోపతి ప్రైవేటు వైద్య సంరక్షణ సంస్థల చట్టం రద్దు బిల్లులకు మండలి ఆమోద ముద్ర వేసింది. ఒక దశలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు చైర్మన్ పోడియం వద్దకు దూసుకువచ్చి కాళేశ్వరం కమిషన్ ప్రతులను చించి ఆయన పైకి విసిరారు. దీంతో మార్షల్స్ రంగప్రవేశం చేసి బీఆర్ఎస్ సభ్యులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వారంతా ప్రతిఘటించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రెడ్డి, దాసోజు శ్రవణ్, బండ ప్రకాశ్‌లు వెనక్కి నెట్టడంతో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కలుగజేసుకుని మార్షల్స్ వెనక్కి రావాలంటూ వారించారు. బీఆర్ఎస్ సభ్యులు తమతమ స్థానాల్లో ఉండి నిరసన తెలపాలని పదేపదే విజ్ఞప్తి చేశారు. అయినా వారు ఆందోళన తీవ్రతరం చేశారు. మరోవైపు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్‌బాబులు బీఆర్ఎస్ సభ్యులపై తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ఓవైపు బీఆర్ఎస్, మరోవైపు కాంగ్రెస్ సభ్యుల నినాదాలతో మండలిలో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఆందోళనల మధ్యే నాలుగు బిల్లులకు ఆమోదం..:

మండలి సమావేశం ప్రారంభం కాగానే మంత్రి సీతక్క బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టారు. దీనిపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడారు. కేవలం 42 శాతం రిజర్వేషన్ల బిల్లుతో మభ్య పెట్టకుండా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సభలో గందరగోళం మధ్యే ఈ బిల్లును ఆమోదించారు. సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణకు సీతక్క ప్రవేశపెట్టిన తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ బిల్లును కూడా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులపై ఆమె ఫైర్ అయ్యారు. తెలంగాణ ప్రజలను అడుగడుగునా మోసం చేసిన బీఆర్ఎస్ 'తెలంగాణ'మాట పలికే అర్హతను కోల్పోయిందని విమర్శించారు. అదేవిధంగా పురపాలక సంఘాల చట్ట సవరణ బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు, అల్లోపతి ప్రైవేటు వైద్య సంరక్షణ సంస్థల చట్టం రద్దు బిల్లును మంత్రి దామోదర రాజ నర్సింహలు ప్రవేశపెట్టారు. ఈ బిల్లులకు సైతం సభ ఆమోద ముద్ర వేసింది. బీసీ బిల్లు సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేస్తున్న సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కలుగజేసుకుని బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్ర దౌర్భాగ్యమన్నారు.

నినాదాలతో హోరెత్తించిన బీఆర్ఎస్ సభ్యులు..:

కాళేశ్వరం నివేదికపై చర్చకు పట్టుబట్టిన బీఆర్ఎస్ సభ్యులు..కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను ప్రభుత్వం సీబీఐకి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ పోడియం వద్ద నినాదాలు చేశారు. 'రాహుల్‌కు సీబీఐ వద్దు..రేవంత్‌కు సీబీఐ ముద్దు, బడే భాయ్..ఛోటే భాయ్ ఏక్ హై, రాష్ట్రంలో పోలీస్ పాలన..కౌన్సిల్‌లో మార్షల్స్ పాలన, రేవంత్ బూటకం..కమీషన్ నాటకం, బాబు, బీజేపీ డైరెక్షన్..రేవంత్ యాక్షన్, తెలంగాణ సాధకుడు కేసీఆర్‌పై సీబీఐ కేసులా..సిగ్గుసిగ్గు..''అంటూ నినాదాలు చేశారు. ఇందుకు ప్రతిగా కాంగ్రెస్ ఎమ్మెల్సీలు..'కేసీఆర్ వద్దు..బీసీలు ముద్దు..'అంటూ నినాదాలు చేశారు. బిల్లులు ఆమోదం పొందిన వెంటనే శాసన మండలిని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ ప్రకటించారు.

ప్రత్యేక జీఓతో సీబీఐకి..!

- తద్వారా ఒక్క కాళేశ్వరంపై విచారణకే సీబీఐకి చాన్స్
- ఇతర కేసుల్లో దర్యాప్తు చేపట్టాలంటే అనుమతి తీసుకోవాల్సిందే..

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను సీబీఐకి అప్పగించాలని నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఈ మేరకు ప్రత్యేక జీవో విడుదల చేయనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022, ఆగస్టు 30న రాష్ట్రంలో సీబీఐ ప్రవేశించేందుకు అనుమతి లేదంటూ జీఓ ఎంఎస్ నంబర్ 51 అమల్లోకి తెచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసు దర్యాప్తు సందర్భంలో అప్పటి హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా 51వ నంబర్ జీఓ జారీ చేశారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై సీబీఐ విచారణకు నిర్ణయం తీసుకోవడంతో.. గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ 51ని పూర్తిగా ఎత్తివేస్తారా? లేక ప్రత్యేకంగా కాళేశ్వరం కేసు విచారణకు సీబీఐకి అనుమతిస్తూ ప్రత్యేకంగా జీఓ ఇస్తారా? అనే చర్చ తెరపైకి వచ్చింది. కానీ ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు.. జీఓ నంబర్ 51ని పూర్తిగా రద్దు చేయకుండా, ప్రత్యేకంగా నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు ప్రత్యేక జీఓతో ఈ కేసును సీబీఐకి అప్పగించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. దీని వల్ల ఇతర కేసుల్లో దర్యాప్తు చేపట్టాలంటే సీబీఐకి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అవుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ కూడా గతంలో ఇచ్చిన ఆ జీవో ఎత్తివేయాల్సిన అవసరం లేదంటూ వ్యాఖ్యానించడం గమనార్హం.

ఢిల్లీ మినహా ఇతర రాష్ట్రాల్లో అనుమతి తప్పనిసరి

ప్రస్తుతం ఢిల్లీ మినహా మిగతా ఏ రాష్ట్రంలోనూ నేరుగా కేసులు దర్యాప్తు చేసే అధికారం సీబీఐకి లేదు. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, 1946 (డీఎస్‌పీఈ) సెక్షన్ 6 ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సాధారణ సమ్మతి (జనరల్ కన్సెంట్)తోనే కేసుల విచారణను చేపట్టేందుకు అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వాల జనరల్ కన్సెంట్‌ను ఈ చట్టం తప్పనిసరి చేసింది. కాగా రాష్ట్రాలు కూడా తమ కన్సెంట్ ఇచ్చాయి. అయితే కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐని కట్టడి చేసేందుకు కొన్ని రాష్ట్రాలు డీఎస్‌పీఈ సెక్షన్ 6ను తమ రాష్ట్రాల పరిధిలో ఉపసంహరించుకుంటూ జీఓలు జారీ చేశాయి. ఈ జాబితాలో పలు రాష్ట్రాలు ఉన్నాయి. ఏపీలోనూ 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సీబీఐకి ఇచ్చిన జనరల్ కన్సెంట్‌ను ఉపసంహరించుకుంది. ఈ క్రమంలోనే 2022లో అప్పటి సీఎం కేసీఆర్ సీబీఐ జనరల్ కన్సెంట్ తీసుకోవడాన్ని తప్పనిసరి చేశారు. ఏపీ, తెలంగాణతో పాటు పశ్చిమ బెంగాల్, కేరళ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మేఘాలయ, మిజోరాం, పంజాబ్ రాష్ట్రాల్లో కూడా సీబీఐ దర్యాప్తుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేశాయి.

ఒకట్రెండు రోజుల్లో సీబీఐకి లేఖ


- మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి
- అంశాల వారీగా మాత్రమే విచారణ
- గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ఎత్తివేయాల్సిన అవసరం లేదు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని కోరుతూ ఒకట్రెండు రోజుల్లో సీబీఐకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆ పనిని అధికారులు చూసుకుంటారని వ్యాఖ్యానించారు. సోమవారం తాజ్‌కృష్ణ హోటల్‌లో ఆయన కొంతసేపు విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ విషయంలో విలేకరులు లేవనెత్తిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేయాలంటే.. అనుమతి లేకుండా సీబీఐ రాష్ట్రంలోకి రాకూడదంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ఎత్తివేయాల్సిన అవసరం లేదని చెప్పారు. సీబీఐ టోకుగా రాదని, అంశాల వారీగా మాత్రమే విచారణ చేపడుతుందన్నారు. కోర్టులు ఆదేశించినా, లేదంటే ప్రభుత్వం కోరినప్పుడు మాత్రమే సీబీఐ కేసులను స్వీకరిస్తుందని వివరించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది కాబట్టి ఈ కేసు విచారణకు వస్తుందన్నారు. అయితే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అలా కాదని, కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో ఈడీ పరిధిలోకి వచ్చే సెక్షన్లు ఉంటే దానంతట అదే విచారణ చేపడుతుందని చెప్పారు. సీబీఐ విచారణ విషయంలో తాము అడిగేది భారత ప్రభుత్వాన్ని అని, బీజేపీని కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి రాజకీయ సంబంధం ఉండదని సీఎం పేర్కొన్నారు.

'సీబీఐ'పై స్టే ఇవ్వలేం

- 'కాళేశ్వరం' నివేదికపై చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులివ్వలేం
- కేసీఆర్, హరీశ్‌రావు మధ్యంతర అప్లికేషన్లపై హైకోర్టు
- తదుపరి విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ నివేదికపై చర్యలు తీసుకోకుండా స్టే ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. తదుపరి ఆదేశాలిచ్చే వరకు ప్రాజెక్టుపై విచారణను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు అప్పగించకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు కూడా నిరాకరించింది. కనీసం తమ మధ్యంతర అప్లికేషన్ల (ఐఏలు)పై మధ్యాహ్నం 2.30 గంటలకు వాదనలు వినాలని, అప్పటిలోగా ప్రభుత్వ వైఖరిని తెలియజేయాల్సిందిగా ఆదేశించాలని విజ్ఞప్తి చేసినా తోసిపుచ్చింది. పోలీస్ చట్టం సెక్షన్ 62 కింద సీబీఐ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం కోరితే..తమ పిటిషన్ల లక్ష్యం నీరుగారిపోతుందన్న వినతిని సైతం పరిగణనలోకి తీసుకోలేదు. అయితే దీనిపై సర్కార్ ఏం చేయబోయేది వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డికి సూచించింది. నివేదికపై చర్యలు తీసుకున్నారా? లేక చర్యలు తీసుకుంటారా? ప్రస్తుతం నిర్ణయం ఏ దశలో ఉందో తెలుసుకుని చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ ఘోష్ నివేదికపై అసెంబ్లీలో చర్చించినా.. చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్ హైకోర్టులో మధ్యంతర అప్లికేషన్లు దాఖలు చేశారు. వీటిపై తాజాగా సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

అది పిటిషనర్ల ఆందోళన మాత్రమే..

పిటిషనర్ల తరఫున ఆర్యమ సుందరం, శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు. పిటిషనర్లపై ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ ప్రభుత్వాన్ని ఆదేశించాలని పదేపదే అభ్యర్థించారు. ధర్మాసనం ఎలాంటి ఆదేశాలు ఇవ్వకుంటే సోమవారం చర్యలు చేపట్టి.. ఇప్పటికే చర్యలు తీసుకున్నామని మంగళవారం చెప్పే అవకాశం ఉందన్నారు. నివేదికను అసెంబ్లీలో పెట్టిన ప్రభుత్వం.. ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగిస్తామని ప్రకటించిందని, న్యాయస్థానం తక్షణమే జోక్యం చేసుకోకపోతే ఆ మేరకు జీవో వెలువరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, అసెంబ్లీలో విపక్ష సభ్యులు సలహాలిచ్చినా, ఇవ్వకపోయినా కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తప్పవని ప్రకటించారని చెప్పారు. నివేదికపై పూర్తి స్థాయి చర్చ సాగకుండా, సీబీఐ దర్యాప్తునకు అసెంబ్లీ తీర్మానం చేయకుండానే సీఎం ప్రకటన చేయడం సరికాదన్నారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణితో సీఎం ఉన్నందున సీబీఐకి ఇవ్వకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ధర్మాసనం జోక్యం చేసుకుని.. ఇదంతా పిటిషనర్ల ఆందోళన మాత్రమేనని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

కవిత ఆరోపణల వెనుక కుట్ర!

- పార్టీ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయి
- ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌ను కలిసిన పార్టీ నాయకులు

సాక్షి, హైదరాబాద్: పార్టీ శ్రేణుల నైతిక స్థైర్యం దెబ్బతీసేలా ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించాలని బీఆర్ఎస్ ముఖ్యనేతలు అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. పార్టీ నేతలు హరీశ్‌రావు, సంతోష్‌ను లక్ష్యంగా చేసుకొని కవిత చేసిన ఆరోపణల వెనుక కుట్ర ఉందనే అనుమానాలు కూడా పార్టీ నేతలు వ్యక్తం చేసినట్టు తెలిసింది. కవిత ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలపై ఎర్రవల్లి నివాసంలో సోమవారం పార్టీ కీలక నేతలు భేటీ అయ్యారు. కేసీఆర్‌తో జరిగిన భేటీలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రులు జి.జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నట్టు తెలిసింది. కవిత చేసిన వ్యాఖ్యలను లోతుగా పరిశీలించి చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం ఈ భేటీలో వ్యక్తమైనట్టు సమాచారం. ఇటీవలి కాలంలో తరచూ ఆమె చేస్తున్న వ్యాఖ్యలు, ప్రకటనలతో పార్టీ శ్రేణుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలని పార్టీ నేతలు కేసీఆర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది.

హరీశ్‌రావుకు సంఘీభావం తెలిపేలా...


మాజీమంత్రి హరీశ్‌రావుపై ఎమ్మెల్సీ కవిత చేసిన విమర్శల నేపథ్యంలో బీఆర్ఎస్ అధికారిక 'ఎక్స్'ఖాతాలో ఆయనకు సంఘీభావం తెలిపేలా పోస్ట్ కనిపించింది. 'ఇది ఆరడుగుల బుల్లెట్, సింహం సింగిల్‌గానే వస్తుంది అన్నట్టు కాళేశ్వరంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని అసెంబ్లీ సాక్షిగా ఆధారాలతో సహా తిప్పికొట్టిన మాజీమంత్రి'అంటూ హరీశ్‌రావు వీడియో క్లిప్‌ను పోస్ట్ చేశారు. దీనిని కేటీఆర్ రీ ట్వీట్ చేస్తూ 'ఇది నిజంగా మన డైనమిక్ నాయకుడు హరీశ్ గారి నుంచి ఒక అద్భుతమైన మాస్టర్ క్లాస్. కేసీఆర్ గారి సమర్థ శిష్యుడి నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు నీటి పారుదల గురించి చాలా విషయాలు నేర్చుకున్నారని నేను కచ్చితంగా విశ్వసిస్తున్నాను'అని పేర్కొన్నారు. కాగా హరీశ్‌రావుకు పరోక్షంగా సంఘీభావం తెలుపుతూ పలువురు బీఆర్ఎస్ నేతలు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. 'హరీశ్‌రావు పార్టీకి కేవలం నమ్మకమైన యోధుడే కాదు.. కేసీఆర్ నాయకత్వానికి, తెలంగాణ ఉద్యమానికి మొదటి నుంచి వెన్నెముక. కేసీఆర్, కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పుడు ఆరోపణలను హరీశ్‌రావు ఒంటరిగా చీల్చి చెండాడిన తీరు కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. కేడర్ తరఫున ఆయనకు కృతజ్ఞతలు. హరీశ్ గారూ.. మీరు మా బలం, ప్రేరణ'అని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు.

కవిత సస్పెన్షన్‌పై ఊహాగానాలు

ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో చర్చనీయాంశంగా మారాయి. కవిత వ్యక్తిగత సహాయకుడు, పీఆర్వోలను పార్టీ అధికారిక వాట్సాప్ గ్రూప్‌ల నుంచి తొలగించారు. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారనే ప్రచారం కూడా జరిగింది. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే జరిగే పరిణామాలపైనా పార్టీ వర్గాల్లో చర్చ జరిగింది. కవిత విషయంలో కేసీఆర్ ఎలా స్పందిస్తారనే అంశంపై పార్టీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పార్టీ తీసుకునే నిర్ణయం ఆధారంగా కవిత తదుపరి కార్యాచరణ ఉంటుందని ఆమె సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.

మోదీ, చంద్రబాబు ఆదేశాల మేరకే సీబీఐ విచారణ

రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరడం ఒక్కటే మిగిలింది: మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకే కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీబీఐ విచారణకు ఆదేశించారని మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరంపై విచారణను సీబీఐకు అప్పగింత వెనుక కేసీఆర్‌ను బదనాం చేసి ప్రాజెక్టును ఎండబెట్టే కుట్ర దాగి ఉందన్నారు. బనకచర్ల లింక్ ప్రాజెక్టును బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నందునే మోదీ, చంద్రబాబుతో కలిసి రేవంత్ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో సోమవారం ప్రశాంత్‌రెడ్డి ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'సీబీఐ విచారణ పేరిట మేడిగడ్డ బరాజ్‌ను శాశ్వతంగా మూసివేయాలని చూస్తున్నారు. బీజేపీకి సీబీఐ అనుబంధ సంస్థ అంటున్న రేవంత్‌రెడ్డి అదే సంస్థకు కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను అప్పగించారు. మోదీ, చంద్రబాబును సంతోషపెట్టిన రేవంత్ బీజేపీలో చేరడం ఒక్కటే మిగిలింది'అని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. 'బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు రేవంత్ ఇచ్చిన స్క్రిప్ట్‌ను చదివారు. రేవంత్, కేంద్రమంత్రి బండి సంజయ్ నడుమ ఉన్న దోస్తానా వల్లే ఆగమేఘాల మీద ఎన్‌డీఎస్‌ఏ కాళేశ్వరంపై నివేదిక ఇచ్చింది. కాంగ్రెస్, బీజేపీ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో కేసీఆర్‌పై కుట్రలు జరుగుతున్నాయి. అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రేవంత్‌రెడ్డి ప్రలోభాలకు గురి చేస్తున్నాడని వివేకానంద విమర్శించారు. రేవంత్‌ను నమ్మి కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చెట్టుకొకరు.. పుట్టకొకరు అన్నట్టుగా చెల్లా చెదురు అయ్యారన్నారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు గాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీబీఐ విచారణ తెలంగాణ అస్తిత్వంపై దాడి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మోదీ, చంద్రబాబుతో కలసి రేవంత్‌రెడ్డి భారీ కుట్ర
- కాళేశ్వరంపై సీబీఐ విచారణకు భయపడేది లేదు
- బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులతో టెలి కాన్ఫరెన్స్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబుతో కలసి తెలంగాణ అస్తిత్వంపై భారీ కుట్ర పన్నుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఆరోపించారు. సీబీఐ విచారణ పేరుతో తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసి వేయడం ద్వారా గోదావరి జలాలను ఆంధ్రకు తరలించే కుతంత్రాలకు ఈ ముగ్గురూ తెరతీశారన్నారు. తెలంగాణ గొంతుకగా ఉన్న కేసీఆర్, బీఆర్ఎస్‌ను లేకుండా చేసి.. తెలంగాణపై తిరిగి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మోదీ, చంద్రబాబు ఎజెండాకు అనుగుణంగా బనకచర్ల ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రేవంత్, తెలంగాణ రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు నిరసనగా సోమవారంతో పాటు, మంగళవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు చేపట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, శ్రేణులతో సోమవారం కేటీఆర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.

కాళేశ్వరంను పూర్తిగా ఎండబెట్టేందుకే

'కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిగా ఎండబెట్టేందుకే సీబీఐ విచారణకు రేవంత్ అప్పగించారు. సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలను మోదీ జేబు సంస్థలుగా విమర్శించిన రేవంత్ 48 గంటల్లోనే ఎందుకు మాట మార్చారో చెప్పాలి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఓ వైపు కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. మరోవైపు రేవంత్ మాత్రం మోదీ ప్రాపకం కోసం ఆ సంస్థలను ఉపయోగించుకుంటున్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కోరిన విధంగా సీబీఐకి కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ అంశాన్ని అప్పగించడం ఆ రెండు పార్టీల అక్రమ సంబంధానికి సాక్ష్యం. కేసీఆర్ మీద విష ప్రచారం చేయాలన్న దుర్మార్గ ఆలోచనతో రేవంత్ ఉన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్, సుంకిశాల సైడ్ వాల్, వట్టెం పంప్ హౌస్, పెద్దవాగు ప్రాజెక్టు కూలిపోయినా స్పందించని ఎన్‌డీఎస్ఏ, మేడిగడ్డపై తలాతోక లేని రిపోర్టులు ఇచ్చింది. రేవంత్ మీద ఈగ కూడా వాలకుండా ప్రధాని మోదీ కాపాడుతున్నారు. సీబీఐతో సహా ఏ విచారణ సంస్థకు అప్పగించినా భయపడేది లేదు. బీజేపీతో కలసి కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ఎదుర్కొంటాం. బెదిరింపులు, కేసులు మాకు కొత్త కాదు, తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాటాలు, త్యాగాలకు సిద్ధం'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్సీల ఆందోళన

కాళేశ్వరంపై సీబీఐ విచారణకు వ్యతిరేకంగా నినాదాలు



గన్‌పార్క్ వద్ద నిరసనలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించడాన్ని నిరసిస్తూ సోమ వారం గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ఉదయం శాసన మండలి సమావేశంలో కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు చర్చకు పట్టుబట్టారు. పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో మండలిని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. ఆ వెంటనే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నల్లకండువాలతో గన్‌పార్క్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఆందోళన చేపట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ ఆరోపించారు. సోమవారం ఆయన శాసనమండలి మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ రాష్ట్రపతి వద్ద రిజర్వేషన్ల బిల్లు ఉన్నా, జంతర్ మంతర్ వద్ద ధర్నాలు, ఆర్డినెన్సు పేరిట ప్రభుత్వం మభ్యపెడుతోందని మండిపడ్డారు. బీసీ బిల్లుకు బీఆర్ఎస్ పార్టీ తరఫున మద్దతు ఇవ్వడంతోపాటు బీసీ ఆర్డినెన్సుకు కూడా మద్దతు ఇచ్చామని గుర్తు చేశారు.

ఆ ఇద్దరి వల్లే కేసీఆర్‌కు మరక

▶ మొదటి పేజీ తరువాయి

సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో మేజర్ పాత్ర ఉన్నందునే ఐదేళ్ల పాటు నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావును రెండోసారి ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ దూరంగా పెట్టారన్నారు. అమెరికా పర్యటన నుంచి సోమవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్న ఎమ్మెల్సీ కవిత.. సాయంత్రం తెలంగాణ జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

ఇలాగైతే పార్టీ ఎలా ముందుకు పోతుంది?

'కేసీఆర్‌కు అవినీతి మరక అంటడానికి, ఆయనపై ఆరోపణలు రావడానికి కారకులెవరో బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ ప్రజలు ఆలోచించుకోవాలి. కేసీఆర్ ప్రజల కోసం ఆలోచిస్తే.. వీళ్లు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై సొంత వనరులు, ఆస్తుల కోసం ఆలోచించారు. కేసీఆర్ కాలిగోటికి సరిపోని వ్యక్తి కేసీఆర్ వైపు వేలెత్తి చూపి సీబీఐ విచారణ జరుపుతా అనేందుకు కారకులు ఎవరు? హరీశ్‌రావు, సంతోష్‌రావు నా మీద వ్యక్తిగతంగా అనేక కుట్రలు చేసినా ఇన్నాళ్లూ పేరు పెట్టి విమర్శించలేదు. కానీ ఇలాంటి వారిని మోస్తూ పోతే పార్టీ ఎలా ముందుకు పోతుంది? బీఆర్ఎస్ నాయకులకు కోపం వచ్చినా చేదు నిజాన్ని జీర్ణించుకోక తప్పదు..'అని కవిత అన్నారు.

నన్ను విమర్శిస్తే ఖబడ్దార్!

'హరీశ్, సంతోష్ వెనుక సీఎం రేవంత్ ఉంటూ వాళ్లను అన్ని విషయాల్లో కాపాడుతూ కేసీఆర్‌ను బదనాం చేస్తున్నారు. బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెడుతున్న అవినీతి అనకొండలను ఏమీ అనడం లేదు. అంతర్గతంగా వారి నడుమ ఉన్న అవగాహన బయటకు రావాలి. నన్ను.. బీజేపీ, కాంగ్రెస్, రేవంత్, బండి సంజయ్ నడిపిస్తున్నారని రేపటి నుంచి సోషల్ మీడియాలో విమర్శిస్తే ఖబడ్దార్. నేను ఎవరో చెప్తే ఆడే తోలుబొమ్మను కాను. నాది కేసీఆర్ రక్తం. స్వతంత్రంగా నేను అనుకున్న విషయాలను చెప్తా. రాజకీయంగా నాకు జరిగే కష్టం, నష్టాన్ని భరించేందుకు సిద్ధం. మా నాన్నకు లేఖ రాసిన నాటి నుంచి నాకు నరకం చూపిస్తూ సోషల్ మీడియాలో ఇష్టం ఉన్నట్లు రాయిస్తున్నారు. కేసీఆర్‌పై సీబీఐ విచారణ అంటే కడుపు రగులుతోంది. అభివృద్ధి విషయంలో కేసీఆర్ నిజాం బాటలోనే నడుస్తారు. కాళేశ్వరం ప్రాజెక్టును 200 ఏళ్ల పాటు గుర్తు పెట్టుకుంటారు. అలాంటి ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్‌పై అభాండాలు వేస్తుంటే గుండె తరుక్కుపోతోంది. మా నాన్న పరువు పోతే నాకు బాధ. కానీ మీకు మాత్రం డబ్బులు కావాలి. ఇలాంటి వ్యక్తులను దూరం పెట్టాలి. బీఆర్ఎస్ నాయకులు తిట్టుకున్నా, స్థానిక ఎన్నికల్లో నష్టం జరుగుతుందని అనుకున్నా సరే. మా నాన్న మీద సీబీఐ ఎంక్వైరీ పడిన తర్వాత పార్టీ ఉంటే ఎంత? పోతే ఎంత?

ఇష్టారీతిన మాట్లాడితే తోలు తీస్తాం

ఎన్నికల్లో ఒకసారి ఓడిపోతారు.. మరోసారి గెలుస్తారు. ఇలాంటి దుర్మార్గుల వల్లే ఓడిపోయే పరిస్థితి వచ్చింది. డబ్బులు, టీవీలు, సోషల్ మీడియా ఉన్నాయని ఇష్టారీతిన మాట్లాడితే తోలు తీస్తాం. కేసీఆర్‌పై పీసీ ఘోష్ కమిషన్లు, సీబీఐ విచారణలు వేస్తే తెలంగాణ బంద్‌కు పార్టీ పిలుపునివ్వాలి కదా? కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసేందుకే సీబీఐ విచారణకు ఆదేశించారు. నేను చెప్పిన పేర్లు ఉన్న వారితో రేవంత్‌కు అవగాహన లేకపోతే వారిపై విచారణ జరపాలి. కేసీఆర్ పేరు చెప్పుకోనిదే రేవంత్‌కు పూట గడవడం లేదు. వాస్తవానికి కేసీఆర్‌కు తెలంగాణ తప్ప.. తిండి, డబ్బు ధ్యాస ఉండదు. విచారణ నుంచి కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు.'అని కవిత పేర్కొన్నారు.

క్లుప్తంగా...

కల్వకుంట్ల కవితపై చర్యలు తీసుకోకపోతే హరీశ్‌రావు ఊరుకోడు

మంత్రి కోమటిరెడ్డి చిట్‌చాట్



సాక్షి, హైదరాబాద్ : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత.. మాజీమంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌రావుపై చేసిన సంచలన వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి స్పందించారు. సోమవారం మంత్రి మీడియాతో చిట్‌చాట్ చేస్తూ.. బీఆర్ఎస్‌లో కుటుంబపోరు ఎప్పటి నుంచో రగులుతోందని, కవిత ఇప్పుడు హరీశ్‌రావును లక్ష్యంగా చేసుకొని చేసిన ఆరోపణలతో ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోతే ఆయన ఊరుకోడు అని వ్యాఖ్యానించారు. కవితపై ఎలాంటి చర్య తీసుకోకపోతే.. తనే పార్టీ నుంచి వెళ్లిపోయి కొత్తపార్టీ పెట్టుకుంటారని తనకు సమాచారం ఉందన్నారు. కవిత విషయంలో ఏం చేయాలో రేపు ఆలోచిద్దాం అని కేసీఆర్ అన్నట్టు ఫాంహౌస్‌లో చర్చల్లో పాల్గొన్న నాయకుడొకరు తనకు చెప్పారని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఇంటి పంచాయితీలోకి తమను లాగొద్దని, ముఖ్యమంత్రి వారి వెనుక ఉన్నారన్న అభియోగాలను ఖండిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి పేరు ఇందులో లాగితే బాగుండదని హెచ్చరించారు. 'హరీశ్ ఉన్నా, సంతోష్‌రావు ఉన్నా సీబీఐ దర్యాప్తులో దోషులు తేలుతారు. ఇక బీఆర్ఎస్ పని అయిపోయినట్టే. మరో 20 ఏళ్ల వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది'అని కోమటిరెడ్డి అన్నారు.

సీబీఐ అక్రమాలను బయటపెడుతుందనే విశ్వాసముంది

కాళేశ్వరంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారంపై సీబీఐ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తుందనే నమ్మకం ఉందని బీజేపీ ఎంపీ, గత ప్రభుత్వంలో మాజీ ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. ఈ విచారణలో భాగంగా కాళేశ్వరంలో చోటుచేసుకున్న అక్రమాలను సీబీఐ బయటపెడుతుందనే సంపూర్ణ విశ్వాసం తమకుందన్నారు. ఈ విచారణను సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయంపై ఈటల మీడియాతో స్పందించారు. ఈ అంశంపై సరైన పద్ధతిలో విచారణ జరపడం రాష్ట్రప్రభుత్వానికి చేతకాదని తెలుసని పేర్కొన్నారు. దీనిపై సిద్ధం చేసిన నివేదిక తప్పుల తడక అని తమకు తెలుసునని చెప్పారు. ఈ రిపోర్టు ఏ విధంగానూ నిలబడదని వారికి పూర్తిగా అర్థమైంది కాబట్టే దీన్ని నిరాకరించేందుకు (డిసోన్) దర్యాప్తును సీబీఐకి అప్పగించారని ఈటల తెలిపారు.


కవిత వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాం

భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగినట్టు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఒప్పుకున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కారకులెవరనేది పక్కన పెడితే కేసీఆర్, హరీశ్‌రావుల హయాంలో కాళేశ్వరం కుంభకోణం జరిగిందని చెప్పిన ఆమె మాటలు జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను, అసెంబ్లీలో జరిగిన చర్చను బలపరిచే విధంగా ఉన్నాయని సోమవారం మీడియాతో అన్నారు. కవిత వ్యాఖ్యలను తాము స్వాగతిస్తున్నామని చామల తెలిపారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని చెప్తున్న కవిత మరో 200 ఏళ్ల కేసీఆర్ పేరు నిలిచిపోయేలా ప్రాజెక్టును కట్టారని అంటున్నారని, ఆమె ఏం మాట్లాడుతున్నారో ఆమెకే అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.సీఎం రేవంత్‌రెడ్డి.. హరీశ్‌రావు, సంతోష్‌లను కాపాడే ప్రయత్నం ఎందుకు చేస్తారని, ఈ విషయంలో కవిత వ్యాఖ్యలు తెలంగాణ సమాజాన్ని పక్క దోవ పట్టించేవిగా ఉన్నాయన్నారు.

అన్నారంలో సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం ఏడీసీపీ సర్వే



కాళేశ్వరం: అన్నారం బ్యారేజీలో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు ఏడీసీపీ (అకౌస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్) పరీక్షలను పుణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్ సీనియర్ సైంటిస్టు సంపత్ శ్రీకాంత్, సైంటిస్టు ఎం.నాగరాజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గురు, శుక్ర, శనివారాల్లో మేడిగడ్డ బ్యారేజీలో నిర్వహించగా.. సోమవారం ఆ బృందం అన్నారం బ్యారేజీలో బోటుకు ప్రత్యేక యంత్రాన్ని అమర్చి నీటి ప్రవాహ తీవ్రతను అంచనా వేశారు. ప్రస్తుతం బరాజ్‌లో 2.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, అంతే అవుట్‌ఫ్లోగా ఉంది. కాగా, గతంలో ఈ బరాజ్‌లో సీపేజీ లీకేజీల కారణంగా నీటిని నిల్వ చేయడం లేని విషయం తెలిసిందే.

'ప్రపంచంలో చదువుకు దూరమైన అతి ఎక్కువ మంది ఆడపిల్లలున్న దేశం భారత్ ఒక్కటే' అంటారు సఫీనా హుసేన్.
స్కూల్లో ఉన్న ఆడపిల్లల కంటే స్కూల్ మానేసిన ఆడపిల్లలు ఎక్కువ ఉండటంతో వారిని తిరిగి స్కూళ్లకు పంపడానికి ఆమె 'ఎడ్యుకేట్ గర్ల్స్' స్థాపించారు.
ఏళ్ల తరబడి ఆమె సాగించిన కృషి బాలికల జీవితాల్లో చదువును తెచ్చింది.
ఆమెకు 'రామన్ మెగసెసె అవార్డు' తెచ్చిపెట్టింది.
ఆసియా నోబెల్‌గా భావించే రామన్ మెగసెసెను సఫీనా స్థాపించిన 'ఎడ్యుకేట్ గర్ల్స్' ఎన్.జి.ఓకు ప్రకటించారు.

ఆడపిల్ల చదువుకు జీవితాన్ని ఇచ్చింది


సఫీనా హుసేన్

'మారుమూల గ్రామంలో అయినా సరే ఏ ఒక్క ఆడపిల్ల స్కూలుకు వెళ్లకుండా ఉండకూడదు. అదే మా ఎడ్యుకేట్ గర్ల్స్ లక్ష్యం' అంటారు సఫీనా హుసేన్.

54 ఏళ్ల ఈ సామాజిక కార్యకర్త 2007 లో బాలికా విద్య కోసం 'ఎడ్యుకేట్ గర్ల్స్' ఎన్.జి.ఓను స్థాపించారు. ఆ రోజు నుంచి ఈరోజు వరకూ సుమారు నాలుగు లక్షల మంది బాలికలను అక్షరాస్యత వైపు నడిపించారు. అందుకే ఆమె సంస్థకు ప్రతిష్ఠాత్మక రామన్ మెగసెసె అవార్డు 2025ను ప్రకటించారు. 1958 నుంచి ఇస్తున్న ఈ అవార్డు కింద 50 వేల యు.ఎస్.డాలర్ల నగదు కూడా ఉంటుంది.



'ఎడ్యుకేట్ గర్ల్స్‌కు రామన్ మెగసెసే అవార్డు రావడం చాలా సంతోషాన్నిచ్చింది. ఇదొక చారిత్రాత్మక క్షణం. భారతదేశంలో బాలికల విద్యకోసం ప్రజలతో కలిసి మేము చేస్తున్న ఈ ఉద్యమం గురించి ఈ అవార్డు వల్ల ప్రపంచవ్యాప్తంగా తెలుస్తుంది. బాలికలను శక్తిమంతం చేయడానికి, వారు అడ్డంకులను ఛేదించి మరిన్ని విజయాలు సాధించడానికి మనమంతా మరెంతో దూరం ప్రయాణించాల్సి ఉంది' అని అవార్డు ప్రకటన తర్వాత సఫీనా అన్నారు.

'టీమ్ బాలిక'ల విజయం

'ఎడ్యుకేట్ గర్ల్స్' ద్వారా స్కూలు మానేయించిన బాలికలను తిరిగి స్కూలుకు పంపడానికి సఫీనా ఎన్నుకున్న మార్గం ప్రతి ఊరి నుంచి ఒక చురుకైన యువతిని కార్యకర్తగా ఎంచుకోవడం. వీరిని 'టీమ్ బాలిక' అంటారు. ఈ బాలికలే ఇంటింటికి తిరిగి కుటుంబాలను ఒప్పించి డ్రాపవుట్ ఆడపిల్లలను తిరిగి బడికి చేరుస్తున్నారు. 2007లో 50 గ్రామాల్లో మొదలెట్టిన ఈ కార్యక్రమం నేడు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని 18 వేల గ్రామాల్లో బాలికలకు విద్యనందించేందుకు కృషి చేస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థలో 13 వేల మంది యువతులు టీమ్ బాలికలుగా గ్రామాల్లో పని చేస్తున్నారు. 'నా ఊరు.. నా



సమస్య... నేనే సమాధానం' అనేది వీరి నినాదం. తమ ఊరిని తామే బాగు చేసుకుందామని వీరు ముందుకొస్తే పెద్దలు మద్దతు తెలుపుతున్నారు. 'స్కూలు మాన్పించి ఇంటి పనులు చేయించడం బాలికల కలలను ఛిద్రం చేయడమే' అంటారు సఫీనా. కేవలం బాలికల్ని బడికి పంపడమే కాకుండా పాఠశాలలకు సౌకర్యాలు అందించడం, బాగా చదివే పిల్లలను కళాశాలల్లో చేర్పించడం, వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపించడం వంటివి కూడా 'ఎడ్యుకేట్ గర్ల్స్' చేపడుతుంది.

ఎవరీ సఫీనా?

సఫీనా హుస్సేన్ 1971లో ఢిల్లీలో జన్మించారు. ఈమె తండ్రి యూసఫ్ హుసేన్ అనే టీవీ నటుడు. 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్' నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన సఫీనా 1998 నుంచి 2004 వరకు శాన్‌ఫ్రాన్సిస్కోలోని 'చైల్డ్ ఫ్యామిలీ హెల్త్ ఇంటర్నేషనల్'కి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2005లో అమెరికా నుంచి ముంబయికి తిరిగొచ్చిన ఆమె స్థానిక పరిస్థితులను పరిశీలించారు. ప్రపంచంలో స్త్రీల జీవన విధానాలు అత్యంత దుర్భరంగా ఉన్న 20 దేశాల్లో భారత్ కూడా ఉందన్న సర్వే వివరాలు తెలుసుకొని ఆమె కలవరపడ్డారు. ప్రధానంగా విద్య విషయంలో తల్లిదండ్రులు ఆడ, మగ అంటూ భేదం చూపించడం, కొడుకును చదివిస్తూ కూతుర్ని ఇంటి పనుల్లో పెట్టడం వంటివి ఆమెను ఆలోచింపజేశాయి. ఆ పరిస్థితి మారాలంటే పల్లెల నుంచి పని మొదలుపెట్టాలని భావించారు. అలా 2007లో 'ఎడ్యుకేట్ గర్ల్స్' స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. ఈమె చేస్తున్న కృషి నచ్చి కత్రినా కైఫ్ తనకు తానుగా ముందుకొచ్చి 'ఎడ్యుకేట్ గర్ల్స్'కు అంబాసిడర్‌గా, టీమ్ బాలికగా పని చేశారు.

2035 నాటికి కోటి మంది బాలికలు

'ఎడ్యుకేట్ గర్ల్స్' చేసిన కృషి ఫలితంగా లక్షలాది బాలికలు బడులకు చేరి అక్షరాలు దిద్దారు. వారిలో కొందరు స్కూళ్లు దాటి కాలేజీల్లోనూ అడుగుపెట్టారు. ఇదంతా సమష్టి కృషితో సాధ్యం అంటారు సఫీనా హుస్సేన్. సంస్థ నిర్వహణలో తనకు సాయం అందించినవారు, తనతో కలిసి పనిచేస్తున్నవారందరి కృషి ఈ విజయంలో ఉందని అంటున్నారు. 2035 నాటికి కోటి మంది బాలికల్ని బడుల్లో చేర్పించడమే లక్ష్యంగా సాగుతున్నట్లు వివరించారు.

జాతీయ పౌష్టికాహార వారోత్సవం
సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు

తూకం కాదు... సమతూకం ఉండాలి

పోషకాహారం అంటే అత్యంత ఖరీదైన ఆహారం అని కాదు. అలాగని కేవలం ఆకలి తీర్చుకోవడానికి తీసుకునే ఆహారమూ కాదు. రుచితో పాటు పోషక విలువలు ఉండాలి. అంతకు ముందు మన శరీరానికి ఎలాంటి ఆహారం కావాలో అర్థం చేసుకోవడం ముఖ్యం. శరీరానికి అవసరమైన అన్ని పోషకాలను సరైన ప్రమాణంలో అందిస్తే అవి ఆరోగ్యంగా పనిచేయడానికి సహాయపడతాయి. అందుకే సమతుల ఆహారంపై దృష్టి పెట్టమని నిపుణులు చెబుతుంటారు.

మనం తీసుకునే ఆహారం రోజంతా పనిచేయడానికి అవసరమైన శక్తిని అందిస్తుంది. శరీర ఎదుగుదలకు ముఖ్యంగా పిల్లలు, యుక్తవయసులో ఉన్నవారికి సరైన పోషకాలు ఎముకలు, కండరాలు, ఇతర కణజాలాల పెరుగుదలకు సహాయపడతాయి. మన రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. వివిధ రకాల వ్యాధుల నుండి రక్షిస్తుంది. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కొన్ని పోషకాలు మన మెదడు పనితీరును, మానసిక స్థితిని మెరుగుపరచటంలో ముఖ్య పాత్రను పోషిస్తాయి. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదంతోపాటు గుండె జబ్బులు, మధుమేహం, కొన్ని రకాల క్యాన్సర్లను తగ్గిస్తాయి.



కార్బోహైడ్రేట్లు మన శరీరానికి తప్పక కావాల్సిందే. అవి తృణధాన్యాలు, కూరగాయలలో లభిస్తాయి. శక్తికి, హార్మోన్ల ఉత్పత్తికి ఐరన్ తప్పక అవసరం. ఆరోగ్యకరమైన కొవ్వులు మేలు చేస్తాయి.

ప్రొటీన్లు కండరాలకు, హార్మోన్ల ఉత్పత్తికి అవసరం. మాంసం, గుడ్లు, పాల ఉత్పత్తులు, పప్పుధాన్యాలలో లభిస్తాయి. విటమిన్లు శరీరంలోని రసాయన చర్యలకు సహాయపడతాయి. వివిధ రకాల పండ్లు, కూరగాయలలో లభిస్తాయి. మినరల్స్ ద్వారా ఎముకల నిర్మాణం జరుగుతుంది. అదేవిధంగా నరాల పనితీరుకు క్యాల్షియం, ఐరన్, పొటాషియం వంటి ఖనిజాలు ముఖ్యమైనవి. రక్తంలో ఐరన్ శాతం తగ్గితే బలహీనంగా అవుతారు. త్వరగా నీరసం వస్తుంది. తలనొప్పి, జుట్టు రాలడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

బచ్చలి, పాలకూర, గోంగూర వంటి ఆకుపచ్చ కూరలు, బీట్‌రూట్, చిక్కుళ్ళు, శెనగ, మటన్, పెసలు, నట్స్, ఎండు ఖర్జూరాలు, ఎండుద్రాక్ష, తృణధాన్యాలు, గుడ్లు.. వంటివి శరీరం లో ఐరన్ శాతం పెరగడానికి సహాయపడతాయి. పిల్లలకు వారి వయసు, యాక్టివిటీని బట్టి 1000 నుంచి 1400 కిలో క్యాలరీలు అవసరం అవుతాయి. పెద్ద పిల్లలైతే 1800 కిలో క్యాలరీల వరకు తీసుకోవచ్చు. ఎదిగే వయసు కాబట్టి జంక్‌ఫుడ్ కాకుండా రోజువారీ భోజనంలో మొలకెత్తిన గింజలు, చేపలు, గుడ్లు, తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఇవ్వాలి. చిన్నపిల్లలైతే రోజుకు 4 గ్లాసులు, పెద్దపిల్లలైతే 12 గ్లాసుల వరకు నీళ్లు తాగేలా చూడాలి. వాతావరణం బట్టి నీటి మోతాదులో మార్పులు ఉండవచ్చు. ప్రతి అరగంటలకు ఒకసారి నీళ్లు కొద్దిగానైనా తాగేలా సూచనలు ఇవ్వాలి.



– డా.బి.జానకి, న్యూట్రిషనిస్ట్

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 1న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,06,910	1,07,630	1,05,880	1,06,740	1,06,250	1,05,870
బంగారం (22 క్యారెట్లు)	1,00,120	97,050	97,050	99,990	97,750	97,050
వెండి	1,25,800	1,26,100	1,36,000	1,23,700	1,26,000	1,36,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా


• వెంకట సతీష్, రామ్‌చరణ్, ఏఆర్ రెహమాన్, బుచ్చిబాబు

మొదటి పాటకి వేళాయె

రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో జాన్వీకపూర్ హీరోయిన్. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ మూవీ 2026 మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి మొదటి పాటని త్వరలోనే విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ మేరకు రామ్‌చరణ్, బుచ్చిబాబు, వెంకట సతీష్ కలిసి ఏఆర్ రెహమాన్ స్టూడియోలో ఉన్న ఫోటోని షేర్ చేసింది యూనిట్. ఈ చిత్రానికి కెమెరా: ఆర్. రత్నవేలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై.ప్రవీణ్ కుమార్.

గ్యాంగ్‌స్టర్ దెయ్యం

'సత్య (1998)', 'కౌన్ (1999)', 'శూల్ (1999)' వంటి చిత్రాల తర్వాత నటుడు మనోజ్ బాజ్‌పాయ్, దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'పోలీస్ స్టేషన్ మే భూత్'. ఈ హారర్ కామెడీ చిత్రంలో జెనీలియా ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. వావ్ ఎమిరేట్స్, కర్మ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఈ మూవీ చిత్రీకరణ మొదలైందంటూ తెలిపి ఫస్ట్‌లుక్, గ్లింప్స్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఓ గ్యాంగ్‌స్టర్‌ను ఓ పోలీస్ ఎన్‌కౌంటర్ చేస్తాడు. చనిపోయిన ఆ గ్యాంగ్‌స్టర్ దెయ్యంగా వచ్చి, ఆ పోలీస్ స్టేషన్‌ను హంట్ చేస్తాడు. అందుకే 'పోలీస్‌స్టేషన్ మే భూత్' టైటిల్ పెట్టాం'' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు రామ్‌గోపాల్ వర్మ. ''రెండు దశాబ్దాల తర్వాత వర్మగారితో మళ్లీ సినిమా చేయడం థ్రిల్లింగ్‌గా ఉంది'' అని మనోజ్ బాజ్‌పాయ్ తెలిపారు.


• మనోజ్ బాజ్‌పాయ్

బర్త్‌డే స్పెషల్


• పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. నేడు (సెప్టెంబర్ 2) పవన్ కల్యాణ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి పవన్ కల్యాణ్ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల 6న ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌తో టాకీ భాగం దాదాపు పూర్తవుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: అయనంక బోస్, సీఈఓ: చెర్రీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: దినేష్ నరసింహన్, హరీష్.

తెలుగు ప్రేక్షకుల ప్రేమ ప్రత్యేకం

– శివ కార్తికేయన్


• ఎన్వీ ప్రసాద్, రుక్మిణి, శివ కార్తికేయన్

''నా సినిమాలు 'రెమో', 'వరుణ్ డాక్టర్', 'కాలేజ్ డాన్', 'మహావీరుడు', 'అమరన్' చిత్రాలను తెలుగు ప్రేక్షకులు బాగా సపోర్ట్ చేశారు. ఇప్పుడు 'మదరాసి' సినిమాను కూడా ఆదరించాలి. విజయం కంటే మీరు (ప్రేక్షకులు) చూపించే ప్రేమే నాకు చాలా ప్రత్యేకం'' అని శివ కార్తికేయన్ చెప్పారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్, రుక్మిణీ వసంత్ జోడీగా నటించిన చిత్రం 'మదరాసి'. శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 5న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మదరాసి' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శివ కార్తికేయన్ మాట్లాడుతూ– ''చిరంజీవి, మహేశ్‌బాబుగార్లను డైరెక్ట్ చేసిన మురుగదాస్ గారితో సినిమా చేయడం సంతోషంగా ఉంది. మా నిర్మాత తిరుపతి ప్రసాద్‌గారు మంచి కంటెంట్ కోసం ఎంతైనా ఖర్చు చేస్తారు. నిర్మాతగా ఆయనలో ఆ క్వాలిటీ నాకు చాలా ఇష్టం.. అందుకే తెలుగులో తరచుగా వెయ్యికోట్ల కలెక్షన్స్ రాబడుతున్న చిత్రాలు వస్తున్నాయి'' అని చెప్పారు. ''మా సినిమా ఆరంభంలో రుక్మిణి అప్‌కమింగ్ హీరోయిన్. కానీ, ఇప్పుడు ఎన్టీఆర్– ప్రశాంత్‌నీల్ సినిమా, యశ్ 'టాక్సిక్', రిషబ్ శెట్టి 'కాంతార' ప్రీక్వెల్ వంటి చిత్రాలు చేస్తున్నారు'' అని నిర్మాత ఎన్వీ ప్రసాద్ తెలిపారు. ''మదరాసి' నాకు చాలా ప్రత్యేకం'' అన్నారు రుక్మిణీ వసంత్.

దీపావళికి మిత్రమండలి

ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం, విష్ణు ఓ.ఐ, రాగ్ మయూర్, ప్రసాద్ బెహ్రా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మిత్ర మండలి'. విజయేందర్. ఎస్ దర్శకత్వంలో బన్నీ వాస్ సమర్పణలో కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. ఈ సినిమాని దీపావళి కానుకగా అక్టోబరు 16న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''స్నేహం ప్రధానంగా నడిచే కథ ఇది. ప్రేక్షకులు మనస్ఫూర్తిగా నవ్వుకునేలా ఈ సినిమా ఉంటుంది'' అని చిత్రబృందం తెలిపింది. ఈ సినిమాకు సంగీతం: ఆర్ఆర్ ధ్రువన్, సహ నిర్మాత: సోమరాజు పెన్మెత్స.


• ప్రియదర్శి

లిటిల్ హార్ట్స్ చూసి నవ్వుకుంటారు

– బన్నీ వాస్


• వంశీ నందిపాటి, బన్నీ వాస్

''లిటిల్ హార్ట్స్' చిత్ర కథ బాగుంది. యూత్ కంటెంట్‌తో మంచి వినోదాత్మకంగా రూపొందిన ఈ సినిమాలో ఎక్కడా అశ్లీలత ఉండదు.. కుటుంబమంతా కలిసి చూడొచ్చు. మా చిత్రం చూసి, ప్రేక్షకులు హాయిగా నవ్వుకుంటారు'' అని నిర్మాత బన్నీ వాస్ తెలిపారు. మౌళి తనుజ్, శివానీ నాగరం జంటగా సాయి మార్తాండ్ దర్శకత్వం వహించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్‌పై ఆదిత్య హాసన్ నిర్మించారు. ఈ సినిమాని బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ నెల 5న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా బన్నీ వాస్ మాట్లాడుతూ– ''సినిమాలకు ప్రేక్షకులు రావాలని మనం డిమాండ్ చేయడంలో అర్థం లేదు. సినిమా బాగుంటే వాళ్లే వస్తారు. మల్టీప్లెక్స్‌లో ఫుడ్ రేట్స్ ఎక్కువగా ఉన్నాయనేది నిజమే. అయితే మూవీ బాగుంటే ప్రేక్షకుడు ఆ ఖర్చు భరించేందుకు సిద్ధంగా ఉన్నాడు. రోజుకి ఐదు షోలు వేయాలని ప్రభుత్వం ఆదేశించినా పాటించడం లేదు.. ఇక్కడ నిబంధనలు ఎన్నో ఉంటాయి. కానీ, పాటించడమే అసాధ్యం'' అన్నారు. వంశీ నందిపాటి మాట్లాడుతూ– ''బన్నీ వాస్‌గారు తన బ్యానర్ నుంచి తీసుకొస్తున్న తొలి చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ప్రేక్షకుల అభిరుచిలో మార్పు వచ్చింది. దానికి తగినట్లే నిర్మాతలూ మారాల్సి ఉంది'' అని తెలిపారు.


యాక్షన్ టన్నెల్


• అథర్వ

అథర్వా మురళి హీరోగా నటించిన చిత్రం 'టన్నెల్'. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో లావణ్యా త్రిపాఠి హీరోయిన్‌గా, అశ్విన్ కాకుమాను విలన్‌గా నటించారు. లచ్చురామ్ ప్రొడక్షన్స్‌పై ఎ. రాజు నాయక్ ఈ చిత్రాన్ని తెలుగులో ఈ నెల 12న రిలీజ్ చేస్తున్నారు. ''యాక్షన్ ప్యాక్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా నటించారు అథర్వ. క్రూరమైన హత్యలకు పాల్పడుతున్న ఓ సైకోను ఆయన ఎలా పట్టుకున్నారు? అనే కథాంశంతో ఈ చిత్రం సాగుతుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జస్టిన్ ప్రభాకరన్, కెమెరా: శక్తి శరవణన్.

మోడ్రన్ బ్యూటీ

అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటించిన చిత్రం 'బ్యూటీ'. జె.ఎస్.ఎస్. వర్ధన్ దర్శకత్వంలో వానర సెల్యులాయిడ్, జీ స్టూడియోస్, మారుతీ టీమ్ ప్రొడక్ట్ పతాకాలపై అడిదల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కుమార్ బన్సాల్ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సినిమా నుంచి 'ప్రెట్టీ ప్రెట్టీ.. మోడ్రన్ బ్యూటీ.. నడుపుతుందే.. మోటార్ స్కూటీ..' అంటూ సాగే 'ప్రెట్టీ ప్రెట్టీ..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించిన ఈ పాటకి సనరే సాహిత్యం అందించగా, పీవీఎన్ఎస్ రోహిత్ పాడారు.


• అంకిత్, నీలఖి

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


• హవీష్

హీరో హవీష్, దర్శకుడు త్రినాథరావు నక్కిన కాంబోలో రూపొందుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'నేను రెడీ'. కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. బ్రహ్మానందం, 'వెన్నెల' కిషోర్, మురళీ శర్మ, వీటీ గణేషన్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. హైదరాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో 'నేను రెడీ' టాకీ పార్ట్ షెడ్యూల్ ప్రారంభమైంది. హీరో, హీరోయిన్‌తోపాటుగా, ప్రధాన నటీనటులపై కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ''ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా మా సినిమా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు మిక్కీ జె. మేయర్ సంగీతం అందిస్తున్నారు.

అర్జున్ చక్రవర్తి ఆరేళ్ల కష్టం

– విజయ రామరాజు


• విజయ రామరాజు, సిజా రోజ్

''అర్జున్ చక్రవర్తి' ఆరేళ్ల కష్టం. మా కష్టానికి ఇంత అద్భుతమైన స్పందన రావడం చాలా ఆనందంగా అనిపించింది. ప్రేక్షకులకు చాలా మంచి సినిమా చూశామనే మంచి అనుభూతిని మా మూవీ ఇస్తుంది'' అని విజయ రామరాజు చెప్పారు. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో విజయ రామరాజు, సిజా రోజ్ జోడీగా నటించిన చిత్రం 'అర్జున్ చక్రవర్తి'. శ్రీని గుబ్బల నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 29న విడుదల అయింది. సోమవారం నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో విక్రాంత్ రుద్ర మాట్లాడుతూ–''మా సినిమాని ఇంకా చాలామంది చూడలేదు.. తప్పక చూడండి'' అని పేర్కొన్నారు. ''మా మూవీని సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు'' అన్నారు శ్రీని గుబ్బల. ఈ మీట్‌లో సిజా రోజ్, నటుడు దయానంద్ రెడ్డి మాట్లాడారు.



వచ్చే ఏడాది భారత్‌లో వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్‌లో ప్రతిష్టాత్మక టోర్నీ వరల్డ్ చాంపియన్‌షిప్‌కు 17 ఏళ్ల తర్వాత భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. 2026 ఆగస్టులో న్యూఢిల్లీ వేదికగా ఈ టోర్నీ జరుగుతుంది. మన దేశంలో చివరిసారిగా 2009లో వరల్డ్ చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. పారిస్‌లో జరిగిన 2025 టోర్నీ ముగింపు సందర్భంగా వచ్చే ఏడాది వేదిక వివరాలను ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ప్రకటించింది. ఈ కార్యక్రమంలో బీడబ్ల్యూఎఫ్ అధ్యక్షురాలు ఖున్‌యింగ్ పటామా, భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) కార్యదర్శి సంజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి లోపాలు లేకుండా వంద శాతం అత్యుత్తమ స్థాయిలో ఈ మెగా టోర్నీని తమ దేశంలో నిర్వహిస్తామని మిశ్రా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రపంచ బ్యాడ్మింటన్‌లో నిలకడగా విజయాలు సాధిస్తున్న జట్లలో భారత్ కూడా ఒకటి. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఇప్పటి వరకు 15 పతకాలు గెలుచుకుంది. 1983లో ప్రకాశ్ పడుకోన్ పురుషుల సింగిల్స్‌లో కాంస్యంతో తొలి పతకం అందించగా... 2011 నుంచి ప్రతీ ఏటా కచ్చితంగా మన ఆటగాళ్లు ఏదైనా ఒక పతకం గెలుస్తూ వచ్చారు. అత్యధికంగా పీవీ సింధు ఒక స్వర్ణం సహా మొత్తం ఐదు పతకాలు సాధించింది.



డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా (ఫైల్)

విజేత జట్టుకు రూ. 39 కోట్ల 42 లక్షలు

రన్నరప్ జట్టుకు రూ. 19 కోట్ల 70 లక్షలు

మహిళల వన్డే వరల్డ్ కప్ ప్రైజ్‌మనీ భారీగా పెంపు

దుబాయ్: మహిళల క్రికెట్‌కు మరింత ఊతమిచ్చే నిర్ణయాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీసుకుంది. ఈనెల 30 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు భారత్–శ్రీలంక వేదికగా జరిగే మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో విజేతతో పాటు రన్నరప్, ఇతర నగదు పురస్కారాన్ని భారీగా పెంచింది. గత టోర్నీతో పోలిస్తే మొత్తం ప్రైజ్‌మనీ దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. 2025 వన్డే వరల్డ్ కప్‌లో విజేతగా నిలిచే జట్టుకు 48 లక్షల 80 వేల డాలర్లు (రూ. 39 కోట్ల 42 లక్షలు) లభిస్తాయి. 2022 వరల్డ్ కప్‌తో పోలిస్తే ఇది 239 శాతం ఎక్కువ కావడం విశేషం. ఫైనల్లో ఓడిన జట్టుకు 22 లక్షల 40 వేల డాలర్లు (రూ. 19 కోట్ల 70 లక్షలు) అందుకుంటుంది. సెమీఫైనల్లో ఓడిన రెండు జట్లకు 11 లక్షల 20 వేల డాలర్ల (రూ. 9 కోట్ల 85 లక్షలు) చొప్పున లభిస్తాయి. గ్రూప్ దశలో ప్రతి విజయానికి ఒక్కో జట్టు 34,314 డాలర్ల (రూ. 30 లక్షల 18 వేలు) చొప్పున అందుకుంటుంది. 5వ, 6వ స్థానాల్లో నిలిచిన రెండు జట్లకు 7 లక్షల డాలర్ల (రూ. 6 కోట్ల 15 లక్షలు) చొప్పున... 7వ, 8వ స్థానాల్లో నిలిచిన రెండు జట్లకు 2 లక్షల 80 వేల డాలర్ల (రూ. 2 కోట్ల 46 లక్షలు) చొప్పున ఇస్తారు. మొత్తంగా ఈ టోర్నీ కోసం 1 కోటీ 38 లక్షల 80 వేల డాలర్లు (రూ. 122 కోట్ల 10 లక్షలు) ప్రైజ్‌మనీగా కేటాయించారు. గత టోర్నీ ప్రైజ్‌మనీ 35 లక్షల డాలర్లతో పోలిస్తే ఏకంగా 297 శాతం పెరగడం పెద్ద విశేషం. రెండేళ్ల క్రితం భారత్‌లో జరిగిన పురుషుల వన్డే వరల్డ్ కప్‌లో కూడా ఇంతకంటే తక్కువ ప్రైజ్‌మనీనే (సుమారు రూ.88.26 కోట్లు) ఉంది. 'మహిళల క్రికెట్‌ను మరింతగా అభివృద్ధి చేయడంతో పాటు పురుషులతో సమానంగా గుర్తింపు ఇవ్వడమే ఐసీసీ లక్ష్యం. దానికి అనుగుణంగానే ఈ భారీ ప్రైజ్‌మనీ పెంపుదలను నిర్ణయించాం. ఈ పెరుగుదల మహిళల క్రికెట్ చరిత్రలో కొత్త మలుపుగా నిలిచిపోతుంది' అని ఐసీసీ చైర్మన్ జై షా ప్రకటించారు.

భారత్ 15
కజకిస్తాన్ 0

- 'సూపర్-4' దశకు టీమిండియా
- లీగ్ దశలో అజేయంగా నిలిచిన ఆతిథ్య జట్టు

రాజ్‌గిర్ (బిహార్): తొలి రెండు లీగ్ మ్యాచ్‌ల్లో ఒక్కో గోల్ తేడాతో నెగ్గిన భారత హాకీ జట్టు... చివరి లీగ్ మ్యాచ్‌లో మాత్రం చెలరేగిపోయింది. ఆసియా కప్ పురుషుల హాకీ టోర్నీలో భాగంగా... కజకిస్తాన్ జట్టుతో సోమవారం జరిగిన పూల్ 'ఎ' ఆఖరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 15–0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్ తరఫున ఎనిమిది మంది ఆటగాళ్లు గోల్స్ చేశారు. టీమిండియా సగటున నాలుగు నిమిషాలకు ఒక్కో గోల్ సాధించడం విశేషం. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి టీమిండియా అజేయంగా నిలిచింది. తొమ్మిది పాయింట్లతో పూల్ 'ఎ'లో అగ్రస్థానం పొందిన భారత బృందం 'సూపర్–4' సెమీఫైనల్ దశకు అర్హత సాధించింది.

అంతర్జాతీయస్థాయిలో తొలిసారి కజకిస్తాన్‌తో పోటీపడ్డ భారత్ ప్రత్యర్థి జట్టుపై ఎడతెరిపిలేని దాడులు నిర్వహించి హడలెత్తించింది. ఐదో నిమిషంలో భారత్ నుంచి తొలి గోల్ నమోదుకాగా... మ్యాచ్ ముగియడానికి మరో నిమిషం వరకు ఈ గోల్స్ వేట కొనసాగింది. భారత్ తరఫున అభిషేక్ (5వ, 8వ, 20వ, 59వ నిమిషాల్లో) అత్యధికంగా నాలుగు గోల్స్ చేశాడు. సుఖ్‌జీత్ సింగ్ (15వ, 32వ, 38వ నిమిషాల్లో), జుగ్‌రాజ్ సింగ్ (24వ, 31వ, 47వ నిమిషాల్లో) మూడు గోల్స్ చొప్పున సాధించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (26వ నిమిషంలో), అమిత్ రోహిదాస్ (29వ నిమిషంలో), రాజిందర్ సింగ్ (32వ నిమిషంలో), సంజయ్ (54వ నిమిషంలో), దిల్‌ప్రీత్ సింగ్ (55వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. భారత జట్టుకు 13 పెనాల్టీ కార్నర్‌లు, 2 పెనాల్టీ స్ట్రోక్‌లు లభించాయి. 13 పెనాల్టీ కార్నర్‌లలో కేవలం నాలుగింటిని మాత్రమే భారత ఆటగాళ్లు గోల్స్‌గా మలిచారు. లేదంటే భారత్ ఖాతాలో మరిన్ని గోల్స్ చేరేవి. కజకిస్తాన్ జట్టు తమకు లభించిన మూడు పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసుకుంది.

చైనా ముందుకు...

పూల్ 'ఎ'లో భాగంగా చైనా, జపాన్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్ 2–2తో 'డ్రా'గా ముగిసింది. చైనా, జపాన్ జట్లు నాలుగు పాయింట్లతో సమంగా నిలిచినా... గోల్స్ అంతరంలో జపాన్‌ను (6 గోల్స్) వెనక్కి నెట్టిన చైనా (11 గోల్స్) జట్టుకు 'సూపర్–4' బెర్త్ దక్కింది. పూల్ 'బి' నుంచి డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియా, మలేసియా జట్లు కూడా 'సూపర్–4' దశకు అర్హత పొందాయి. నేడు విశ్రాంతి దినం. బుధవారం నుంచి భారత్, కొరియా, చైనా, మలేసియా జట్ల మధ్య 'సూపర్–4' దశ మ్యాచ్‌లు మొదలవుతాయి. బుధవారం జరిగే మ్యాచ్‌ల్లో దక్షిణ కొరియాతో భారత్ (రాత్రి గం. 7:30 నుంచి), మలేసియాతో చైనా (సాయంత్రం గం. 5 నుంచి) తలపడతాయి.


సుఖ్‌జీత్ (జెర్సీ నంబర్ 34)కు సహచరుడి అభినందన

ఐఎస్‌ఎల్‌పై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహణకు సంబంధించి నెలకొన్న వివాదంపై సుప్రీం కోర్టు తమ తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. ఈ టోర్నీ నిర్వహణ విషయంలో అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్), నిర్వాహక హక్కులు ఉన్న ఫుట్‌బాల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (ఎఫ్‌డీఎస్‌ఎల్) మధ్య ఒప్పందం పునరుద్ధరణ జరగాల్సి ఉంది. అయితే వేర్వేరు కారణాలతో ఇది సాధ్యం కాలేదు. దాంతో ఐఎస్‌ఎల్‌పై అనిశ్చితి నెలకొంది. దాంతో ఈ లీగ్‌లో సంబంధం ఉన్న పలువురు తమకు స్పష్టత కావాలంటూ కోర్టుకెక్కారు. తాము ముందుగా సంక్షిప్త తీర్పు ఇస్తామని, ఆ తర్వాత ఏఐఎఫ్‌ఎఫ్ నియమావళితో పాటు కేంద్ర ప్రభుత్వ కొత్త క్రీడా బిల్లును పరిగణనలోకి తీసుకుంటూ తుది తీర్పు ఇస్తామని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జయమాల బాగ్చిలతో కూడా బెంచ్ స్పష్టం చేసింది.

- యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ ఫలితాలు

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


పైరేట్స్ రెయిడర్‌ను నిలువరిస్తున్న యోధాస్ డిఫెండర్లు

పైరేట్స్‌కు యోధాస్ షాక్

విశాఖ స్పోర్ట్స్: ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో యూపీ యోధాస్ జోరు పెంచుతోంది. ఈ సీజన్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ 34–31తో మూడుసార్లు చాంపియన్ అయిన పట్నా పైరేట్స్‌ను కంగుతినిపించింది. ఆట ఆరంభంలో పైరేట్స్ పైచేయి కనబరిచింది. మొదటి పది నిమిషాలైతే చకచకా పాయింట్లు రాబట్టిన పట్నా 7–6తో ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత యూపీ యోధాస్ ఆటగాళ్లు సమష్టిగా రాణించడంతో పట్నా వెనుకబడింది. రెయిడర్లలో గగన్ గౌడ 7 పాయింట్లు తెచ్చిపెట్టాడు. మిగతా వారిలో భవాని రాజ్‌పుత్, శివమ్ చెరో 5 పాయింట్లు చేశారు. డిఫెండర్లలో కెప్టెన్ సుమిత్, అషు సింగ్ తలా 5 పాయింట్లు సాధించారు. పట్నా పైరేట్స్ జట్టులో రెయిడర్లు అయాన్ (9) మణిందర్ సింగ్ (7) రాణించారు. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో మాజీ చాంపియన్ పుణేరి పల్టన్ 41–19తో గుజరాత్ జెయంట్స్‌పై అలవోక విజయం సాధించింది. రెయిడింగ్‌లో ఆదిత్య షిండే (6), పంకజ్ (5), డిఫెండర్లలో అభినేశ్ (6), గౌరవ్ ఖత్రి (4) అద్భుతంగా ఆడారు. ఆల్‌రౌండర్లు అస్లామ్ (5), గుర్దీప్ (4)లు కూడా మెరుగ్గా రాణించడంతో పుణేరి జట్టు క్రమం తప్పకుండా పాయింట్లు సాధించింది. గుజరాత్ తరఫున రెయిడర్ రాకేశ్ (6) మాత్రమే చెప్పుకోదగ్గ ప్రదర్శన కనబరిచాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో దబంగ్ ఢిల్లీతో బెంగళూరు బుల్స్, జైపూర్ పింక్ పాంథర్స్‌తో పట్నా పైరేట్స్ తలపడతాయి.

తెలంగాణ విద్యా విధానంపై కమిటీ

- చైర్‌పర్సన్‌గా కె.కేశవరావు.. సభ్యులుగా మరో ఆరుగురు
- నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ అమలుపై పరిశీలన
- అక్టోబర్ 30లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఓ కమిటీని వేసింది. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, కమిటీ చైర్మన్ సిఫార్సు మేరకు మరో వ్యక్తి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ కమిటీ అధ్యయనం చేయాల్సిన అంశాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం–2020ని తెలంగాణ విద్యావిధానానికి అనుగుణంగా అమలు చేయడంలో సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తుంది. ఉద్యోగ అవకాశాలు, విద్యార్థులకు నైపుణ్యం పెంపు, అంతర్జాతీయ మార్కెట్లో అవకాశాలు పెంచడం, డిజిటల్ విద్యా విధానం, కొత్త ఆవిష్కరణలు, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ పెంచడంలో విద్యా విధానం ఎలా ఉండాలనే అంశాలను కమిటీ అధ్యయనం చేయాల్సి ఉంది. పాఠశాల, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, ఒకేషనల్ కోర్సుల్లో నైపుణ్యంతో కూడిన ప్రొఫెషనల్ విద్యా విధానం వంటి అంశాలను లోతుగా అధ్యయనం చేస్తుంది. అక్టోబర్ 30వ తేదీలోగా ఈ కమిటీ నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

రాష్ట్రీయం

నాలుగేళ్ల స్థానికత సబబే

ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ జీవో 33ని సమర్థించిన సుప్రీంకోర్టు

- స్థానిక కోటా నిబంధనలకు గ్రీన్‌సిగ్నల్.. హైకోర్టు తీర్పు రద్దు చేస్తూ తీర్పు
- ఇతర ప్రాంతాల్లో చదివినా లోకల్‌గా పరిగణించాలని పలువురు వేసిన పిటిషన్లు డిస్మిస్
- 15% సీట్లు ఆల్ ఇండియా కోటాకు.. మిగతా 85% స్థానిక విద్యార్థులకే
- నాలుగు కేటగిరీల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం లభించనున్న మినహాయింపు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ స్థానిక కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు రాష్ట్రంలో వరుసగా తొమ్మిది, పదో తరగతితో పాటు ఇంటర్ రెండేళ్లు కలిపి నాలుగేళ్లు చదివిన వారే అర్హులంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో–33ని సుప్రీంకోర్టు సమర్థించింది. తెలంగాణ స్థానిక కోటా కింద ప్రవేశాలకు నాలుగేళ్ల స్థానికత నిబంధన తప్పనిసరని స్పష్టం చేసింది. స్థానిక రిజర్వేషన్లపై ప్రతి రాష్ట్రానికీ సొంతంగా నిబంధనలను తయారు చేసుకొనే అధికారం ఉందంటూ తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదనలతో ఏకీభవించింది. కొంతకాలం తెలంగాణ వెలుపల నివసించినంత మాత్రాన రాష్ట్ర శాశ్వత నివాసితులకు మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలను నిరాకరించడం కుదరదంటూ హైకోర్టు వెలువరించిన తీర్పును సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. ఇతర ప్రాంతాల్లో చదివినప్పటికీ తమను స్థానికులుగా పరిగణించాలని కోరుతూ పలువురు విద్యార్థులు వేసిన పిటిషన్లను సైతం సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అప్పీల్‌ను అనుమతిస్తూ చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది. 2017లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల నిబంధనలను, ఆ నిబంధనలకు 2024లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలు సబబేనని సమర్థించింది. అదే సమయంలో రాష్ట్రానికి చెందిన నాలుగు కేటగిరీల్లోని ప్రభుత్వ ఉద్యోగులు ఇతర రాష్ట్రాల్లో విధులు నిర్వహించినట్లు రుజువులు చూపడం ద్వారా



వారి పిల్లలు స్థానిక కోటా నిబంధన నుంచి మినహాయింపు పొందే అవకాశాన్ని సుప్రీంకోర్టు కల్పించింది. అయితే తెలంగాణ స్థానికత వర్తించకపోయినా గతేడాది ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గతేడాది కోర్టును ఆశ్రయించినందుకు 135 మంది విద్యార్థులకు ఆ ఒక్కసారికి మినహాయింపు ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం అంగీకరించడం తెలిసిందే.

హైకోర్టు తీర్పు అలా..
సుప్రీంలో వాదనలు సాగాయిలా..

2017 వైద్య ప్రవేశాల నిబంధనల్లోని 3 (ఏ)ను సవాల్ చేస్తూ పలువురు విద్యార్థులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. స్థానిక అభ్యర్థుల నిర్వచనాన్ని తిరస్కరించి 'పర్మనెంట్ రెసిడెంట్స్'అనే కొత్త నిర్వచనానికి రాష్ట్రం మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశిస్తూ తీర్పుచెప్పింది. దీనివల్ల తెలంగాణ వెలుపల చదివినప్పటికీ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు స్థానిక కోటా ప్రయోజనం పొందగలిగే పరిస్థితి ఏర్పడింది. అభ్యర్థులు నాలుగేళ్లు స్థానికంగా చదవకపోయినా తెలంగాణలో నివాసం ఉన్నట్లయితే స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే దీనివల్ల రాష్ట్రంలో వైద్య కోర్సులకు పోటీ మరింత పెరుగుతుందని ప్రభుత్వం వాదించింది. హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టు తలుపుతట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, గోపాల్ శంకర్ నారాయణన్, ఎ.సుదర్శన్‌రెడ్డి సుప్రీంలో వాదనలు వినిపించారు. 'స్థానిక అభ్యర్థులను గుర్తించడానికి నివాస పరీక్షలు విధించడం రాష్ట్ర హక్కు. ఇది ముఖ్యంగా బలహీనవర్గాల ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన నిబంధన. వారు రాష్ట్రం వెలుపల కోచింగ్ తీసుకొనే స్తోమత లేనివారు. వారికి అందాల్సిన అవకాశాలు కాపాడటానికి ఈ నిబంధనలు అవసరం'అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కానీ విద్యార్థుల తరఫున సీనియర్ న్యాయవాదులు పీబీ సురేశ్, రఘెన్త్ బసంత్ తదితరులు వాదిస్తూ 'తల్లిదండ్రుల ఉద్యోగ బదిలీల కారణంగా పిల్లలు రాష్ట్రం వెలుపల చదవాల్సి వస్తుంది. అలా అని వారిని స్థానిక కోటా నుంచి వంచించడం అన్యాయం. వారి మూలాలు తెలంగాణలోనే ఉన్నాయి'అని ధర్మాసనం ముందు తమ వాదనను వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం '2017 నిబంధనల నిర్వచనం సరిగ్గానే ఉంది. 2024లో తీసుకొచ్చిన సవరణ కూడా చట్టబద్ధమే. ఆర్టికల్ 371డీ కింద జారీ చేసిన రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి స్థానిక అభ్యర్థులకు ప్రత్యేక రక్షణ కల్పించే అధికారం ఉంది. 15% సీట్లను అఖిల భారత కోటా కింద కేటాయించినందున మిగిలిన 85% సీట్లలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వడంలో తప్పు లేదు'అని జస్టిస్ చంద్రన్ తీర్పులో పేర్కొన్నారు.

ఎంబీబీఎస్ ప్రవేశాలకు లైన్‌క్లియర్

- సుప్రీం తీర్పునకు అనుగుణంగా త్వరలో జీవో విడుదల చేయనున్న ప్రభుత్వం
- మెరిట్ లిస్టు, అర్హుల జాబితా రూపొందించనున్న కాళోజీ యూనివర్సిటీ
- ఈ వారంలోనే స్టేట్ కోటా ప్రవేశాల నోటిఫికేషన్ జారీ!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో–33ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడంతో త్వరలోనే స్టేట్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. జీవో 33కి సవరణలు చేస్తూ ప్రభుత్వం కొత్త జీవో జారీ చేయాల్సి ఉంది. జీవో జారీ అయ్యాక ఇతర రాష్ట్రాల్లో చదివిన ప్రభుత్వ ఉద్యోగుల సంతానానికి ప్రత్యేక పరిస్థితుల్లో దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పిస్తూ కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం ఉత్తర్వులు జారీ చేయనుంది. ఆ తర్వాత స్టేట్ కోటా కింద రాష్ట్రంలోని 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో స్టేట్ కోటా (85 శాతం) కింద ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఈ వారంలోనే నోటిఫికేషన్ జారీ కానున్నట్లు సమాచారం. కాగా, ఎంబీబీఎస్ ఆలిండియా కోటా కౌన్సెలింగ్ గత నెలలోనే ప్రారంభమవగా ఆగస్టు 5న సుప్రీం తీర్పును పెండింగ్‌లో పెట్టడం వల్ల రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ వాయిదా పడుతూ వస్తోంది.

రాష్ట్ర కోటాలో 3,476 ఎంబీబీఎస్ సీట్లు

రాష్ట్రంలోని 34 ప్రభుత్వ కళాశాలల్లో 4,090 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. అందులో అఖిల భారత కోటా కింద 15 శాతం సీట్లు అంటే 614 సీట్లు పోగా 3,476 సీట్లు రాష్ట్ర కోటా కింద ఇకపై తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకే లభించనున్నాయి. అలాగే ఒక్క ఉస్మానియా మెడికల్ కాలేజీలో పరిధిలో ఉన్న ప్రభుత్వ డెంటల్ కాలేజీలో 15% సీట్లు ఆలిండియా కోటా కింద ఉంటే మిగిలిన సీట్లు రాష్ట్ర కోటా కింద ఉన్నాయి. రాష్ట్ర విభజన జరిగి 2024 జూన్ 2తో పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 2024 జూలై 19న జీవో 33ని తీసుకొచ్చింది.

మినహాయింపు వర్తించేది వీరికే...

తెలంగాణకు చెందిన వారు ఉద్యోగ విధుల్లో భాగంగా ఇతర రాష్ట్రాల్లో పనిచేయాల్సి వచ్చినప్పుడు వారి సంతానం తప్పనిసరిగా ఇతర ప్రాంతాల్లో 9, 10, ఇంటర్ విద్యను అభ్యసిస్తే వారికి మినహాయింపును కల్పించారు. వారిలో 1. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, 2. అఖిల భారత సర్వీసుల (ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్) తెలంగాణ కేడర్ అధికారులు 3. రక్షణ/పారామిలటరీ దళాలు, మాజీ సైనికులు 4. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన కార్పొరేషన్లు/ఏజెన్సీలలో పనిచేసే ఉద్యోగులు ఉన్నారు. వారు ఉద్యోగాల్లో చేరినప్పుడు హోం టౌన్‌గా తెలంగాణలోని ప్రాంతాలను పేర్కొంటేనే ఈ నాలుగు కేటగిరీల్లోని వారికి మినహాయింపు లభిస్తుంది. అయితే ఇందుకోసం వైద్య ప్రవేశం కోరే అభ్యర్థి తన తల్లిదండ్రుల ఉద్యోగ ధ్రువపత్రం సమర్పించాల్సి ఉంటుంది. అది ఆయా సంవత్సరాల్లో రాష్ట్రం వెలుపల పనిచేసినట్లు నిర్ధారించాల్సి ఉంటుంది.

వీరిది ఎటూకాని పరిస్థితి..

ఉమ్మడి ఏపీలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి కింద 1974 నాటి ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం నాలుగు నుంచి పదో తరగతి వరకు తెలంగాణ (ఓయూ ప్రాంతం), ఆంధ్ర (ఆంధ్ర యూనివర్సిటీ), రాయలసీమ (శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ)లలో ఎక్కడ నాలుగేళ్లపాటు చదివితే ఆ ప్రాంతంలో స్థానికుడిగా నమోదు చేసుకొనే వెసులుబాటు ఉండేది. 2014లో రాష్ట్ర విభజన జరిగాక పదేళ్లపాటు కూడా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ పనిచేస్తుందని విభజన చట్టంలో పేర్కొన్నారు. 2024 జూలై 19న రాష్ట్ర ప్రభుత్వం 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివిన వారినే ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లకు అర్హులుగా పేర్కొంటూ జీవో 33 జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు విద్యార్థులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఏపీలోనూ ఇదే విధానాన్ని అమలు చేస్తుండటంతో ఏపీ స్థానికత ఉన్నా ఉత్తమ విద్య కోసం ఇంటర్‌ను హైదరాబాద్‌లోని టాప్ కాలేజీల్లో చదివిన వారు ఏపీ, తెలంగాణలోనూ స్థానికులు కాని పరిస్థితి నెలకొంది.


కోఠి ఉమెన్స్ కళాశాల చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

కదం తొక్కిన ఆశా వర్కర్లు

- కోఠి చౌరస్తాలో బైఠాయించి.. వందలాది మంది ధర్నా
- సమస్యల పరిష్కారానికి కమిషనర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమణ

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలన్న డిమాండ్‌తోపాటు ఇతర సమస్యలపై తలపెట్టిన ఆశాల చలో హైదరాబాద్ ఆందోళన ఉద్రిక్తతంగా సాగింది. సీఐటీయూ, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కోఠిలోని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి వందలాది మంది ఆశా వర్కర్లు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు డీఎంహెచ్‌ఎస్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ఉన్న ఉమెన్స్ కళాశాల చౌరస్తాలో బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో కోఠిలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ సమాచారం తెలుసుకున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణతో చర్చలకు రావాలని అడిషనల్ డీసీపీ నర్సయ్య ఆశాల ప్రతినిధులను కోరడంతో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి ఆధ్వర్యంలో 20 మంది ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కమిషనర్ సంగీత మాట్లాడుతూ.. ఆశాల డిమాండ్లపై ప్రభుత్వానికి నివేదించి, సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆశాలకు పనిభారం పెంచకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. అలాగే ఆశాలకు సంబంధించి ఏ సమస్య అయినా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో మూడు గంటల పాటు నిర్వహించిన ధర్నాను ఆశాలు విరమించారు. అనంతరం జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశాల సమస్యలపై కమిషనర్ హామీ మేరకు ప్రస్తుతానికి తాము ధర్నాను విరమిస్తున్నామని, సమస్యలు పరిష్కారం కాని పక్షంలో మరో సారి సమ్మె చేస్తామని స్పష్టం చేశారు.

సాక్షి
బిజినెస్
మంగళవారం
2-9-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
555	198
80,364	24,625

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	21,456	▼	250
డోజోన్స్	45,545	▼	92
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,188	▲	1
డాక్స్	24,031	▲	129
షాంఘై	3,876	▲	18
నికాయ్	42,145	▼	573

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.80	88.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.90	120.92
€	యూరో	ఎస్‌బీఐ	102.00	104.81
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.35	60.86
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.19	59.03
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.29	70.00
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.47	23.97
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.12	23.14
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.49	13.31

డేటా సెంటర్స్‌లోకి విస్తరిస్తాం..

2030 నాటికి 1 బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యం

- అయిదేళ్లలో అనుబంధ సంస్థల లిస్టింగ్
- బొండాడ ఇంజనీరింగ్ చైర్మన్ రాఘవేంద్ర రావు వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక వసతుల రంగ సంస్థ బొండాడ ఇంజనీరింగ్ మరిన్ని రంగాల్లోకి విస్తరిస్తోంది. ఈ మధ్యే డిఫెన్స్ రంగంలోకి అడుగుపెట్టిన గ్రూప్ వచ్చే ఏడాది, రెండేళ్లలో డేటా సెంటర్స్ విభాగంలోకి కూడా ప్రవేశించే యోచనలో ఉంది. సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బొండాడ రాఘవేంద్ర రావు ఈ విషయాలు వెల్లడించారు. కీలకమైన నిరంతరాయ విద్యుత్ సరఫరా, మౌలిక సదుపాయాలు మన దగ్గర గణనీయంగా మెరుగుపడినందున దేశీయంగా డేటా సెంటర్లు పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్నాయని ఆయన వివరించారు. పునరుత్పాదక విద్యుత్‌ను సరైన విధంగా నిల్వ చేసి, విశ్వసనీయంగా సరఫరా చేయగలిగితే, వేల కోట్లు ఆదా అవుతాయని, అలాగే మరింత చౌకగా కూడా అందించవచ్చని చెప్పారు. అటు డిఫెన్స్ రంగానికి సంబంధించి మిసైల్స్, డ్రోన్స్ తయారీపై దృష్టి పెట్టనున్నట్లు రాఘవేంద్ర రావు చెప్పారు. ఇందులో భాగంగా పలు ప్రభుత్వ రంగ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించారు. రాబోయే నాలుగైదేళ్లలో తమ గ్రూప్ నుంచి మూడు, నాలుగు అనుబంధ సంస్థలను పబ్లిక్ ఇష్యూకి తీసుకురానున్నట్లు రాఘవేంద్ర రావు వివరించారు. గ్రూప్‌లో ప్రస్తుతం ఎట్‌పోల్ టెక్నాలజీస్, బొండాడ ఎకోబిల్డ్ మొదలైన అనుబంధ సంస్థలు ఉన్నాయి.

80 శాతం ఆదాయ వృద్ధి అంచనాలు..

ఆర్డర్ బుక్ ప్రస్తుతం రూ. 5,400 కోట్లుగా ఉండగా, ఈ ఏడాది మరో రూ. 2,700 కోట్లు జత కాగలవని రాఘవేంద్ర రావు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ. 1,571 కోట్లుగా, లాభం సుమారు రూ. 120 కోట్లుగా ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయం సుమారు 80 శాతం, లాభం దాదాపు 60–70 శాతం మేర వృద్ధి చెందగలదని అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. 2030 నాటికల్లా 1 బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు రాఘవేంద్ర రావు చెప్పారు. ఇందుకు టెలికం, రెన్యువబుల్ ఎనర్జీ, భారతీయ రైల్వేస్, డిఫెన్స్ తదితర రంగాలు దోహదపడగలవని ఆయన వివరించారు. అప్పటికల్లా 6 గిగావాట్ల సోలార్ ఈపీసీ, బీఈఎస్ఎస్ (బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం)..ఇతరత్రా పునరుత్పాదక విద్యుత్ వనరుల ఈపీసీకి సంబంధించి 2 గిగావాట్లు, సోలార్ ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్‌గా (ఐపీపీ) 2 గిగావాట్ల సామర్థ్యాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాఘవేంద్ర రావు తెలిపారు. సోలార్ ఐపీపీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్, అస్సాం ప్రభుత్వాలతో కంపెనీకి ఒప్పందాలు ఉన్నాయి. అటు తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ నుంచి 400 మెగావాట్‌అవర్ బీఈఎస్ఎస్ ప్రాజెక్టు దక్కించుకున్నట్లు రాఘవేంద్ర రావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తమ రెండు చిన్న ప్లాంట్లను కలిపి ఒకే భారీ ప్లాంటుగా ఏర్పాటు చేయనున్నట్లు, ఇందుకోసం సుమారు రూ. 250 కోట్లు వెచ్చించనున్నట్లు వివరించారు.

సోమవారం బీఎస్ఈలో కంపెనీ షేరు సుమారు ఒకటిన్నర శాతం పెరిగి రూ. 399.75 వద్ద ముగిసింది.

పసిడి రికార్డుల పరుగు!

దేశీయంగా, అంతర్జాతీయంగా సరికొత్త ఆల్‌టైమ్ గరిష్టాలకు...

- 10 గ్రాముల ధర రూ. 1.05 లక్షల పైకి..
- అమెరికా టారిఫ్‌లపై అనిశ్చితి, రూపాయి క్షీణత కారణం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పటిష్టంగా ఉండటం, టారిఫ్‌ల పరమైన అనిశ్చితి, ఈ నెలలో అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చనే అంచనాల మధ్య పసిడి ర్యాలీ కొనసాగుతోంది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం సోమవారం దేశీయంగా న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పది గ్రాముల పసిడి ధర (99.9 శాతం స్వచ్ఛత) రూ. 1,000 పెరిగి మరో కొత్త రికార్డు స్థాయి రూ. 1,05,670ని తాకింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం రూ. 800 పెరిగి రూ. 1,04,800కి చేరింది. అమెరికా టారిఫ్‌లపరమైన అనిశ్చితి, వడ్డీ రేట్లపై ఫెడ్ వైఖరి గురించి ఆందోళన పెరుగుతుండటంతో ఇన్వెస్టర్లు, పసిడిలాంటి సురక్షితమైన పెట్టుబడి సాధనాల వైపు మళ్లుతున్నారని ట్రేడర్లు వెల్లడించారు. రూపాయి మారకం క్షీణిస్తుండటం, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో పుత్తడి ఆకర్షణీయత మరింత పెరిగిందని ట్రేడ్‌జినీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డి. త్రివేశ్ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫెడ్ రిజర్వ్ మధ్య విభేదాలు తారస్థాయికి చేరడం, టారిఫ్‌లపరమైన అనిశ్చితి, ఈ నెలలో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు మొదలైన అంశాలు స్పాట్ మార్కెట్లో పసిడి ర్యాలీకి కారణమవుతున్నాయని కోటక్ సెక్యూరిటీస్ ఏవీపీ (కమోడిటీ రీసెర్చ్) కాయ్‌నాత్ చైన్‌వాలా చెప్పారు. కాగా, అంతర్జాతీయంగా ఫ్యూచర్స్ మార్కెట్లో ఔన్సు (31.1 గ్రాములు) పసిడి రేటు ఒక దశలో 3,556.87 డాలర్లకు ఎగిసింది. ఇది కొత్త ఆల్‌టైమ్ రికార్డు స్థాయి కావడం గమనార్హం.

మరోవైపు, వెండి ధర కేజీకి మరో రూ. 1,000 పెరిగి ఇంకో కొత్త గరిష్ట స్థాయి రూ. 1,26,000ని తాకింది. పర్యావరణహిత విద్యుత్, ఎలక్ట్రానిక్స్ తదితర పరిశ్రమల నుంచి డిమాండ్‌తో పాటు స్పెక్యులేషన్ కూడా వెండి ర్యాలీకి దోహదపడుతోందని త్రివేశ్ వివరించారు.

జీఎస్‌టీ ఆదాయం రూ.1.86 లక్షల కోట్లు

- ఆగస్టులో 6.5 శాతం అధిక వసూళ్లు
- 20 శాతం పెరిగిన రిఫండ్‌లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) రూపంలో ఆగస్టులో రూ.1.86 లక్షల కోట్లు వసూలైంది. గతేడాది ఆగస్టులో వసూళ్లు రూ.1.75 లక్షల కోట్లతో పోల్చి చూస్తే 6.5 శాతం పెరిగింది. కానీ, ఈ ఏడాది జూలైలో జీఎస్‌టీ రూపంలో రూ.1.96 లక్షల కోట్ల ఆదాయం సమకూరడం గమనార్హం. దేశీ విక్రయాలపై ఆదాయం 9.6% పెరిగి రూ.1.37 లక్షల కోట్లకు చేరింది. దిగుమతులపై పన్నుల రూపంలో ఆదాయం 1.2% తగ్గి రూ.49,354 కోట్లకు పరిమితమైంది. జీఎస్‌టీ రిఫండ్‌లు (వ్యాపారులకు తిరిగి చేసిన చెల్లింపులు) క్రితం ఏడాది ఆగస్టు నెలతో పోల్చి చూసినప్పుడు 20% పెరిగి రూ.19,359 కోట్లుగా ఉన్నాయి. దీంతో నికర జీఎస్‌టీ ఆదాయం (రిఫండ్‌లు పోను) ఆగస్టు నెలకు రూ.1.67 లక్షల కోట్లు. ఎగుమతులకు సంబంధించి రిఫండ్‌లు గణనీయంగా తగ్గడం మన దేశ ఎగుమతులపై అంతర్జాతీయ టారిఫ్‌ల ప్రభావాన్ని తెలియజేస్తున్నట్టు ఈవై ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో వసూలైన రూ.2.37 లక్షల కోట్లు నెలవారీ అత్యధిక ఆదాయం రికార్డుగా నమోదై ఉంది. జీఎస్‌టీలో 5, 12, 18, 28% శ్లాబుల స్థానంలో 5, 18% శ్లాబులనే కొనసాగించాలన్న ఆర్థిక శాఖ ప్రతిపాదనపై ఈ వారంలో (3, 4వ తేదీలు) జరిగే జీఎస్‌టీ కౌన్సిల్ భేటీలో నిర్ణయం తీసుకోనున్నారు. ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తే అమ్మకాలు మరింత పెరిగేందుకు అవకాశం ఉంటుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
ఆగస్టులో తయారీ రంగం భళా | సూచీలకు 'జీడీపీ' జోష్

వాహన విక్రయాలకు జీఎస్‌టీ 2.0 బ్రేకులు



- కొనుగోళ్లు వాయిదా వేసుకుంటున్న కస్టమర్లు
- కంపెనీల నుంచి డీలర్లకు తగ్గిన సరఫరా
- ఆగస్టులో ఆటో అమ్మకాలు డీలా

ముంబై: కొత్త జీఎస్‌టీ విధానంతో ధరలు తగ్గొచ్చనే ఆశావహ అంచనాలతో కస్టమర్లు వాహన కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నారు. దీంతో ఆగస్టులో ఆటో అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం వాహన రంగం అత్యధిక పన్ను రేటు 28% శ్లాబులో ఉంది. వాహన రకాన్ని బట్టి 1–22% పరిహార సెస్ విధిస్తున్నారు. చిన్న పెట్రోల్ కార్లపై 29% నుంచి ఎస్‌యూవీలపై 50% వరకు పన్ను చెల్లించాల్సి వస్తుంది. జీఎస్ 2.0% విధానంలో అన్ని వాహనాలను ఒకే శ్లాబులోకి ఉంచే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాల అంచనా. ఈ నేపథ్యంలో కస్టమర్లు జీఎస్‌టీ ప్రకటన వెలువడే వరకు వేచిచూసే ధోరణి ప్రదర్శిస్తున్నారు.

మారుతీ సుజుకీ దేశీయంగా ఆగస్టులో 1,31,278 ప్యాసింజర్ వాహనాలు విక్రయించింది. గత ఏడాది ఆగస్టులో అమ్ముడైన 1,43,075 వాహనాలతో పోలిస్తే 8% తక్కువ. ఎగుమతులతో మొత్తం అమ్మకాలు 1,80,683 యూనిట్లుగా నమోదయ్యాయి. ''జీఎస్‌టీ సంస్కరణ ఆటో పరిశ్రమపై సానుకూల ప్రభావం చూపుతుంది. ఏదైనా మంచి ఫలితం దక్కాలంటే.., ముందుగా కష్టాన్ని భరించాలి. అందుకే ఆగస్టు నెలలో డీలర్లకు సరఫరా తగ్గింది. జీఎస్‌టీ ప్రకటన తర్వాత పరిస్థితి మారుతుంది. మా వద్ద 1.5 లక్షల వాహన ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయి. డీలర్ల వద్ద నిల్వలు 48–50 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి.'' అని మారుతీ సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు.

ఆగస్టులో వాహన విక్రయాలు (ఎగుమతులతో కలిపి)...

కంపెనీ	2025	2024	వృద్ధి/క్షీణత (%)
మారుతీ	1,80,683	1,81,782	(-)0.6
హ్యుందాయ్	60,501	63,175	(-)4.2
ఎంఅండ్ఎం	75,901	76,755	(-)1.11
టాటా మోటార్స్	73,178	71,693	2
ఎంజీ మోటార్స్	6,578	4,323	52
టయోటా కిర్లోస్కర్	34,236	30,879	11
ద్విచక్రవాహనాలు			
హెచ్‌ఎంఎస్ఐ	5,34,861	5,38,852	(-)0.74
హీరోమోటోకార్ప్	5,53,727	5,12,360	8
టీవీఎస్ మోటార్స్	5,09,536	3,91,588	30
బజాజ్ ఆటో	4,17,616	3,97,804	5
రాయల్ ఎన్‌ఫీల్డ్	1,14,002	73,629	55
వాణిజ్య వాహనాలు			
వీఈసీవీ	7,167	6,543	9.5
అశోక్ లేలాండ్	15,239	14,463	5
ఎస్కార్ట్స్	8,456	6,652	27

యూపీఐ లావాదేవీలు @ 2,000 కోట్లు

- ఆగస్టులో సంఖ్యాపరంగా కొత్త రికార్డ్
- రూ. 24.85 లక్షల కోట్ల విలువ



న్యూఢిల్లీ: చెల్లింపులు జరిపేందుకు సులభతరమైన మాధ్యమంగా ఉండటంతో యూపీఐ విధానంలో లావాదేవీలు గణనీయంగా పెరుగుతున్నాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) గణాంకాల ప్రకారం సంఖ్యాపరంగా ఆగస్టులో 2,000 కోట్ల లావాదేవీల రికార్డును తాకాయి. వీటి విలువ రూ. 24.85 లక్షల కోట్లు. గతేడాది ఆగస్టులో నమోదైన రూ. 20.60 లక్షల కోట్లతో పోలిస్తే విలువ 21 శాతం, లావాదేవీల పరిమాణం 1,490 కోట్ల నుంచి 34 శాతం పెరిగింది. మే నెలలో రికార్డు స్థాయిలో రూ. 25.14 లక్షల కోట్ల విలువ చేసే లావాదేవీలు, సంఖ్యాపరంగా జూలైలో అత్యధికంగా 1,947 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్ హైదరాబాద్‌లో 80 ట్రైనీ ఇంజనీర్ పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్), హైదరాబాద్ యూనిట్‌లో తాత్కాలిక ప్రాతిపదికన ట్రైనీ ఇంజనీర్-1, ప్రాజెక్ట్ ఇంజనీర్-1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 80.
» **పోస్టుల వివరాలు:** ట్రైనీ ఇంజనీర్ 1–67, ప్రాజెక్ట్ ఇంజనీర్ 1 –13.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, సివిల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏఐసీటీఈ/యూజీసీ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ/బీటెక్/బీఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 01.08.2025 నాటికి ట్రైనీ ఇంజనీర్-1కు 28 ఏళ్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్-1కు 32 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు ట్రైనీ ఇంజనీర్‌కు రూ.30,000 నుంచి రూ.40,000. ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు రూ.40,000 నుంచి రూ.55,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 28.08.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.09.2025
» **రాతపరీక్ష తేది:** 14.09.2025.
» **పరీక్ష కేంద్రం:** లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజ్, సర్వే ఆఫ్ ఇండియాకు ఎదురుగా, పీ-టీ కాలనీ, ఉప్పల్, హైదరాబాద్-500039
» **ఇంటర్వ్యూ తేది:** 15.09.2025.
» **ఇంటర్వ్యూ వేదిక:** బీఈఎల్ ఫ్యాక్టరీ (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్), ఐ.ఈ.నాచారం, హైదరాబాద్-500076.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

ఎన్‌హెచ్‌పీసీలో 248 జూనియర్ ఇంజనీర్ పోస్టులు

ఫరీదాబాద్ (హర్యానా)లోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌హెచ్‌పీసీ).. జూనియర్ ఇంజనీర్ (నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 248.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ రాజ్‌భాషా ఆఫీసర్(ఈ1 గ్రేడ్)–11, జూనియర్ ఇంజనీర్(సివిల్)–109, జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–46, జూనియర్ ఇంజనీర్(మెకానికల్)–49, జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)–17, సూపర్‌వైజర్(ఐటీ)–01, సీనియర్ అకౌంటెంట్–10, హిందీ ట్రాన్స్‌లేటర్–05.
» **అర్హత:** 60 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. » **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** జూనియర్ ఇంజనీర్/సూపర్‌వైజర్/సీనియర్ అకౌంటెంట్‌కు రూ.29,600 నుంచి రూ.1,19,500, హిందీ ట్రాన్స్‌లేటర్‌కు రూ.27,000 నుంచి రూ.1,05,000, అసిస్టెంట్ రాజ్‌భాషా ఆఫీసర్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 02.09.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.10.2025
» **వెబ్‌సైట్:** https://www.nhpcindia.com

బీఐఎస్ చెన్నైలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

చెన్నైలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.08.2025 నాటికి 35 ఏళ్ల లోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.70,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **దరఖాస్తులకు చివరితేది:** 05.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.bis.gov.in

పీఎం రీసెర్చ్ ఫెలోషిప్.. పొందండిలా!

» సైన్స్, టెక్నాలజీ అంశాల్లో రీసెర్చ్‌కు పీఎంఆర్ఎఫ్ అవకాశం
» అయిదేళ్ల పాటు నెలకు రూ.70 వేలు-రూ.80 వేలు ఫెలోషిప్
» ఐఐటీలు, ఎన్ఐటీ, ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్ విద్యార్థులకు అవకాశం
» ఏటా రెండుసార్లు దరఖాస్తు చేసుకోవచ్చు

అకడమిక్ రీసెర్చ్.. ఇటీవల కాలంలో విస్తృతంగా వినిపిస్తున్న మాట! రీసెర్చ్ చేసేందుకు యువత సైతం ఆసక్తి చూపుతున్న వైనం! రీసెర్చ్ పూర్తి చేసుకుని డాక్టరేట్ పట్టా అందుకుంటే.. భవిష్యత్తులో సమున్నత అవకాశాలు అందుకోవచ్చనే ఆలోచన! మరోవైపు.. ప్రభుత్వం కూడా రీసెర్చ్ ఆవశ్యకత, ప్రాధాన్యతను గుర్తిస్తూ.. పరిశోధనలను ప్రోత్సహించేలా నూతన స్కీమ్స్ తెస్తోంది. ఇలాంటి వాటిల్లో అత్యంత కీలకమైన పథకం.. ప్రైమ్ మినిస్టర్స్ రీసెర్చ్ ఫెలోషిప్ స్కీమ్(పీఎంఆర్ఎఫ్)! ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ రంగాల్లో పరిశోధనలను విస్తృతం చేయాలనే లక్ష్యంతో పీఎంఆర్ఎఫ్‌ను తెచ్చారు. ఈ నేపథ్యంలో.. పీఎంఆర్ఎఫ్‌కు అర్హతలు, ఎంపిక విధానం, ప్రయోజనాలు, రీసెర్చ్ విభాగాలు తదితర వివరాలు..

పీఎంఆర్ఎఫ్ అంటే

ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఫెలోషిప్.. సంక్షిప్తంగా పీఎంఆర్ఎఫ్. దేశంలో సైన్స్, టెక్నాలజీ రంగాల్లో పరిశోధనలను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం.. 2018లో ఈ పథకాన్ని ప్రత్యేకంగా ప్రవేశ పెట్టింది. దీనిద్వారా దేశంలోని ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్స్‌గా పిలిచే ఐఐటీలు, టాప్–25 ఎన్ఐటీలు, ఐఐఎస్ఈఆర్, ఐఐఎస్సీ, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ చేసే వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఈ ఫెలోషిప్ స్కీమ్‌కు ఏటా రెండుసార్లు మే, డిసెంబర్‌ల్లో దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుంది.

ఈ ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకే

పీఎంఆర్ఎఫ్ మార్గదర్శకాల ప్రకారం–ప్రస్తుతం నిర్దేశిత ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకే ఈ ఫెలోషిప్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అన్ని ఐఐటీ క్యాంపస్‌లు, ఐఐఎస్ఈఆర్(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) క్యాంపస్‌లు, ఐఐఎస్సీ–బెంగళూరు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్–25 జాబితాలో నిలిచిన ఎన్ఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు. ఈ ఇన్‌స్టిట్యూట్స్‌నే పీఎంఆర్ఎఫ్ గ్రాంటింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌గా పిలుస్తారు.

పది విభాగాల్లో రీసెర్చ్‌కు అవకాశం

- పీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రస్తుతం పది విభాగాల్లో రీసెర్చ్ చేసే అవకాశం ఉంది.
- సివిల్ ఇంజనీరింగ్, ఎర్త్ సైన్స్, ఆర్కిటెక్చర్, ఓషియన్ అండ్ నేవల్ ఇంజనీరింగ్ (కోఆర్డినేటింగ్ ఇన్‌స్టిట్యూట్–ఐఐటీ బాంబే).
- మెకానికల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, డిజైన్(కో ఆర్డినేటింగ్ ఇన్‌స్టిట్యూట్–ఐఐటీ ఢిల్లీ).
- ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్,ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్(కోఆర్డినేటింగ్ ఇన్‌స్టిట్యూట్–ఐఐటీ కాన్పూర్).
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డేటా సైన్స్, మ్యాథమెటిక్స్(కోఆర్డినేటింగ్ ఇన్‌స్టిట్యూట్–ఐఐటీ రోపార్).
- బయో మెడికల్ ఇంజనీరింగ్, బయలాజికల్ సైన్సెస్ అండ్ అగ్రికల్చరల్ సైన్సెస్ (కోఆర్డినేటింగ్ ఇన్‌స్టిట్యూట్–ఐఐటీ గువహతి).
- కెమికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్(కో ఆర్డినేటింగ్ ఇన్‌స్టిట్యూట్–ఐఐటీ ఖరగ్‌పూర్).
- మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్(కో ఆర్డినేటింగ్ ఇన్‌స్టిట్యూట్–ఐఐటీ ఇండోర్).
- ఫిజిక్స్(కో ఆర్డినేటింగ్ ఇన్‌స్టిట్యూట్–యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్).
- కెమిస్ట్రీ(కో ఆర్డినేటింగ్ ఇన్‌స్టిట్యూట్– ఐఐఎస్ఈఆర్, పుణె).
- సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో ఇంటర్ డిసిప్లినరీ విభాగాలు(కో ఆర్డినేటింగ్ ఇన్‌స్టిట్యూట్–ఐఐఎస్సీ బెంగళూరు).

రెండు విధాలుగా ఎంపిక

పీఎంఆర్ఎఫ్‌కు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో డైరెక్ట్ ఎంట్రీ ఛానెల్, లేటరల్ ఎంట్రీ ఛానెల్ అనే రెండు విధానాలను అవలంబిస్తున్నారు. వీటికి వేర్వేరు అర్హత ప్రమాణాలు నిర్దేశించారు.

డైరెక్ట్ ఎంట్రీ ఛానెల్ విధానం

ఐఐఎస్సీ/ఐఐటీలు/ఎన్ఐటీలు/ఐఐఎస్ఈఆర్‌లు/ఐఐఈఎస్‌టీ/కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ట్రిపుల్ ఐటీల్లో సైన్స్, టెక్నాలజీ విభాగాల్లో నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసుకున్న వారు లేదా నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు; అదే విధంగా అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ లేదా రెండేళ్ల ఎమ్మెస్సీ లేదా అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ యూజీ-పీజీ చివరి సంవత్సరం చదువుతున్న లేదా పూర్తి చేసుకున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. వీరు తప్పనిసరిగా కనీసం 8 జీపీఏ పాయింట్లు పొంది ఉండాలి.

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి నాలుగేళ్ల బీటెక్ లేదా అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ పూర్తి చేసుకున్న లేదా చివరి సంవత్సరం అభ్యర్థులు, సైన్స్, టెక్నాలజీ విభాగాల్లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ లేదా రెండేళ్ల ఎమ్మెస్సీ లేదా అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అభ్యర్థులు గేట్‌లో సంబంధిత సబ్జెక్ట్‌లో 650 స్కోర్ లేదా సీఎస్ఐఆర్/యూజీసీ నెట్‌లో వంద లోపు జేఆర్ఎఫ్ ర్యాంకు లేదా ఎన్‌బీహెచ్‌ఎం ఫెలోషిప్‌లలో ఏదో ఒకటి కలిగుండాలి.

గేట్ ఉత్తీర్ణతతో పీఎంఆర్ఎఫ్ గ్రాంటింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంటెక్ లేదా ఎంఎస్ బై రీసెర్చ్ చదువుతున్న లేదా పూర్తి చేసుకున్న అభ్యర్థులు కూడా అర్హులే. వీరు దరఖాస్తు చేసుకునే సమయానికి తప్పనిసరిగా 8 జీపీఏ కలిగుండాలి.

ఈ అర్హతలు కలిగిన అభ్యర్థులు పీఎంఆర్ఎఫ్ గ్రాంటింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఏదో ఒక ఇన్‌స్టిట్యూట్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌కు ఎంపికై ఉండాలి. సదరు అభ్యర్థిని పీఎంఆర్ఎఫ్‌కు సిఫార్సు చేస్తూ.. సంబంధిత గ్రాంటింగ్ ఇన్‌స్టిట్యూట్ పీఎంఆర్ఎఫ్ వెబ్‌పోర్టల్‌లో సమాచారం అందిస్తుంది.

లేటరల్ ఎంట్రీ ఛానెల్

ఈ విధానం ద్వారా పీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు గ్రాంటింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ చేస్తూ ఉండాలి. పీజీ అర్హతతో పీహెచ్‌డీలో చేరితే కనీసం 12 నెలల వ్యవధి పూర్తి చేసుకోవాలి. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో పీహెచ్‌డీలో ప్రవేశం పొందితే కనీసం 24 నెలల వ్యవధిని పూర్తి చేసుకోవాలి. ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ /ఎమ్మెస్సీ/పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ల అభ్యర్థులు పీజీ పొందిన 12 నెలలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో కనీసం నాలుగు కోర్సులు పూర్తి చేసుకోవడంతోపాటు కనీసం 8.5 సీజీపీఏ పొందాలి. ఈ అర్హతల ఆధారంగా సదరు పీఎంఆర్ఎఫ్ గ్రాంటింగ్ ఇన్‌స్టిట్యూట్.. అభ్యర్థులను సిఫార్సు చేస్తూ పీఎంఆర్ఎఫ్ వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరచాలి.

ఆన్‌లైన్ దరఖాస్తు తప్పనిసరి

పీఎంఆర్ఎఫ్ గ్రాంటింగ్ ఇన్‌స్టిట్యూట్స్ నుంచి పీఎంఆర్ఎఫ్‌కు నామినేట్ అయిన అభ్యర్థులు కూడా స్వీయ దరఖాస్తు పూర్తి చేయడం తప్పనిసరి. నామినేట్ అయిన అభ్యర్థులు పీఎంఆర్ఎఫ్ పోర్టల్ ద్వారా పూర్తి స్థాయిలో దరఖాస్తును పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తులను ఆయా రీసెర్చ్ విభాగాలకు సంబంధించిన జాతీయ స్థాయి నిపుణుల కమిటీ పరిశీలించి.. నేషనల్ కో–ఆర్డినేషన్ కమిటీకి సిఫార్సు చేస్తుంది. ఆ తర్వాత అభ్యర్థులకు లభించిన ర్యాంకులు, ప్రతి పీఎంఆర్ఎఫ్ గ్రాంటింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు కేటాయించిన సీట్ల ఆధారంగా.. తుది జాబితా రూపొందిస్తారు.ఆ జాబితాలో నిలిచిన వారిని పీఎంఆర్ఎఫ్‌కు ఎంపికైనట్లుగా ప్రకటిస్తారు.



భారీగా ఫెలోషిప్

పీఎంఆర్ఆఫ్‌కు ఎంపికైన అభ్యర్థులకు భారీ స్థాయిలో ఫెలోషిప్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తున్నారు. మొదటి రెండేళ్లు నెలకు రూ.70 వేలు చొప్పున, మూడో ఏడాది నెలకు రూ.75 వేలు చొప్పున; నాలుగు, ఐదేళ్లలో నెలకు రూ.80 వేలు చొప్పున ఫెలోషిప్ లభిస్తుంది. దీంతోపాటు అయిదేళ్ల పాటు ఏడాదికి రూ.రెండు లక్షలు రీసెర్చ్ గ్రాంట్ కూడా అందుతుంది. ఇంటిగ్రేటెడ్ కోర్సుల అర్హతతో పీహెచ్‌డీలో చేరిన వారికి నాలుగో ఏడాది చివరి వరకు; బీటెక్ అర్హతతో పీహెచ్‌డీలో చేరిన వారికి అయిదో ఏడాది చివరి వరకు అందిస్తారు. లేటరల్ ఎంట్రీ విధానంలో ఎంపికైన వారికి.. పీహెచ్‌డీ ప్రోగ్రామ్ మిగిలిన వ్యవధికి ఫెలోషిప్ చెల్లిస్తారు.

నిరంతర సమీక్ష

పీఎంఆర్ఎఫ్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఫెలోషిప్‌ను కొనసాగించే క్రమంలో నిరంతర సమీక్ష విధానాన్ని అమలు చేస్తున్నారు. పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశించిన 12 నుంచి 18 నెలల మధ్యలో పీఎంఆర్ఎఫ్ ప్యానెల్ సదరు అభ్యర్థుల ప్రతిభను సమీక్షించి.. ఫెలోషిప్‌ను కొనసాగించే విషయంపై నిర్ణయం తీసుకుంటుంది. అదే విధంగా పీఎంఆర్ఎఫ్‌కు ఎంపికైన అభ్యర్థులు ప్రతి ఏటా వారు చేపట్టాల్సిన కార్యకలాపాలు, సాధించాల్సిన ఫలితాలపై నిర్దిష్ట ప్రమాణాలు రూపొందిస్తారు. వీటిని అభ్యర్థులు పీహెచ్‌డీ చేస్తున్న విభాగం, పీహెచ్‌డీ గైడ్‌లు నిర్దేశిస్తారు. అభ్యర్థులు ఎంచుకున్న అంశం ఆధారంగా ఇవి ఉంటాయి. వీటికి సంబంధించి ప్రతి ఏటా సమీక్ష నిర్వహిస్తారు. ఈ సమీక్ష జాతీయ స్థాయిలో సమావేశం లేదా సదస్సులు ప్రాతిపదికగా ఉంటుంది. వీటిలో అభ్యర్థులు అప్పటి వరకు తాము సాధించిన ప్రగతిని తెలియజేయాల్సి ఉంటుంది.

టీచింగ్ అసిస్టెంట్‌షిప్

పీఎంఆర్ఎఫ్‌కు ఎంపికైన అభ్యర్థులు సామాజిక ప్రగతిలో ముఖ్యంగా విద్యారంగ అభివృద్ధిలో పాల్పంచుకునేలా టీచింగ్ అసిస్టెంట్‌షిప్ పేరుతో ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని ప్రకారం– పీఎంఆర్ఎఫ్‌కు ఎంపికైన అభ్యర్థులు తమ ఇన్‌స్టిట్యూట్‌కు సమీపంలో ఉన్న ఐటీఐ లేదా పాలిటెక్నిక్ లేదా ఇంజనీరింగ్ కళాశాలల్లో వారానికి ఒక సారి బోధించాల్సి ఉంటుంది. ఇలా.. ఏడాదికి 50 గంటలు లేదా సెమిస్టర్‌కు 25 గంటల వ్యవధిలో టీచింగ్ అసిస్టెంట్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.pmrf.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–భూగోళశాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–కంప్యూటర్ అవేర్‌నెస్

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.

సాక్షి ప్లస్
మంగళవారం 2-9-2025



ఇరవై రోజుల కిందట పసుపు వర్ణంలోకి మారిన వరి పంట



తాజా వర్షాలతో ప్రాణం పోసుకున్న పంట

నాడు పసుపు వర్ణం.. నేడు ప్రాణం!

ఈ ఫొటోల్లో కనిపిస్తున్న దృశ్యాలు ఒకే రైతుకు చెందిన వరి క్షేత్రంలోనివి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పండువారిగూడెం శివారులో ఓ గిరిజన రైతు మూడెకరాల్లో వెదజల్లే విధానంలో వరి సాగు చేస్తున్నాడు. వర్షాభావం, అధిక ఎండలతో గతనెల 11న పంటకు నీటి తడులు అందక పసుపు వర్ణంలోకి మారి ఎండిపోయే స్థితికి చేరింది. ఇప్పుడు కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఏపుగా పెరగడమే కాకుండా ఆకుపచ్చ రంగుల్లోకి మారిన వరి క్షేత్రం కళకళలాడుతోంది. - అశ్వారావుపేట రూరల్

సమాజ భవిష్యత్‌కు ఆరోగ్య రక్షణ



గుడ్ టచ్-బ్యాడ్ టచ్ వివరాలు వెల్లడిస్తున్న వైద్యాధికారి దుర్గాభవాని



పినపాక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మధు

- కౌమారులకు సమగ్ర మార్గనిర్దేశం
- మానసిక ఆరోగ్యం, రక్షణ చట్టాలపై అవగాహన
- హెల్త్ ఎడ్యుకేషన్‌తో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపు
- ఆయుష్మాన్ భారత్ కింద కార్యక్రమాల అమలు

కరకగూడెం: మనిషి జీవితంలో అత్యంత కీలకమైనది కౌమార దశ. సాధారణంగా 10–19 ఏళ్ల మధ్య ఉండే ఈ దశలో శారీరక, మానసిక, భావోద్వేగ మార్పులు వేగంగా జరుగుతాయి. బాల్యం నుంచి యవ్వనంలోకి అడుగుపెట్టే ఈ సమయంలో సరైన మార్గనిర్దేశం లేకపోతే భవిష్యత్‌లో అనేక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ మార్పులను అర్థం చేసుకోవడం, వాటిని ఆరోగ్యకరమైన పద్ధతిలో నిర్వహించడం చాలా కీలకం. అందుకే కౌమార దశలోని విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భారత్' కింద స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమం, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమాల సమన్వయంగా అమలవుతోంది. కౌమారులకు ఆరోగ్యకరమైన జీవనశైలి, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, వ్యాధి నివారణపై అవగాహన కల్పించడం దీని ప్రధాన లక్ష్యంగా చెబుతున్నారు. ఈక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ వైద్యాధికారులు, సిబ్బంది 'కౌమార దశ హెల్త్ ఎడ్యుకేషన్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం కేవలం హెల్త్ టాక్ మాత్రమే కాదు సమాజానికి ఆరోగ్యవంతమైన భవిష్యత్ పునాది వేస్తుందని చెబుతున్నారు.

శారీరక మార్పులు.. సహజ ప్రక్రియ

కౌమార దశలో హార్మోన్ల ప్రభావం వల్ల బాలబాలికల్లో శారీరకంగా అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఎత్తు పెరగడం, గొంతు ధ్వని మారడం, బహిష్టు మొదలుకావడం, ముఖంపై మొటిమలు రావడం వంటివి సహజంగా జరుగుతాయి. కానీ వీటిపై అవగాహన లేక పలువురు ఆందోళనకు గురవుతున్న నేపథ్యంలో ఇందులో భయపడాల్సిన పని లేదని, సహజ శరీర పరిణామాలేనని అవగాహన కార్యక్రమాల్లో వైద్యులు స్పష్టం చేస్తున్నారు. సరైన అవగాహన కలిగితే విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారని, పరీక్షల ఒత్తిడి, భవిష్యత్ ఆలోచనలు, స్నేహబంధాలు, కుటుంబ పరిస్థితుల వలన ఎదురయ్యే ఆందోళన తగ్గుతుందని చెబుతున్నారు. ఈక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు మద్దతుగా నిలవాలని వైద్యులు సూచిస్తున్నారు. అంతేకాక యోగా, ధ్యానం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలితో మానసిక ఆరోగ్యం దరిచేరుతుందని చెబుతున్నారు.

పోక్సో యాక్ట్ నుంచి పోషకాహారం వరకు..

బాలల రక్షణ కోసం రూపొందించిన పోక్సో చట్టంపై విద్యార్థులకు వివరిస్తూ లైంగిక వేధింపులు లేదా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే నిశ్శబ్దంగా ఉండకుండా పెద్దలకు చెప్పాలని వైద్యులు సూచిస్తున్నారు. తద్వారా ఇది పిల్లల్లో ధైర్యం పెంచడమే కాకుండా భద్రతా భావనను కలిగిస్తోంది. ఇక సోషల్ మీడియా అతిగా వాడితే చదువు దెబ్బతినడం, నిద్రలేమి, మానసిక సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నారు. కౌమార దశలో శరీరానికి కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందేలా ఐరన్, క్యాల్షియం, ప్రోటీన్, విటమిన్లతో కూడిన ఆహారం తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. పండ్లు, పాలు, ఆకుకూరలు, గింజలు రోజువారీ ఆహారంలో భాగం కావాలని చెబుతున్నారు. వీటికి తోడు వ్యక్తిగత పరిశుభ్రత, చదువుతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లను వివరిస్తూ శారీరక వ్యాయామం, ఆటలు, సరైన విశ్రాంతి ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. ఎనీమియా వంటి సమస్యలను ముందుగా గుర్తించి చికిత్స చేయడం, బహిష్టు సమయంలో పరిశుభ్రత, యోగా, ధ్యానాన్ని ప్రోత్సహిస్తున్నారు. అంతేకాక విద్యార్థినులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

సమాజానికి విలువైన పెట్టుబడి

కౌమార దశలో పిల్లలకు సరైన మార్గనిర్దేశం లేకపోతే తప్పుదోవ పట్టే ప్రమాదం ఉంటుంది. అందుకే పాఠశాల స్థాయిలోనే హెల్త్ ఎడ్యుకేషన్‌ను అత్యవసరంగా భావిస్తున్నారు. భవిష్యత్‌లో ఆరోగ్యవంతమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన తరాన్ని తీర్చిదిద్దడం సాధ్యమని చెబుతున్నారు. మొత్తానికి కౌమార దశ హెల్త్ ఎడ్యుకేషన్ అనేది పాఠశాల కార్యక్రమంగానే కాక సమాజానికి విలువైన పెట్టుబడిగా.. పిల్లల భవిష్యత్ సుస్థిరంగా, శక్తివంతంగా ఎదిగేలా దోహదపడుతుందని చెప్పొచ్చు.

ఆరోగ్యవంతమైన భవిష్యత్‌కు పునాది..



కౌమార దశలో శారీరక, మానసిక, భావోద్వేగ మార్పులు సహజం. వీటిని విద్యార్థులు సరిగా అర్థం చేసుకునేలా ఆయుష్మాన్ భారత్ కింద స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్ ద్వారా పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. పోషకాహారం, పరిశుభ్రత, మానసిక ఆరోగ్యం, గుడ్ టచ్–బ్యాడ్ టచ్ వంటి అంశాలపై వివరిస్తున్నారు. ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయనే నమ్మకం ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పిల్లలకు ఎప్పటికప్పుడు మద్దతుగా నిలిచి వారికి స్నేహపూర్వకంగా మార్గనిర్దేశనం చేస్తే కౌమార దశలో ఎదురయ్యే అనేక సమస్యలను సులభంగా అధిగమిస్తారు.

- డాక్టర్ జయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

కేసీఆర్, హరీశ్‌లకు మిగిలింది జైలే

టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసి లక్షల కోట్లు దోచుకున్న కేసీఆర్, హరీశ్‌రావులకు మిగిలింది జైలేనని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అభిప్రాయపడ్డారు. ఈ కుంభకోణంపై సీబీఐ విచారణకు ఆదేశించడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అసాధారణ నిర్ణయం తీసుకుందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసీఆర్ కుటుంబీకులు దోచుకున్న మొత్తాన్ని రెవెన్యూ రికవరీ చట్టం ద్వారా ప్రభుత్వం తిరిగి వసూలు చేస్తుందన్నారు. కాళేశ్వరంలో ఎలాంటి అవకతవకలు జరగకపోతే స్టే కోసం కోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించిన బండి సుధాకర్.. ప్రజలకు సమాధానం చెప్పకుండా కోర్టుకు వెళ్లడంతోనే అవినీతి బట్టబయలైందని పేర్కొన్నారు. ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ కేసీఆర్, హరీశ్‌రావు వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి అమరవీరుల కుటుంబాలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

నాపై బీఆర్‌ఎస్ నేతల దుష్ప్రచారం

బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

సాక్షి, హైదరాబాద్: తనపై బీఆర్‌ఎస్ నేతలు అవాకులు చెవాకులు పేలుతున్నారని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మండిపడ్డారు. తన నియోజకవర్గంలోనే తుమ్మిడిహట్టి ఉందని, అక్కడ నీళ్లు లేవని అంటేనే తాను సభలో మాట్లాడానని స్పష్టంచేశారు. ఇంత దానికే తనపై బీఆర్‌ఎస్ నాయకులు అభాండాలు వేసి, పిచ్చి వాగుడు వాగుతున్నారని ధ్వజమెత్తారు. తాను ఎవరికీ భయపడి లొంగిపోయే వాడిని కాదని, తనపై ఎన్ని అభాండాలు వేసినా నిజాలు దాగవన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో హరీశ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ నుంచి తాము వాకౌట్ చేశాక.. మాట్లాడే అవకాశం ఇస్తా అంటే తాను మళ్లీ వెళ్లానని స్పష్టంచేశారు. స్థానిక ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌కు బీజేఎల్పీ లీడర్ విజ్ఞప్తి చేశారని చెప్పారు. రాత్రి అసెంబ్లీలో జరిగిన ప్రహసనం అందరూ చూశారని, సీబీఐ విచారణకు బీఆర్‌ఎస్ నేతలు ఎందుకు భయపడుతున్నారని, తప్పు చేయక పోతే కోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతి సొమ్ము దేశం దాటిందని హరీశ్‌బాబు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఆలస్యంగానైనా కనువిప్పు కలిగినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సీబీఐ, ఈడీల విచారణతో అన్నీ బయటకు వస్తాయని చెప్పారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పుతో నక్సల్స్ సమస్య మొదటికి..

మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: నాడు సుప్రీంకోర్టు జడ్జిగా ఉన్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సల్వా జుడుంపై ఇచ్చిన తీర్పు నక్సలైట్ల మనో ధైర్యం పెరగడానికి కారణమైందని బీజేపీ నేత, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ విషయంలో కేంద్ర హోం శాఖమంత్రి అమిత్ షా చెప్పింది నిజమేనన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నక్సలైట్ కార్యకలాపాలు పెరగడం వల్ల ఎందరో చనిపోయారని తెలిపారు. సల్వా జుడుం వచ్చాక నక్సలైట్లను అడ్డుకుందన్నారు. అయితే ఆ తర్వాత జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఇచ్చిన తీర్పుతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందనేది వాస్తవమని శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ తీర్పు రాకపోతే నక్సల్స్ సమస్య ఎప్పుడో రూపు మాసి పోయేదని అభిప్రాయపడ్డారు.

గన్‌పార్క్ వద్ద ఉద్యోగభర్తీపై చర్చకు రావాలి

మంత్రులకు బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి సవాల్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి ఎన్ని నోటిఫికేషన్లు జారీచేసి ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేసిందో ప్రకటించాలని బీజేపీ ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద తనతో బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు. మంత్రులు తన సవాలును స్వీకరించి చర్చకు రావాలన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో అంజిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, కేవలం 6.5 శాతం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు రాహుల్ గాంధీ అశోక్‌నగర్‌కి వచ్చి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన మాట ఉత్త నోటిమాటగానే నిలిచిపోయిందని విమర్శించారు. సోమవారం శాసనమండలిలో నిరుద్యోగుల గొంతుకగా వారి సమస్యలను లేవనెత్తాలని ప్రయత్నించామని అంజిరెడ్డి తెలిపారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ సభ్యులు వాకౌట్ చేయడంతో సభ వాయిదా పడిందన్నారు.

మావోయిస్టు ప్రభావిత గ్రామంలో వంతెన

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో నిర్మాణం



కర్రలు, రోప్‌తో వాగుపై సీఆర్పీఎఫ్ అధికారులు నిర్మించిన వంతెన

చర్ల: మావోయిస్టు ప్రభావిత గ్రామాల ప్రజలు వర్షాకాలంలో ఉప్పొంగే వాగుల కారణంగా ఇబ్బంది పడకుండా సీఆర్పీఎఫ్ అధికారులు, జవాన్లు వంతెన నిర్మించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పల్నార్–తోడ్కా మధ్య ఉన్న వాగు వర్షాకాలంలో పొంగుతుండటంతో 12 గ్రామాల ఆదివాసీలు అత్యవసర సమయాల్లో సమస్య ఎదుర్కొంటున్నారు. ఈమేరకు రాకపోకల కోసం సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో బలమైన కర్రలతో తాత్కాలిక వంతెనలు నిర్మిస్తున్నారు. పల్నార్–తోడ్కా మధ్య నిర్మించిన వంతెనతో ఆదివాసీల ఇక్కట్లు తీరగా.. పోలీసు బలగాలు కూడా ఈ తరహా వంతెనలు నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది.

నిర్మల్‌లో మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు?

వివరాలు సమర్పించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ ఏడాది మార్చి 25న నిర్మల్ మున్సిపాలిటీ పదవీకాలం ముగిసినా ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన 'పిల్'పై జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది చిన్నోళ్ల నరేశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ మున్సిపాలిటీలో ఎన్నికైన సభ్యులు లేనందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పదవీకాలం ముగిసిన స్థానిక సంస్థలకు ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాల్సిన రాష్ట్ర ఎన్నికల కమిషన్.. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు. ఎస్‌ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది జి. విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ.. వార్డుల పునర్విభజన వంటి ముందస్తు ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసి, రిజర్వేషన్లను తెలియజేస్తే ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామన్నారు. శాంతిభద్రతలు, ఎన్నికల విధులు, ఇతర సిబ్బంది.. ఇలా సర్కార్ రెడీగా ఉంటేనే ఎన్నికల నిర్వహణకు అవకాశం ఉంటుందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి ప్రభుత్వ వివరణ సమర్పించాలని అదనపు అడ్వొకేట్ జనరల్‌ను ఆదేశిస్తూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.





రైలు బోగీ ఫుట్‌బోర్డుపై పుస్తకం చదువుతూ నిద్రలోకి జారుకున్న ప్రయాణికుడు



రైలు బోగీ ప్రవేశ ద్వారం వద్ద ప్రమాదకరంగా కూర్చుని ప్రయాణం



రైల్లో ప్రమాదకరంగా ప్రయాణాలు

ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదమని తెలిసినా..

ప్రకృతిలో రైలు ప్రయాణం.. చల్లగాలిని ఆస్వాదిస్తూ ఏదో పుస్తకం చదువుతూ ఫుట్‌బోర్డుపై అలా నిద్రలోకి జారుకున్నాడు ఓ యువకుడు. చెప్పేందుకు ఇది చాలాబాగానే ఉన్నా.. ఏమాత్రం అటుఇటైనా ప్రాణం పోవడం ఖాయం. మరో బోగీలో కిక్కిరిసిన ప్రయాణికులు.. డోర్ వద్దే కాళ్లు వేలాడదీసి ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. ఇలాంటి రైలు ప్రయాణాలు సాధారణమే అయినా.. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుని చాలామంది చనిపోతున్నారు. ఇందులో యువతే అత్యధికంగా ఉంటోందని రైల్వే అధికారులు చెబుతున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం ఓ రైలులో ప్రమాదకరస్థితిలో ప్రయాణం సాగిస్తున్న యువకులు 'సాక్షి' కెమెరాకు ఇలా కనిపించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా...

13 మంది జూనియర్ లెక్చరర్లకు పదోన్నతి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 13 మంది జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపల్స్‌గా పదోన్నతి కల్పించారు. జోన్-2లో ఒకరికి పదోన్నతి ఇవ్వగా, మిగిలిన మూడు జోన్లలో నలుగురికి చొప్పున పదోన్నతి కల్పించారు.

ఇంటర్ బోర్డు ఓఎస్డీగా రిటైర్డ్ సీఓఈ

సాక్షి, అమరావతి: ఏపీ ఇంటర్మీడియెట్ విద్యా మండలి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీఓఈ)గా ఇటీవల రిటైరైన వీవీ సుబ్బారావును రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ బోర్డులోకి తీసుకుంది. ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ వింగ్‌లో ఓఎస్డీగా ఆయన్ను తిరిగి నియమించింది. నెలకు రూ.లక్ష వేతనం చెల్లించాలని ఆదేశాల్లో పేర్కొంది.

డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. విద్యార్థులు 3వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, 4 వరకు వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని సోమవారం పేర్కొంది. ఈ మేరకు 5న వెబ్ ఆప్షన్‌లో మార్పులు చేర్పులు, 8న సీట్ల కేటాయింపు ఉంటుందని ఉన్నత విద్యా మండలి రివైజ్డ్ షెడ్యూల్ విడుదల చేసింది. 3 వరకు స్పెషల్ కేటగిరిలో వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొంది. 9వ తేదీ నుంచి తరగతులు ప్రారంభంకానున్నాయి.

ప్రత్యేక ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ హాజరు మినహాయింపు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులకు విద్యా శాఖ బయోమెట్రిక్ హాజరులో మినహాయింపు ఇచ్చింది. స్పెషల్ టీచర్లు అందరూ పాఠశాల ఆవరణంలోనే బయోమెట్రిక్ హాజరు నమోదుచేయాలని ఇటీవల ఆదేశాలివ్వడాన్ని నిరసిస్తూ వారు ఆందోళన చేపట్టారు. దీంతో దృష్టిలోపం, ప్రత్యేక అవసరాలు గల ఉపాధ్యాయులతో వారి సహాయకులు వారానికి ఒకరోజు పాఠశాల ఆవరణలో బయోమెట్రిక్ చేయాలని, మిగిలిన రోజుల్లో లీప్‌యాప్ హాజరు నమోదుచేయాలని అధికారులు సోమవారం ఆదేశాలు జారీచేశారు.

పారిశుద్ధ్యానికి 'స్వచ్ఛాంధ్ర' పురస్కారాలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ సంస్థలు, మున్సిపాలిటీలు, పంచాయతీలు, పాఠశాలల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు గుర్తింపుగా స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం చేయనున్నట్లు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ 2న మొత్తం 18 విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో 52, జిల్లా స్థాయిలో 1,421 పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

మన్యంలో కాఫీ ఘుమఘుమలు

- మన్యంలో పెరుగుతున్న కాఫీ సాగు
- అరకు, పాడేరులో విక్రయాలు
- ప్రభుత్వం ప్రోత్సహించాలంటున్న గిరిజన కాఫీ రైతులు



పాచిపెంట: అరకు కాఫీ ఘుమఘుమలకు పెట్టింది పేరు. అరకు కాఫీ పేరు వింటేనే కాఫీ ప్రియుల నోరూరుతుంది. దేశ ప్రధానమంత్రి మోదీ సైతం అరకు కాఫీపై ప్రశంసలు కురిపించారంటే దీనికున్న ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. అటువంటి కాఫీ తోటలకు ధీటుగా పార్వతీపురం మన్యం జిల్లాలో ఇటీవల కాఫీ తోటల సాగు పెరుగుతోంది. ఈ తోటల నుంచి వెలువడే సువాసనలను ఆ మార్గంలో ప్రయాణించే వారు ఆస్వాదిస్తున్నారు. పాచిపెంట మండలం శతాబి, చిల్లమామిడి, తంగ్లాం, గరిసిగుడ్డి తదితర గిరిశిఖర ప్రాంతాల్లో కాఫీ సాగు విస్తారంగా ఉంది.

అనుకూలిస్తున్న వాతావరణం

కాఫీ సాగుకు చల్లగా ఉన్న ఈ మన్యం ప్రాంతం అనుకూలంగా ఉండడంతో సాగు విస్తీర్ణం క్రమేణా పెరుగుతూ వస్తుంది. 1998లో 30 ఎకరాల్లో ప్రారంభమైన దీని సాగు నేడు సుమారు వందెకరాలకు విస్తరించింది. దీనిపై ఆదాయంతో పాటు డిమాండ్ అధికంగా ఉండడంతో ఇక్కడి రైతుల కాఫీ తోటల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఫలితంగా కాఫీ సాగు విస్తీర్ణం మరింత పెరిగేలా కనిపిస్తుంది. ఈ క్రమంలో మరో 50 ఎకరాల్లో కాఫీ తోటలు సాగు చేసేందుకు అధికారులు మన్యం ప్రాంతంలో ప్రత్యేక నర్సరీలో మొక్కలు పెంచుతున్నారు. ప్రసుత్తం వీటి సాగు నారు దశలో ఉంది.

కలెక్టర్ ఆదేశాలతో..

మన్యం జిల్లాలో కాఫీ తోటల సాగుకు అనుకూలమని తెలుసుకున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఏడాది జనవరి 28న దీనిపై సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో పలువురు శాస్త్రవేత్తలు, అధికారుల బృందం ఈ ప్రాంతంలో కాఫీ సాగును పరిశీలించారు. సాగు విస్తీర్ణం పెంచేలా రైతులను ప్రోత్సహించేలా పలు సూచనలు అందించారు.



నర్సరీలో పెంచుతున్న కాఫీ మొక్కలు



సాగు చేస్తున్న పంటను చూపిస్తున్న రైతు శిల్బజన్ని రామయ్య

కాఫీ సాగుకు మన్యం అత్యంత అనుకూలం

సాధారణంగా కాఫీ సాగుకు చల్లని ప్రాంతంతో పాటు సాగు ప్రాంతం సముద్ర మట్టానికి 750 మీటర్ల ఎత్తు ఉండాలి. పాచిపెంట మండలంలోని శతాబి నుంచి తంగ్లాం వరకు కాఫీ తోటలు సాగయ్యే భూములు సముద్ర మట్టానికి సుమారు 900 మీటర్ల ఎత్తు ఉండడం అత్యంత అనుకూలమైన అంశంగా మారింది. ఇదే సమయంలో కాఫీ గింజల ధర కూడా కలిసొచ్చేదిగానే ఉంది. ఎందుకంటే కేజీ కాఫీ గింజల ధర రూ.400 వరకు ఉంది. ఎకరా విస్తీర్ణంలో కాఫీ తోటల సాగులో రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. దీని సాగుకు ఖర్చయ్యేది రూ.వేలల్లోనే ఉంటుందని చెబుతున్నారు. దీంతో ఈ సాగు రైతులకు ఆదాయాన్నిచ్చేదిగానే ఉంది.

మూడేళ్లలో దిగుబడి

కాఫీ తోటలు వేసిన తరువాత మూడేళ్లకు గింజల దిగుబడి ప్రారంభమవుతుంది. నాల్గో సంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో గింజల దిగుబడులు వస్తాయి. అదే సమయంలో ఎకరా తోటలో దిగుబడి బాగుంటే 220 కేజీల నుంచి 250 కేజీల వరకు కాఫీ గింజలు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దీంతో రైతులకు ఇది మంచి ఆదాయం ఇచ్చే పంటగా ఉంది.

కానరాని కొనుగోలు కేంద్రాలు

అయితే కాఫీ గింజల కొనుగోలు కేంద్రాలు మన్యంలో కానరావడం లేదు. దీంతో సాగు రైతులు అరకు, పాడేరు ప్రాంతాలకు వెళ్లి తమ సాగు కాఫీ గింజలను అక్కడ విక్రయిస్తున్నారు. ఇది వారికి అదనపు భారంగా మారింది. మంచి డిమాండ్ ఉన్న కాఫీ గింజలను మన్యం ఇల్లా ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేపట్టాలని ఈ ప్రాంత గిరిజన రైతులు కోరుతున్నారు. అలా చేస్తే తమకు కలిసొస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదికి రూ.లక్ష పైబడే ఆదాయం

ఎకరాన్నర పొలంలో కాఫీ తోటలు సాగు చేస్తున్నాను. ఏడాదికి రూ.లక్ష నుంచి లక్షా 50 వేల వరకు ఆదాయం వస్తుంది. అయితే కాఫీ గింజల విక్రయానికి అరకు, పాడేరు ప్రాంతాలకు వెళ్లి రావాల్సి వస్తుంది. పార్వతీపురం మన్యం ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేస్తే మాకు అనుకూలంగా ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– శిల్బజన్ని రామయ్య, రైతు, శతాబి

విదేశాల్లో వైఎస్సార్‌కు ఘన నివాళులు

సాక్షి,అమరావతి/తిరుపతి గాంధీ రోడ్డు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతిని ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. పలువురు ఎన్నారైలు డాక్టర్ వైఎస్సార్ చేసిన సేవలను గుర్తు చేసుకొన్నారు. తెలుగు జాతి వైఎస్సార్‌కి రుణపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియా వైఎస్సార్‌సీపీ విక్టోరియా కన్వీనర్ కృష్ణారెడ్డి, సహ కన్వీనర్ భరత్, కోర్ టీమ్ సభ్యులు బ్రహ్మారెడ్డి, రామాంజి, సురేష్ రెడ్డి, సతీష్, పవన్, బాషా, తేరా జయవర్ధన్ రెడ్డి, దశరథ్ రెడ్డి, డి.శ్రీధర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫీనిక్స్ ఎన్ఆర్ఐ కమిటీ రక్తదానం

డాక్టర్ వైఎస్సార్ 16వ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ ఫీనిక్స్ ఎన్ఆర్ఐ కమిటీ రక్తదాన డ్రైవ్ నిర్వహించింది. ఈ సందర్భంగా వైఎస్సార్ చేపట్టిన సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్‌రెడ్డి యర్రపురెడ్డి, ఆది, రేఖ మోర్రెడ్డి, వంశీ ఏరువరం, చెన్నారెడ్డి మద్దూరి, ధీరజ్‌పోలా, అంజిరెడ్డి, రుక్మాన్, రమేష్, శ్రీధర్ చెమిడ్డి, బాలమురళీకృష్ణ, ఇంద్రసేనారెడ్డి, నాగేష్వార్ల, వేమశేఖర్, విఘ్నేష్, కొండారెడ్డి, జ్ఞానదీప్, నాగి బోనం తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఆఫ్రికాలో...

సౌత్ ఆఫ్రికాలోని వైఎస్సార్‌సీపీ ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో జోహానెస్‌బర్గ్‌లో సోమవారం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.



సౌత్ ఆఫ్రికాలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు

సెప్టెంబర్ 2 వర్ధంతి సందర్భంగా ముందురోజు సోమవారం జోహానెస్‌బర్గ్‌లోని కమ్యూనిటీ సెంటర్ బేకరీ అనాథాశ్రమంలో చిన్నారులకు ఆహారంతోపాటు రూ.5 లక్షల విలువచేసే వస్త్రాలను దానం చేశారు. తమలో చాలామంది వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారానే ఉన్నత చదువులు చదువుకుని ఈ స్థాయిలో ఉన్నామని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అభిమానులు కల్లా నరసింహారెడ్డి, సూర్య రామిరెడ్డి, విజయ శ్రీనివాసు, శ్రీకృష్ణారెడ్డి, వాసు సింగారెడ్డి, పెట్లూరు విక్రం, మాగంటి వెంకట్, సానికొమ్మ అంజిరెడ్డి, అవనిగడ్డ పుష్పాంజలి, కృష్ణమోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఆత్మకూరు హరి, బుద్ధ సురేంద్ర, అనిపి రెడ్డి నవీన్ రెడ్డి, బాల భాస్కర్, రాజారపు శివ, పల్లె మధు పాల్గొన్నారు.

రూ.12.5 కోట్లతో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ పరికరాలు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి కార్యాలయం, క్యాంపు ఆఫీసు, సీఎస్, మంత్రుల కార్యాలయాలకు అవసరమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ పరికరాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.12.5 కోట్లతో వీటిని కొనుగోలు చేసేందుకు ఏపీటీఎస్‌కు అనుమతి ఇస్తూ ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

డీజే సౌండ్.. గుండెపోటుతో కార్మికుడి మృతి

రాయదుర్గం టౌన్: వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే సౌండ్ కారణంగా మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుడు పూలకుంట శ్రీనివాసులు (36) గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ ఘటన అనంతపురం జిల్లా రాయదుర్గంలో చోటుచేసుకుంది. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు కాలనీలో కొలువుదీర్చిన గణేష్ నిమజ్జనంలో ఆదివారం రాత్రి పాల్గొన్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల ప్రాంతంలో డీజే శబ్దాలకు తీవ్ర అస్వస్థతకు లోనై ఇంటికి చేరుకున్నాడు. సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. కాగా, రెండు నెలల క్రితమే ఆయన గుండె సంబంధిత చికిత్స పొందినట్లు బంధువులు, తోటి కార్మికులు తెలిపారు.

సుగాలి ప్రీతి మరణంపై చంద్రబాబును ఎందుకు నిలదీయట్లేదు?

పవన్‌కళ్యాణ్‌కు ఏపీ ట్రైకార్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర ప్రశ్న

సాక్షి, అమరావతి: సుగాలి ప్రీతి మరణంపై చంద్రబాబును ఎందుకు నిలదీయట్లేదని జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను ఏపీ ట్రైకార్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర సోమవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. సుగాలి ప్రీతి ఘటన జరిగిన 2017లో ముఖ్యమంత్రిగా ఉన్నది చంద్రబాబేనని గుర్తు చేశారు. పవన్‌కళ్యాణ్ చెబుతున్నట్లుగా ఆధారాలు తారుమారై ఉంటే.. అది చంద్రబాబు ప్రభుత్వమే చేసి ఉంటుందన్నారు. మరి చంద్రబాబును ఎందుకు ప్రశ్నించట్లేదని పవన్‌కళ్యాణ్‌ను నిలదీశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని నిందించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వైఎస్ జగన్ ప్రభుత్వమే సుగాలి ప్రీతి కుటుంబానికి 5 ఎకరాల భూమి, 5 సెంట్ల స్థలం, తండ్రికి ఉద్యోగంతోపాటు కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఆ కేసు నుంచి సీబీఐ పక్కకు తప్పుకుంటే ఎందుకు స్పందించలేదని పవన్‌ను ప్రశ్నించారు. ఒక గిరిజన బాలికకు న్యాయం చేయలేని పవన్‌కళ్యాణ్.. రాష్ట్రంలో కనిపించకుండా పోయారని ఆయనే దుష్ప్రచారం చేసిన 30 వేల మంది మహిళలకు ఏం న్యాయం చేయగలరని నిలదీశారు. సుగాలి ప్రీతి కేసులో నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ పోస్టు కార్డు ఉద్యమం చేపడతామని సురేంద్ర చెప్పారు.

కూటమి సర్కారు నిర్లక్ష్యం వల్లే నిరుద్యోగాంధ్ర

- వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు
- పానుగంటి చైతన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర ధ్వజం

సాక్షి,అమరావతి: నిరుద్యోగంలో రాష్ట్రాన్ని దేశంలోనే మూడో స్థానంలో నిలిపి ఆంధ్రప్రదేశ్‌ని కూటమి సర్కారు నిరుద్యోగాంధ్రగా భ్రష్టు పట్టించిందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర ధ్వజమెత్తారు. జాతీయ స్థాయిలో నిరుద్యోగిత శాతం 14.6 శాతం ఉంటే... మన రాష్ట్రంలో అది 21 శాతంగా నమోదవడం కూటమి ప్రభుత్వ విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలకు ప్రత్యక్ష నిదర్శనమని వారు నిందించారు. సోమవారం వారు ఈ మేరకు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఎన్నికల ముందు ఇరవై లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.మూడువేల భృతి ఇస్తామని హామీలిచ్చిన కూటమి ఇప్పుడు నిరుద్యోగులను వంచించిందని పేర్కొన్నారు. పైగా ఉన్న ఉద్యోగాలను ఊడబీకుతోందని విమర్శించారు. నిరుద్యోగంలో రాష్ట్రాన్ని దేశంలోనే టాప్-3గా నిలిపిన కూటమి సర్కారు సిగ్గుపడాలని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ ఆరు లక్షల ముప్పై వేల ఉద్యోగాలిచ్చారని గుర్తుచేశారు.

విశాఖ ఉక్కుపై టీడీపీ, బీజేపీ అసత్యాలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు జరుగుతున్న కుట్రలపై టీడీపీ, బీజేపీ ప్రజలను పక్కదారి పట్టించేలా అసత్యప్రచారం చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మండిపడ్డారు. ప్రతీ రెండేళ్లకోసారి టెండరు పూర్తికాగానే కొత్త టెండరు పిలిచే విధానానికి బదులు ఈసారి కొత్తగా ఈఓఐను ఎందుకు పిలవాల్సి వచ్చిందో చెప్పాలని సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. పాత పద్ధతిలో యాజమాన్యం ఓ పనిని నిర్దేశించి ఆ పనికి ఎంత మంది కార్మికులు అవసరమవుతారు.. వారికి పీఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనం, సేఫ్టీ తదితర చెల్లింపులకు ఎంత ఖర్చవుతుందో అంచనా వేసి ఆ మేరకు టెండర్ పిలిచేవారన్నారు. ఎవరు తక్కువగా టెండర్ వేస్తే వారికి ఆ పని అప్పగించేవారన్నారు. ఆ పని అంతా స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన ఇంజనీరింగ్ ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలో శాశ్వత కార్మికులతో కలిసి కాంట్రాక్టు కార్మికులు చేసేవారని ఆయన చెప్పారు. కానీ, ప్రస్తుతం కాంప్రెహెన్సివ్ టెక్నికల్ మెయింటెనెన్స్ పేరిట ఈఓఐ పిలుస్తున్నారని శ్రీనివాసరావు చెప్పారు. గతంలో ఒక విభాగానికి సంబంధించి మెకానికల్, ఎలక్ట్రికల్, క్లీనింగ్ పనులు మాత్రమే కాంట్రాక్టర్ల భాగస్వామ్యంతో జరిగేవని.. కానీ, ఇప్పుడు ఆపరేషన్ పనులతో సహా మొత్తం విభాగాన్ని కాంట్రాక్టుకు అప్పగిస్తున్నారన్నారు. వాస్తవాలిలా ఉంటే.. టీడీపీ, బీజేపీ నేతలు ఇష్టానుసారంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

చంద్రబాబు ఓ దార్శనికుడు

- తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో ఆయన ముద్ర చిరస్మరణీయం
- డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: భవిష్యత్తును ఊహించి దూరదృష్టితో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే దార్శనికుడు చంద్రబాబునాయుడు అంటూ జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణం చేసి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చంద్రబాబుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తున్నట్లు సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో ఆయన ముద్ర చిరస్మరణీయమన్నారు. కఠిన సవాళ్లు ముందున్నా దృఢచిత్తంతో పాలనా వ్యవస్థను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. దార్శనికత కలిగిన ముఖ్యమంత్రి నిర్దేశకత్వంలో తమ మంత్రివర్గం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నిబద్ధతతో పనిచేస్తోందని పవన్ పేర్కొన్నారు.

పవన్‌తో వీహెచ్‌పీ నేతల భేటీ..

మరోవైపు.. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో విశ్వహిందూ పరిషత్ అఖిల భారత ఆర్గనైజింగ్ సెక్రెటరీ జనరల్ మిలింద్ పరాండే సోమవారం సాయంత్రం మంగళగిరిలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో దేవాలయాల నిర్వహణ, అభివృద్ధి, ధార్మిక ప్రచారం, సేవా కార్యక్రమాలపై వీహెచ్‌పీ ప్రతినిధులు పవన్‌కళ్యాణ్‌తో చర్చించారని జనసేన పార్టీ మీడియా విభాగం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో విజయవాడ వేదికగా నిర్వహించిన హైందవ శంఖారావం డిక్లరేషన్ గురించి వీహెచ్‌పీ నేతలు వివరించారని తెలిపింది.

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పేరుతో వేధింపులు ఆపండి: ఏపీ యూటీఎఫ్

సాక్షి, అమరావతి: మోడల్ స్కూళ్లను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ చేయడంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులను వేధించడం సబబు కాదని, విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ప్రసాద్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు విద్యా సంవత్సరంలో 250 రోజులు, స్టడీ అవర్స్‌తో కలిపి 300 రోజులకు పైగా పనిచేస్తూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు.

అకడమిక్ రికార్డుల అప్‌లోడ్ గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: విద్యార్థులు అకడమిక్ రికార్డుల(సర్టిఫికెట్ల)ను నేషనల్ అకడమిక్ డిపాజిటరీ-అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ ప్లాట్‌ఫామ్‌లో అప్‌లోడ్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నవంబర్ 30 వరకు గడువు పొడిగించిందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సర్టిఫికెట్లను భద్రపరచుకోవడంతో పాటు క్రెడిట్లు, ధ్రువపత్రాలను సులభంగా ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చన్నారు.

పుష్టిగా పశు సంపద సృష్టి!

సరోగసి (అద్దె గర్భం) విధానం మనుషుల్లోనేకాక పశువులలో కూడా అభివృద్ధి చేయడం ద్వారా వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఒంగోలు జాతి గిత్తలను సరోగసి విధానంతో ఉత్పత్తి పెంచడం ద్వారా వ్యవసాయ పరంగానే కాకుండా పాల ఉత్పత్తి, పశువుల ఎగుమతి ద్వారా వాణిజ్య పరంగా కూడా అభివృద్ధి సాధ్యపడనుందని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతున్నారు.

- సరోగసి విధానంలో మేలుజాతి ఒంగోలు గిత్తల అభివృద్ధికి పెరిగిన అవకాశాలు
- ఐవీఎఫ్ పద్ధతిలో కోరుకున్న దూడల సృష్టి
- తొలిసారి బొల్లాపల్లి గ్రామంలో నరసింహ అనే ఒంగోలు జాతి కోడెదూడ రెండేళ్ల క్రితం జననం
- వ్యవసాయ రంగంలో వినూత్న ఒరవడితో ఎన్నో ప్రయోజనాలు



సరోగసి విధానంలో ఆవు గర్భంలోకి పిండాన్ని ప్రవేశపెడుతున్న దృశ్యం

మార్టూరు: బాపట్ల జిల్లా మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామంలో సరోగసి విధానంతో జన్మించిన ఒంగోలు జాతి గిత్త నరసింహతో జిల్లాలో పశువులలో సరోగసి విధానాన్ని మొదటిసారిగా దాదాపు రెండేళ్ల క్రితం ప్రారంభించారు.

జన్యు సంరక్షణ

పశువులలో సరోగసి విధానం ద్వారా మేలైన పశుసంపద సృష్టించడానికి ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, తిరుపతిలోని వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్త కార్యాచరణ రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ప్రకాశం జిల్లా దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ లీలాకృష్ణ, చదలవాడ పశు ఉత్పత్తి కేంద్రం ఏడీఏ డాక్టర్ బీ రవి, డాక్టర్ సోమశేఖర్‌తోపాటు మార్టూరు ఏడీఏ పద్మావతి, మార్టూరు మండలం కోలలపూడి పశు వైద్యురాలు మాధవీలతల బృందం కృషి ఎంతో ఉంది.

మేలు జాతి కోసం

సాధారణంగా ఒక ఆవు తన జీవితకాలంలో 8 నుంచి 10 దూడలను ఈనగలదు. మేలు జాతి ఆవు నుంచి సేకరించిన అండాలతో ఫలదీకరించిన 150 పిండాల ద్వారా సరోగసి విధానంలో 50 నుంచి 60 వరకు మేలు జాతి దూడలను పొందవచ్చు. ఈ పద్ధతి ద్వారా వయసు మీరిన, గాయపడిన, సహజ పద్ధతిలో సంతానోత్పత్తి చేయలేని ఆవుల నుంచి సైతం పిండాలను అభివృద్ధి చేయటం ద్వారా దూడలను పొందవచ్చు. ఈ విధానానికి సహజంగా తక్కువ పాల దిగుబడి ఉన్న ఆవుల గర్భాలను వైద్యులు ఎంచుకుంటారు. పాల దిగుబడి ఎక్కువగా ఇచ్చే మేలు రకపు ఆవుల నుంచి సేకరించిన అండాలతో మరో మేలు జాతి కోడెదూడల వీర్యంతో ఫలదీకరణ చేయబడిన పిండాలను ఈ ఎంపిక చేయబడిన ఆవుల గర్భంలో ప్రవేశపెడతారు. తద్వారా మేలురకపు పశు సంపద ఉత్పత్తి జరుగుతుంది. సరోగసి విధానం వలన అంతరించిపోతున్న పుంగనూరు, ఒంగోలు జాతి గిత్తలను గణనీయంగా ఉత్పత్తి చేసుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. గతంలో బ్రెజిల్‌కు ఎగుమతి చేయబడిన ఒంగోలు జాతి గిత్త మూలాలు కలిగిన కోడె దూడ ఇటీవల అదే దేశంలో అక్షరాల రూ.41 కోట్ల ధర పలికిన విషయం తెలిసిందే.

ప్రయోజనాలు ఎన్నో..

సరోగసి విధానం ద్వారా అధిక పాల ఉత్పత్తిని ఇచ్చే సామర్థ్యం గల ఆవులను సృష్టించవచ్చు. తద్వారా గణనీయమైన పాల ఉత్పత్తిని సాధించటంతోపాటు ఎగుమతులు చేయవచ్చు. మేలు జాతి కోడెదూడలను ఉత్పత్తి చేయడం ద్వారా వ్యవసాయంలో వినియోగించుకునే అవకాశం ఉంది. ఒంగోలు జాతి కోడె దూడల వీర్యానికి ప్రపంచస్థాయిలో ఉన్న డిమాండ్, పేరు ప్రఖ్యాతులు దృష్ట్యా ఇతర దేశాలకు ఎగుమతులు సైతం చేసుకొనే వాణిజ్యపరమైన అవకాశాలు లేకపోలేదు. ప్రస్తుతం విస్తరిస్తున్న ప్రకృతి సేద్యంలో భాగంగా గో వ్యర్థాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. తదద్వారా ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పెంపకాలకు ఎంతో అవకాశం ఉంది.

సరోగసి ద్వారా 20కుపైగా దూడలు



ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సరోగసి విధానం ద్వారా ఇప్పటివరకు సుమారు 20 దూడలను ఉత్పత్తి చేశాం. ప్రస్తుతం ప్రతి మండలంలో శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా ఒంగోలు జాతి గిత్తల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. స్థానికంగా కూలీల రేట్లు పెరిగి పశుపోషణ భారంగా మారుతున్నందున రైతులు వ్యవసాయం కోసం పశువులపై కంటే యంత్రాలవైపే మొగ్గు చూపుతున్నారు.

– డాక్టర్ సోమశేఖర్, పశువైద్యుడు, కొణిజేడు, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా

పశు ఉత్పత్తి పెంపుతో ప్రయోజనాలు

సరోగసి విధానం ద్వారా మేలు జాతి పశు ఉత్పత్తి పెరగడం వల్ల పాల దిగుబడి అధికం కానుంది. రైతులకు ఆదాయం చేకూరుతుంది. పంటల గిట్టుబాటు ధరలు ఒడిదొడుకులను ఎదుర్కొంటున్న వేళ పాల ఉత్పత్తి ద్వారా రైతులు నికరాదాయాన్ని పొందగలుగుతారు. ప్రకృతి సేద్యంలో నేడు వినియోగిస్తున్న అన్ని రకాల కషాయాల తయారీకి గో ఆధారిత వ్యర్థాలనే వినియోగిస్తున్నారు. ఆరోగ్యకరమైన పంటలను పండించగలుగుతున్నారు.

– వీరవల్లి కృష్ణమూర్తి, మార్టూరు మండల రైతు సంఘం అధ్యక్షుడు

అలా 'నరసింహ'కు ఊపిరి పోసి...

వీరి ప్రయత్నంతోనే మండలంలోని బొల్లాపల్లి గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గోశాలలోని ఆవు గర్భంలో ఫలదీకరించబడిన వేరే ఆవు పిండాన్ని ప్రవేశపెట్టడం ద్వారా 'నరసింహ' అనే ఒంగోలు జాతి కోడెదూడ 2023 సెప్టెంబర్ 12వ తేదీన పుట్టింది. వాస్తవానికి ఈ కోడె దూడ తాలూకు జన్యుపరమైన తల్లి ఆవు వయోభారంతో 2022 జూన్ నెలలోనే మరణించింది. అప్పటికే అంటే 2022 ఏప్రిల్ నెలలోనే ఈ ఆవు నుంచి సేకరించిన అండాల నుంచి అభివృద్ధి చేసిన పిండాన్ని అతి శీతలీకరణ పద్ధతిలో ద్రవ నత్రజనిలో భద్రపరిచారు. తల్లి మరణించిన సంవత్సరం తర్వాత కూడా అద్దె గర్భం ద్వారా పుట్టిన దూడగా నరసింహ రికార్డు సృష్టించటం గమనార్హం.



సరోగసి విధానం ద్వారా జన్మించిన బొల్లాపల్లిలోని కోడెదూడ నరసింహ

హెల్త్



ఎవరికైనా శరీరంలోని ఏ భాగంలోనైనా దెబ్బతగిలినప్పుడు అక్కడ ఎర్రగా మారి, వాపు వచ్చి మంట వస్తుంది. ఇలా జరగడాన్నే ఇంగ్లిష్‌లో ఇన్‌ఫ్లమేషన్ అంటారు. ఇది చర్మం పై వచ్చినప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది. అయితే కొన్నిసార్లు దేహభాగాల్లో లోపలి దెబ్బలకూ, గాయాలకు ఇన్‌ఫ్లమేషన్ రావచ్చు. ఇలా కేవలం దెబ్బలు తగిలినప్పుడు మాత్రమే కాకుండా... సాధారణంగా ఏదైనా ఇన్ఫెక్షన్ దేహంలోని ఆ భాగంలోనైనా వస్తే అక్కడ కూడా ఇన్‌ఫ్లమేషన్ రావచ్చు. ఆర్థ్రైటిస్ వంటి సమస్యలు వచ్చినప్పుడు కీళ్ల వద్ద, కీళ్ల మధ్య కూడా ఇన్‌ఫ్లమేషన్ రావడం జరగవచ్చు. దెబ్బలూ, గాయాలూ, ఇన్ఫెక్షన్లు, ఆర్థ్రైటిస్ వంటి కేసుల్లో గాయాలూ, కీళ్లలోనే కాకుండా అనేక సందర్భాల్లో అనేక అవయవాల్లోనూ ఇన్‌ఫ్లమేషన్లు రావచ్చు. ఉదాహరణకు... గుండెకు సంబంధించిన కార్డియోవాస్క్యులార్ జబ్బుల్లోనూ ఇన్‌ఫ్లమేషన్ కనిపించవచ్చు. ఈ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి, గాయాలూ, ఇన్ఫెక్షన్లను నయం చేయడానికి మందుల్ని వాడినప్పటికీ... కొన్ని రకాల ఆహారాలు సైతం ఇన్‌ఫ్లమేషన్‌ను వేగంగా తగ్గించేందుకు ఉపయోగపడతాయి. ఆ ఆహారాలేమిటో చూద్దాం...

ఫుడ్ ఫర్ ఇన్‌ఫ్లమేషన్

ఆహారంతో వాపును ఆపుదాం!

సాధారణంగా ఇన్‌ఫ్లమేషన్ వచ్చినప్పుడు అది వేగంగా తగ్గడానికి, గాయంగానీ లేదా ఇన్ఫెక్షన్‌గానీ నయం కావడానికి కొన్ని మందులు ఇస్తారు. వీటినే 'యాంటీ ఇన్‌ఫ్లమేటరీ' మందులుగా చెబుతారు. అయితే యాంటీఇన్‌ఫ్లమేటరీ మందులు, ఎన్‌ఎస్‌ఏఐడీ (నాన్ స్టెరాయిడ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్) వంటి ఔషధాలతో పాటు... దేహంలో ఇన్ఫెక్షన్, ఇన్‌ఫ్లమేషన్‌తో ప్రభావితమైన చోట అది తగ్గడానికీ, అలాగే అక్కడ వచ్చే నొప్పి తగ్గడానికి ఇచ్చే నొప్పి నివారణ (పెయిన్ కిల్లర్స్) మందులు... వీటన్నింటి కారణంగా కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ రావచ్చు. ఉదాహరణకు సుదీర్ఘకాలం పెయిన్ కిల్లర్స్ వాడటం వల్ల కిడ్నీలు దెబ్బతినడం జరగవచ్చు. అలాగే ఇన్‌ఫ్లమేషన్ తగ్గించే మందులను సైతం సుదీర్ఘకాలం పాటు వాడటమూ అంత మంచిది కాదు. అలా ఆ మందుల్ని దీర్ఘకాలం పాటు వాడటం వల్ల దేహంలో వ్యాధి నిరోధకశక్తి తగ్గడం, దేహం ఆ మందుల పట్ల నిరోధకత (రెసిస్టెన్స్) పెంచుకోవడం లాంటి పరిణామాలు జరగవచ్చు.



డాక్టర్ రాజీబ్ పాల్
సీనియర్ కన్సల్టెంట్
ఇంటర్నల్ మెడిసిన్

ఇన్‌ఫ్లమేషన్ తగ్గించే పని ఆహారమే చేస్తే...

ఒకవేళ మందుల్ని కేవలం పరిమితంగానే తీసుకుంటూ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల సదరు ఆహారాలలోని పోషకాల వల్ల ఇన్‌ఫ్లమేషన్ తగ్గించడం సాధ్యమవుతుందా అన్న ప్రశ్నకు అది సాధ్యపడుతుందనే అంటున్నారు డాక్టర్లు, ఆహార నిపుణులు. ఈ నేపథ్యంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గించే ఆహారాల గురించి తెలుసుకుందాం.

ఇన్‌ఫ్లమేషన్ తగ్గించే ఆహారాలతో ప్రయోజనాలివి...

ఒకవేళ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడానికి ఆహారాల మీదే ఆధారపడటం వల్ల నొప్పి నివారణ మందుల తాలూకు దుష్ప్రభావాన్ని తగ్గించడమే కాదు... వాటి వల్ల కోల్పోయే రోగనిరోధక శక్తినీ పెంపొందించుకోవచ్చు. అనవసరంగా వాడే మందుల మోతాదులు తగ్గించడంతో పాటు... వ్యాధినిరోధక వ్యవస్థను పరిపుష్టం చేసేలా దేహానికి అవసరమైన స్వాభావికమైన పోషకాలనే తీసుకోవడంతో శరీరానికి అవసరమైన విటమిన్లు, లవణాలు సమకూరతాయి. దాంతో నేచురల్ పదార్థాల వల్ల స్వాభావికంగానే ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది.

కొన్ని ముఖ్యమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఆహారాలివి...



✔ **చేపలు :** చేపల్లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. మరీముఖ్యంగా సాల్మన్ చేపల్లోని ఒమెగా 3-ఫ్యాటీ యాసిడ్స్ స్వాభావికమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ స్వభావాన్ని కలిగి ఉండి, మంచి ప్రయోజనాన్ని ఇస్తుంది.



✔ **కెల్ప్ :** ఇది ఆల్గే ప్రజాతికి చెందిన ఒక రకం ఆహారం. ప్రస్తుతం మన దగ్గర (మనదేశంలో) అంత విస్తృతంగా దొరకదు. అయితే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఆహారాల్లో ఇది చేపల తర్వాత అంత సమర్థమైనది. పైగా ఇది కేవలం యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలను కలిగి ఉండటం మాత్రమే కాకుండా... కాలేయ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను తగ్గించే నేచురల్ యాంటీ ట్యూమర్, యాంటీ ఆక్సిడేటివ్ గుణాలున్న ఆహారం కావడంతో దీన్ని వాడటం వల్ల మంచి ప్రయోజనాలు కలుగుతాయి.



✔ **ఆలివ్ ఆయిల్ :** మధ్యధరా (మెడిటెరేనియన్ సీ) ప్రాంతపు వాసులు చాలా ఆరోగ్యంగా సుదీర్ఘ కాలం జీవించడానికి వాళ్ల వంటకాల్లో ఆలివ్ ఆయిల్‌ను విస్తృతంగా వాడటం అని మనలో చాలామందికి తెలిసిన విషయమే. ఇక వాళ్ల సంస్కృతిలో తాజా పండ్లతో పాటు ఆలివ్ నూనెను వారి సంప్రదాయ వంటకాల్లో వాడటం వల్ల ఆ ప్రాంత వాసులు మరింత ఆరోగ్యంగా జీవిస్తున్నారని అనేక అధ్యయనాల్లో వెల్లడైంది. ఇందుకు కారణమేమిటంటే... ఈ ఆలివ్ నూనెలో కొవ్వులు ఎంత మోతాదులో ఉండాలో అంతే మోతాదులో ఉంటాయి. దాంతో పాటు ఆలివ్ ఆయిల్‌లో కేవలం ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే గుణం మాత్రమే కాకుండా... ఆస్థమానూ, ఆర్థ్రైటిస్‌నూ తగ్గించే గుణమూ ఉంది. గుండెకూ, రక్తనాళాలకూ మేలు చేసే స్వభావం కూడా ఈ ఆలివ్ ఆయిల్‌లో ఉండటం విశేషం.

✔ **క్రూసిఫెరస్ వెజిటబుల్స్ :** కాలీఫ్లవర్, క్యాబేజీ, బ్రాకలీలను క్రూసిఫెరస్ వెజిటబుల్స్‌గా పేర్కొంటారు. మొదట్లో మన దగ్గర కేవలం కాలీఫ్లవర్, క్యాబేజీ మాత్రమే లభ్యమవుతూ ఉండగా... ఇటీవల బ్రాకలీ లభ్యత కూడా బాగా పెరిగింది. ఈ క్రూసిఫెరస్ వెజిటబుల్స్‌లో యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉండటంతో పాటు... మన శరీరంలోని విషాలను (టాక్సిన్స్‌ను) స్వాభావికంగానే హరించే శక్తి ఉంది. ఇలా శరీరం నుంచి స్వాభావికంగా విషాలను తొలగించే శక్తి కారణంగానే ఇవి ప్రభావవంతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఆహారంగా గణుతికెక్కాయి.






✔ **బ్లూ బెర్రీస్ :** ఇవి ఇన్‌ఫ్లమేషన్‌ను స్వాభావికంగానే పూర్తిగా ప్రభావవంతంతో తగ్గించడమే కాదు... వయసు పెరుగుతున్న కొద్దీ మెదడుతో పాటు దేహంలోని అన్ని అవయవాల్లో కలిగే నష్టాలూ / అనర్థాలను తగ్గించే గుణాలూ ఉన్నాయి. వయసు పెరిగాక వచ్చే మతిమరపు (డిమెన్షియా)ను ఇవి సమర్థంగా అరికడతాయి. ఇక బ్లూబెర్రీస్‌లో యాంటీ క్యాన్సర్ గుణాలూ ఎక్కువే. అయితే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే... ఎరువులు వాడి పండించిన బ్లూ బెర్రీస్‌తో పోలిస్తే... స్వాభావికంగా పండించిన బ్లూ బెర్రీస్ మంచివి.



✔ **పసుపు :** పసుపుకు ఔషధ గుణాలు (మెడిసినల్ ప్రాపర్టీస్) ఉన్నాయన్న విషయం మనకు చాలా కాలం కిందటి నుంచే తెలుసు. పసుపులో ఉండే కర్క్యుమిన్ అనే పోషకం / పదార్థం యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాన్ని కలిగి ఉంటుంది. అందువల్లనే ఆహారంలో పసుపు వాడినప్పుడు అది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ప్రయోజనాలతో పాటు సమర్థమైన నొప్పి నివారణిగా కూడా పనిచేస్తుంది. మనం మెడికల్ షాపుకు వెళ్లి ఆన్ కౌంటర్ మెడిసిన్‌గా కొనుగోలు చేసే కొన్ని మందులు కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ చూపవచ్చు. కానీ పసుపు వేసి వండిన ఆహారాలు ఎలాంటి దుష్ప్రభావాలూ చూపకుండానే మంచి ప్రయోజనాన్ని ఇస్తూ మెడిసిన్ ఇచ్చే ప్రభావాన్ని చూపుతాయి.




✔ **అల్లం :** అల్లానికి కూడా ఔషధ గుణాలూ, వైద్య ప్రయోజనాలు చాలానే ఉన్నాయి. వాటిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణం కూడా ఒకటి. ఒక్క యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణం మాత్రమే కాకుండా అల్లానికి... రక్తంలో చక్కెర మోతాదులను తగ్గించే గుణం కూడా ఉంది.



✔ **వెల్లుల్లి :** వెల్లుల్లిలో ఎన్నో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నట్టు ఇప్పటికే అనేక పరిశోధనల్లో వెల్లడైంది. అంతే కాదు... ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలూ, దీనితో కలిగే ప్రయోజనాలపై ఇంకా పరిశోధన జరుగుతూనే ఉన్నాయి. ఇది సమర్థమైన నొప్పి నివారిణి మాత్రమే కాదు... ఇది చాలా రకాల క్యాన్సర్లనూ నివారిస్తుంది. అంతే కాదు... శరీరంలో ఇన్ఫెక్షన్లతోనూ పోరాడుతుంది. రక్తంలోని చక్కెరనూ సమర్థంగా నియంత్రిస్తుంది.



✔ **చిలగడదుంప :** తెలుగు రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో మోరంగడ్డ, గెణుసుగడ్డ అని పిలిచే ఈ దుంపలో కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్, పీచుపదార్థాలు, బీటా కెరోటిన్, మాంగనీసు, విటమిన్ బీ6, విటమిన్- సి వంటి అనేక కీలకమైన పోషకాలు ఉంటాయి. వీటి కారణంగా చిలగడదుంపకు ఇన్‌ఫ్లమేషన్‌ను త్వరగా మానేలా చేసే గుణం ఉంది.



✔ **గ్రీన్ టీ :** గ్రీన్ టీలోని ఫ్లేవనాయిడ్స్ అనే పోషకాలు గ్రీన్-టీ కి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలను ఇస్తాయి. చాలా రకాల క్యాన్సర్లకు గ్రీన్-టీ మంచి విరుగుడుగా పని చేస్తుంది.


ఇవన్నీ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించేందుకు ఉపయోగపడే ఆహారాలు కాగా... కొన్ని రకాల ఆహారాలు ఇన్‌ఫ్లమేషన్ పెంచుతాయి కూడా.

ఇక ఇన్‌ఫ్లమేషన్ కలిగించే ఆహారాలివి...

✘ **రిఫైన్డ్ ధాన్యాలు :** ధాన్యంపై ఉండే పొట్టును తొలగించి తీసుకునే ఆహారాలు ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతాయి.



✘ **కొన్ని రకాల ఆహారంపై పెంచే జంతువుల మాంసం:** ఆహారంగా ఉపయోగపడే జంతువులను పెంచే క్రమంలో కొన్నిచోట్ల వాటికి సోయా, కార్న్ వంటివి తినిపిస్తుంటారు. ఇలా సోయా, కార్న్ వంటివి తింటూ పెరిగిన ఆ జంతువుల మాంసం తిన్నప్పుడు దేహంలోని ఇన్‌ఫ్లమేషన్ ఒక పట్టాన తగ్గదు. అలాగే... ఇంకొన్ని జంతువులు త్వరగా లావెక్కి, వేగంగా కొవ్వు పట్టడానికి హార్మోన్, యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు చేస్తారు. ఇలాంటి జంతువుల మాంసం కూడా ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతుంది.




✘ **రెడ్‌మీట్, ప్రాసెస్‌డ్ మీట్ :** కొవ్వు ఎక్కువగా ఉండే గొడ్డు మాంసంలో ఎన్‌ఈయూ5జీసీ అనే పదార్థం ఉంటుంది. ఇది శరీరంలోకి చేరగానే ఇన్‌ఫ్లమేటరీ గుణానికి పెంపొందిస్తుంది. అందుకే ఏదైనా ఇన్‌ఫ్లమేషన్ ఉన్నవారు రెడ్‌మీట్‌ను తీసుకోవాల్సి వస్తే దాన్ని చాలా పరిమిత మోతాదుల్లో మాత్రమే తినాలి. ఒకవేళ రెడ్‌మీట్‌కు బదులు కోడి మాంసం, చేపలు తీసుకోవడం వల్ల ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుకోకుండా... తగ్గించుకునే అవకాశాలూ పెరుగుతాయి.



✘ **చక్కెరలు :** చక్కెరతో పాటు చక్కెరను వాడి తయారు చేసే అన్నిరకాల తీపి పదార్థాలూ ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతాయి.



✘ **వంటనూనెలు :** ఒక్క ఆలివ్ నూనె మినహాయించి... కుసుమ, సోయా, పొద్దుతిరుగుడు, కార్న్ నూనెలతో పాటు, పత్తినూనె సహా అన్ని రకాల వంట నూనెలూ ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతాయి.



✘ **ట్రాన్స్‌ఫ్యాట్స్ (కొవ్వులు):** స్వాభావికంగా పాల నుంచి వచ్చిన నెయ్యి కాకుండా... కృత్రిమంగా తయారు చేసే నెయ్యి లాంటి డాల్డా వంటి వాటిని ట్రాన్స్‌ఫ్యాట్స్‌గా పేర్కొంటారు. ఇక కొన్ని ఆహారాల్లో నూనెలు, నెయ్యి వంటివి వాడితే త్వరగా పాడవుతాయనీ, అలా పాడు కాకుండా ఉంచేందుకు దీర్ఘకాలం నిల్వ ఉంచేందుకూ (షెల్ఫ్ లైఫ్ పెంచేందుకు) మార్జరిన్ వంటి నూనెలు వాడతారు. ఈ ట్రాన్స్‌ఫ్యాట్స్ అన్నీ దేహంలో చెడు కొవ్వులనూ, చెడు కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దాంతో అన్ని రకాల కొవ్వులూ, వేపుళ్లు, ఫాస్ట్‌ఫుడ్స్, బేకరీ ఐటమ్స్ మాత్రమే కాకుండా మార్జరిన్ వంటి నూనెను ఉపయోగించిన అన్ని ఆహారాలూ దేహంలో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచేందుకు కారణమవుతాయి.

✘ **పాలలో అలర్జీని తెచ్చిపెట్టే కారకాలు / పోషకాలు :** పాలలోని అలర్జీ కలిగించే పదార్థాలు దేహంలో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచతారు. ఉదాహరణకు పాలు సరిపడని కొందరిలో వాటిని తాగినప్పుడు వాళ్ల ఒంటిపై ర్యాష్ వస్తుంది. దేహంలో ఇన్‌ఫ్లమేషన్ రావడం వల్లనే ఇలా జరుగుతుంది. (అయితే పాల అలర్జీ కారణంగా అవి సరిపడనివారికి మినహా మిగతా వారందరికీ పాలు మంచి ఆహారం).

✘ **ఆహారానికి కలిపే కృత్రిమ పదార్థాలు :** కొన్ని రకాల ఆహారాలకు అస్పార్టమ్, ఎమ్‌ఎస్‌జీ అనే అడెటివ్స్ కలుపుతారు. ఇవి కలిపిన ఆహారం ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతుంది.

✘ **మనకు సరిపడని అన్ని రకాల ఆహారాలు :** కొందరిలో కొన్ని రకాల ఆహారాలు అలర్జీని కలిగిస్తాయి. ఇలా సరిపడని ఆహారాల వల్ల కూడా ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుంది.



✘ **ఆల్కహాల్ :** ఆల్కహాల్ దేహంలోని చాలా భాగాల్లో ఉండే ఇన్‌ఫ్లమేషన్‌ను మరింత పెరిగేలా చేస్తుంది. దేహంలో ఇన్‌ఫ్లమేషన్ ఉండి, క్రమం తప్పకుండా ఆల్కహాల్ తీసుకుంటుంటే ఆ ఇన్‌ఫ్లమేషన్‌నే కాలక్రమంలో క్యాన్సర్‌గా మారే ప్రమాదమూ ఉంటుంది. అందుకే ఇన్‌ఫ్లమేషన్ ఉన్నవారు ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలి. ఆ మాటకొస్తే ఇన్‌ఫ్లమేషన్ లేనప్పుడూ ఆల్కహాల్ ముట్టుకోకపోవడమే మంచిది.

•••

చివరగా... ఒకవేళ ఏదైనా కారణాల వల్ల ఇన్‌ఫ్లమేషన్‌ను కలిగించే ఆహారాన్ని పూర్తిగా తీసుకోకుండా ఉండటం సాధ్యం కానప్పుడు దాన్ని చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలి. ఇన్‌ఫ్లమేషన్‌కు వ్యతిరేకంగా పనిచేసే యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. మనం ఆహారపదార్థాలను తినే సమయంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించేవాటిని ఎక్కువగా తీసుకుంటూ, పెంచేవాటిని తక్కువ మోతాదులో తీసుకోవడం లేదా వీలైతే పూర్తిగా దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలతో దేహంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను సమర్థంగా తగ్గించుకోవచ్చు.

నిర్వహణ:
యాసీన్

సాక్షి ప్లస్
మంగళవారం । 2-9-2025

బిజినెస్ రీల్

ఏటీఎఫ్ ధర 1.4 శాతం తగ్గింపు

వాణిజ్య సిలిండర్ రేటు రూ. 51.50 డౌన్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) విమాన ఇంధనం ధరలను (ఏటీఎఫ్) సోమవారం 1.4 శాతం మేర తగ్గించాయి. దీనితో దేశ రాజధాని న్యూఢిల్లీలో కిలో లీటరు ఏటీఎఫ్ రేటు రూ. 1,308.41 తగ్గి రూ. 90,713.52కి చేరింది. అటు ముంబైలో రూ. 86,077.14 నుంచి రూ. 84,832.83కి చేరింది. భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాలతో అంతర్జాతీయంగా చమురు రేట్లు పెరిగిన నేపథ్యంలో జూలై 1 నుంచి వరుసగా రెండు నెలల పాటు కిలోలీటరుకు రూ. 8,949.38 మేర పెంచిన ఓఎంసీలు తాజాగా తగ్గించాయి. సాధారణంగా విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాల్లో ఇంధనం ఖర్చుల వాటా దాదాపు 40 శాతం వరకు ఉంటుంది.

యూబీఎల్ ఇలియోస్ బ్రూవరీలో ఉత్పత్తి ప్రారంభం

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ తూర్పుగోదావరి జిల్లాలోని ఇలియోస్ బ్రూవరీ నుంచి బీర్ల ఉత్పత్తి ప్రారంభించినట్లు హైనెకెన్ గ్రూప్ సంస్థ యునైటెడ్ బ్రూవరీస్ (యూబీఎల్) వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లాలోని ఈ బ్రూవరీ నెలవారీ సామర్థ్యం 4.5 లక్షల కేస్‌లుగా ఉంటుందని తెలిపింది. శ్రీకాకుళం బ్రూవరీ 12 లక్షల కేస్‌లకు ఇది అదనంగా ఉంటుందని సంస్థ ఎండీ వివేక్ గుప్తా తెలిపారు. ఇలియోస్ బ్రూవరీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

స్టార్ లోకల్‌మార్ట్ చేతికి దస్‌మినిట్



న్యూఢిల్లీ: సంజయ్ ఘొడావత్ గ్రూప్‌లో భాగమైన స్టార్ లోకల్‌మార్ట్ తాజాగా గేటెడ్ కమ్యూనిటీల్లో కార్యకలాపాలు సాగించే బెంగళూరు రిటైల్ చెయిన్ 'దస్‌మినిట్'ని కొనుగోలు చేసింది. దీనితో స్టార్ లోకల్‌మార్ట్ స్టోర్ల సంఖ్య 170కి చేరింది. చిన్న పట్టణాల మీద మరింతగా ఫోకస్ చేస్తున్న స్టార్ లోకల్‌మార్ట్ ఇటీవలే రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, గోవాల్లో భారీగా కార్యకలాపాలు విస్తరించింది. వచ్చే ఐదేళ్లలో రూ. 5,000 కోట్ల ఆదాయాన్ని కంపెనీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా 2030 నాటికి స్టోర్స్ సంఖ్యను 3,000కు పెంచుకోనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

2-9-2025

విశాఖ	570–00
చిత్తూరు	578–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	565–00
విజయవాడ	570–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ-AUTO	8,978.00	4.01
M&M	3,312.00	3.52
HEROMOTOCO	5,250.00	3.18
EICHERMOT	6,292.00	3.1
TATAMOTORS	689.7	3.09

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SUNPHARMA	1,564.00	-1.91
ITC	405.55	-1.03
HINDUNILVR	2,645.00	-0.56
TITAN	3,618.00	-0.3
CIPLA	1,585.90	-0.22

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,230
ఎన్ఎస్ఈ	84,799
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,19,843
ఎఫ్ఐఐ	- 1,430
డీఐఐ	+ 4,335

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	64.61	$	64.01
బ్రెంట్	68.16	$	67.68

తయారీ రంగం భళా



- 59.3కు పీఎంఐ
- 17 ఏళ్లలోనే వేగవంతమైన పురోగతి

న్యూఢిల్లీ: తయారీ రంగం ఆగస్టులో అదరగొట్టింది. ఈ రంగంలో పనితీరును ప్రతిఫలించే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా తయారీ రంగ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 59.3కు చేరుకుంది. జూలైలో ఇది 59.1గా ఉంది. పదిహేడున్నరేళ్ల కాలంలోనే అత్యంత వేగవంతమైన విస్తరణను చూపించినట్లు హెచ్‌ఎస్‌బీసీ ఇండియా తెలిపింది. 50 పాయింట్లకు పైన విస్తరణగా, అంతకు దిగువన నమోదైతే కుచించినట్లు పరిగణిస్తుంటారు. ''భారత తయారీ రంగ పీఎంఐ ఆగస్టులో మరో కొత్త రికార్డును తాకింది. తయారీ శర వేగంగా విస్తరించడం ఫలితమే ఇది. భారత వస్తువులపై అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధించడం కొత్త ఎగుమతి ఆర్డర్లు కొంత తగ్గేందుకు దారితీసి ఉండొచ్చు. టారిఫ్‌ల అనిశ్చితుల మధ్య అమెరికా కొనుగోలుదారులు కొత్త ఆర్డర్లకు దూరంగా ఉన్నారు''అని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ముఖ్య ఆర్థిక వేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. కొత్త ఆర్డర్ల రాక ఐదు నెలల కనిష్ట స్థాయిలో ఉన్నట్లు ఈ నివేదిక తెలిపింది. కాకపోతే జూలై ఆర్డర్ల స్థాయిలోనే ఉన్నట్లు పేర్కొంది.

శాంసంగ్ నుంచి ఏ17 స్మార్ట్‌ఫోన్

ధర రూ. 18,999 నుంచి ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పండుగ సీజన్ సందర్భంగా కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ తాజాగా తమ గెలాక్సీ 'ఏ' సిరీస్ స్మార్ట్‌ఫోన్లను విస్తరించింది. 5జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాలు గల ఏ17ని ఆవిష్కరించింది. దీని ధర శ్రేణి రూ. 18,999–రూ. 23,499గా ఉంటుంది. హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ కార్డులు, యూపీఐ ద్వారా రూ. 1,000 వరకు క్యాష్‌బ్యాక్ లభిస్తుందని సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఆదిత్య బబ్బర్ తెలిపారు. ఈ విభాగంలో అత్యంత పల్చని, తేలికైన ఫోన్ ఇదేనని ఆయన చెప్పారు. 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీప్లస్ సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే, ఎక్సినోస్ ప్రాసెసర్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ కెమెరా, 14 ప్రాంతీయ భాషల్లో జెమినీ లైవ్ సపోర్ట్ తదితర ప్రత్యేకతలు ఇందులో ఉంటాయని ఆదిత్య వివరించారు. 6 జనరేషన్స్ వరకు ఆండ్రాయిడ్, 6 ఏళ్ల వరకు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఆఫర్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఆఖరు నాటికి పది కోట్ల 'ఏ' సిరీస్ స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు సాధించాలని నిర్దేశించుకున్నట్లు, ఇప్పటివరకు 9.7 కోట్లు విక్రయించినట్లు ఆయన పేర్కొన్నారు.

కొంచెం ఆగి చూద్దాం!

కొనుగోళ్లను వాయిదా వేస్తున్న వినియోగదారులు

- జీఎస్‌టీ తగ్గింపు నేపథ్యంలో వేచి చూసే ధోరణి
- ఇది తాత్కాలికమేనంటున్న నిపుణులు



న్యూఢిల్లీ: కీలకమైన పండుగల సమయంలో వినియోగదారులు (ఆన్‌లైన్ షాపర్లు) ఎలక్ట్రానిక్స్, కన్జూమర్ గూడ్స్ తదితర ఉత్పత్తుల కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నారు. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) క్రమబద్ధీకరణతో రేట్లు తగ్గుతాయన్న అంచనాలే ఇందుకు కారణం. అయితే ఈ పరిస్థితి తాత్కాలికమేనని, ఒక్కసారి పన్ను రేట్లపై స్పష్టత వస్తే కొనుగోళ్లు తిరిగి ఊపందుకుంటాయన్నది నిపుణుల అంచనా. కేంద్ర ప్రభుత్వం సైతం జీఎస్‌టీలో శ్లాబుల తగ్గింపును వేగంగా అమల్లోకి తీసుకురావాలనుకుంటోంది. ఇందులో భాగంగానే సెప్టెంబర్ 3, 4 తేదీల్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్‌టీ కౌన్సిల్ భేటీ కానుంది. ప్రస్తుతం వివిధ రకాల వస్తు సేవలపై 5, 12, 18, 28 శాతం జీఎస్‌టీ రేట్లు అమల్లో ఉండడం తెలిసిందే. 12, 28 శాతం శ్లాబులను ఎత్తివేయాలన్నది ప్రతిపాదన. అప్పుడు అధిక శాతం వస్తు సేవలు 5 లేదా 18 శాతం రేట్ల పరిధిలోకి వస్తాయి. వాషింగ్ మెషిన్లు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తదితర ఎన్నో ఉత్పత్తులపై పన్ను భారం తగ్గనుంది.

ఈ-కామర్స్‌పై కనిపిస్తున్న మార్పు..

ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై వినియోగదారుల కొనుగోళ్ల పరంగా స్పష్టమైన మార్పు కనిపిస్తున్నట్టు గ్రాంట్ థార్న్‌టన్ భారత్ పార్ట్‌నర్ నవీన్ మల్పానీ తెలిపారు. ముఖ్యంగా అధిక విలువ కలిగిన ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల విషయంలో ఈ ధోరణి నెలకొన్నట్టు చెప్పారు. ''జీఎస్‌టీ రేట్లపై స్పష్టత ఆలస్యమయితే అప్పుడు ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు తదితర విభాగాలపై 25–30 శాతం మేర ప్రభావం పడొచ్చు. కొత్త శ్లాబులు అమల్లోకి వస్తే రేట్లు తగ్గుతాయన్న అంచనాలు ప్రస్తుత వేచి చూసే ధోరణికి కారణమవుతున్నాయి. ఉదాహరణకు రూ.1.2 లక్షల ఖరీదైన స్మార్ట్‌ఫోన్ ధర జీఎస్‌టీలో సంస్కరణల అనంతరం 10 శాతం మేర తగ్గనుంది. ఈ అంచనాలు కొనుగోళ్ల నిర్ణయాలను వాయిదా వేసుకునేందుకు దారితీస్తున్నాయి'' అని మల్పానీ వివరించారు.

అమ్మకాలు వేగంగా పెరుగుతాయ్..

''రిటైలర్ల వద్ద ఉత్పత్తుల నిల్వలు అధికంగానే ఉన్నాయి. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల విభాగంలో కొనుగోళ్లు వాయిదా పడుతున్నాయి. పండుగల సీజన్ చివర్లో (అక్టోబర్) పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా సన్నద్ధం అయ్యేందుకు ఈ-కామర్స్ సంస్థలు బ్రాండ్లతో సంప్రదింపులు చేస్తున్నాయి. జీఎస్‌టీలో పన్ను రేట్ల సవరణ ధరల వ్యూహాల్లోనూ మార్పులకు దారితీయనుంది. మొత్తం మీద సమీప కాలంలో కనిపించే ప్రభావం తాత్కాలికమే. కొత్త పన్నులపై ఒక్కసారి స్పష్టత వస్తే అమ్మకాలు వేగంగా పుంజుకుంటాయి'' అని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ సీనియర్ అనలిస్ట్ శుభమ్ నింకార్ తెలిపారు. ఈ-కామర్స్ సంస్థలకు పండుగల సీజన్ ఎంతో కీలకం. వార్షిక అమ్మకాల్లో పావు శాతం ఈ సమయంలోనే నమోదవుతుంటాయి.

పండుగ షాపింగ్ ప్రత్యేకం..

పండుగల సమయంలో కొనుగోళ్లు కేవలం సంస్కృతిలో భాగమే కాకుండా, భావోద్వేగపరమైనవి అని షిప్‌రాకెట్ ఎండీ, సీఈవో సాహిల్ గోయల్ పేర్కొన్నారు. ''కొత్త గృహోపకరణం అయినా, గ్యాడ్జెట్ అయినా లేక గృహ నవీకరణ అయినా పండుగల సమయంలో కొనుగోలు చేసేందుకు కుటుంబాలు ప్రణాళికలతో ఉంటాయి. ఈ అంతర్గత డిమాండ్ కచ్చితంగా కొనసాగుతుంది. జీఎస్‌టీ క్రమబద్ధీకరణ అన్నది కొనుగోళ్ల దిశగా వినియోగదారులకు మరింత ప్రోత్సాహాన్నిస్తుంది. రేట్ల సవరణతో ధరలు అందుబాటులోకి వస్తాయి. వినియోగదారుల కొనుగోలు శక్తి పెరుగుతుంది'' అని వివరించారు. జీఎస్‌టీ రేట్ల క్రమబద్ధీకరణ అన్నది నిర్మాణాత్మక సంస్కరణ అని, వినియోగానికి బలమైన ఊతం ఇస్తుందని ఫ్లిప్‌కార్ట్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ కుమార్ సైతం అభిప్రాయపడ్డారు. జీఎస్‌టీలో మార్పులు అమల్లోకి వచ్చినట్టయితే పండుగల సీజన్‌లో ఈ-కామర్స్ అమ్మకాలు మొత్తం మీద 15–20 శాతం పెరగొచ్చని (గతేడాదితో పోల్చితే) మల్పానీ అంచనా వేశారు.

ఫ్లిప్‌కార్ట్ చేతికి పింక్‌విల్లా

జెన్‌జెడ్ కంటెంట్‌పై దృష్టి

PINKVILLA

న్యూఢిల్లీ: ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తాజాగా డిజిటల్ ఇన్ఫోటెయిన్‌మెంట్ ప్లాట్‌ఫామ్ పింక్‌విల్లాను సొంతం చేసుకుంది. కంటెంట్ విభాగంలోకి ప్రవేశించేందుకు వీలుగా పింక్‌విల్లా ఇండియాలో మెజారిటీ వాటా కొనుగోలు చేసినట్లు ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది. అయితే డీల్ విలువను వెల్లడించలేదు. తాజా కొనుగోలుతో జెన్‌జెడ్, మిలీనియల్ ప్రేక్షకులను ఆకట్టుకోనున్నట్లు ఫ్లిప్‌కార్ట్ తెలియజేసింది. పటిష్ట కంటెంట్ ఐపీలు, సంబంధిత వీక్షకుల బేస్ తదితరాల ద్వారా కంటెంట్ ఆధారిత వృద్ధిని అందుకోనున్నట్లు వివరించింది. ఇప్పటికే అమెజాన్ ప్రైమ్ ప్లాట్‌ఫామ్‌తో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యర్థి కంపెనీ, ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ కంటెంట్ బిజినెస్‌లో భారీగా విస్తరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫ్లిప్‌కార్ట్ కొనుగోలుకి ప్రాధాన్యత ఏర్పడింది.

ఐఆర్‌డీఏఐ చైర్మన్‌గా అజయ్‌సేత్ బాధ్యతలు



న్యూఢిల్లీ: బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) కొత్త చైర్మన్‌గా ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అజయ్ సేత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. 1987 బ్యాచ్ కర్ణాటక కేడర్ ఐఏఎస్ అధికారి అయిన సేత్ కేంద్ర ఆర్థిక శాఖలో నాలుగేళ్ల సుదీర్ఘ సేవల అనంతరం ఈ ఏడాది జూన్‌లోనే పదవీ విరమణ చేశారు. స్వల్ప విరామంతో ఆయన్ని కీలకమైన ఐఆర్‌డీఏఐ చైర్మన్ బాధ్యతల్లో కేంద్రం కూర్చోబెట్టడం గమనార్హం. బీమా రంగంలో ఆరోగ్యకరమైన పోటీకి, అందరికీ బీమా సేవల విస్తృతికి, ఉత్తమ ప్రమాణాల అమలుకు, పాలసీదారుల ప్రయోజనాల పరిరక్షణకు ఐఆర్‌డీఏఐ కృషి చేస్తుంటుంది.

దేశీ వినియోగమే జీడీపీకి బూస్ట్

- ఫలితంగా జూన్ క్వార్టర్‌లో 7.8 శాతం వృద్ధి
- క్రిసిల్ ఆర్థికవేత్తల బృందం



కోల్‌కతా: దేశీ డిమాండ్ పుంజుకోవడం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతానికి చేరుకునేలా చేసినట్టు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నామినల్ జీడీపీ మాత్రం జూన్ క్వార్టర్‌లో 8.8 శాతానికి తగ్గిందని, క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఇది 10.8 శాతంగా ఉన్నట్టు క్రిసిల్ ఆర్థికవేత్తల బృందం పేర్కొంది. ''దేశీ ప్రైవేటు వినియోగం బలపడింది. ఇది తయారీ, సేవల రంగానికి ఊతమిచ్చింది. మొదటి త్రైమాసికంలో ప్రభుత్వం మూలధన వ్యయాలను పెద్ద మొత్తంలో పెంచిది. ఇది సైతం ప్రభుత్వ వినియోగ వ్యయాన్ని పెంచింది'' అని క్రిసిల్ ఆర్థిక బృందం తెలిపింది. స్థూల విలువ జోడింపు (జీవీఏ) క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో ఉన్న 6.8 శాతం నుంచి 7.6 శాతానికి పెరిగినట్టు పేర్కొంది. గ్రామీణ డిమాండ్ ప్రైవేటు వినియోగం పెరిగేందుకు దోహదం చేసి ఉండొచ్చని అభిప్రాయపడింది.

సవాళ్లలోనూ పటిష్ట పనితీరు..

అంతర్జాతీయంగా ఎన్నో సవాళ్లు నెలకొన్న తరుణంలో భారత జీడీపీ రికార్డు స్థాయిలో 7.8 శాతంగా నమోదు కావడం ప్రశంసనీయమని ఐటీసీ చైర్మన్ సంజీవ్ పురి పేర్కొన్నారు. గత ఐదు త్రైమాసికాల్లోనే ఇది గరిష్ఠ రేటు అని గుర్తు చేశారు. వినియోగ ఆధారిత ఆర్థిక వ్యవస్థ కావడంతో అన్ని రంగాల్లో అవకాశాల విస్తరణకు మద్దతునిస్తున్నట్టు చెప్పారు. పెద్ద ఎత్తున పెట్టుబడులతో తన నిర్వహణలోని అన్ని వ్యాపారాల విస్తరణకు, విలువ జోడింపునకు ఐటీసీ కట్టుబడి ఉన్నట్టు చెప్పారు.

ఆగస్టులో హైరింగ్ 3 శాతం అప్..

- ఐటీయేతర, ఏఐ–ఎంఎల్ ఉద్యోగాలకు డిమాండ్
- హైదరాబాద్‌లో నియామకాల జోరు
- నౌకరీ జాబ్‌స్పీక్ నివేదిక



న్యూఢిల్లీ: ఈ ఏడాది ఆగస్టులో దేశీయంగా వైట్–కాలర్ జాబ్ మార్కెట్ వార్షిక ప్రాతిపదికన 3 శాతం వృద్ధి చెందింది. ప్రధానంగా ఐటీయేతర రంగాలు, కృత్రిమ మేథ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) ఉద్యోగాలకు డిమాండ్ నెలకొన్నట్లు నౌకరీ జాబ్‌స్పీక్ నివేదిక వెల్లడించింది. ప్రొఫెషనల్స్, మేనేజర్లు, అడ్మినిస్ట్రేషన్ ఉద్యోగాలను వైట్ కాలర్ ఉద్యోగాలుగా వ్యవహరిస్తారు. నివేదిక ప్రకారం ఆగస్టులో అత్యధికంగా 24 శాతం హైరింగ్‌తో బీమా రంగం అగ్రస్థానంలో నిల్చింది. ఆతిథ్య (22 శాతం), రియల్ ఎస్టేట్ (18 శాతం) రంగాలు తర్వాత స్థానాల్లో ఉన్నాయి. బీపీవో/ఐటీఈఎస్ (17 శాతం), విద్య (16 శాతం), ఆయిల్..గ్యాస్ (7 శాతం), రిటైల్ (3 శాతం), ఎఫ్‌ఎంసీజీ (2 శాతం) రంగాల్లో కూడా సానుకూల హైరింగ్ నమోదైంది. రిపోర్టులో మరిన్ని విశేషాలు..

- కొత్త టెక్నాలజీల్లో నిపుణులకు డిమాండ్ నెలకొనడంతో ఏఐ/ఎంఎల్ ఉద్యోగాలకు హైరింగ్ 54 శాతం ఎగిసింది. అయితే, ఓవరాల్‌గా ఐటీ/సాఫ్ట్‌వేర్ సర్వీసుల రంగంలో నియామకాలు 6 శాతం తగ్గాయి.
- బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసుల విభాగంలో హైరింగ్ 11 శాతం, టెలికం/ఐఎస్‌పీలో నియామకాలు 13 శాతం క్షీణించాయి.
- ఫ్రెషర్ల (0–3 ఏళ్ల అనుభవం) రిక్రూట్‌మెంట్ 7 శాతం పెరిగింది. ఆతిథ్య, రియల్ ఎస్టేట్, విద్య తదితర ఐటీయేతర రంగాల్లో డిమాండ్ ఇందుకు తోడ్పడింది.
- ఓవరాల్‌గా 10 శాతం హైరింగ్ వృద్ధితో నియామకాలకు సంబంధించి హైదరాబాద్ టాప్ మెట్రో సిటీగా నిల్చింది. యూనికార్న్‌లలో (1 బిలియన్ డాలర్ల విలువ చేసే అంకురాలు) రిక్రూట్‌మెంట్ 45 శాతం ఎగిసింది.

రూ. 6 వేల కోట్ల 'పెద్ద' నోట్లు ఇంకా చలామణీలో..



ముంబై: రిజర్వ్ బ్యాంక్ రూ. 2,000 నోట్లను ఉపసంహరించి రెండేళ్లవుతున్నా ఇప్పటికీ రూ. 5,956 కోట్ల విలువ చేసే నోట్లు చలామణీలో ఉన్నాయి. ఆర్‌బీఐ సోమవారం విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది. 2023 మే 19న ఈ పెద్ద నోట్లను వెనక్కి తీసుకుంటున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ రోజున మొత్తం రూ. 3.56 లక్షల కోట్ల విలువ చేసే రూ. 2,000 నోట్లు చలామణీలో ఉండగా 2025 ఆగస్టు 31 నాటికి ఇది రూ. 5,956 కోట్లకు తగ్గినట్లు ఆర్‌బీఐ తెలిపింది. 98.33 శాతం పెద్ద నోట్లు వెనక్కి వచ్చినట్లు పేర్కొంది. రూ. 2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించినప్పటికీ, వాటిని రద్దు చేయలేదు కాబట్టి చలామణీలో ఉన్నవి చెల్లుబాటు అవుతాయి. ఈ నోట్లను బ్యాంక్ అకౌంట్లలో డిపాజిట్ చేసుకోవచ్చు. తమ ఖాతాల్లో జమ చేసుకునేందుకు ఇండియా పోస్ట్ ద్వారా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లోని ఆర్‌బీఐ ఇష్యూ ఆఫీసులకు ఇండియా పోస్ట్ ద్వారా పంపించవచ్చు.

జీఎస్‌టీ 2.0తో ఒకే పన్ను రేటు దిశగా అడుగులు

థింక్ చేంజ్ ఫోరం నివేదిక



న్యూఢిల్లీ: ప్రతిపాదిత జీఎస్‌టీ 2.0 సంస్కరణలు అంతిమంగా ఒకే పన్ను రేటు దిశగా బాటలు వేస్తాయని మేథావుల సంఘం థింక్ చేంజ్ ఫోరం ఒక నివేదికలో పేర్కొంది. 'నేడు రెండు శ్లాబ్‌లు – రేపు ఒకే రేటు' పేరిట దీన్ని రూపొందించింది. గరిష్ఠ ట్యాక్స్ రేటును 40 శాతంగా కాకుండా సెస్సులన్నీ కలిపి 18 శాతంగా నిర్ణయించడం శ్రేయస్కరమని పేర్కొంది. ప్రస్తుతానికి 40 శాతం శ్లాబును కొన్ని లగ్జరీ ఉత్పత్తులకే నిర్దేశించినా సరే భవిష్యత్తులో మరిన్ని ఉత్పత్తులను ఈ పరిధిలోకి చేర్చే అవకాశముందని, దీనితో ట్యాక్స్ రేట్లను సరళతరం చేయాలన్న ప్రధాన ఉద్దేశం నీరుగారుతుందని తెలిపింది. 18 శాతం రేటుతో జీఎస్‌టీ స్వరూపంలో అసమానతలు, న్యాయవివాదాలు, నిబంధనల భారం తగ్గుతాయని, చట్టవిరుద్ధ మార్కెట్లను అదుపు చేసి జీఎస్‌టీ వ్యవస్థపై విశ్వసనీయతను పునరుద్ధరించవచ్చని నివేదిక తెలిపింది.

కరెంట్ ఖాతా లోటు 0.2 శాతమే

ఆర్‌బీఐ డేటా విడుదల



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (2025–26 ఏప్రిల్–జూన్) కరెంటు ఖాతా లోటు (క్యాడ్)జీడీపీలో 0.2 శాతంగా (2.4 బిలియన్ డాలర్లు) ఉన్నట్టు ఆర్‌బీఐ విడుదల చేసిన డేటా తెలియజేస్తోంది. క్రితం ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం చివరికి క్యాడ్ జీడీపీలో 0.9 శాతం (8.6 బిలియన్ డాలర్లు)తో పోల్చితే చాలా తక్కువకే పరిమితమైంది. సేవల ఎగుమతులు ఇందుకు దోహదం చేసినట్టు డేటా స్పష్టం చేస్తోంది. ఇక ఈ ఏడాది జనవరి–మార్చి త్రైమాసికంలో కరెంట్ ఖాతా 13.5 బిలియన్ డాలర్ల మిగులు (జీడీపీలో 1.3 శాతం)తో ఉండడం గమనార్హం. విదేశాలకు చేసే ఎగుమతుల రూపంలో వచ్చే ఆదాయం, దిగుమతులకు చేసే చెల్లింపులు, ఆదాయ స్వీకరణలు ఇవన్నీ కరెంట్ ఖాతా కిందకు వస్తాయి. వస్తు వాణిజ్యానికి సంబంధించి లోటు జూన్ త్రైమాసికంలో 68.5 బిలియన్ డాలర్లుగా ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ1లో ఇది 63.8 శాతమే. సేవల రూపంలో నికరంగా 47.9 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది 39.7 బిలియన్ డాలర్లుగా ఉంది. వ్యక్తిగత నగదు బదిలీ స్వీకరణలు (విదేశాల్లో స్థిరపడిన వారు మాతృదేశానికి పంపించే) 33.2 బిలియన్ డాలర్లుగా జూన్ త్రైమాసికంలో నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో 28.6 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనించొచ్చు.

సూచీలకు 'జీడీపీ' జోష్

- మూడు రోజులకు నష్టాలకు బ్రేక్
- సెన్సెక్స్ 555 పాయింట్లు ప్లస్



ముంబై: దేశీయ తొలి త్రైమాసిక జీడీపీ గణాంకాలు అంచనాలకు మించి నమోదవడం స్టాక్ మార్కెట్ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపింది. జీఎస్టీ 2.0 తో అధిక ప్రయోజనం పొందే ఆటో, వినిమయ షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. ఫలితంగా సెన్సెక్స్ 555 పాయింట్లు పెరిగి 80,364 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 198 పాయింట్లు లాభపడి 24,625 వద్ద నిలిచింది. దీంతో సూచీల మూడు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు క్రమంగా పుంజుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 597 పాయింట్లు పెరిగి 80,407 వద్ద, నిఫ్టీ 209 పాయింట్లు బలపడి 24,636 వద్ద గరిష్టాన్ని తాకింది. అయితే విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, రూపాయి జీవితకాల కనిష్టానికి పతనం సూచీల లభాలకు కళ్లెం వేశాయి.

- ఆసియాలో చైనా, హాంగ్‌కాంగ్ సూచీలు నష్టపోగా, కొరియా, జపాన్ ఇండెక్సులు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. అమెరికా మార్కెట్లు 0.50% – 1% నష్టంతో ట్రేడవుతున్నాయి.
- బీఎస్ఈ రంగాల వారీ ఇండెక్సుల్లో ఆటో 2.68%, కన్జూమర్ డ్యూరబుల్స్, వినిమయ, క్యాపిటల్ గూడ్స్ విద్యుత్ 2%, మెటల్, ఐటీ 1.50% పెరిగాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 1.50% రాణించాయి.
- రూపాయి కొత్త కనిష్టాల పతనం కొనసాగింది. భారత్–అమెరికాల వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితులు, డాలర్లకు డిమాండ్ కొనసాగడంతో సోమవారం ఒక్కపైసా బలహీనపడి తాజా జీవితకాల కనిష్టం 88.10 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24 క్షీణించి 88.33 వద్ద కనిష్టాన్ని తాకింది. దేశీయ స్టాక్ మార్కెట్ లాభపడటంతో రూపాయి కొంత మేరకు రికవరీ అయ్యింది. '' వాణిజ్య ఒప్పంద అస్థిరతలు, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు, క్రూడాయిల్ ధరల పెరుగుదల ఒత్తిళ్ల నేపథ్యంలో రూపాయి మరింత పతనాన్ని చవిచూడొచ్చు. రానున్న రోజుల్లో 87.85 – 88.50 శ్రేణిలో ట్రేడవ్వొచ్చు'' మీరే అసెట్ ఫారెక్స్ రీసెర్చ్ నిపుణుడు అనుజ్ చౌదరీ తెలిపారు.



జొకోవిచ్... 64వ సారి

గ్రాండ్‌స్లామ్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లోకి సెర్బియా దిగ్గజం

- ఒకే ఏడాది అన్ని గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ క్వార్టర్ ఫైనల్ చేరిన అతి పెద్ద వయస్కుడిగా రికార్డు
- ప్రిక్వార్టర్ ఫైనల్లో వరుస సెట్‌లలో విజయం
- అల్‌కరాజ్, టేలర్ ఫ్రిట్జ్ కూడా ముందుకు

టెన్నిస్ చరిత్రలోనే అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా అవతరించేందుకు ప్రయత్నిస్తున్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో అడుగు ముందుకు వేశాడు. టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో ఈ మాజీ చాంపియన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గత ఏడాది మూడో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టిన ఏడో సీడ్ ఈసారి మాత్రం సాధికారిక ఆటతో టైటిల్‌పై గురి పెట్టాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఓవరాల్‌గా 64వ సారి క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించిన జొకోవిచ్... యూఎస్ ఓపెన్‌లో 14వ సారి ఈ ఘనత సాధించాడు. ఈ క్రమంలో 38 ఏళ్ల జొకోవిచ్ ఒకే ఏడాది అన్ని గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ (ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్) కనీసం క్వార్టర్ ఫైనల్ చేరిన అతి పెద్ద వయస్కుడిగా కొత్త రికార్డు నెలకొల్పాడు.

2 యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ విభాగంలో జిమ్మీ కానర్స్ (అమెరికా : 17 సార్లు) తర్వాత అత్యధికంగా 14 సార్లు క్వార్టర్ ఫైనల్ చేరిన రెండో ప్లేయర్‌గా జొకోవిచ్ నిలిచాడు. తాజా గెలుపుతో ఫెడరర్ (స్విట్జర్లాండ్ : 13 సార్లు), ఆంద్రీ అగస్సీ (అమెరికా : 13 సార్లు)లను జొకోవిచ్ దాటేశాడు.

4 పాంచో గొంజాలెజ్ (అమెరికా : 40 ఏళ్ల ప్రాయంలో 1968లో), కెన్ రోజ్‌వాల్ (ఆస్ట్రేలియా : 40 ఏళ్ల ప్రాయంలో 1974లో), జిమ్మీ కానర్స్ (అమెరికా : 39 ఏళ్ల ప్రాయంలో 1991లో) తర్వాత యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన నాలుగో అతిపెద్ద వయస్కుడిగా జొకోవిచ్ గుర్తింపు పొందాడు.

న్యూయార్క్: కెరీర్‌లో 19వ సారి యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడుతున్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ఒక్కో అడ్డంకిని అధిగమిస్తూ దూసుకెళ్తున్నాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-3, 6-3, 6-2తో జాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ)పై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. 1 గంట 49 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్‌కు ఏ దశలోనూ ఇబ్బంది ఎదురుకాలేదు. 12 ఏస్‌లతో అదరగొట్టిన జొకోవిచ్ ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయకపోవడం విశేషం. నెట్ వద్దకు 18 సార్లు దూసుకొచ్చిన అతను 15 సార్లు పాయింట్లు గెలిచాడు. తన సర్వీస్‌ను ఒకసారి చేజార్చుకున్న మాజీ చాంపియన్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. 33 విన్నర్స్ కొట్టిన జొకోవిచ్ కేవలం 20 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు జాన్ లెనార్డ్ ఆరు డబుల్ ఫాల్ట్‌లు, 32 అనవసర తప్పిదాలతో డీలా పడ్డాడు. 'ఈ టోర్నీలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఇదే నా అత్యుత్తమ ప్రదర్శన. ఇదే జోరును ముున్ముందు కొనసాగిస్తానని నమ్మకంతో ఉన్నా' అని నాలుగుసార్లు యూఎస్ ఓపెన్ టైటిల్ సాధించి, ఆరుసార్లు రన్నరప్‌గా నిలిచిన జొకోవిచ్ వ్యాఖ్యానించాడు. క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్, గత ఏడాది రన్నరప్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)తో జొకోవిచ్ తలపడతాడు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో టేలర్ ఫ్రిట్జ్ 6-4, 6-3, 6-3తో టొమాస్ మఖచ్ (చెక్ రిపబ్లిక్)పై నెగ్గాడు. ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఎనిమిదో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా) కూడా క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అల్‌కరాజ్ 7-6 (7/3), 6-3, 6-4తో ఆర్థర్ రిండర్‌నీచ్ (ఫ్రాన్స్)పై, డిమినార్ 6-3, 6-2, 6-1తో లియాం డ్రో రీడి (స్విట్జర్లాండ్)పై నెగ్గారు.



రిబాకినా

రిబాకినాకు షాక్

మహిళల సింగిల్స్ విభాగంలో తొమ్మిదో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. ప్రపంచ 60వ ర్యాంకర్, 2023 వింబుల్డన్ చాంపియన్ మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6-4, 5-7, 6-2తో 2022 వింబుల్డన్ విజేత, ప్రపంచ 10వ ర్యాంకర్ రిబాకినాను ఓడించి ఈ టోర్నీలో రెండోసారి క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. 1 గంట 51 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో వొండ్రుసోవా 13 ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరోవైపు ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా (బెలారస్), బార్బరా క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) కూడా క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సబలెంకా 6-1, 6-4తో క్రిస్టీనా బుక్సా (స్పెయిన్)పై, క్రెజికోవా 1-6, 7-6 (15/13), 6-3తో టేలర్ టౌన్‌సెండ్ (అమెరికా)పై గెలుపొందారు. టౌన్‌సెండ్‌తో జరిగిన మ్యాచ్‌లో క్రెజికోవా రెండో సెట్‌లో ఏకంగా 8 మ్యాచ్ పాయింట్లను కాచుకొని గట్టెక్కడం విశేషం. క్వార్టర్ ఫైనల్స్‌లో వొండ్రుసోవాతో సబలెంకా; క్రెజికోవాతో జెస్సికా పెగూలా (అమెరికా) తలపడతారు.



సొరానా కిర్‌స్టీ విన్నర్స్ ట్రోఫీ చోరీ

న్యూయార్క్: రొమేనియా టెన్నిస్ ప్లేయర్ సొరానా కిర్‌స్టీ తను గెల్చుకున్న ట్రోఫీని పోగొట్టుకుంది. ప్రస్తుతం యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ఆడేందుకు వచ్చిన ఈ రొమేనియన్ న్యూయార్క్‌లోని హోటల్‌లో బస చేసింది. హోటల్ గది నుంచే తన ట్రోఫీ చోరీకి గురైందని వాపోయింది. యూఎస్ ఓపెన్‌కు ముందు అమెరికాలో సన్నాహక టోర్నీలు జరగడం సహజం. 35 ఏళ్ల కిర్‌స్టీ కూడా క్లీవ్‌లాండ్ వార్మప్ టోర్నీలో పాల్గొంది. అందులో గెల్చుకున్న ట్రోఫీని వెంటతెచ్చుకున్న ఆమె తను బస చేసిన గదిలోనే భద్రపరిచింది. అయితే ఇది అపహరణకు గురైంది. ఎవరైనా తీసుకున్నా... ఎవరి వద్దనైనా ఉన్నాగానీ తనకు తిరిగి అప్పగించాలని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సొరానా వేడుకుంది. ప్రస్తుత యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రొమేనియన్ ప్లేయర్ సింగిల్స్ రెండో రౌండ్లో నిష్క్రమించింది. 11వ సీడ్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) చేతిలో ఆమె ఓడిపోయింది.



ఇకపై పరిమిత ఓవర్ల క్రికెట్‌కే ప్రాధాన్యం

లండన్: ఇంగ్లండ్ పేసర్ జేమీ ఓవర్టన్ సంప్రదాయ క్రికెట్‌కు విరామం ప్రకటించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నాని... అందుకే టెస్టులకు నిరవధిక విరామం ప్రకటిస్తున్నట్లు చెప్పాడు. అయితే ఐదు రోజుల ఆటకు ఇది రిటైర్మెంట్ కాదు. 31 ఏళ్ల ఇంగ్లండ్ క్రికెటర్ ఇటీవల భారత్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో పాల్గొన్నాడు. 2-2తో సమమైన ఆ సిరీస్‌లో అతను రెండు టెస్టులు ఆడాడు. 'కెరీర్ జోరుగా సాగిపోతున్న ఈ దశలో ఏడాదిలో 12 నెలలు అన్ని ఫార్మాట్లకు అందుబాటులో ఉండాలంటే కుదరదు. అలా ప్రతీ ఫార్మాట్‌కు న్యాయం చేయలేను. శారీరకంగా, మానసికంగానూ నాకిది ఇబ్బందికరం. అందుకే బాగా ఆలోచించాకే టెస్టులకు విరామం ప్రకటిస్తున్నాను. అప్పుడు నేను పూర్తిగా పరిమిత ఓవర్ల క్రికెట్‌పై ఎక్కువ దృష్టిపెట్టొచ్చు. సుదీర్ఘకాలం పాటు వన్డేలు, టి20లు ఆడేందుకు ఈ నిర్ణయం ఎంతగానో దోహదం చేస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నా' అని ఓవర్టన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశాడు. 2022లో మొదలైన పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఇప్పటివరకు ఓవర్టన్ కేవలం 6 వన్డేలు, 12 టి20లే ఆడాడు. ఐపీఎల్‌లో అతను చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. లండన్‌లో ఇటీవల జరిగిన 'ది హండ్రెడ్' టోర్నీలో లండన్ స్పిరిట్‌కు ఆడాడు. ఓవర్టన్ అంతర్జాతీయంగా వివిధ దేశాల్లో జరిగే టి20 లీగ్‌లకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేలా ప్రణాళిక చేసుకుంటున్నాడు.

డిసెంబర్‌లో టెన్నిస్ ప్రీమియర్ లీగ్

ముంబై: ఈ సీజన్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నారు. డిసెంబర్ 9 నుంచి 14 వరకు గుజరాత్ యూనివర్సిటీ స్టేడియంలో టెన్నిస్ పోటీలు నిర్వహిస్తామని లీగ్ వర్గాలు వెల్లడించాయి. ఆరంభం నుంచి ఆరు సీజన్లుగా మహారాష్ట్రలో జరిగిన ఈవెంట్ వేదికను తొలిసారి మార్చారు. ఈ ఏడో సీజన్‌లో మొత్తం 8 జట్లు ఇందులో పోటీపడతాయి. స్టార్ డబుల్స్ ప్లేయర్ రోహన్ బోపన్న సహా భారత ఆటగాళ్లు, ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 30 నుంచి 50వ ర్యాంకులో ఉన్న అంతర్జాతీయ ఆటగాళ్లు కూడా ఇందులో పాల్గొంటారని లీగ్ వర్గాలు తెలిపాయి. 'గత ఏడాది కాలంగా టీపీఎల్ గుజరాత్ టెన్నిస్ సంఘం (జీఎస్‌టీఏ)తో కలిసి నడుస్తోంది. క్రమం తప్పకుండా పలు వయో విభాగాల టోర్నీలను జీఎస్‌టీఏ నిర్వహించింది. ప్రతిభావంతులను గుర్తించి గోల్డ్ స్కాలర్‌షిప్ అందజేసేందుకు క్షేత్రస్థాయిలో మా వంతు సహకారం అందించాం. ఇప్పుడు ఏకంగా లీగ్‌నే అక్కడ నిర్వహించాలని నిర్ణయించాం' అని లీగ్ వర్గాలు పేర్కొన్నాయి.



మాయ రాజేశ్వరన్ శుభారంభం

యూఎస్ ఓపెన్ జూనియర్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ బాలికల సింగిల్స్ విభాగంలో భారత రైజింగ్ స్టార్ మాయ రాజేశ్వరన్ శుభారంభం చేసింది. న్యూయార్క్‌లో సోమవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో కోయంబత్తూరుకు చెందిన 16 ఏళ్ల మాయ 7-6 (7/5), 6-3తో క్వాలిఫయర్ జాంగ్ కియాన్ వె (చైనా)పై నెగ్గింది. 94 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మాయ తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 19 సార్లు దూసుకొచ్చి 10 సార్లు పాయింట్లు గెలిచిన మాయ 39 అనవసర తప్పిదాలు చేయడం గమనార్హం. రెండో రౌండ్‌లో రెండో సీడ్ హనా క్లుగ్‌మన్ (యునైటెడ్ కింగ్‌డమ్)తో మాయ తలపడుతుంది. అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జూనియర్ ర్యాంకింగ్స్‌లో 54వ స్థానంలో ఉన్న మాయాకు నేరుగా మెయిన్ 'డ్రా'లో చోటు లభించింది. ప్రస్తుతం మాయ స్పెయిన్‌లోని రాఫెల్ నాదల్ అకాడమీలో శిక్షణ తీసుకుంటోంది. మరోవైపు జూనియర్ బాలుర సింగిల్స్ విభాగంలో భారత పోరాటం ముగిసింది. బరిలో దిగిన ఇద్దరు భారత ఆటగాళ్లు హితేశ్ చౌహాన్, క్రిష్ త్యాగి తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. హితేశ్ 2-6, 3-6తో మాక్సిమస్ డసాల్ట్ (అమెరికా) చేతిలో, క్రిష్ 3-6, 1-6తో లుడ్‌విగ్ హిడి (స్వీడన్) చేతిలో ఓటమి చవిచూశారు.

29 ఏళ్లకే...

- మధ్యప్రదేశ్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా మహాన్ ఆర్యమన్ ఎన్నిక
- క్రికెట్ పరిపాలనలో 'సింధియా' మూడో తరం

ఇండోర్: మధ్యప్రదేశ్ క్రికెట్ సంఘం (ఎంపీసీఏ) అధ్యక్షుడిగా మహాన్ ఆర్యమన్ సింధియా ఏకగ్రీవంగా ఎంపికయ్యాడు. 'సింధియా' రాజ కుటుంబానికి చెందిన 29 ఏళ్ల ఆర్యమన్ ఎంపీసీఏ అధ్యక్ష పదవి చేపట్టనున్న అతి పిన్న వయస్కుడిగా గుర్తింపు పొందాడు. మాజీ బీసీసీఐ అధ్యక్షుడు, దివంగత మాధవ్‌రావ్ సింధియా మనవడు, ప్రస్తుత కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కుమారుడైన ఆర్యమన్ గత మూడేళ్లుగా క్రికెట్ పరిపాలనలో చురుగ్గా పాలుపంచుకుంటున్నాడు. గ్వాలియర్ జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడైన ఆర్యమన్‌కు ఎంపీసీఏలో జీవితకాల సభ్యత్వం ఉంది. గత ఏడాది కొత్తగా మొదలు పెట్టిన మధ్యప్రదేశ్ టి20 లీగ్‌కు అతనే అధ్యక్షుడిగా ఉంటూ టోర్నీ నిర్వహణలో కీలక పాత్ర పోషించాడు. సుదీర్ఘ కాలంగా ఎంపీసీఏలో సింధియాల పట్టు కొనసాగుతోంది. మాధవ్‌రావ్ సింధియా తర్వాత ఆయన కుమారుడు జ్యోతిరాదిత్య అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించగా, ఇప్పుడు మూడో తరానికి చెందిన ఆర్యమన్ పదవిలోకి వచ్చాడు. 2010లో మాత్రమే జ్యోతిరాదిత్యను ఓడించేందుకు నాటి రాష్ట్ర మంత్రి కైలాష్ విజయ్‌వర్గియ పోటీలో నిలిచినా... చివరకు ఓటమి తప్పలేదు. తొమ్మిదేళ్ల పదవీకాలం పూర్తి కావడంతో లోధా కమిటీ సిఫారసుల ప్రకారం జ్యోతిరాదిత్య 2017లో ఎంపీసీఏ నుంచి తప్పుకున్నారు.



ఇరాన్ చేతిలో ఓడిన భారత్

- 0-3 గోల్స్‌తో పరాజయ
- నేషన్స్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ

హిసోర్ (తజికిస్తాన్): సెంట్రల్ ఏషియా ఫుట్‌బాల్ అసోసియేషన్స్ (సీఏఎఫ్‌ఏ) నేషన్స్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో భారత్‌కు రెండో మ్యాచ్‌లో పరాజయం ఎదురైంది. సోమవారం గ్రూప్ 'బి'లో జరిగిన పోరులో భారత్ 0-3 గోల్స్ తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇరాన్ చేతిలో ఓటమి పాలైంది. నిజానికి ఈ మ్యాచ్‌లో తమకన్నా మెరుగైన ర్యాంకింగ్ జట్టును భారత్ చాలా వరకు నిలువరించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 20వ స్థానంలో ఉన్న ఇరాన్ స్ట్రయికర్ల దాడుల్ని 133వ ర్యాంకులో ఉన్న భారత్ అద్భుతరీతిలో అడ్డుకుంది. ఓ గంట పాటు ఆకట్టుకున్న భారత రక్షణ పంక్తి తర్వాత పట్టు సడలించడంతో కాచుకొని వున్న ఇరాన్ ఆఖరి 30 నిమిషాల్లోనే మూడు గోల్స్ చేయడం గమనార్హం. భారత ఆటగాళ్లు రాణించడంతో తొలి అర్ధభాగం 0-0తో ముగిసింది. ద్వితీయార్ధం మొదలైన చాలాసేపటికి ఇరాన్ స్ట్రయికర్ అమిర్‌హొస్సేన్ (60వ నిమిషంలో) తొలి గోల్ చేయడంతో భారత్ శ్రమ బూడిద పాలయింది. తర్వాత అలీ అలిపోర్ఘర (89వ నిమిషంలో), ఇంజ్యూరీ టైమ్ (90+6వ నిమిషంలో)లో మెహదీ తరేమి చెరో గోల్ చేయడంతో భారత్‌కు పరాజయం తప్పలేదు. ఈ గ్రూప్‌లో భారత్ తొలి మ్యాచ్‌లో 2-1తో ఆతిథ్య తజికిస్తాన్‌ను ఓడించింది. ఇక 4న జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్... అఫ్గానిస్తాన్‌తో తలపడుతుంది. గ్రూప్ నుంచి అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు నేరుగా ఫైనల్‌కు చేరి టైటిల్ కోసం తలపడతాయి. రెండో స్థానం పొందిన జట్లు మూడు, నాలుగో స్థానాల కోసం పోటీ పడతాయి.





విజేత జోయెల్

సాక్షి, హైదరాబాద్: దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారక ఆలిండియా ఓపెన్ బిలో 1600 రేటింగ్ చెస్ టోర్నీలో తెలంగాణ క్రీడాకారులు మెరిశారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ టోర్నీలో 18 రాష్ట్రాల నుంచి 784 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. మూడు రోజులపాటు జరిగిన ఈ టోర్నీలో 7 ఏళ్ల నుంచి 91 ఏళ్ల వయో విభాగం వారు బరిలోకి దిగడం విశేషం. తెలంగాణకు చెందిన 10 ఏళ్ల ఇమాదబత్తిని జోయెల్ విజేతగా నిలిచాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత జోయెల్ 9 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. జోయెల్ ఆడిన తొమ్మిది గేముల్లోనూ గెలుపొందాడు. తెలంగాణకే చెందిన 12 ఏళ్ల షార్జీల్ హసన్ షేక్... 9 ఏళ్ల లింగం మనీశ్ రెడ్డి... 15 ఏళ్ల షేక్ మొహమ్మద్ ఇర్ఫాన్... 20 ఏళ్ల తమిళనాడు ప్లేయర్ మిథున్ 8 పాయింట్లతో ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... షార్జీల్‌కు రెండో స్థానం, మనీశ్ రెడ్డికి మూడో స్థానం, మిథున్‌కు నాలుగో స్థానం, ఇర్ఫాన్‌కు ఐదో స్థానం లభించాయి. తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి.మల్లారెడ్డి, తెలంగాణ చెస్ సంఘం అధ్యక్షుడు ఆర్.లక్ష్మీ రెడ్డి, హైదరాబాద్ జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

టి20 సిరీస్ బంగ్లాదేశ్ సొంతం

రెండో మ్యాచ్‌లో 9 వికెట్లతో నెదర్లాండ్స్ ఓటమి

సిల్హెట్: సొంతగడ్డపై నెదర్లాండ్స్‌తో జరిగిన టి20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో బంగ్లాదేశ్ గెలుచుకుంది. సోమవారం జరిగిన రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 9 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ 17.3 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. ఆర్యన్ దత్ (24 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్), విక్రమ్‌జిత్ సింగ్ (17 బంతుల్లో 24; 4 ఫోర్లు) మాత్రమే ఫర్వాలేదనిపించారు. గత మ్యాచ్‌లో రాణించిన తేజ నిడమనూరు (0) ఈసారి తొలి బంతికే వెనుదిరిగాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నసుమ్ అహ్మద్ (3/21) డచ్ టీమ్‌ను దెబ్బ తీయగా... ముస్తఫిజుర్, మహేదీ హసన్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం బంగ్లాదేశ్ 13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 104 పరుగులు సాధించింది. పర్వేజ్ హుసేన్ (23) తొందరగానే వెనుదిరగ్గా... తన్‌జీద్ హసన్ (40 బంతుల్లో 54 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ లిటన్ దాస్ (18 నాటౌట్) రెండో వికెట్‌కు 46 బంతుల్లో అభేద్యంగా 64 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. మూడో టి20 ఇదే మైదానంలో బుధవారం జరుగుతుంది.

సెమికాన్ ఇండియా సదస్సు నేటి నుంచి

సాక్షి, న్యూఢిల్లీ: దేశాన్ని సెమీకండక్టర్ డిజైన్, తయారీ, సాంకేతిక అభివృద్ధి కేంద్రంగా మార్చే లక్ష్యంతో దేశ రాజధాని ఢిల్లీ మరో అంతర్జాతీయ మహాసదస్సుకు వేదికైంది. ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ఢిల్లీలోని యశోభూమిలో 'సెమికాన్ ఇండియా–2025'సదస్సును ప్రారంభించనున్నారు. ఈ నెల 2 నుంచి 4 వరకు మూడు రోజులపాటు కొనసాగనుంది. 3వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రధాని మోదీ వివిధ కంపెనీల సీఈవోల రౌండ్‌టేబుల్ భేటీలో పాల్గొని చర్చలు జరపనున్నారు. సదస్సుకు 20,750 మంది పాల్గొననున్నారు. వీరిలో 48 దేశాల 2,500 ప్రతినిధులున్నారు. 350 ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులు, సాంకేతికతలను ప్రదర్శించనున్నారు. 2022లో బెంగళూరు, 2023లో గాంధీనగర్, 2024లో గ్రేటర్ నోయిడాలో ఈ సదస్సులు జరిగాయి.



సోమవారం చైనాలోని తియాంజిన్‌లో జరిగిన ఎస్‌సీవో సభ్య దేశాల నేతల సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

ఫాం హౌస్‌లో ధన్‌ఖడ్ బస

న్యూఢిల్లీ: మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన అధికార నివాసం నుంచి ఛతర్‌పూర్‌లోని ఓ ప్రైవేట్ ఫాం హౌస్‌కు మకాం మార్చారని అధికారులు తెలిపారు. జూలై 21న పదవికి రాజీనామా చేసినప్పటి నుంచి పార్లమెంట్ హౌస్ సమీపంలోని ఉపరాష్ట్రపతి అధికార నివాసంలోనే ఉంటున్నారు. నిబంధనల ప్రకారం మాజీ ఉపరాష్ట్రపతికి టైప్–8 అధికార బంగ్లాను సిద్ధం చేసే వరకు తాత్కాలికంగా ఐఎన్‌ఎల్‌డీ నేత అభయ్ చౌతాలాకు చెందిన గడాయ్‌పూర్‌లోని ఫాంహౌస్‌లో ఉంటారని అధికారులు వివరించారు. అనారోగ్య కారణాలు చూపుతూ ఆకస్మికంగా పదవికి రాజీనామా చేసినప్పటి నుంచి ధన్‌ఖడ్ బయటకు రాకపోవడం గమనార్హం. తీరిక వేళల్లో కుటుంబ సభ్యులతో గడుపుతున్నారని, టేబుల్ టెన్నిస్ ఆడుతూ యోగ సాధన చేస్తున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ఆస్ట్రేలియాలో నిరసనలు

భారతీయుల వలసపై ఆగ్రహం • జాత్యాహంకారానికి దేశంలో స్థానం లేదన్న ప్రభుత్వం

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాలో వలసదారులపై వ్యతిరేకత పెరుగుతోంది. దేశవ్యాప్తంగా వేలాది మంది ఆస్ట్రేలియన్లు ఆదివారం వలసలకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించారు. ప్రత్యేకించి భారతీయుల వలసలపై నిరసన కారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా'పేరుతో ర్యాలీలు నిర్వహించారు. వందేళ్లలో వచ్చిన గ్రీకులు, ఇటాలియన్ల కంటే ఐదేళ్లలో ఎక్కువ మంది భారతీయులు వచ్చారని, ఈ వలసలు తమ దేశంలోని సంస్కృతిపై ప్రభావం చూపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2013 నుంచి 2023 వరకు 845,800 మంది భారతీయులు ఆస్ట్రేలియాకు వలస వచ్చారని వారు పంచిన కరపత్రాల్లో పేర్కొన్నారు. ఇది తాత్కాలిక సాంస్కృతిక మార్పు కాదని, ప్రత్యామ్నాయంగా ఏర్పడుతోందని వారు ఆరోపించారు.

ఖండించిన ప్రభుత్వం..

ఈ ర్యాలీలను ఆస్ట్రేలియా ప్రభుత్వం ఖండించింది. జాత్యహంకారం, జాతికేంద్రీకరణపై ఆధారపడిన తీవ్రవాదానికి దేశంలో స్థానం లేదని పేర్కొంది. వారసత్వం ఏదైనా సరే, ఆస్ట్రేలియన్లందరూ సురక్షితంగా ఉండే హక్కును కలిగి ఉన్నారని పేర్కొంది. సామాజిక ఐక్యతను దెబ్బతీయాలని చూసే వ్యక్తులకు దేశంలో చోటు లేదని హోం వ్యవహారాల మంత్రి టోనీ బర్క్ అన్నారు. ద్వేషాన్ని వ్యాప్తి చేసే, సమాజాన్ని విభజించే ఇలాంటి ర్యాలీలకు తాము మద్దతు ఇవ్వబోమని ఫెడరల్ లేబర్ మంత్రి ముర్రే వాట్ స్పష్టం చేశారు. ఈ ర్యాలీలను ఆస్ట్రేలియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సర్వీసెస్ కూడా ఖండించింది. వైవిధ్యమే ఆస్ట్రేలియాకు గొప్ప బలమని సంస్థ సీఈఓ కసాండ్రా గోల్డీ అన్నారు. ఫెడరల్ ప్రతిపక్ష నాయకుడు సుస్సాన్ లే సైతం ర్యాలీలపై స్పందించారు. 'ప్రజల జాతీయత, మతం ఆధారంగా లక్ష్యంగా భావజాలానికి ఆస్ట్రేలియాలో స్థానం లేదు. హింస, జాత్యహంకారం లేదా బెదిరింపులకు ఇక్కడ చోటు లేదు. సామాజిక ఐక్యతను చీల్చే ద్వేషాన్ని, భయాన్ని అనుమతించలేం'అని స్పష్టం చేశారు.

ప్రధాన నగరాల్లో ర్యాలీలు..

సిడ్నీ, మెల్‌బోర్న్, కాన్‌బెర్రాతోపాటు ఇతర నగరాల్లో పెద్ద ర్యాలీలు జరిగాయి. సిడ్నీలో దాదాపు పదివేల మంది రోడ్డెక్కారు. నగర మారథాన్ కోర్సు దగ్గరకు చేరి జాతీయ జెండాలతో ప్రదర్శించారు. మెల్‌బోర్న్‌లో, నిరసనకారులు ఫ్లిండర్స్ స్ట్రీట్ స్టేషన్ వెలుపల ఆస్ట్రేలియన్ జెండాలు, వలస వ్యతిరేక ప్లకార్డులతో రాష్ట్ర పార్లమెంటుకు కవాతు చేశారు. ర్యాలీని ఉద్దేశించి నియో–నాజీ వ్యక్తి థామస్ సెవెల్ మాట్లాడుతూ వలసలను ఆపకపోతే, మన మరణం ఖాయమన్నారు. ఇక్కడ నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. ఆరుగురిని అరెస్టు చేశారు. కాన్‌బెర్రాలో, పార్లమెంట్ హౌస్‌కు ఎదురుగా ఉన్న సరస్సు వద్ద జరిగిన నిరసనలో వేలాది మంది పాల్గొన్నారు. క్వీన్స్‌ల్యాండ్‌లో, ఫెడరల్ ఎంపీ బాబ్ కట్టర్ టౌన్స్‌విల్లేలో జరిగిన ర్యాలీకి హాజరయ్యారు.

ఇస్లామిక్ గ్రూపుల వ్యతిరేకత..

ఉర్దూ అకాడమీ కార్యక్రమాన్ని రద్దు చేసిన బెంగాల్ ప్రభుత్వం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ కోల్‌కతాలో నిర్వహించాలనుకున్న ఉర్దూ అకాడమీ కార్యక్రమాన్ని మమతా బెనర్జీ ప్రభుత్వం వాయిదా వేసింది. కార్యక్రమానికి ప్రముఖ గేయ రచయిత, కవి జావేద్ అక్తర్‌ను ఆహ్వానించడాన్ని ఇస్లామిక్ గ్రూపులు తీవ్రంగా వ్యతిరేకించడంతో అకాడమీ ఈ నిర్ణయం తీసుకుంది. 'హిందీ సినిమాలో ఉర్దూ'పేరుతో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 3 వరకు కోల్‌కతాలో ఈ కార్యక్రమం జరగనుంది. చర్చలు, కవితా పఠనాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో భారతీయ సినిమాకు ఉర్దూ అందించిన గొప్ప సహకారాన్ని సెలబ్రేట్ చేసేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. అయితే.. సోమవారం జరగాల్సిన ముషాయిరాకు ప్రముఖ రచయిత, కవి జావేద్ అక్తర్ అధ్యక్షత వహించాల్సి ఉంది. ఈ మేరకు ఆయనకు ఆహ్వానం కూడా అందింది. ఈ ఆహ్వానంపై కోల్‌కతాలోని రెండు ప్రముఖ ఇస్లామిక్ సంస్థలు, జమియత్ ఉలేమా–ఎ–హింద్, వహ్యాహిన్ ఫౌండేషన్ అభ్యంతరం వ్యక్తం చేశాయి. మతం, దేవునికి వ్యతిరేకంగా మాట్లాడే వ్యక్తిగా అక్తర్‌ను అభివర్ణించాయి. ఆహ్వానాన్ని ఉపసంహరించుకోకపోతే 2007లో తస్లీమా నస్రీన్‌పై జరిగినట్లుగా ప్రజాస్వామ్య నిరసనలు ఉంటాయని జమియత్ ఉలేమా–ఎ–హింద్ కూడా హెచ్చరించింది. దీంతో అనివార్య పరిస్థితుల కారణంగా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు అకాడమీ చెప్పినప్పటికీ, మమతా బానర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సంవత్సరానికి ముందు ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉందని, ఘర్షణకు బదులుగా వాయిదా వేయాలని నిర్ణయించుకుందని సమాచారం. అనివార్య పరిస్థితులు నాలుగు రోజుల కార్యక్రమాన్ని రద్దు చేయాల్సి వచ్చిందని పశ్చిమ బెంగాల్ ఉర్దూ అకాడమీ కార్యదర్శి నుజ్రత్ జైనాబ్ తెలిపారు.

కార్యక్రమం రద్దు చేయడంతో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారత్ లౌకిక దేశమని, స్వేచ్ఛగా జీవించే, మాట్లాడే హక్కు నాస్తికులకు ఉందని మానవ హక్కుల కార్యకర్త షబ్నం హష్మి అన్నారు. అంతేకాదు.. మతాలు నడిచే రాష్ట్రాల్లో కూడా మతాన్ని నమ్మని వ్యక్తులు ఉన్నారని హష్మీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ కార్యక్రమాన్ని రద్దు చేయడాన్ని కవి–రచయిత గౌహర్ రజా తీవ్రంగా విమర్శించారు. 'హిందూ అయినా, ముస్లిం అయినా, ఛాందసవాదులు హేతుబద్ధ గళాలను నొక్కేయాలని చూస్తున్నారనడానికి ఇది నిదర్శనం'అని రజా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సీపీఎం నేతలు సైతం దీన్ని ఖండించారు. 'కోల్‌కతా జమైతియాలు జావేద్ అక్తర్ గురించే కలత చెందితే, సాహిర్ లూధియాన్వితో ఏమి చేసేవారు? మతాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని అతన్ని చంపేవారా?'అని ప్రశ్నించారు. అంతేకాదు.. బెంగాల్ ఉర్దూ అకాడమీ పన్ను చెల్లింపుదారుల డబ్బుతో నడుస్తోందని, జమియత్ ముల్లాల వ్యక్తిగత ఆస్తి కాదని స్పష్టంచేశారు.

ఈయూ చీఫ్ విమానానికి తప్పిన ప్రమాదం

రష్యా సిగ్నల్ జామింగే కారణమని ఈయూ ఆరోపణ



సోఫియా: యూరోపియన్ యూనియన్(ఈయూ)చీఫ్ ఉర్సులా వోన్ డెర్ లెయన్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆదివారం ఆమె ప్రయాణిస్తున్న విమానం బల్గేరియా దక్షిణ ప్రాంతంలోని ప్లావ్‌డివ్ విమానాశ్రయంలో ల్యాండవ్వాల్సి ఉంది. రక్షణ సన్నద్ధతను పరిశీలించేందుకు ఆమె ఈయూ దేశాల్లో పర్యటిస్తున్నారు. అయితే, ఆమె విమానం ప్లావ్‌డివ్ సమీపంలో ఉండగా జీపీఎస్ సిగ్నల్స్‌లో అంతరాయం ఏర్పడింది. అధికారులు వెంటనే ప్రత్యామ్నాయ సాంకేతికతతో కాగితం మ్యాప్ సాయంతో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా చేశారు. విమానం జీపీఎస్ నేవిగేషన్ వ్యవస్థకు శాటిలైట్ సిగ్నల్ ప్రసారం అందకుండా అడ్డుకోవడంతోనే సమస్య ఏర్పడిందని బల్గేరియా ప్రభుత్వం తెలిపింది. తక్షణమే ఎయిర్ కంట్రోల్ సేవల సిబ్బంది స్పందించారని వివరించింది. ఈ పరిణామం వెనుక రష్యాయే ఉందని ఈయూ ఆరోపించింది. రష్యా జోక్యం వల్లే ఇలా జరిగినట్లు బల్గేరియా ప్రభుత్వం అనుమానం వ్యక్తం చేసినట్లు ఈయూ వెల్లడించింది.

యుద్ధం ముగింపునకు ట్రంప్‌తో అంగీకారం: పుతిన్



మాస్కో: గత నెలలో అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన భేటీలో ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముగింపు పలికే విషయమై ఒక అంగీకారానికి వచ్చినట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వెల్లడించారు. ఆ దిశగా జరుగుతున్న ప్రయత్నాలతో ఉక్రెయిన్‌లో శాంతి నెలకొంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో శాంతి చర్చలకు అంగీకరించారా అన్న ప్రశ్నకు మాత్రం ఆయన సమాధానమివ్వలేదు. ఈ విషయమై మధ్యవర్తిత్వం వహిస్తున్న ట్రంప్ సోమవారం కల్లా జెలెన్‌స్కీతో శాంతి చర్చలకు అంగీకరించేదీ లేనిదీ స్పష్టత ఇవ్వాలంటూ పుతిన్‌కు గడువు ఇవ్వడం తెల్సిందే. చైనాలోని తియాంజిన్‌లో ఎస్‌సీవో శిఖరాగ్రానికి వచ్చిన పుతిన్ సోమవారం మీడియాతో మాట్లాడారు. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రను ఈ సందర్భంగా మరోసారి సమర్థించుకున్నారు. ప్రస్తుత యుద్ధానికి పశ్చిమ దేశాలే కారణమని నిందించారు.

ఢిల్లీ కోర్టు జడ్జిపై సస్పెన్షన్ వేటు

న్యూఢిల్లీ: అనుచిత ప్రవర్తన ఆరోపణలను ఎదుర్కొంటున్న ఢిల్లీలోని సాకేత్ కోర్టు జడ్జి సంజీవ్ కుమార్ సింగ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఓ కేసులో లాయర్‌పై ఒత్తిడి చేశారని, ఆర్థిక పరమైన అనుచిత లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలు ఆయనపై వచ్చాయి. లైంగిక వేధింపుల కేసులో బాధితురాలిని రాజీకి రావాలంటూ సింగ్ ఒత్తిడి చేశారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఇటీవల ఓ పిటిషన్ విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టులో సింగ్‌పై ఆరోపణలు వెలుగు చూశాయి. దీనిపై విజిలెన్స్ రిజిస్ట్రార్ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు అందిన విచారణ నివేదికపై ఆగస్టు 29న హైకోర్టు ఫుల్ బెంచ్ సమావేశమై చర్చించింది. సంజీవ్ కుమార్ సింగ్‌ను ముందస్తు అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్స్‌ను విడిచి ఎక్కడికీ వెళ్లవద్దని ఆదేశించింది. సస్పెన్షన్ కాలంలో సబ్‌స్టినెన్స్ అలవెన్స్ మాత్రమే అందుతుందని స్పష్టం చేసింది.

హిమాచల్, ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సం

- కొండచరియలు విరిగి ఏడుగురు మృత్యువాత
- ఛార్‌ధామ్, హేమ్‌కుండ్ యాత్రలు నిలిపివేత

న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో సోమవారం భీకర వర్షాలు, కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో ఏడుగురు చనిపోయారు. ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ మార్గంలో సోమవారం ఉదయం కొండచరియలు విరిగి వాహనంపై పడగా ఇద్దరు యాత్రికులు చనిపోయారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. సోన్‌ప్రయాగ్–గౌరీకుండ్ మార్గంలోని ముంకాటియా వద్ద కొండప్రాంతం పక్క నుంచి వెళ్తున్న వాహనంపై ఒక్కసారిగా బండరాళ్లు పడ్డాయని అధికారులు తెలిపారు. బాధితులంతా ఉత్తరకాశీ జిల్లాకు చెందిన వారేనన్నారు. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థి తి విషమంగా ఉందన్నారు. భారీ వర్షాలు కొనసాగుతుండటంతో ఛార్‌ధామ్ యాత్ర, సిక్కుల హేమ్‌కుండ్ సాహిబ్‌కు వెళ్లే దారిని ఈ నెల 5వ తేదీ వరకు మూసివేసినట్లు అధికారులు వివరించారు. వాతా వరణం మెరుగయ్యాక, రహదారులు పూర్తి సురక్షితమని భావించిన తర్వాతే తిరిగి రాకపోకలను అనుమతిస్తామన్నారు. సోమవారం ఉదయం 8 గంటల వేళకు చంపావత్ జిల్లా బన్‌బాసాలో 25.64 సెంటీమీటర్లు, ఖతిమాలో 18.1 సెంటీమీటర్లు, తనక్‌పూర్‌లో 17.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వివరించారు. రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశమున్న డెహ్రాడూన్, ఉత్తరకాశీ, తెహ్రీ, పౌడీ, నైనిటాల్ తదితర 9 జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు.

హిమాచల్‌లో ఐదుగురు..

హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా జిల్లాలో 24 గంటల వ్యవధిలో వేర్వేరు చోట్ల కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఐదుగురు చనిపోయారు. వీరిలో ఒక మహిళ, ఏడేళ్ల ఆమె కుమార్తె ఉన్నారు. జుంగాలోని డబ్లూ ప్రాంతంలో కొండచరియలు విరిగి ఇల్లు కూలడంతో తండ్రి, అతడి పదేళ్ల కుమార్తె మరణించారు. సిమ్లాలోని కోట్‌ఖైలో ఇల్లు కూలి వృద్ధ మహిళ మరణించారు. కొండచరియలు విరిగిపడటంతో సిమ్లా–కల్కా మార్గంలో నడిచే ఆరు రైళ్లను రద్దు చేశారు. దెబ్బతిన్న ఐదు జాతీయ రహదారులు సహా 793 రహదారులను మూసివేశారు. మంగళవారం వరకు ఆరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ విభాగం హెచ్చరించింది.

కశ్మీర్‌లో అమిత్ షా పర్యటన

జమ్మూకశ్మీర్‌లోని కత్రాలో భారీ వర్షం కురియడంతో మాతా వైష్ణోదేవి ఆలయాన్ని వరుసగా ఏడో రోజూ మూసి ఉంచారు. జమ్మూకశ్మీర్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లోని వారి పునరావాసానికి అన్ని విధాలుగా సాయమందిస్తామని హోం మంత్రి అమిత్ షా తెలిపారు. సోమవారం జమ్మూలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా, సీనియర్ నేతలతో రాజ్‌భవన్‌లో జరిగిన సమావేశంలో పరిస్థితిని సమీక్షించారు.



యూనిట్రీ జీ1 రోబోతో బాక్సింగ్ చేస్తున్న ఈయన సైయోనిక్ సీఈవో అదీల్ అక్బర్. గ్రీస్‌లోని ప్రాచీన ఒలింపియా మైదానంలో మొట్టమొదటి ఇంటర్నేషనల్ హ్యూమనాయిడ్ ఒలింపియాడ్ పోటీలోని సన్నివేశమిది.



మిస్ టీన్ ఇంటర్నేషనల్–2025 కిరీటం ధరిస్తున్న వేళ స్పెయిన్‌కు చెందిన లొరెనా రూయిజ్ ఉద్వేగం. సోమవారం రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

99.5% ఓటర్లు సరైన ధ్రువీకరణలను సమర్పించారు

అనర్హుల తొలగింపులో ఆ రెండు పార్టీలు మాత్రమే సహకరించాయి: ఈసీ

న్యూఢిల్లీ: బిహార్‌లోని 7.24 కోట్ల మంది ఓటర్లకుగాను ఇప్పటి వరకు 99.5 శాతం మంది వెరిఫికేషన్ కోసం ధ్రువీకరణ పత్రాలను అందజేసినట్లు ఎన్నికల కమిషన్(ఈసీ) సోమవారం వెల్లడించింది. ముసాయిదా ఓటరు జాబితాలో అనర్హుల పేర్ల తొలగింపులో ఆర్‌జేడీ, సీపీఐఎంఎల్‌లు మాత్రమే తమకు సాయం చేశాయని ఈసీ వివరించింది. రాష్ట్రంలో గుర్తింపు పొందిన సీపీఐ ఎంఎల్ 103 మంది పేర్లను తొలగించాలని కోరగా, ఆర్‌జేడీ, సీపీఐఎంఎల్‌లు కలిసి 25 పేర్లను కలపాలని దరఖాస్తులను అందించాయని పేర్కొంది. గుర్తింపు జాతీయ పార్టీ అయిన బీజేపీ మాత్రమే ఓటరు ముసాయిదాకు సంబంధించిన 16 అభ్యంతరాలను అందజేసిందని వివరించింది. బిహార్ ఎస్ఐఆర్‌పై మార్పులు, చేర్పులకు ఆఖరు రోజైన సోమవారం భారీగా దరఖాస్తులు అందాయని వెల్లడించింది. జాబితా నుంచి తొలగించాలని ఏకంగా 2.17 లక్షల దరఖాస్తులు అందగా, తమ పేర్లను చేర్చాలని 36 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించింది. ముసాయిదా జాబితాలో పొరపాటున చేర్చిన తమ పేర్లను తొలగించాలంటూ 2.17 లక్షల మంది వ్యక్తులు ఇప్పటి వరకు దరఖాస్తులను అందజేశారని ఈసీ అధికారులు తెలిపారు. బిహార్ ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ముసాయిదాపై అభ్యంతరాలు, మార్పులు చేర్పులకు సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత కూడా అవకాశమిస్తున్నట్లు ఈసీ సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపింది.

అనుచితంగా తాకినందుకు

- షూతో కొట్టి.. పోలీసులకు అప్పగించా
- 17 ఏళ్లప్పుడు రైలులో కెమిల్లా అనుభవం
- తాజా పుస్తకంలో వెల్లడించిన బ్రిటన్ రాణి

లండన్: లండన్‌లో రైలులో వెళ్తుండగా తనపై జరిగిన లైంగిక దాడిని ధైర్యంగా ఎలా ఎదుర్కొన్నదీ బ్రిటన్ రాణి కెమిల్లా తాజాగా విడుదలైన పుస్తకంలో వెల్లడించారు. రాజకుటుంబం, ప్రధాని కార్యాలయం మధ్య సంబంధాలను తెలిపే 'పవర్ అండ్‌ది ప్యాలెస్'పేరుతో విడుదలైన ఈ పుస్తకంలో కింగ్ చార్లెస్–3 భార్య కెమిల్లా, అప్పటి లండన్ మేయర్ బోరిస్ జాన్సన్ మధ్య సంభాషణ గురించిన వివరాలున్నాయి. 'అప్పుడు నా 16, 17 ఏళ్లుంటాయి. లండన్ రైలులో వెళ్తుండగా ప్యాడింగ్‌టన్ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి అనుచితంగా తాకేందుకు యత్నించాడు. అంతే, నా షూ తీసి అతడి గజ్జల్లో కొట్టా. ట్రెయిన్ ఆగాక రైల్వే పోలీసుకు అతడిని అప్పగించా. అమ్మ నాకు చెప్పినట్లే చేశా'అని కెమిల్లా వివరించారు. 2008లో జరిగిన ఈ ఘటనపై అప్పట్లో లండన్ మేయర్‌గా ఉన్న బోరిస్ జాన్సన్ దృష్టికి తీసుకెళ్లడం, ఆయన ఇటువంటి ఘటనల విషయంలో యంత్రాంగం తక్షణమే స్పందించేలా లండన్ వ్యాప్తంగా మూడు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిపోయాయి. ఒక కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో కెమిల్లా సైతం పాల్గొన్నారు. ఈ పుస్తకంలో పేర్కొన్న అంశాలపై బకింగ్ హామ్ ప్యాలెస్ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. కెమిల్లా బాధ్యతాయుతమైన పని చేశారని పుస్తక రచయిత్రి అన్నారు.

ఇప్పుడున్నంత ఆరోగ్యంగా మునుపెన్నడూ లేను

తన అనారోగ్యంపై వస్తున్న వార్తలను కొట్టేసిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తన ఆరోగ్యంపై వస్తున్న పుకార్లను తోసిపుచ్చారు. తాను ఇప్పుడున్నంత ఆరోగ్యంగా ఇంతకుముందెప్పుడూ లేనని స్పష్టం చేశారు. అంతేకాదు.. వాషింగ్టన్ డీసీ ఇప్పుడు పూర్తి నేర రహిత జోన్‌గా మారిందని ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఆదివారం రాత్రి పోస్ట్ చేశారు. బహిరంగ కార్యక్రమాలకు హాజరు కాకపోవడంతో ఆయన ఆరోగ్యంపై పుకార్లు చెలరేగాయి. 'ట్రంప్ ఈజ్ డెడ్', 'వేర్ ఈజ్ ట్రంప్'హ్యాష్‌ట్యాగ్‌లు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. ఈ ఊహాగానాలను అమెరికన్ రాజకీయ వ్యాఖ్యాత రోగన్ ఓ హ్యాండ్లీ కూడా ప్రశ్నించారు. దీనికి స్పందించిన కన్జర్వేటివ్ వ్యాఖ్యాత డీసీ–రైనో ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. 'జో బైడెన్ ఒకేసారి రోజుల తరబడి బయట కనిపించకుండా గడిపేవాడు. అయినా మీడియా అతడిని షార్ప్, గ్రేట్ ప్లేయర్ అంటూ పొగిడేది. అమెరికా చరిత్రలో మరే ఇతర అధ్యక్షుని కంటే ఎక్కువ సమయాన్ని ట్రంప్ ప్రజల కోసం వెచ్చిస్తారు. అయినా అతను 24 గంటలు అదృశ్యమైతే మీడియా భయపడుతుంది. ఇవి ద్వంద్వ ప్రమాణాలు'అని పోస్ట్ చేశారు. రైనో పోస్ట్‌ను రీపోస్ట్ చేసిన ట్రంప్.. పై వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. వర్జీనియాలోని స్టెర్లింగ్‌లో శనివారం గోల్ఫ్ ఆడటానికి వెళ్తున్న చిత్రాలను కూడా ట్రంప్ పోస్ట్ చేశారు.

భాషా ఆందోళన్ వేదికను కూల్చడమా?

ఆర్మీపై బెంగాల్ సీఎం మమత ఆగ్రహం

కోల్‌కతా: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వలసకార్మికులపై దాడులు జరుగుతున్నాయంటూ కోల్‌కతాలో నిర్వహించిన భాషా ఆందోళన్ వేదికను ఆర్మీ కూల్చివేయడంపై టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ మండిపడ్డారు. ఈ ఘటనను ఆమె బీజేపీ దుర్మార్గపు రాజకీయ క్రీడగా అభివర్ణించారు. కోల్‌కతాలోని మైదాన్ ఏరియాలోని గాంధీ విగ్రహం పక్కన కొన్ని రోజుల క్రితం టీఎంసీ తాత్కాలిక వేదికను ఏర్పాటు చేసింది. 'తాత్కాలిక వేదిక నిర్మాణం కోసం స్థానిక యంత్రాంగం నుంచి అనుమతి తీసుకుని, సెక్యూరిటీ డిపాజిట్ కూడా చెల్లించాం. అయినా భారత ఆర్మీ తొలగించింది. ఇక్కడి మేయో రోడ్డులో ఆర్మీకేం పని? భాషా ఆందోళన్‌కు అవరోధం కల్పించడానికి బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడింది'అని టీఎంసీ చీఫ్, సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు.

'పెట్రోల్‌లో ఇథనాల్'పై పిల్ కొట్టివేత

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన దేశవ్యాప్త పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్(ఈబీపీ–20) విధానాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ పరిణామం ఇథనాల్ బ్లెండింగ్ విధానాన్ని పక్కాగా అమలు చేయడానికి ప్రభుత్వానికి అవకాశమేర్పడింది. ప్రస్తుతమున్న చాలా వాహనాలు ఈ20 ఇంధనానికి అనుగుణంగా డిజైన్ చేసినవి కాకున్నా, లక్షలాది మంది మోటారు వాహన యజమానులపై బ్లెండెడ్ పెట్రోల్ పోయించుకోవాలంటూ ఒత్తిళ్లు తెస్తున్నారంటూ దాఖలైన పిల్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అన్ని పెట్రోల్ బంకుల్లో ఇథనాల్ రహిత పెట్రోల్‌ను అందుబాటులో ఉంచేలా పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖను ఆదేశించాలని పిటిషనర్ కోరారు. ముందుగా ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా, ప్రజల్లో అవగాహన కల్పించకుండా ఈ20 పెట్రోల్ మాత్రమే పెట్రోల్ పంపుల్లో అందుబాటులోకి తేవడం దారుణమని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది షదన్ ఫరసత్ పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ వెంకటరమణి ఈ వాదనలను తోసిపుచ్చారు. ఈ పిటిషన్ వెనుక భారీ లాబీయింగ్ ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

బుద్ధుడు ప్రవచించిన మార్గాన్ని ఏమంటారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

పురుషార్థాలు

హిందూ సమాజ వ్యవస్థలో ప్రతి వ్యక్తికీ పురుషార్థాలు మార్గదర్శక సూత్రాలుగా వ్యవహరిస్తాయి. పురుషార్థాలు 4. అవి..

ధర్మం, అర్థం, కామం, మోక్షం.

1. ధర్మం

హిందూ జీవనంలో ధర్మం అనే భావానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ధర్మం అనే పదం సంస్కృతంలోని'ధృ' అనే ధాతువు నుంచి వచ్చింది. 'ధృ' అంటే కలిపి ఉంచు, నిలబెట్టు అని అర్థం. ధర్మం మానవుడి ప్రవర్తనను క్రమబద్ధం చేస్తుంది. సమాజానికి ఏది ఆమోద యోగ్యమో, దానికి అనుగుణంగా వ్యక్తి జీవించాలి. నీతి, నిజాయతీ, నైతిక ప్రవర్తన గురించి ధర్మం చెబుతుంది. 'ధర్మం' అనే పదాన్ని అనేక సందర్భాల్లో అనేక అర్థాల్లో వాడారు.

ఐతరేయ బ్రాహ్మణం: విశ్వానికంతటికీ మూలం ధర్మం. ప్రజలు మార్గదర్శకత్వం కోసం ధర్మం గురించి బాగా తెలిసిన వ్యక్తి వద్దకు వెళతారు. ధర్మం వల్ల దుష్టత్వాన్ని పారద్రోలవచ్చు. ప్రతిదీ ధర్మం మీదే ఆధారపడి ఉంది. అందువల్ల ధర్మం అత్యుత్తమ సుగుణం.

మహాభారతం: ప్రజల్లో శక్తి, ప్రభావం కలగడానికి ధర్మాన్ని వివరించారు. ధర్మం అహింసతో కూడింది, దృఢమైంది. అది ప్రపంచాన్ని నిలబెడుతుంది. సృష్టిలోని ఏ జీవికీ హాని చేయకుండా ఉండేది కచ్చితంగా ధర్మం.

వైశేషిక సూత్రాలు: భౌతిక లాభం, ఆధ్యాత్మిక సుగుణం దేని నుంచి కలుగుతాయో అదే ధర్మం.

మహానారాయణోపనిషత్తు: జగత్ అంతటికీ మూలం ధర్మం. ధర్మాన్ని శ్రద్ధగా పాటించేవారిని ప్రజలు ఆశ్రయిస్తారు. ధర్మం ద్వారా పాపాలను పోగొట్టుకుంటారు. ధర్మం అత్యంత సుగుణం. 'సు' అంటే మంచి అని అర్థం. గుణం అంటే లక్షణం అని అర్థం.

జైమిని ప్రకారం: వేదాలు సూచించే, ఆశించే ఫలితం లేదా ఆశయమే ధర్మం.

మనుస్మృతి ప్రకారం: పక్షపాత బుద్ధితో కాకుండా, నీతి నిజాయతీలతో రాగద్వేషాలను వీడి మనసా, వాచా, కర్మణా జీవించే పవిత్ర జీవన విధానమే ధర్మం. ప్రతి వస్తువుకు గమనించదగ్గ నైసర్గిక ధర్మం ఉంటుంది.



- మానవుడు ఆచరించాల్సిన ధర్మాలను గురించి యాజ్ఞవల్క్యుడు తొమ్మిది ధర్మ సుగుణాలను వివరించాడు. అవి..
  అహింస, నిర్మలత్వం, నీతి,
  పరిశుభ్రత, ఇంద్రియ నిగ్రహం,
  దానం, ఆత్మనిగ్రహం, ప్రేమ, సహనం
- ఈ తొమ్మిది ధర్మగుణాల్లో మొదటి ఆరు ధర్మ గుణాలు సమాజ మనుగడకు,మిగతా మూడు ధర్మాలు వ్యక్తి సత్ప్రవర్తనకు తోడ్పడతాయి.

ధర్మం లక్షణాలను
కింది విధంగా గ్రహించవచ్చు.

1. ప్రజల శ్రేయస్సు కోసం ధర్మం ఉంది.
2. ఇతరులకు హాని చేయరాదు అనే భావం ఇందులో ఉంది.
3. ధర్మం వ్యక్తి నడవడిక నియమాలను, జీవన విధానాన్ని సూచిస్తుంది.
4. ధర్మం ఆనందానికి మూలం
5. ఏకీకృతం చేయడానికి ధర్మం ఉపకరిస్తుంది.
6. ధర్మం కర్తవ్యాన్ని సూచిస్తుంది.
7. ధర్మం సామాజిక విలువలకు, సాంస్కృతిక ప్రమాణాలకు ప్రతీకగా ఉంటుంది.

- హిందూ సామాజిక వ్యవస్థలో ధర్మం అత్యంత ఉన్నతమైంది, ఉత్కృష్టమైంది.

2. అర్థం

దీన్నే సంపద, ఐశ్వర్యం అంటారు. సంపద వల్ల శారీరక సుఖం కలుగుతుంది. అంటే వ్యక్తి అవసరాలను తీర్చడానికి అర్థం ఉపయోగపడుతుంది. కౌటిల్యుడి 'అర్థశాస్త్రం' అర్థం విలువను వివరించింది. ధనాన్ని అక్రమ మార్గాల ద్వారా సంపాదించరాదు. అర్థం ఎక్కువ చలామణిలో ఉండటంవల్ల వ్యక్తులు, సమాజం అభివృద్ధి జరుగుతుంది.

3. కామం

కామం అంటే కోరిక. ఇంద్రియ వాంఛలను తృప్తి పరచుకోవడం కామం. గృహస్థాశ్రమంలో వ్యక్తికి కామం సహజం. కామం కేవలం శారీరక వాంఛలకు మాత్రమే పరిమితం కాదు. నృత్యం, సంగీతం, నటన కళారూపాలు మొదలైన వాటిలో కూడా కోరిక ఉంది. కామం వివాహానికి, సంతాన ప్రాప్తికి మూలం. ధర్మంతో కూడిన కామం అంగీకార యోగ్యం. కాబట్టి ప్రతి వ్యక్తీ కామాన్ని క్రమబద్ధం చేసుకోవాలి. ద్విజులలో సంతానోత్పత్తికి మాత్రమే కామాన్ని ఉద్దేశించారు. ధర్మం, అర్థం, కామాలను త్రి వర్గాలు అని పిలుస్తారు. పురుషార్థాలలో కామానికి తక్కువ ప్రాధాన్యమిచ్చి ధర్మానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

4. మోక్షం

ప్రతి హిందువు తుది లక్ష్యం మోక్ష సాధన. మోక్షం అంటే 'ఆత్మను పరమాత్మలో మిళితం చేయడం'. మోక్షసాధన అంటే ప్రతి వ్యక్తి ఆత్మ సాక్షాత్కారం లేదా అంతరంగిక ఆధ్యాత్మికతను సాధించడం. ధర్మ, అర్థ, కామ పరిపూర్ణత ఇందులో ఉంటుంది. కర్మం, జ్ఞానం, భక్తి అనే మూడు మార్గాల ద్వారా మోక్షం లభిస్తుంది. భగవద్గీతలో మోక్షాన్ని పరాగతిగా వర్ణించారు.

బౌద్ధమతం

గౌతమబుద్ధుడు రుమిందై గ్రామ సమీపంలోని లుంబినివనంలో జన్మించాడు. అతడి తండ్రి కపిలవస్తు పాలకుడైన శుద్ధోదనుడు, తల్లి మహామాయ. గౌతమబుద్ధుడి అసలు పేరు సిద్ధార్థుడు. గౌతమబుద్ధుడు పుట్టిన ఏడు రోజులకే అతడి తల్లి మహామాయ మరణించింది. సవతితల్లి మహాప్రజాపతి గౌతమి పెంచడంతో అతడికి గౌతముడిగా పేరొచ్చింది. బుద్ధుణ్ని పెంచిన 'గౌతమి ప్రజాపతి' బౌద్ధమతంలో తొలి సన్యాసిని. బుద్ధుడి భార్య యశోధర, కుమారుడు రాహులుడు.

బుద్ధుడు తన 29వ ఏట ఒక వృద్ధుణ్ని, ఒక వ్యాధిగ్రస్తుణ్ని, ఒక సన్యాసిని, ఒక శవాన్ని చూశాడు. వీటిని చూసిన బుద్ధుడు కలత చెంది ఇల్లు వదిలి జ్ఞానాన్వేషణకు బయల్దేరాడు. సంరక్షకుడైన చెన్న సహాయంతో 'కంఠక' అనే గుర్రం మీద బుద్ధుడు బయల్దేరాడు. దీన్నే మహాభినిష్క్రమణ అంటారు. జ్ఞానాన్వేషణలో భాగంగా బుద్ధుడు రెండేళ్లపాటు వైశాలిలో అలారకలామ వద్ద ధ్యాన విధానాన్ని నేర్చుకున్నాడు. రాజగృహంలో ఉద్రక(ఉద్దక) వద్ద కొన్ని రోజులు శిష్యరికం చేశాడు. గురువుల వద్ద తనకు కావాల్సిన సమాధానం లభించలేదు. దీంతో ముక్తి కోసం 15రోజులు ఉపవాసం ఉన్నాడు. గౌతముడు స్పృహ కోల్పోయిన దశలో సుజాత అనే స్త్రీ అతడి ప్రాణాలను కాపాడింది.

గౌతమ బుద్ధుడు బుద్ధగయ వద్ద బోధివృక్షం కింద 49 రోజులు ధ్యానం చేశాడు. ఇక్కడే జ్ఞానోదయం(మహాసంబోధి) పొంది బుద్ధుడయ్యాడు (బుద్ధుడు అంటే తథాగతుడు-నిజాలను తెలుసుకున్నవాడు అని అర్థం). తర్వాత కఠోర ఆహార నియమాలు, సాధనలు చేయకూడదని అన్నీ మధ్యస్థంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. అందుకే బుద్ధుడు ప్రవచించిన మార్గాన్ని మధ్యేమార్గం అంటారు. మధ్యేమార్గం అంటే మనిషి పూర్తిగా సన్యాసిగా కాకుండా, పూర్తిగా భౌతిక కాంక్షలతో కాకుండా స్వీయ నిగ్రహశక్తితో జీవితాన్ని గడపటం. ఈ మార్గాన్ని అనుసరించిన ఏ వ్యక్తయినా అతడి సామాజిక నేపథ్యంతో నిమిత్తం లేకుండా ముక్తి పొందుతాడు.

ఉదా:ఐశ్వర్యానికి, పేదరికానికి మధ్య జీవించడం
.

బుద్ధుడు సిద్ధాంతాలను ప్రబోధించలేదు. కానీ ఆధ్యాత్మిక వికాసానికి ఒక హేతువాద మార్గాన్ని సూచించాడు. అందుకే బుద్ధుణ్ని అజ్ఞేయవాది(Agnostic) అని పిలవవచ్చు. బుద్ధుడు సత్యదూరాలైన వేదాలను తిరస్కరించాడు. జంతు బలులను ఖండించి, క్లిష్ట సంస్కారాలను ఎదిరించాడు. హిందూ మతంలోని అసమానత్వం, కొన్ని మత ఛాందస భావాలను ముఖ్యంగా కులవ్యవస్థను, బ్రాహ్మణాధిక్యతను ప్రశ్నించాడు. అందువల్ల బౌద్ధమతాన్ని మత ఉద్యమంగా కాకుండా ఒక సామాజిక ఉద్యమంగా చూడాలని కొందరి భావన. అందుకే బౌద్ధమతాన్ని రియాక్షనరీ రిలీజియస్ అని పిలుస్తారు.

బుద్ధుడు సారనాథ్‌లోని జింకలవనంలో కొండిన్య, అశ్వజిత్, బద్రుక, మహానామ, కశ్యప /ఉపాలి అనే అయిదుగురు శిష్యులకు జ్ఞానబోధ చేశాడు. దీన్నే ధర్మచక్రపరివర్తనం అంటారు. బౌద్ధమత పుట్టుకగా 'సారనాథ్'ను పేర్కొంటారు.

బుద్ధుడి శిష్యులకు బోధించిన సారాన్ని పంచశీల అంటారు.

పంచశీల సూత్రాలు..

- అసత్య (అసత్యం పలకరాదు)
- అసతేయ (దొంగతనం చేయరాదు)
- అపరిగ్రహ (ఆస్తిని కూడబెట్టరాదు)
- మత్తుమందులు సేవించరాదు
- వ్యభిచారం చేయరాదు

బుద్ధుడి బోధనలు

1. ఆర్యసత్యాలు
2. అష్టాంగ మార్గం
3. ప్రతిత్య సముత్పాదన (కార్యకారణ సిద్ధాంతం)
4. మధ్యేమార్గం

నిగ్రహశక్తిని కోల్పోయినవారు మానసికంగా బలహీనులయ్యే అవకాశముంది. కాబట్టి నిగ్రహాన్ని నిలబెట్టుకోవడానికి ఆర్యసూత్రాలు (లేదా) ఆర్యసత్యాలు, అష్టాంగ మార్గాన్ని పాటించాలని బుద్ధుడు చెప్పాడు.

బుద్ధుడి ఆర్యసత్యాలు

1. ప్రపంచం మొత్తం దుఃఖమయం
2. కోరికలే దుఃఖాలకు కారణాలు
3. దుఃఖ నిర్మూలనకు కోర్కెలను జయించాలి
4. దుఃఖ నిర్మూలనకు ఏకైక మార్గం అష్టాంగ మార్గం

బుద్ధుడి అష్టాంగ మార్గం:

1. సమ్యక్ ఆలోచన 2. సమ్యక్ వాక్కు
3. సమ్యక్ క్రియ 4. సమ్యక్ జీవనం
5. సమ్యక్ కృషి 6. సమ్యక్ నిశ్చయం
7. సమ్యక్ విశ్వాసం 8. సమ్యక్ దృష్టి

ప్రతిత్య సముత్పాదన: దీన్నే కార్యకారణ సిద్ధాంతం అంటారు. ఇది బుద్ధుడి తత్వం. అంటే కర్మల వల్లే జీవుడు బంధ విముక్తుడు అవుతాడు.

బౌద్ధ సమావేశాలు: బౌద్ధ సమావేశాలనే బౌద్ధ సంగీతులు అంటారు. వినయ, సుత్త, అభిదమ్మ పీటికలను త్రిపీటకాలంటారు.

బౌద్ధ సంగీతులు

బౌద్ధ సంగీతి	కాలం	నగరం	రాజు	అధ్యక్షుడు	కారణం	ప్రాధాన్యం
మొదటి సంగీతి	క్రీ.పూ.483 (బుద్ధుడు మరణించిన వెంటనే)	రాజగృహం	అజాతశత్రువు	మహాకశ్యప	బుద్ధుడి బోధనలను గ్రంథస్తం చేయడానికి	ఆనందుడు 'వినయ', ఉపాలి 'సుత్త' అనే పీటికల (నియమావళి గ్రంథాలు)ను సంకలనం చేశారు.
రెండో సంగీతి	క్రీ.పూ.383	వైశాలి	కాలాశోకుడు	సభాకమి	బౌద్ధమతంలో విభేదాలను పరిష్కరించడానికి	బౌద్ధమతం థేరవాదులు(మార్పు కోరని వారు), మహాసాంఘికులు(మార్పు కోరే వారు)గా చీలిపోయింది.
మూడో సంగీతి	క్రీ.పూ.250	పాటలీ పుత్రం	అశోకుడు	మొగలిపుత్రతిస్స	బౌద్ధమతానికి సంబంధించిన అనేక విషయాలను చర్చించడానికి	అభిదమ్మ పీటికను సంకలనం చేశారు.
నాలుగో సంగీతి	క్రీ.శ. 1వ శతాబ్దం	కుందలవనం కశ్మీర్	కనిష్కుడు	వసుమిత్రుడు	18 శాఖల మధ్య ఐక్యత సాధించడానికి	బౌద్ధమతం మహాయాన, హీనాయాన శాఖలుగా చీలిపోయింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐఎం రాయ్‌పూర్‌లో నాన్ టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) రాయ్‌పూర్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
- **పోస్టుల సంఖ్య:** చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-01, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు 55 ఏళ్లు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు 45 ఏళ్లు.
- **వేతనం:** నెలకు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు 37,400 నుంచి రూ.67,000, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు రూ.56,100.
- **దరఖాస్తు ఫీజు:** చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2500.అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు రూ.1000. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 02.09.2025.
- **వెబ్‌సైట్:** https://iimraipur.ac.in

ఆర్ఆర్‌యూలో రీసెర్చ్ ఫెలోలు

గుజరాత్‌లోని రాష్ట్రీయ రక్షా యూనివర్శిటీ(ఆర్ఆర్‌యూ) తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోలు, సీనియర్ రీసెర్చ్ ఫెలోల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 02.
- **ఖాళీల వివరాలు:** జూనియర్ రీసెర్చ్ ఫెలో-01, సీనియర్ రీసెర్చ్ ఫెలో-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. నెట్, గేట్ అర్హత సాధించిన వారికి మొదటి ప్రాధాన్యతను ఇస్తారు.
- **వేతనం:** నెలకు జూనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.18,720 నుంచి రూ.25,000, సీనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.21,840 నుంచి రూ.28,000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఈమెయిల్:** gujcost.project@rru.ac.in.
- **దరఖాస్తులకు చివరి తేది:** 05.09.2025.
- **వెబ్‌సైట్:** https://rru.ac.in

అధిక ఆవేశాన్ని కలిగించే గ్రంథి ఏది?

అంతస్స్రావక గ్రంథులు

1. ఎడ్రినల్ (అధివృక్క) గ్రంథులు

మానవుడిలో ఒక జత ఎడ్రినల్ గ్రంథులు మూత్ర పిండాల పైభాగంలో ఉంటాయి. అధివృక్క గ్రంథిలో రెండు భాగాలుంటాయి. 1.వల్కలం.. అధివృక్క గ్రంథి వెలుపలి భాగం. 2. దవ్వ.. లోపలి భాగం.

అధివృక్క వల్కల హార్మోన్లు: దీని నుంచి విడుదలయ్యే హార్మోన్లను కార్టికాయిడ్లు అంటారు. ఇవి మూడు రకాలు.

ఎ) కార్టిసాల్ బి) అల్డోస్టిరాన్
సి) లైంగిక కార్టికాయిడ్లు

కార్టిసాల్

ఈ హార్మోన్ పిండి పదార్థాల జీవక్రియలో పాల్గొంటుంది. ఉపవాస(అత్యవసర) పరిస్థితుల్లో గ్లూకోజ్‌ను సంశ్లేషించి రక్తంలోకి విడుదల చేస్తుంది. కాబట్టి కార్టిసాల్‌ను ప్రాణరక్షక హార్మోన్ అంటారు. ఇది ఒక ఒత్తిడి పోరాట హార్మోన్‌గా కూడా పనిచేస్తుంది. కార్టిసాల్ అధికస్రావం వల్ల కూషింగ్స్ వ్యాధి (బఫెల్లో నెక్) వస్తుంది.

- **లక్షణాలు:** ముఖం, అవయవాలు, వీపు ప్రాంతంలో కొవ్వు పేరుకుపోతుంది.
  వీపుపై మూపురం (బఫెల్లో హంప్) వేలాడుతూ ఉంటుంది.
  కార్టిసాల్ తక్కువైతే అడిసన్స్ వ్యాధి వస్తుంది.
  లక్షణాలు: చర్మంపై కంచు వర్ణపు మచ్చలు, బరువు కోల్పోవడం, కండరాల బలహీనత.

అల్డోస్టిరాన్

ఇది దేహంలో నీరు, లవణాల తుల్యతను క్రమపరుస్తుంది. మూత్రం నుంచి సోడియం (Na^{+}) పునఃశోషణను పెంచుతుంది. అదే సమయంలో పొటాషియం (K^{+}), ఫాస్ఫేట్ అయాన్లను మూత్రంలోకి స్రవింపజేయడంలో తోడ్పడుతుంది. శరీరంలో పొటాషియం అయాన్ల గాఢత పెరగడం ప్రమాదకరం. కాబట్టి అధివృక్క ఆల్డోస్టిరాన్ లోపిస్తే మానవుడు మరణిస్తాడు.

లైంగిక కార్టికాయిడ్లు

ఇవి ఒక రకమైన లైంగిక హార్మోన్లు(ఆండ్రోజన్స్). ఇవి స్త్రీ, పురుషుల్లో లైంగిక హార్మోన్లకు అనుబంధంగా పనిచేస్తాయి.

ఈ హార్మోన్ల అధిక స్రావం వల్ల స్త్రీ , పురుషుల్లో వ్యాధులు వస్తాయి. అవి..

- **విరిలిజం:** స్త్రీలకు అవాంఛిత రోమాలు (గడ్డాలు, మీసాలు) రావడం, పురుష గొంతు.
- **హిర్సుటిజం:** స్త్రీలకు ఛాతీపైన, శరీరంపైన రోమాలు రావడం.
- **గైనకోమాస్టియా:** ఇది పురుషులకు వచ్చే వ్యాధి. పురుషులకు రొమ్ములు ఏర్పడటం.

అధివృక్క దవ్వ

అధివృక్క దవ్వ రెండు రకాల హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది.

ఎ) ఎడ్రినలిన్ (ఎఫినెఫ్రిన్)
బి) నార్ ఎడ్రినలిన్ (నార్ ఎఫినెఫ్రిన్)

ఇవి ఒత్తిడి, అత్యవసర పరిస్థితులకు అనుక్రియగా ఉత్పత్తి అవుతాయి. కాబట్టి వీటిని అత్యవసర హార్మోన్లు (ఎమర్జెన్సీ హార్మోన్లు), పోరాట లేదా పలాయన హార్మోన్లు, 3F హార్మోన్ (Fight -Flight - Fright) , 4S హార్మోన్ (Sugar Metabolism, Salt retainning, Sex hormones, Source of Energy), బీపీ హార్మోన్ లేదా రక్తపోటుకు కారణమైన హార్మోన్ అని పిలుస్తారు.

ఈ హార్మోన్ల వల్ల భయం, కోపం వంటి భావోద్వేగాలకు లోనైనప్పుడు వెంట్రుకలు నిక్కబొడుచుకోవడం, చెమటపట్టడంతో పాటు హృదయస్పందన, శ్వాసక్రియ రేటు పెరుగుతాయి.

ఎడ్రినలిన్

హృదయ స్పందన రేటును పెంచి గుండెపోటుకు (బీపీ) కారణమవుతుంది.

నార్ ఎడ్రినలిన్

ఈ హార్మోన్ రక్త పీడనాన్ని తగ్గిస్తుంది (నియంత్రిస్తుంది)

గమనిక: లోనోట్రోప్స్ రక్తపోటును తగ్గించడానికి వాడే ఔషధం.

2. బీజకోశాలు

బీజకోశాలు రెండు రకాలు..

1) పురుష బీజకోశాలు (ముష్కాలు)
2) స్త్రీ బీజ కోశాలు

ముష్కాలు / పురుష బీజకోశాలు

ముష్కాలు పురుష ప్రత్యుత్పత్తి అంగాలు. ఒక జత ముష్కాలు శరీరం వెలుపల ముష్క గోణుల్లో ఉంటాయి.

- **ముష్కాల ప్రధాన విధి:** శుక్రకణోత్పత్తి, హార్మోన్ విడుదల. ముష్కాల్లోని లిడిగ్ కణాల నుంచి టెస్టోస్టిరాన్ (ఆండ్రోజెన్) అనే లైంగిక హార్మోన్ విడుదలవుతుంది.
- **టెస్టోస్టిరాన్ విధి:** కండరాల అభివృద్ధి,ముఖం, బాహుమూలాల్లో రోమాలు ఏర్పడటం, పురుష కంఠధ్వని(గొంతు మారడం). ఈ లక్షణాలను ద్వితీయ లైంగిక లక్షణాలు అంటారు.

స్త్రీ బీజకోశాలు

స్త్రీలలో ఒక జత స్త్రీ బీజకోశాలు ఉదర కుహరంలో ఉంటాయి. ప్రాథమికంగా ఇవి అండాలను ఉత్పత్తి చేస్తాయి. ఇవి ప్రతి రుతుచక్రంలోనూ ఒక అండాన్ని విడుదల చేస్తాయి. ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్‌లను విడుదల చేస్తాయి.



- **ఈస్ట్రోజన్:** ఈ హార్మోన్ స్త్రీలలో ద్వితీయ లైంగిక లక్షణాలను ప్రేరేపిస్తుంది.అంటే రుతుచక్ర ప్రారంభం, స్తనాభివృద్ధి, స్త్రీ కంఠస్వరం.
- **ప్రొజెస్టిరాన్:** దీన్ని ప్రెగ్నెన్సీ హార్మోన్, గర్భస్రావ నిరోధక హార్మోన్ అంటారు. ఈ హార్మోన్ పిండ ప్రతిస్థాపనకు తోడ్పడుతుంది. ఫలదీకరణ ద్వారా ఏర్పడిన పిండాన్ని గర్భాశయ గోడలకు అంటి పెట్టడంలో దోహదపడుతుంది. ఈ హార్మోన్ రుతుచక్రం ఆగిపోవడానికి, మళ్లీ ఫలదీకరణ జరగకుండా ఉండటానికి తోడ్పడుతుంది. కాబట్టి గర్భ నిరోధక మాత్రల్లో ప్రొజెస్టిరాన్‌ను ఉపయోగిస్తారు. ఈ హార్మోన్ జరాయువు ఏర్పడటానికి తోడ్పడుతుంది.
- **రిలాక్సిన్ హార్మోన్:** ఈ హార్మోన్‌ను ప్రసవ సమయంలో జరాయువు స్రవిస్తుంది. ఇది సుఖ ప్రసవానికి దోహదపడుతుంది.

3. థైమస్ గ్రంథి (బాలగ్రంథి)

ఈ గ్రంథి రెండు ఊపిరితిత్తుల మధ్య గుండెకు దగ్గరగా ఉంటుంది. ఇది తల్లిగర్భంలో ఉన్న పిండం (ఆరో వారం)లో ఏర్పడుతుంది. ఇది చిన్న పిల్లల్లో మాత్రమే ఉంటుంది. కౌమార దశలో అదృశ్యమవుతుంది. కాబట్టి దీన్ని బాలగ్రంథి, తాత్కాలిక గ్రంథి, తిరోగమన గ్రంథి,అంతరించిపోయే గ్రంథి అని పిలుస్తారు. ఈ గ్రంథి స్రవించే హార్మోన్ థైమోసిన్.

- **థైమోసిన్ విధి:** లింఫోసైట్ కణాల పరిపక్వతకు తోడ్పడుతుంది. ఫలితంగా ప్రతిరక్షకాలు (యాంటిబాడీలు)ఉత్పత్తి అవుతాయి. ఇవి వ్యాధి నిరోధకతను పెంపొందిస్తాయి.
  మాంసం దుకాణాల్లో జంతువుల థైమస్ గ్రంథిని స్వీట్ బ్రెడ్‌గా అమ్ముతారు.

- **ఎక్టో హార్మోన్లు:** కొన్ని వినాళ గ్రంథుల నుంచి బాహ్య వాతావరణంలోకి విడుదలయ్యే రసాయన పదార్థాలను ఎక్టో హార్మోన్లు లేదా పిరమోన్లు అంటారు. ఈ పిరమోన్లు కీటకాల్లో మాత్రమే ఉంటాయి.
- ఒక జాతి జీవుల నుంచి విడుదలయ్యే పిరమోన్లను అదే జాతికి చెందిన కీటకాలు మాత్రమే గుర్తిస్తాయి. దీంతో వాటి మధ్య ఆకర్షణ, కమ్యూనికేషన్స్ నెలకొంటాయి.
  ఉదా: కూలీ చీమ మార్గాన్ని ఇతర చీమలు పిరమోన్ల వల్లే అనుకరిస్తాయి.

4. పీనియల్ గ్రంథి

ఇది మానవుడి మెదడు ద్వారగోర్థం పృష్ఠతలంలో ఉంటుంది. మెలటోనిన్ హార్మోన్‌ను స్రవిస్తుంది. ఇది శరీరంలోని 24 గంటల దిన పరివర్తన లేదా సర్కేడియన్ లయలను క్రమపరుస్తుంది. అంటే నిద్ర, మెలకువల వలయాన్ని నియంత్రిస్తుంది.

5. జఠరాంత్రనాళ హార్మోన్లు

జీర్ణాశయం, ఆంత్రమూలాల శ్లేష్మస్తరం హార్మోన్లను స్రవిస్తుంది. ఈ హార్మోన్లు జీర్ణ గ్రంథుల చర్యలను పరిరక్షిస్తాయి. ఇది నాలుగు రకాల పెప్టైడ్ హార్మోన్లను స్రవిస్తుంది. అవి...

- **గాస్ట్రిన్:** ఈ హార్మోన్‌ను జీర్ణాశయం స్రవిస్తుంది. ఇది జఠర గ్రంథులను ప్రభావితం చేసి హైడ్రోక్లోరిక్ ఆమ్లం, పెప్సినోజన్ విడుదలను ప్రేరేపిస్తుంది.
- **సెక్రిటిన్:** ఆంత్రమూలం నుంచి విడుదలయ్యే ఈ హార్మోన్ క్లోమ, పైత్య రసాల స్రావాన్ని ప్రేరేపిస్తుంది. మొదట కనుగొన్న హార్మోన్ సెక్రిటిన్
- **కోలిసిస్టోకైనిన్:** ఇది కూడా ఆంత్రమూలం నుంచి విడుదలవుతుంది. పిత్తాశయాన్ని సంకోచింపజేసి పైత్యరసాన్ని ఆంత్రమూలంలోకి విడుదల చేయిస్తుంది.
- **పాంక్రియోజైమిన్:** దీన్ని ఆంత్రమూలం స్రవిస్తుంది. ఈ హార్మోన్ క్లోమాన్ని ఉత్తేజపర్చి క్లోమరసం విడుదలకు దోహదపడుతుంది.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. రక్తపోటును నియంత్రించే హార్మోన్?
   1) థైరాక్సిన్ 2) ఇన్సులిన్
   3) ఎడ్రినలిన్ 4) పిట్యూటరీ గ్రంథి
2. ఇన్సులిన్, ఈస్ట్రోజన్ అనేవి ?
   1) బ్యాక్టీరియాలు 2) ఫంగస్‌లు
   3) క్రిములు 4) హార్మోన్లు
3. అధిక ఆవేశాన్ని కలిగించే గ్రంథి ఏది?
   1) పిట్యూటరీ గ్రంథి 2) ఎడ్రినల్ గ్రంథి
   3) థైరాయిడ్ గ్రంథి 4) సెలైవరీ గ్రంథి
4. మానవ దేహంలో అధివృక్క గ్రంథి వేటిపై ఉంటుంది?
   1) చిన్నప్రేగు 2) గుండె
   3) ఊపిరితిత్తులు 4) మూత్ర పిండాలు
5. తమ జాతి జీవులపై ప్రభావం చూపించేవి, జీవి శరీరం నుంచి బాహ్యంగా విడుదలయ్యే సమ్మేళనాన్ని ఏ విధంగా పిలుస్తారు?
   1) సబ్‌హార్మోన్లు 2) న్యూరోహార్మోన్లు
   3) పిరమోన్లు 4) న్యూరోట్రాన్స్ మీటర్
6. స్త్రీ జీవుల్లో ద్వితీయ లైంగిక లక్షణాల అభివృద్ధిని నియంత్రించేది?
   1) ఈస్ట్రోజన్ 2) ఆక్సిటోసిన్
   3) టెస్టోస్టిరాన్ 4) ప్రొజెస్టిరాన్
7. శిశువుల్లో మాత్రమే ఉండి కౌమార దశలో అంతరించే గ్రంథి?
   1) థైరాయిడ్ గ్రంథి 2) థైమస్ గ్రంథి
   3) పీనియల్ గ్రంథి 4) పీయూష గ్రంథి
8. గర్భ నిరోధక మాత్రల్లో ఉండే హార్మోన్?
   1) ఈస్ట్రోజెన్ 2) ప్రొజెస్టిరాన్
   3) ఆక్సిటోసిన్ 4) ప్రొలాక్టిన్
9. పిత్తాశయాన్ని సంకోచింపజేసి పైత్యరసాన్ని స్రవింపజేసే హార్మోన్?
   1) సెక్రిటిన్ 2) ఇన్సులిన్
   3) కోలిసిస్టోకైనిన్ 4) ఎడ్రినలిన్
10. లైంగిక కార్టికాయిడ్ల అధికస్రావం వల్ల వచ్చే వ్యాధి?
    1) విరిలిజం 2) హిర్సుటిజం
    3) గైనకోమాస్టియా
    4) పైవన్నీ

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 4; 5) 3; 6) 1; 7) 2; 8) 2; 9) 3; 10) 4.

'గార్డెన్ స్టేట్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా పేరొందిన ప్రాంతం ఏది?

వ్యవసాయం

ప్రముఖ ఆర్థిక భౌగోళిక శాస్త్రజ్ఞుడు విట్లేసీ కింద సూచించిన వ్యవసాయ వ్యవస్థలను గుర్తించాడు.

» సాంద్ర జీవనాధార వ్యవసాయం
» విస్తార వాణిజ్య వ్యవసాయం
» మిశ్రమ వ్యవసాయం
» వాణిజ్య పండ్ల తోటల సాగు
» మార్కెట్ గార్డెనింగ్/ట్రక్ ఫార్మింగ్
» ఉద్యానవన తోటలు/ఎస్టేట్ ఫార్మింగ్
» వాణిజ్య పాడి మండలం
» వాణిజ్య పశుమాంస ఉత్పత్తి మండలం (రాంచింగ్)
» పోడు వ్యవసాయం
» సంచార పశు పోషణ

సాంద్ర జీవనాధార వ్యవసాయం

ఆయనరేఖా, ఉప ఆయనరేఖా ప్రాంతాలకు చెందిన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో జీవనాధార సాంద్ర వ్యవసాయం అమల్లో ఉంది. ఇండియా, చైనా, బ్రెజిల్, థాయ్‌లాండ్, మెక్సికో, ఈజిప్ట్ లాంటి వ్యవసాయ ప్రధాన దేశాల్లోని వ్యవసాయ వ్యవస్థలు ఈ కోవకు చెందినవి. సాంద్ర వ్యవసాయంలో పంటల తీవ్రత అధికం. పెద్ద మొత్తాల్లో ఎరువులు, క్రిమిసంహారక మందులు, సేద్యపు నీటిని వాడతారు. వ్యవసాయ భూకమతాల సగటు పరిమాణం చాలా తక్కువ. జనాభాలో అధిక శాతం ప్రత్యక్షంగా వ్యవసాయం పైనే ఆధారపడతారు. కాబట్టి వ్యవసాయ భూమిపై ఒత్తిడి అధికం. ప్రధానంగా ఆహార పంటలను పండిస్తారు. జనాభా, జనసాంద్రతలు అధికంగా ఉండటం వల్ల వ్యవసాయ ఉత్పత్తులను పూర్తిగా దేశీయంగానే వినియోగిస్తారు. మిగులు లేకపోవడంతో ఎగుమతులు అత్యల్పం. వ్యవసాయంలో శ్రామిక శక్తిని అధికంగా వినియోగిస్తారు. సగటు వ్యవసాయ భూమికి దిగుబడులు అధికంగా ఉన్నప్పటికీ, తలసరి దిగుబడులు కనిష్ఠంగా ఉంటాయి. వ్యవసాయ జనాభా ప్రధానంగా సన్న, చిన్నకారు రైతుల రూపంలో ఉంటుంది. ఈ వ్యవసాయ మండలంలో రైతుల ఆదాయాలు స్వల్పంగా ఉంటాయి. రైతులు తమ గృహ అవసరాల ఆధారంగా పంటలను ఎంచుకుంటారు.

విస్తార వాణిజ్య వ్యవసాయం

ఐరోపా, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అర్జెంటీనాల్లో విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉంది. వ్యవసాయంపై ఆధారపడే శ్రామిక జనాభా శాతం చాలా తక్కువ. వ్యవసాయంలో యాంత్రీకరణ స్థాయి అధికం. వ్యవసాయ భూకమతాలు చాలా పెద్దవి. ఉదాహరణకు యూఎస్‌ఏలో సగటు భూకమతాల



పరిమాణం 1000-1400 హెక్టార్లు. పంటల తీవ్రత సాంద్ర వ్యవసాయ మండలంతో పోలిస్తే తక్కువగా ఉంటుంది.

ప్రపంచ మార్కెట్లను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మండలంలో పంటలు పండిస్తారు. జనాభా, జనసాంద్రత తక్కువగా ఉండటం వల్ల స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం తక్కువ. మిగులు వ్యవసాయ ఉత్పత్తుల వల్ల పెద్ద మొత్తాల్లో ఎగుమతి చేస్తారు. విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉండే యూఎస్‌ఏ, కెనడా, రష్యా, ఉక్రెయిన్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా దేశాలు ప్రపంచంలో ప్రధాన వ్యవసాయ ఎగుమతిదారులు. ఈ మండలాన్ని ప్రపంచ ధాన్యాగారంగా అభివర్ణిస్తారు. ఈ తరహా వ్యవసాయం విస్తారంగా పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకొని ఉంది.

మిశ్రమ వ్యవసాయం

పంటలతోపాటు పశుపోషణ కోసం కూడా వ్యవసాయ భూమిపై ఆధారపడటాన్ని మిశ్రమ వ్యవసాయంగా వ్యవహరిస్తారు. ఈ తరహా వ్యవసాయంలో పంటల నుంచి వచ్చిన రొట్టను, వ్యవసాయ ఉత్పత్తులను పశుగ్రాసంగా వాడతారు. పశువుల మేతకోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లు ఉండవు. అయితే జీవనాధార వ్యవసాయంలా కాకుండా, ఈ మండలంలో వ్యవసాయ పంటలు, పశుపోషణ వాణిజ్య తరహాలో జరుగుతుంది. పశ్చిమ, మధ్య ఐరోపాల్లో వ్యవసాయం ఈ కోవకు చెందింది. ఈ మండలంలో సగటు వ్యవసాయ భూకమతాల పరిమాణం మధ్యస్థంగా (100-200 హెక్టార్లు) ఉంటుంది.

వాణిజ్య పండ్ల తోటల సాగు

మధ్యధరా శీతోష్ణస్థితి ప్రాంతాలు పండ్ల తోటల సాగుకు అనుకూలం. కవోష్ణ వాతావరణం వల్ల ముఖ్యంగా సిట్రస్ జాతికి చెందిన పండ్ల తోటలు ఇక్కడ సాగవుతాయి. మధ్యధరా తీరంలోని ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, గ్రీస్, మొరాకో, అల్జీరియా, ట్యునీషియా ప్రాంతాలు, దక్షిణాఫ్రికాలోని కేప్ ప్రాంతం, యూఎస్‌ఏలోని కాలిఫోర్నియా తీరం, మధ్య చిలీ, ఇజ్రాయెల్ తీర ప్రాంతాలు ఈ వ్యవసాయ మండలం కిందకు వస్తాయి. ఈ ప్రాంతాల్లో బత్తాయి, నిమ్మ, ద్రాక్ష, నారింజ, దానిమ్మ లాంటి సిట్రస్ జాతికి చెందిన పండ్లను వాణిజ్య పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఇది పెట్టుబడితో కూడుకున్న వ్యవసాయం. పండ్ల రసాలు, జామ్‌లు, జెల్లీలు, సాస్‌లు, ఎండు పళ్లను ఈ ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో ఎగుమతి చేస్తున్నారు. ద్రాక్ష సారాయి తయారీ కూడా పెద్ద పరిశ్రమగా రూపొందింది. ఫ్రాన్స్‌లోని రైన్ లోయ, ఇటలీలోని గెరొన్ బేసిన్ వీటికి ప్రసిద్ధి.

మార్కెట్ గార్డెనింగ్/ట్రక్ ఫార్మింగ్

పారిశ్రామిక విప్లవం తర్వాత ఐరోపా, ఉత్తర అమెరికాల్లో విస్తృత నగరీకరణ జరిగింది. విస్తరిస్తున్న మెట్రోపాలిటన్ నగరాల్లో తాజా కూరగాయలు, పండ్లకు గిరాకీ బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో వాయవ్య ఐరోపా, ఉత్తర అమెరికాల్లోని పెద్ద పెద్ద నగరాల సమీపంలో పండ్లు, కూరగాయల సాగు వాణిజ్య పద్ధతిలో ప్రారంభమైంది. రోజూ ఉదయాన్నే ఈ వ్యవసాయ ప్రాంతాల నుంచి నగరాలకు భారీ ట్రక్కుల ద్వారా తాజా పండ్లు, కూరగాయల రవాణా జరుగుతుంది. అందువల్ల దీన్ని ట్రక్ ఫార్మింగ్ (మార్కెట్ గార్డెనింగ్) అని పిలుస్తారు. ఆగ్నేయ ఆస్ట్రేలియాలోని నగర జనాభాకు కావాల్సిన తాజా పండ్లు, కూరగాయలను టాస్మానియా దీవి నుంచి బాస్ జలసంధి ద్వారా మర పడవలపై సరఫరా చేస్తారు. అందువల్ల టాస్మానియా దీవిని 'గార్డెన్ స్టేట్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా వ్యవహరిస్తారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
భూగోళశాస్త్రం

దేశం	ఎస్టేట్లు	పెట్టుబడి పెట్టిన దేశం
శ్రీలంక	తేయాకు	బ్రిటన్
మలేషియా	రబ్బరు	బ్రిటన్
ఇండోనేషియా	రబ్బరు, చెరకు	డచ్
దక్షిణాఫ్రికా	చెరకు	డచ్, బ్రిటన్
బ్రెజిల్	కాఫీ	పోర్చుగల్
ఫిలిప్పీన్స్	కొబ్బరి	యూఎస్‌ఏ
కరేబియన్		
దీవులు	చెరకు, అరటి	యూఎస్‌ఏ
పశ్చిమ ఆఫ్రికా	కొకురా	ఫ్రాన్స్

ఉద్యానవన తోటలు/ఎస్టేట్ ఫార్మింగ్

ఎస్టేట్ ఫార్మింగ్ పద్ధతుల్లో ఉద్యానవన తోటల పెంపకాన్ని వలస పాలనా కాలంలో వలస రాజ్యాలు ప్రారంభించాయి. ఉష్ణమండల ఆయన రేఖా, ఉప ఆయనరేఖా ప్రాంతాల్లోని దేశాల్లో వలస పాలకులు కాఫీ, తేయాకు, రబ్బరు, సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి, చెరకు, అరటి పంటలను ఎస్టేట్‌ల రూపంలో సాగు చేయడం ప్రారంభించారు. ఈ రకమైన సాగులో వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా నడిపిస్తారు. ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టే యాజమాన్యం కేవలం విధాన నిర్ణయాలను మాత్రమే తీసుకుంటుంది. సాగు నిర్వహణ కోసం సుశిక్షితులైన, సాంకేతిక అర్హతలు ఉన్న వారిని 'మేనేజర్లు'గా వేతన ప్రాతిపదికన నియమిస్తారు. శ్రామికులను దినసరి లేదా రోజువారీ కూలీ ప్రాతిపదికన వినియోగిస్తారు. లాభాలను ఆశించి ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేస్తారు. ఇప్పటికీ ఈ రంగంలో విదేశీ పెట్టుబడులు కన్పిస్తాయి.

వాణిజ్య పాడి మండలం

వాయవ్య ఐరోపాలోని సమశీతోష్ణ వాతావరణంలో పచ్చిక బయళ్లు విస్తారంగా పెరుగుతాయి. ఈ పరిస్థితులు పశుపోషణకు అనుకూలం, జెర్సీ, ఆరిషైర్, స్విస్‌బ్రౌన్, ఆబర్డన్, హార్ట్‌ఫోర్డ్, ఫ్లెచ్‌విక్ లాంటి మేలి రకం పాడి పశువుల జాతులకు ఈ ప్రాంతాలు నిలయాలు. పెద్ద మొత్తాల్లో పెట్టుబడులు పెట్టి ఆధునిక శాస్త్ర పరిజ్ఞానాన్ని వాడుతూ పాడి పశువులను పెంచుతారు. పశువుల మేత కోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లను నిర్వహిస్తారు. ఈ ప్రాంతంలోని యూకే, డెన్మార్క్, బెల్జియం, నెదర్లాండ్, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, నెదర్లాండ్ దేశాల నుంచి పెద్ద మొత్తాల్లో పాడి వస్తువులు ఉత్తర అమెరికా, యూరప్‌లోని ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. డెన్మార్క్‌ను Butter House of Europe గా అభివర్ణిస్తారు. కొపెన్‌హెగెన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రోజూ విమానాల ద్వారా వెన్నను ప్రపంచం నలుమూలలకు ఎగుమతి చేస్తారు.

వాణిజ్య పశుమాంస ఉత్పత్తి మండలం (రాంచింగ్)

పశ్చిమ యూఎస్‌ఏలోని రాకీ పర్వత ప్రాంతం, అర్జెంటీనా, ఉరుగ్వే, పరాగ్వే దేశాలు రాంచింగ్ (Ranching) మండలం కిందకు వస్తాయి. ఈ మండలంలో మాంసం ఉత్పత్తి కోసం పశువులను పెంచుతారు. పశుపోషణ కోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లను నిర్వహిస్తారు. పశువుల మేత కోసం ప్రత్యేకంగా మొక్కజొన్నను పండిస్తారు. బాగా లావెక్కిన పశువులను యాంత్రిక వధశాలల్లో సంహరించి, మాంసాన్ని యంత్రాల సహాయంతో శుద్ధి చేసి ప్యాక్ చేస్తారు. మాంసం శుద్ధి, ప్యాకింగ్ ఒక పెద్ద పరిశ్రమగా అభివృద్ధి చెందింది. అర్జెంటీనా, ఉరుగ్వే, పరాగ్వేల నుంచి శుద్ధి చేసిన మాంసాన్ని యూఎస్‌ఏకు ఎగుమతి చేస్తారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో కూడా రాంచింగ్ అమల్లో ఉంది.

సంచార పశు పోషణ

దట్టమైన అటవీ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల నుంచి కొన్ని ఆదిమ తెగల సమాజాల్లో ఇప్పటికీ సంచార పశుపోషణ, సంచార వ్యవసాయం అమల్లో ఉంది. ఈశాన్య భారతదేశంలో సంచార వ్యవసాయాన్ని 'జూమింగ్'గా పిలుస్తారు. మధ్య భారతదేశంలో 'బేవార్' అని, కేరళలో 'పొనమ్' అని పిలుస్తున్నారు. సంచార వ్యవసాయం బ్రెజిల్ (రోకా), మలేషియా (లడాంగ్)లలో కూడా అమల్లో ఉంది.

మాదిరి ప్రశ్నలు

1. వ్యవసాయ జనాభా ప్రధానంగా సన్న, చిన్నకారు రైతుల రూపంలో ఉండే వ్యవసాయ విధానం ఏది?
   1) సాంద్ర జీవనాధార వ్యవసాయం
   2) విస్తార వాణిజ్య వ్యవసాయం
   3) మిశ్రమ వ్యవసాయం 4) పైవేవీ కాదు
2. Butter House of Europe గా పేరొందిన దేశం ఏది?
   1) ఆస్ట్రేలియా 2) చిలీ
   3) దక్షిణాఫ్రికా 4) డెన్మార్క్
3. పండ్ల తోటల సాగుకు అనువైన శీతోష్ణస్థితి ఉన్న ప్రాంతం ఏది?
   1) వాయవ్య ఐరోపా 2) పశ్చిమ ఆఫ్రికా
   3) మధ్యధరా ప్రాంతం
   4) తూర్పు ఐరోపా
4. 'గార్డెన్ స్టేట్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా పేరొందిన ప్రాంతం ఏది?
   1) టాస్మానియా 2) న్యూసౌత్‌వేల్స్
   3) క్వీన్స్‌లాండ్ 4) విక్టోరియా
5. మధ్య భారతదేశంలో సంచార వ్యవసాయాన్ని ఏమని పిలుస్తారు?
   1) జూమింగ్ 2) పొనమ్
   3) బేవార్ 4) ఏదీకాదు
6. కింద సూచించిన పంటల్లో చల్లటి వాతావరణంలో పండించే పంట ఏది?
   1) కొబ్బరి 2) రబ్బరు
   3) తేయాకు 4) చెరకు
7. దేశంలో వాణిజ్య పద్ధతుల్లో అత్యధికంగా పూలను ఎగుమతి చేస్తోన్న రాష్ట్రం ఏది?
   1) కేరళ 2) తమిళనాడు
   3) తెలంగాణ 4) కర్ణాటక
8. కింది వాటిలో రాంచింగ్ మండలంలో ఉన్న దేశం ఏది?
   1) ఉరుగ్వే 2) కెనడా
   3) లాత్వియా 4) శ్రీలంక
9. ఏ దేశాన్ని ఆదర్శంగా తీసుకొని భారత్‌లో సహకార రంగంలో పాడి సహకార సంఘాలను స్థాపించారు?
   1) బ్రెజిల్ 2) నెదర్లాండ్స్
   3) ఇజ్రాయెల్ 4) డెన్మార్క్

సమాధానాలు

1) 1 2) 4 3) 3 4) 1
5) 3 6) 3 7) 4 8) 1
9) 4

Which file is responsible to start MS-Word?

MS - WORD

1. Which is not a font style?
   1) Bold 2) Superscript
   3) Italic 4) Regular
   5) None of above
2. What is gutter margin?
   1) Margin that is added to right margin when printing
   2) Margin that is added to the left margin when printing
   3) Margin that is added to the outside of the page when printing
   4) Margin that is added to the binding side of page when printing
   5) None
3. Landscape is?
   1) A font style 2) Paper Size
   3) Page Layout
   4) Page Orientation
   5) None
4. Typeface option will come under which menu?
   1) Edit 2) View 3) Format
   4) Tools 5) None of above
5. Background color on a document is not visible in?
   1) Web layout view
   2) Print Preview
   3) Reading View
   4) Print Layout view 5) None
6. What is a portion of a document in which you set certain page formatting options?
   1) Page Setup
   2) Section
   3) Page 4) Document
   5) None of above
7. Which of the following is not available on the Ruler of MS Word screen?
   1) Tab stop box
   2) Left Indent
   3) Right Indent 4) Center Indent
   5) None of above
8. Gutter position can be set in following positions
   1) Left & Right 2) Left & Top
   3) Left & Bottom
   4) Left Only 5) None of above
9. What is the Short cut key for line break?
   1) CTRL + Enter
   2) Alt + Enter 3) Shift + Enter
   4) Space + Enter
   5) None of above
10. By pressing F12, which of following will happen?
    1) Save As dialog box will open
    2) Save dialog box will open
    3) Open dialog box will open
    4) Close dialog box will open
    5) None of above
11. Which key will open an Open dialogue box?
    1) F12 2) Alt + F12
    3) Ctrl + F12 4) Shift + F12
    5) None of above
12. How will MS Word will respond in repeated word ?
    1) A Green wavy line under the repeated word
    2) A Red wavy line under the repeated word
    3) A Blue wavy line under the repeated word
    4) A pink wavy lines under the repeated word
    5) None of above
13. What is the use of "All Caps" feature in MS - Word?
    1) It changes all selected text into Capital Letter
    2) It adds captions for selected Image
    3) It shows all the image captions
    4) It changes some text into Capital Letter
    5) None of above
14. Which file is responsible to start MS Word?
    1) Winword.exe
    2) Win.exe
    3) Word.exe 4) Wordwin.exe
    5) None of above
15. To keep track of different editions of a document which feature we will use?
    1) Editions 2) versions
    3) Tracks 4) Traces
    5) None of above
16. Which is not a type of margin?
    1) Top 2) Left 3) Right
    4) Center5) None of above
17. What will be the use of Ctrl + J?
    1) Insert Image
    2) Insert Hyperlink
    3) Align Justify
    4) Search file 5) None of above
18. What shortcut will we use to align center?
    1) Ctrl + A 2) Ctrl + E
    3) Ctrl + D 4) Ctrl + B
    5) None of above
19. Which shortcut will we use to make text Italic?
    1) Ctrl + U 2) Ctrl + T
    3) Ctrl + I 4) Ctrl + P
    5) None of above
20. How to use Format Painter multiple times?
    1) By Click on Lock Format Painter Icon
    2) Format Painter cannot be use multiple times
    3) By Double Click on the Format Painter Icon
    4) By Double Click on the Format Painter Icon
    5) None of above
21. What is place to the left of horizontal scroll bar?
    1) Indicators 2) Split buttons
    3) Tab stop buttons
    4) View buttons
    5) None of above
22. Where can you find the horizontal split bar on MS-Word screen?
    1) On the top of vertical scroll bar
    2) On the bottom of vertical scroll bar
    3) On the left of horizontal scroll bar
    4) On the right of horizontal scroll bar Comment on this question
    5) None of above
23. Tabs stop position cannot be the following alignment?
    1) Decimal Alignment
    2) Center Alignment
    3) Bar Alignment
    4) Justify Alignment
    5) None of above
24. What is the use of bookmarks?
    1) To correct the spellings.
    2) To jump to a specific location in the document
    3) To ignore spelling mistakes
    4) To save alignments as it is
    5) None of above
25. Which feature is used to replace straight quotes with smart

BANK EXAMS
COMPUTER AWARENESS

quotes as you type?
    1) Auto Correct as you type
    2) Auto Change as you type
    3) Auto Ignore as you type
    4) Auto Format as you type
    5) None of above
26. Ctrl + D is short cut used for?
    1) Open Dialogue Box
    2) Font Dialogue Box
    3) Save as Dialogue Box
    4) Save Dialogue Box
    5) None of above
27. Ctrl + G is shortcut for?
    1) Open Find and Replace Dialog box with activating Goto Tab
    2) Open Find and Replace Dialog box with activating Find Tab
    3) Open Find and Replace Dialog box with activating Replace Tab
    4) Open Goto Dialog box
    5) None of above Comment on this question
28. Ctrl + H is short cut for?
    1) Open Insert Dialog box activating Insert Hyper Link Tab
    2) Open Find and Replace Dialog box with activating Go to Tab
    3) Open Find and Replace Dialog box with activating Find Tab
    4) Open Find and Replace Dialog box with activating Replace Tab
    5) None of above
29. What can be searched by find?
    1) Format 2) Characters
    3) Symbol 4) All of above
    5) None of above
30. On which page the header or the footer is printed by default?
    1) On first page
    2) on last page
    3) on alternate page
    4) Every page5) None of above
31. Which of these toolbars allows changing of Fonts and their sizes?
    1) Standard 2) Formatting
    3) Options 4) Review
    5) None of above
32. To spell check which function key you will press?
    1) F5 2) F6 3) F7
    4) F8 5) None of above
33. How to insert a sound file in word document?
    1) From insert -> sound menu option
    2) From insert -> object menu option
    3) From insert -> subject menu option
    4) From insert -> file menu option
    5) None of above
34. How many maximum number of columns can be inserted in the word document?
    1) 45 2) 50 3) 55
    4) 65 5) None of above
35. What is smallest and largest available font on formatting toolbar?
    1) Smallest 8 and Largest 70
    2) Smallest 5 and Largest 72
    3) Smallest 8 and Largest 72
    4) Smallest 5 and Largest 70
    5) None of above
36. Why drop cap is used in document?
    1) To get all first character capital
    2) To get all first character small
    3) To begin a paragraph with a large dropped initial capital letter
    4) To begin a paragraph with a large dropped initial small letter
    5) None of above
37. What is Macro?
    1) Small add-on programs that are installed afterwards if you need them
    2) Type of high level programming language
    3) Type of low level programming language
    4) Small programs created in MS-Word to automate repetitive tasks by using VBA
    5) None of above
38. Which among following can be a vertical separation between columns?
    1) Margin 2) Header
    3) Orientation 4) Gutter
    5) None of above
39. To change the typeface of a document, we will choose following menu option:
    1) Edit 2) View 3) Tools
    4) Format 5) None of above
40. To auto fit the width of column:
    1) Double click the left border of column
    2) Double click the right border of column
    3) Double click the column header 4) None of above
    5) All the above
41. What is the default font size of a new Word document based on Normal template?
    1) 8pt 2)10pt 3) 12pt
    4)14pt 5) None of above
42. Which of following line spacing is invalid?
    1) Single 2) Double
    3) Triple 4) Multiple
    5) None of above
43. Format painter tool can be found in?
    1) Options toolbar
    2) Standard toolbar
    3) Formatting toolbar
    4) Drawing toolbar
    5) None
44. Which among following is correct extension of word files?
    1) xls 2) doc 3) ppt
    4) dcw 5) None of above
45. You can jump to the next column by?
    1) Press Alt + Down-arrow
    2) Clicking with your mouse on the next column
    3) Both of above
    4) None of above
    5) Press Alt + 5 arrow

Key

1) 2; 2) 4; 3) 4; 4) 3; 5) 2;
6) 2; 7) 4; 8) 2; 9) 3; 10) 1;
11) 3; 12) 2; 13) 1; 14) 1; 15) 2;
16) 4; 17) 3; 18) 2; 19) 3; 20) 3;
21) 4; 22) 1; 23) 4; 24) 2; 25) 4;
26) 2; 27) 1; 28) 4 ;29) 4; 30) 4;
31) 2; 32) 3; 33) 2; 34) 1; 35) 3;
36) 3; 37) 4; 38) 1; 39) 4; 40) 2;
41) 3; 42) 3; 43) 2; 44) 2; 45) 3